శ్రీ రస్తు.

అనుభాగవతము అని పేర్వొందిన

కల్కిపురాణము.

ఆంధ్ర వచనకావ్యము.

P. Ramachandra Rao

పువ్వాడ-రామచంద్రరావు పంతులుగారిచే

అనూదితము.

బ్రహ్మశ్రీ

పండిత, పురాణం-సూర్యనారాయణతీర్థులవారిచే

పరిష్కృతము.

Uppala Veeranna Shreshthi

ఉప్పల. వీరన్న శ్రేష్ఠిగారిచే

ప్రకటితము.

1925

చంద్రికాప్రెస్, చాకలపేట, చెన్నపురి.

కొండపల్లూర్పు 10-9-25—1000

"శ్లో. యద్దోర్దణ్డకరాళసర్పకవళ
జ్వాలాజ్వలద్విగ్రహా
నేశుస్సత్కరవాళదణ్డదళితా
భూపాః క్షితిక్షోభకాః,
శశ్వత్సైన్ధవవాహనో ద్విజజనిః
కల్కిః పరాత్మా హరిః
పాయాత్సత్యయుగాదికృత్స భగవాన్
ధర్మప్రవృత్తిప్రియః."

శ్రీ వేదవ్యాసులు.

వెల సాధారణప్రతి 0-12-0
,, గేసుప్రతి 1-0-0

సంగతి.

"సీ. ధర బెండువాటెఁ బాతాళలోకముఁ జేరె
సత్యమ్ము ధర్మమూ సన్న్యసించె,
తపము మున్నై నయుక్తమకృతుల్ వనిఁ జొచ్చెఁ
దొలుజాతివక్త్రచాపలము హెచ్చె,
తండ్రితోఁ గొమరుండు తగవాడఁగాఁ బాత
రాజులందు దురాశ రహిఁ జనించె,
జఘనచాపలము స్త్రీజాతి కెచ్చుగఁ జేతఁ
బురుషుండు స్త్రీలకింకరతఁ గోరె,
తే-గీ. కష్టముల్ చుట్టుకొనుచుండె శిష్టజనుల
కమ్మ! దుర్జనులకు విభుత్వమ్ము నిండె
వీనినింబట్టి యూహింప విశద మగును
కలిమహారాజు క్రమవృద్ధిఁ గాంచుచుంట."

విప్రశాపగ్రస్తుఁడైన పరీక్షిన్మహారాజు శ్రీశుకమహర్షివలన భాగవతధర్మములు వినుచుండఁగా నింతట ఏడురోజులును పూర్తియగుడు వెంటనే వారున్న ఒంటిస్తంభపుమేడ దగ్ధమయిపోయినది. అచ్చటి మునులందఱును తమతమ-ఆశ్రమములకుఁ బోయినారు. తరువాతను మార్కండేయముని యుడుగఁగా శుకమహర్షి మిగతకథ నీకల్కిపురాణముగా చెప్పుటచే నిది యనుభాగవత మని పేరుపడినది. శుకముని చెప్పుచుండఁగా విని సూతుఁడు శౌనకాదిమునులకు చెప్పినాఁడు. శ్రీకృష్ణభగవానుఁ డవతారము చాలించినదినముననే కలి ప్రాదుర్భవించినాఁడు. మనపంచాంగములలెక్కనుబట్టి చూడఁగా కలియుగము ప్రారంభమై యిప్పటి కయిదువేలయిరువయాఱు సంవత్సరములు ముగిసి యిరువదియేడవసంవత్సరము నడుచుచున్నది. ఈయుగమునకు నాయకుఁడు కలిమహారాజా. అతనిజీవితకాలము మనుష్యమానముచేతను నాలుగులక్షలముప్పదిరెండువేలసంవత్సరములు. అప్పటి కతనికి నూఱుసంవత్సరములగును.

ఆలెక్కనుబట్టి చూడఁగా నిప్పటి కా కలికి పదుమూఁడు నెలల యిరువది యొన్మిదిదినములు గడచి యిరువదితొమ్మిదవదినము నడుచుచున్నది. రాఁబోవు బహుధాన్యసంవత్సరముతో పదునాల్గుమాసములు నిండును. ఇట్టిశైశవస్థితిలో కలిమహారా జుండఁగానే పైపద్యము ప్రకారము జరుగుచుండఁగా, "చెల్లరే! ఇఁకపై యిట్లయినఁ జెప్పెడి దేమిఁక ముందుముచ్చటల్!" అన్నట్లుగా నింక ముందెట్లు జరుగునో ముందువారికే యెఱుక.

"శ్లో. యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత!
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్.
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే."

అని భగవద్గీతలో చెప్పినచొప్పున, ఎప్పుడెప్పుడు సనాతనధర్మమునకు హానియు, అధర్మమునకు వృద్ధియు నగునో అప్పుడు నే నవతరించుచుందు ననియు, సాధులను కాపాడుటకును, దుర్మార్గులను నశింపఁజేయుటకును ధర్మము నెప్పటియట్ల స్థాపనచేయుటకును నేను ప్రతియుగమునందును అవతరించుచుందుననియు భగవంతుఁడు ప్రతిజ్ఞ పట్టియున్నాఁడు. ఆప్రతిజ్ఞ ననుసరించి ప్రతికలియుగమందును విష్ణుభగవానుఁడు పదియవదియగు కల్క్యవతారమెత్తి సనాతనధర్మద్రోహులయిన బౌద్ధ,మ్లేచ్ఛ,యవన,పాషండ, నాస్తికాదుల సంహారించి ధర్మాత్ములగు పురుషులరాజ్యమును స్థాపించి సనాతనమైన వైదిక ధర్మమును రక్షించి మరల కృతయుగము నావిర్భవింపఁజేయుచుండును. ఈ పురాణములో భవిష్యత్సంగతులు కడచినట్లుగా వ్రాయఁబడియున్నవి. ఇందులకు ముఖ్యముగా రెండుకారణము లున్నవి. ప్రతికలియుగములోను కల్కిభగవానుఁ డవతరించుకారణమున గతించినకలియుగమునందలియవతారకథచెప్పి భవిష్యావతారసూచన చేయుట ఒకటి. రెండవది భవిష్యద్వార్తలను భూతములుగా వ్రాయుట సర్వత్రధర్మగ్రంథములప్రాచీనసంప్రదాయము. ఏమో అగుఁగాక! ఏసమయమున కలిమహారాజుప్రభావము భయంకర మగునో, ఏస

మయమున సూర్య,చంద్ర,కుజ,బుధ,గురు,శుక్ర,శని,రాహువు లేక రాశిగతులగుదురో, ఏసమయమున అధార్మికుల ఉత్పాతముద్వారా సనాతనవైదికధర్మమునకు సైపరానిదెబ్బ తగులునో ఆసమయమున విష్ణుభగవానుఁ డవశ్యము కల్క్యవతారమును ధరించి సనాతనధర్మములను రక్షించును. సనాతనధర్మావలంబులగు హైందవులందరుకు స్థైర్య మవలంబించి యేమివచ్చినను సహించుచు తమధర్మమునం దాసక్తులై యుందురు గాక! ఈ గ్రంథమున 3 సపుటలోని కలిపురుషజననము అనుశీర్షిక మొదలు ఇంద్రాగలు బ్రహ్మపురంబునకుఁ బోవుట అనుశీర్షికవఱకును కలిజననము, కలియుగంబునందలి విపరీతాచారములును వర్ణింపఁబడియే యున్నవి. కలియుగ మిట్టిఘోరమైన దయినను మధ్యమధ్యను వరుసక్రమమున, కృత, త్రేతా, ద్వాపరయుగముల సంబంధముకూడ కలుగుచుండును. అదెట్లందురేని, ఏప్రకారముగ ఒకగ్రహము తాలూకు దశలో మిగిలినగ్రహముల, అంతరములు, ప్రత్యంతరములు జరుగుచుండునో అదేప్రకారముగ ప్రతియుగమునను ఇతరయుగముల, అంతర ప్రత్యంతరములును జరుగుచుండును. గ్రహములు తమతమ అంతర ప్రత్యంతరములలో ఫలము నిచ్చుచుండునట్లే యుగములు నని యెఱుంగునది. ప్రస్తుతము కలిలో కలి నడచుచున్నది. మరల కృతపాదము రానున్నది. అప్పట్లో మరల సనాతనవైదికధర్మము తలయెత్తక మానదు. అందులకు సూచన లిప్పుడే కర్మభూమియగు మన భరతఖండమునం దగపడుచున్నవి. ఏమయినను కలిప్రభావము హెచ్చుటకును, కల్కి అవతరించుటకును ఇంకను చాలవేలసంవత్సరములు కడవవలసియున్నవి. ముందువా రాఘోరములైన ముచ్చటలన్నియుఁ జూడఁగలరు.

ప్రస్తుత మీపురాణమును సుమారు 30 సంవత్సరములకు పూర్వమే ఆంధ్రుల-ఉపయోగముకొఱకు మద్రాసువాస్తవ్యులును, చాలవఱకు సంస్కృతభాషలో పురాణము లచ్చువేసి ప్రకటించినవారును అగు మహారాజశ్రీ పువ్వాడ-రామచంద్రరావుపంతులుగారు విద్వత్సహాయులై ఆంధ్రుల, ఉపయోగనిమిత్తముగ ఆంధ్రీకరించి ముద్రించి ప్రకటించియున్నారు. ఆప్రతులిపుడు దొరకనికారణమున, వారిమనుమని యనుమతిని బొందినయతఁడును;

"క. అంబా! మాజన్మస్థా
నం బగు "గవరవరము"న కనతిదూరమునఁ
పాంబుర మనఁ దగి "చోడవ
రం" బను నామమ్ముచేఁ బరఁగు గ్రామమునన్."

సీ. ఆర్యవైశ్యకులమ్మునందుఁ బుట్టినవాఁడుఁ
బలుపుస్తకంబులఁ గలగృహస్థు,
మాకంటె ముందె యీమద్రాసునకుఁ గర్మ
గౌరవమ్ముచే వచ్చి యున్నవాఁడుఁ,
గోమటి యని చెప్పఁగూడనియతఁడు స
త్యప్రమాణికుఁడు విద్వత్సఖుండు,
భాషాభిమానతత్పరతచేఁ గాకున్న
మానఁ బొత్తము లమ్మ మఱిగినాఁడు,
తే.గీ మాకుఁ జిరకాలమిత్రుండు మఱి హితుండుఁ
గ్రొత్తక్రొత్తవి ప్రాఁతవి పొత్తములను
యోగ్యముగ నచ్చువేయించుచున్నవాఁడు
నయిన - ఉప్పలకులుఁడు వీరన్నశ్రేష్ఠి."

అనునతఁ డిద్దాని నచ్చువేయించుచు దీని సంస్కరణభారమును మాయం దుంచినాఁడు. మేమును మాతృభాషాభిమానముచేతను మిత్రుని-ఆదేశమును శిరసావహించి మొదటికూర్పులో కుప్పతెప్పలుగా పడియున్న తప్పులను యథామతి సంస్కరించి యీప్రకారముగా దీనిని తయారుచేయఁగలిగితిమి. ఇంకను ఎందేని పొరపాట్లుండినచో చదువరులు సరిచేసికొని చదువుకొనఁ బ్రార్థింపఁబడుచున్నారు.

ఇట్లు:

1-9-25 చెన్నపట్టనము.

మాతృభాషాసేవకపరమాణువు
పురాణం-సూర్యనారాయణతీర్థులు.

విషయసూచిక

నం. విషయము. పుట.

ప్రథమాంశము.

1. శౌనకాదిమహర్షులు సూతుని కలివృత్తాంతంబు నడుగుట 1
2. శౌనకాదిమహర్షులకు సూతుండు కలివృత్తాంతంబులం జెప్పుట 2
3. కలిపురుషజననము 3
4. కలియుగంబునందలి విపరీతాచారములు 4
5. ఇంద్రాదులు బ్రహ్మపురంబునకుం బోవుట 6
6. బ్రహ్మాదులు విష్ణుసమీపంబునకుం బోయి కలియుగదోషంబులను జెప్పుట 7
7. విష్ణువు విష్ణుయశస్సుగృహంబున కల్కియవతారము చేయుట 8
8. కల్కిమూర్తికి ఉపనయనముం జేయుట 11
9 కల్కి వేదాభ్యాసము చేయుట 14
10. కల్కి బిల్వోదకేశ్వరుని స్తుతించుట 15
11. బిల్వోదకేశ్వరుఁడు కల్కిమూర్తికి శుకతురంగాదులనిచ్చుట 17
12 విశాఖయూపుఁడు కల్కిసమీపమునకు వచ్చుట 18
13. కల్కిమూర్తి విశాఖయూపునకు స్వధర్మంబు లుపదేశించుట 19
14. పద్మాస్వయంవరము 24
15 శుకపద్మాసంవాదము 29
16 విష్ణ్వర్చనావిధి 32

ద్వితీయాంశము.

17. పద్మాశుకసంవాదము 35
18. పద్మాకల్కిసంవాదము 43
19. పద్మావివాహము 44
20. కల్కియొద్ద కనంతఋషి వచ్చుట 48

21. అనంతఋషివృత్తాంతకథనము 50
22. శాంపుం డనంతఋషికి తత్త్వము నుపదేశించుట 55
23. కల్కిమూర్తి నిజనగరంబునకుం బోవుట 59
24. కల్కి బౌద్ధుని జయించుట 63

తృతీయాంశము.

25. కల్కి మ్లేచ్ఛవధ చేయుట 68
26. మ్లేచ్ఛస్త్రీలు యుద్ధము చేయుట 69
27. అస్త్రదేవతలు మ్లేచ్ఛస్త్రీలకు తత్త్వోపదేశము చేయుట 71
28. కల్కిమూర్తి కుథోదర్యాదిరాక్షసులం జంపుట 73
29. కల్కిసమీపంబునకు నారదాదిఋషులు వచ్చుట. 77
30. మరుభూపాలుండు కల్కిమూర్తికి శ్రీరామచరిత్రము చెప్పుట 80
31. చంద్రవంశానువర్ణనము 95
32. దేవాపి-మరువులకు దివ్యరథప్రాప్తి 97
33. కృతయుగము వచ్చుట 98
34. కల్కి దిగ్విజయమునకుం బోవుట 101
35. కల్కిపురుషుండు కలిపురుషునితో యుద్ధము చేయుట 103
36. కోకవికోకవధము 107
37. భల్లాటనగరంబున శశిధ్వజ కల్కిసేనలకు యుద్ధము 110
38. కల్కిశశిధ్వజులయుద్ధము 116
39. సుశాంతాగీతము 118
40. శశిధ్వజుండు తనపూర్వజన్మవృత్తాంతమును జెప్పుట 123
41. శశిధ్వజునికి యుద్ధప్రవృత్తికారణము 129
42. ద్వివిదోపాఖ్యానము 133
43. కల్కిమూర్తి కాంచనపురికిం బోవుట 137
44. మాయాస్తోత్రము 142
45. విష్ణుయశస్సు మోక్షమున్ బొందుట 144
46. రుక్మిణీవ్రతకథనము 151
47. కల్కిమూర్తి లీలావర్ణనము 157
48. కల్కి వైకుంఠమునకుం బోవుట 160
49. పురాణకథాసంగ్రహము 165

శ్రీరస్తు.

కల్కి పురాణము

(వచన కావ్యము)

ప్రథమాధ్యాయము.

శ్లో. నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్.

"క. నారాయణతీర్థులకును,
ప్రాకృతజాతమున నుత్తములకు నరునకున్, గీర్
నారికి, వ్యాసులకు నమ
స్కారము గావించి పిదప జయ మనవలయున్."

భా. సూ. నా.

—శ్రీ శౌనకాదులకు సూతుని పూర్వవృత్తాంతంబుల నడుమను కథ—

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుండును, కల్క్యవతారుండునగు నే వేలుపు సకలలోకమాతయగు భూదేవతకు సంతోషంబునుగలుగం జేయ దుష్టభూపతుల నిజహస్తంబున ధరించిన ఖడ్గంబుచే ఖండించి బాహుదండ ప్రతాపానలజ్వాలాజాలంబుచే దహించెనో; ఏ భగవంతుఁడు కృతయుగధర్మంబును భూతలంబున వెలయింపం జేయుట కిచ్ఛగలవాఁడును, పరాత్పరుండును, ఉత్తమాశ్వంబు వాహనంబుగఁ గలవాఁడును, బ్రహ్మకులజాతుండునై యున్నవాఁడో; అట్టి విష్ణుమూర్తి మనల రక్షిం

చుఁగాత. అని సూతుండు చెప్ప సకలభువనప్రశస్తంబును శ్రీమన్నారాయణచరణారవిందమందేతరభక్తిలతాసముల్లసన సముచితహృదయకేదారమునిబృందారక బృందశరణ్యంబగు నైమిశారణ్యంబున వసించు శౌనకాదిమునిశ్రేష్ఠులు పౌరాణికోత్తముండగు సూతమహర్షి మృదుమధురవాక్యంబుల నతిహర్షంబున నాలకించి సర్వధర్మంబుల గుర్తెఱిఁగినవాఁడును రోమహర్షణపుత్త్రుండును త్రికాలజ్ఞానసంపన్నుండును సర్వపురాణగాథల నుపన్యసించుటయందు నేర్పరియునైన సూతునింజూచి "పౌరాణికోత్తమా! కలియన నెవ్వండు? ఎక్కాలంబున నెచ్చోటజనించె? వానిచే సర్వధర్మంబు లెట్లునశింపఁజేయఁబడియె? వానిస్వరూపం బెట్టిది? అను నీవృత్తాంతంబుల మాకు సావధానంబుగ ననుగ్రహించి మాడెందంబులయందలి సందియంబులం దీర్చి నను గ్రహింపు" మని ప్రార్థించిన ఋషిసత్తముల పలుకుల సూతుం డాకర్ణించి సర్వజగంబుల కొడయండగు విష్ణుదేవుని పదకంజంబుల దనడెందంబున ధ్యానించి యానందాతిశయరోమాంచముగలవాఁడై శౌనకాదిమహర్షులకుఁ గలిపురుషుని వృత్తాంతంబు నిత్తెఱంగునం జెప్ప నుపక్రమించె.

—౨ శౌనకాదిమహర్షులకు సూతుండు కలివృత్తాంతంబులం జెప్పుట ౨—

ఓ ఋషిసత్తములారా! పరమాద్భుతంబుగను ఇఁక ముందు జరుగంబోయెడిదిగ నుండు నీయుపాఖ్యానంబువినుండు. ఇయ్యది తొలుత నలువ తనపట్టియగు నారదమహామునికిని, అతఁడు వ్యాసునకును, అతఁడు తనపుత్త్రుండగు బ్రహ్మరాతునకును, బ్రహ్మరాతుం డభిమన్యుపుత్త్రుండైన విష్ణురాతునకును వక్కాణించె. ఆవిష్ణురాతుం డేడుదివసంబులు పదునెనిమిది వేలపరిమితిగల భాగవతకథలను విని సప్తమదినంబునఁ గాలధర్మంబు నొం

డె. అపుడాపుణ్యాశ్రమంబునందలి మార్కండేయాది ఋషిశ్రేష్ఠులు తమకు నావలికథలను జెప్పుమని శుకుని బ్రార్థింప వారు చెప్పఁగా వారియనుమతిచే నేనీకల్కిచిత్రచరిత్రంబు నాకర్ణించితిని. అట్టికథను జెప్ప నారంభించెద. మీరు సావధానచిత్తులరై యాలకింపుఁడని యిట్లని చెప్పందొడంగె.

భగవత్స్వరూపుండగు శ్రీకృష్ణుండు భూభారభూతులగు కంసాదిదుష్టభూపతులం దునిమి స్వస్థానంబగు వైకుంఠంబునకుం బోయినపిదప కలి యుద్భవించె.

కలిపురుషజననము.

విష్ణునాభికమలసంజాతుండును లోకపితామహుండునైన నలువ తనపృష్ఠదేశమార్గంబున పాతకంబుల విసర్జించె. అవియే యధర్మంబు లని వాడంబడు. అయ్యధర్మవంశపారంపరలను కీర్తించుటచేతను, స్మరించుటచేతను మానవులు సర్వపాపంబుల వలన విడువఁబడినవార లగుదురు.

మార్జాలమువంటికన్నులు గల మిథ్య యను నది యధర్మంబునకు భార్య. కోపిష్ఠుండుగ, బలిష్ఠుఁడుగనుండు దంభుండు పుత్త్రుండు. పుత్త్రుండగు దంభుండు తనతోఁబుట్టువగు మాయ యను కన్యకయందు లోభుండను పుత్త్రుని నికృతియను పుత్త్రికను గనెను. లోభము నికృతి వీరిరువురి యన్యోన్యసంపర్కముచేఁ గ్రోధుండు పుట్టెను క్రోధుండు తనభగినియగు హింసయందు వామహస్తంబునం దుపస్థను ధరించినవాఁడును తైలముతో మిశ్రముచేయఁబడిన కాటుకవంటిశరీరకాంతి గలవాఁడును, కాకమువలె శుష్కీభవించిన యుదరముగలవాఁడును, వికారమైన ముఖముగలవాఁడును, చలింపుచుండు నాలుక గలవాఁడును, భయంకరస్వరూపుండును, దుర్గంధయుక్తమగు శరీరముగల

వాఁడును జూదము, మద్యపానము, స్త్రీసంపర్కము, ధనము, వీనియందధికాసక్తిగలవాఁడునైన కలి యను పుత్రునిఁ గనెను. అక్కలి దురుక్తియను తోఁబుట్టువునందు భయ మనుపుత్రుని అపమృత్యువను కూఁతును జనింపఁజేసె. భయాపమృత్యువుల యందు నరక మనుపుత్రుండు పుట్టె. నరక మనువాఁడు దన తోఁబుట్టువగు యాతనయందు బదివేలసంఖ్యగల పుత్రులం గాంచె. ఇట్లు కలికులంబున జనించినవారును, ధర్మనిందకులును, వేదాధ్యయనయాగాదిధర్మంబుల నాశనముఁ జేయువారును, మనోవ్యాధి, రోగము, జర, బడలిక, దుఃఖము, శోకము, భయము వీనియందు ముఖ్యముగా నాసక్తి గలవారు నైన కలిరాజదూత లిక్కలియుగంబున గుంపులుగుంపులుగ లోకనాయకులై సంచరించుచున్నవారలు.

కలియుగంబునందలివిపరీతాచారములు.

ఇక్కలికాలంబున మనుజులు స్త్రీలోలురును, దంభాచార దురాచారప్రధానులును, తల్లిదండ్రుల హింసించుస్వభావము గలవారు నై యున్నవారలు. మఱియు బ్రాహ్మణులు వేదాధ్యయనవిహీనులును, శూద్రజనసేవాదురంధరులును, కుయుక్తిపరులును, ధర్మ, వేదవిక్రయులును, ఉపనయనాదిస్వకులాచారంబులను పాఱఁద్రోలినవారును, లవణతైలాదిరసవర్గంబులు, మాంసాదులు వీనిని విక్రయించువారును, దయాశూన్యులును, శిశ్నోదరపరాయణులును, పరదారేచ్ఛాగమనులును, మదించినవారును వర్ణసంకరమును గలుగంజేయువారు నగుదురు.

మనుష్యులు పొట్టియాకారముగలవారును, పాపకృత్యంబులం జేయుటయందు వెనుదీయనివారును, పైకి మంచిమాటలం జెప్పుచు హృదయంబున ద్రోహము దలఁచువారును, మఱ

ములో నివసించువారును, పదియాఱువత్సరంబు లాయుఃపరిమితి గలవారును, భార్యావర్గంబునందలి బంధువులనుమాత్రము తన కాప్తులుగఁ దలంచువారలును, నీచజనులతోడి చెలిమి సంభాషణాలు నెరపువారును, ఎల్లప్పుడును గలహము చేయువారును వెండ్రుకలను దువ్వుకొని యలంకారము చేసికొనుటయం దధిక ప్రీతి గలవారునై యుందురు.

ధనికుఁడు నీచవంశజాతుఁడుగ నుండినను సత్కులప్రసూతుండుగ, పూజార్హుండుగ నెన్నంబడు. విప్రులు వడ్డితో జీవించువారలుగను, సన్న్యాసులు గృహమునం దాసక్తి కలవారలుగను, గృహస్థులు వివేకరహితులుగనుందురు. శూద్రులు గురుబ్రాహ్మణనిందాసక్తులును, డాంబికమునకు విత్తమును విచ్చలవిడిగ వెచ్చముఁ జేయువారును, పెద్దలకు ద్రోహము దలంచువారును, దానము దీయువారును, ఇతరులసొత్తులను హరించువారు నగుదురు. మఱియు స్త్రీపురుషుల యన్యోన్యసమ్మతమే వివాహముగా భావించుట, దుష్టుఁడు కొంచెము దాతృత్వము కలవాఁడుగ నుండినంతమాత్రముచేతనే వానితో స్నేహముఁ జేయుట, ఒకఁడు తనకు కీడు చేసినపట్ల వానికి మరల చెడుపు చేయుటకుఁ దనకు శక్తి లేనియెడలమాత్రమే యోర్పు గలిగి యుండుట, తనదుర్జనత్వమునుంబట్టి యెవ్వరేని తనకు దానముం జేయకుండు కారణంబుచే దానముదీయనివానివలె నటించుట, పూర్ణపాండిత్యవిహీనుండుగ నుండినను నిజవాచాలత్వంబుచే దండిపండితుం డనిపించుకొనుట, దేవతాప్రీత్యర్థము గాక కీర్తి సంపాదించుటకై ధర్మము జేయుట, దుర్గుణుండుగ నుండినను ధనసంపత్తిచే శ్లాఘ్యుం డని కొనియాడంబడుట, యజ్ఞోపవీతధారణముచేతమాత్రము బ్రాహ్మణుం డనిపించుకొనుట, దండ

మును ధరించినమాత్రముచేత సన్న్యాసి యని భావింపం జేయుట, సాధారణముగ భూమియంతయు ఫలవంతము గాక నదీతీరంబులందలిభూమిమాత్రము కొంచెముగ ఫలించుట, కులంబునందలి యిల్లాండ్రు వెలవెలందులవలె తమ చాకచక్యంబులచే పరపురుషులహృదయంబుల దొంగిలించి తమచిక్కులం జిక్కంజేసికొనుట, పురుషు లగ్నిపురస్సరంబుగం బెండ్లియాడిన నిజభార్యలయం దసూయాపరులై వేశ్యాసంగమంబునం దాసగొనుట, ద్విజన్ములు పరాన్నభుక్కులై చండాలగృహమునందు పౌరోహిత్యము చేయించువారుగ నుండుట, విధవస్త్రీలు తమనియమంబులనువదలి స్వేచ్ఛగా పరపురుషులతోడిసంపర్కముం జేయుట, మేఘుంబులు చిత్రంబుగ వర్షించుట, భూమి యల్పంబుగ ఫలంబు నిచ్చుట, రాజులు తమ రాజ్యములోనిజనంబుల ననేకమిషలచే హింసించి వంచించుట, రాజులకప్పములు మొదలగువానిచే ప్రజలు హింసింపంబడి పుత్రమిత్రాదులతో వనానుగమనులై పర్వతంబుల నాశ్రయించి మధు మాంస మూల ఫలాదులచే ప్రాణంబులను గాపాడికొనుట, ఇట్లు కలియుగ ప్రథమపాదంబునందు నడుచును. ద్వితీయపాదంబున యజ్ఞయాగాది ధర్మంబులు, బ్రాహ్మణాదిచాతుర్వర్ణంబులు వీనినామంబులునైతము శూన్యంబు లగు. తృతీయపాదమునందు బ్రాహ్మణాదివర్ణసంకరంబు గలుగు. నాల్గవపాదంబునం దెల్లకులంబులునశించి యొక్కటేజాతిమాత్రము నిలుచును. మఱియు జేజేల స్మరణయే లేకపోవును.

~ ఇంద్రాదులు బ్రహ్మపురంబునకుం బోవుట. ~

ఇప్పగిది కలియుగంబున వేదాధ్యయన, స్వాహాకార, స్వధాకార, వషట్కార, ఓంకారంబులు శూన్యంబు లగుటం జేసి పురందరాదిబృందారకులు నిరాహారులై కృశించి దీనత్వ

ముం జెందియుండు భూదేవిని ముందిడుకొని వేదఘోషంబుల చేతను, యజ్ఞధూమంబులచేతను, గణనాతీతులగు బ్రహ్మర్షులచేతను, స్వర్ణవేదికామధ్యంబునఁ బ్రజ్వలింపుచుండుయాగాగ్నుల చేతను, యూపస్తంభములచేతను, పుష్పఫలసమన్వితంబులగు నుద్యానవనంబులచేతను, హంససారసాదివిహంగంబులచే సంపూర్ణంబుగనుండు సరోవరంబులచేతను విరాజమానం బగు బ్రహ్మపురంబునకుం బోయి మందమారుతంబుచేఁ జలింపఁబడిన లతానివహాగ్రంబులయం దుల్లసత్కుసుమనికర మధ్యంబుల యందలిషట్పదవ్రాతంబు లొనర్పుఝుంకారంబులచే ప్రణామాహ్వానపూజామధురభాషణాదులను జేయుటంబోలెఁ బ్రకాశింపుచుండు బ్రహ్మసదనంబునకుం జని సనకసనందనసనాతనాది సిద్ధులచే నెల్లపుడు నమస్కరింపఁబడినపాదపద్మంబులు గలవాఁడును భద్రాసనోపవిష్టుండును త్రైలోక్యపితామహుండునైన బ్రహ్మదేవునికినమస్కరించి, వారిచే ననుజ్ఞాతులై దైన్యంబుఁ జెందిన హృదయంబులతో నిజకార్యంబుల నివేదించుట కారంభించిరి.

ఇది ప్రథమాధ్యాయము.

ద్వితీయాధ్యాయము.

{ బ్రహ్మాదులు విష్ణుసమీపంబునకుం బోయి కలియుగ దోషంబులను జెప్పుట. }

ఇట్టు లింద్రాది దేవతలు కమలాసనునిసదనంబున కేగి బ్రహ్మానుజ్ఞాతులై వారియెదుటఁ గూర్చుండి కలియుగంబునం గళిగియుండు ధర్మవిపరీతంబులను వక్కాణింప నలువ యాకర్ణించి మీరు భయంబు నుడుఁగుఁడు. మన మెల్లరము కమలాపతి

సమీపంబునకుం బోయి యావెన్నునకు దయపుట్టునట్లు చేసి మనయత్నీకృతకార్యంబులను నెఱవేర్చుకొంద మని మందలించి దేవతానికరపరివృతుండై వైకుంఠంబునకుం జని గరుడవాహను ననేకభంగులం గొనియాడి దేవతామనోవాంఛితంబను వెల్లడించె.

ఇట్లు చెప్పిన బ్రహ్మాపాలకులను బుండరీకాక్షుండగు విష్ణుం డాకర్ణించి నేను శంబళంబను గ్రామంబున "విష్ణుయశస్సు" అను పేరంబరంగు భూదేవుని గృహంబున సుమతి యనుకన్యకయందు నలువు రన్నదమ్ములతోడం బుట్టి కలిపురుషుని సంహరించెదను. పుడమియందు మీరును మీమీయంశంబులతోడ నాకు సాహాయ్యార్థంబుగ నవతరింపుఁడు నామనోనాయిక లక్ష్మీదేవి సింహళదేశంబున కేలికయగు బృహద్రథుం డని వెలయు భూకాంతుని నిజపత్ని యగు కౌముది యనునాయికాగ్రణియందుఁ బుట్టి "పద్మ" యనునామంబునుం బొంది నాకు భార్యగాఁగలదు నే నపుడు కలి యనుదుష్టగజంబును సంహరించి భూలోకంబున మరువు, దేవాపి, యనుభూమీశుల నిరువురిని ప్రజాపాలకులుగ నియమించి తొల్లింటికరణి కృతయుగధర్మంబుల స్థాపించి స్వస్థానంబగు వైకుంఠంబుఁ జేరెద నని వచించు కమలనాభునిపలుకుల నెంతయుసంతసంబున నాలకించి బ్రహ్మాదిదేవతలు మనో దుఃఖవిముక్తులై వారివారి స్థానంబులకుం బోయిరి.

— విష్ణువు విష్ణుయశస్సుగృహంబున కల్కి యను నామము నొందుట —

పిదప నారాయణుండు శంబళగ్రామవాసియగు విష్ణుయశస్సునిభార్యయగు సుమతిగర్భంబునం జొచ్చి వైశాఖశుద్ధద్వాదశీదివసంబున శంఖచక్రగదాశార్ఙ్గచతుర్భుజాద్యసాధారణ నిజ



చిహ్నంబులతో మహిం బుట్టెను. అట్టి వైకుంఠనిలయవతారో
త్సవసమయంబున దేవమహర్షి మానవసరిత్సముద్రగిరి వృక్షభు
జంగమ ప్రభృతులైన స్థావరజంగమంబులగు నెల్లభూతంబు
లత్యానంద కందళితమనస్కులైనవి. అమందానందంబున పితృ
దేవతలు నాట్యము సేసిరి. దేవతాగణంబులు పరమాత్మునికీర్తిని
గానముఁ జేసిరి. గంధర్వులు భేరీపటహ మృదంగ దుందుభిఢాం
కాది దేవతావాద్యంబులను మ్రోయించిరి. అప్సరోగణంబులు
సంగీతనర్తనాదులను సలిపిరి. తల్లిదండ్రులయిన సుమతీ విష్ణుయ
శస్సులు నిజశిశుసందర్శన మాత్రంబున నానందాంబుధియందు
జలమానుష కేళి నుండిరి. పరమేశ్వరపత్ని యగు పార్వతీదేవి
యాకాశగంగోదకంబుచే శిశువునకు జలకమాడించె. సావిత్రి

దేవి తడి యొత్తె. జగద్రక్షకుండగు నాశిశువునకు భూదేవత
యమృతస్వరూపంబగు తనచంటిపాలు గుడిపించె. బ్రాహ్మ్యాది
సప్తమాతలు మంగళంబులం బాడిరి. ఇట్టియపూర్వవృత్తాంతం
బును సృష్టికర్తయగు విరించి యెఱింగి తనసేవకుండగు వాయు
దేవునిం బిలిచి నీవతిత్వరితగమనంబునఁ బురిటింటి కేఁగి లోక
నాయకుండగు విష్ణువునకు మ్రొక్కిలిడి నావచనంబుగ నిట్ల
నుము. "ఓస్వామీ! దేవతలకుసయితము దర్శించుటకు దుర్లభం
బగు శంఖచక్రగదాశార్ఙ్గ చతుర్భుజాదినిజరూపంబులను వర్జించి
సాధారణంబుగ మనుష్యశిశురూపంబును ధరింపఁ బ్రార్థింతు"
మని చెప్పినబ్రహ్మాదేశంబు నెఱింగి వాయుదేవుండు శీతసుగంధ
మందమారుత స్వరూపంబున సూతికాగృహంబుఁ జొచ్చి విన
యవినమితాంతరంగుండై బ్రహ్మప్రార్థనావాక్యంబుల దామో
దరునితోఁ బల్కిన విష్ణుస్వరూపుండగు నాశిశు వాలకించి తత్క్ష
ణంబ భుజద్వయాదిచిహ్నంబులం గల్గి మనుష్యశిశువువలె పరి
ణమించె. తొల్లింటిశంఖచక్రాదిచతుర్భుజంబు లదృశ్యంబులై
సామాన్య మనుష్యశిశురూపంబు వహించినయాశిశువును తల్లి
దండ్రులుచూచి పరమాశ్చర్యాంబుధినిమగ్నులైరి. శంబళగ్రామం
బునందలి బ్రాహ్మణాదిసకలవర్ణంబులు మంగళాచరణ మహో
త్సవాదులతోఁ గూడినవారలై పాపసంతాపదుఃఖభయాదివ
ర్జితులైరి. తల్లియగు సుమతి జగత్ప్రియయగు విష్ణువును పుత్త్రుం
డుగఁ జెంది సఫలమనోరథయై బ్రాహ్మణోత్తముల గోదాన
సహస్రంబులచేఁ దృప్తింబఱచె జనకుండగు విష్ణుయశస్సు నిజత
నూజునికి ఋగ్యజుస్సామాథర్వ వేదస్వరూపమైన నామకరణము
చేయవలయునని పరిశుద్ధమైన తనమనస్సుచే యోజించుచుండ

వ్యాసకృపాశ్వత్థామభీష్మాచార్యులు భిక్షుకుల స్వరూపంబులం దాల్చి మనుజశిశువుగ నవతరించియుండు భగవంతునిసమీపంబునకు వచ్చి నమస్కరించిరి. ఉదితమార్తాండతేజంబుగల యావ్యాసాదులను విష్ణుయశస్సు చూచి యానందాతిశయజనిత పులకాంకితుండై వారికి పెక్కుభంగులఁ బూజ లొనర్చె. ఇట్లు పూజలొందినవ్యాసాదులు సుఖోపవిష్టులై విష్ణుయశస్సు నంకతలంబున దినకరసదృశంబుగ వెలుంగు నాయర్భకుం జూచి జగంబునం దెల్లెడల నిండియుండు నాజిష్ణుండు కలివినాశార్థంబై మనుష్యశిశురూపంబున నవతరించియుండునట్లు దెలిసికొని కల్కి యనునామం బిడి జాతకర్మాదిసంస్కారంబులను మంత్రపురస్సరంబుగ నిర్వర్తించి ప్రహృష్టమానసులై నిజవాసంబుల కేఁగిరి.

తదనంతరం బా భగవత్స్వరూపుఁ డగు శిశురత్నంబు సుమతి యను మాతారత్నంబుచే నానాఁటికిఁ బోషింపంబడి శుక్లపక్షక్షపాకరునిమాడ్కి నభివృద్ధిం జెందె. ఇక్కల్కిపురుషునికి కవి, ప్రాజ్ఞుఁడు, సుమంత్రుఁడు అనునామంబులచే వెలయు మువ్వురగ్రజులు గలరు. వీరు పితృమాతృగురుబ్రాహ్మణులయెడ విశేషభక్తి కలవారలై సత్యధర్మనిరతులుగ నుండిరి. గర్గ, భర్గ, విశాలు రను పేళ్లుగల జ్ఞాతులు వీరల కనుచరులు. వీర లందఱు విశాఖయూపుండను పుడమితేనిచేఁ బాలింపఁబడి భయ, సంతాప, శోకశూన్యులై కల్కిమూర్తిని వీక్షింపుచుఁ బరమానందంబును జెంది యుండిరి.

కల్కిమూర్తికి ఉపనయనముఁ జేయుట.

ఇవ్విధంబున కొన్నిదివసంబులు గతించిన విష్ణుయశస్సు సముత్తమగుణోపేతుండును, వికసితతామరస సదృశనేత్రద్వయుండును, విద్యాభ్యాసమునం దిచ్ఛ గలవాఁడును, బుద్ధిమం

తుఁడునైన తన ముద్దులపట్టిని జూచి ఓకుమారా? నీకు బ్రహ్మ సంస్కార యజ్ఞసూత్ర గాయత్ర్యుపదేశ వేదాధ్యయనంబులం జేయవలయునని వాకొనుతండ్రి పలుకులఁ గల్కి యాలకించి "ఓ పిత! వేదంబన నెద్ది? సావిత్రి యన నేమి? బ్రాహ్మణు లేసూత్రంబుచే సంస్కారముఁ జేయఁబడుదురు? వీని నామూలాగ్రంబుగ నా కుపదేశింపు" మని యడిగెను.

పిత—వేదం బన పరబ్రహ్మవాక్కుచే వచింపఁబడినది. సావిత్రి వేదంబులకుఁ దల్లి. త్రిగుణత్రివృత్తులను సూత్రంబులచే బ్రాహ్మణులు సంస్కరింపఁబడుదురు. దశవిధసంస్కారయుక్తులుగ నుండువారికి బ్రాహ్మణు లనుసంజ్ఞ చెల్లును. వేదములు ధర్మమార్గములను స్థాపించి త్రిభువనపోషకములుగ నుండును వేదవిధాన మనుసరించి యజ్ఞాధ్యయన, దాన, తప, స్వాధ్యాయ, సంయమాదులచేత భగవంతుని బ్రాహ్మణోత్తములు భక్తియుక్తముగ భజింతురు. కావున నీకు శుభదినంబున బ్రాహ్మణశ్రేష్ఠబంధువర్గసమక్షంబున నుపనయన సంస్కారముం జేయుదు నని తండ్రి ప్రత్యుత్తర మిచ్చెను.

పుత్త్రుఁడు—బ్రాహ్మణాధీనంబులగు దశవిధసంస్కారంబు లెయ్యవి? విప్రవరు లేవిధిచేత విష్ణువు నారాధింతురు? అని కుమారుండు మరల తండ్రి నడిగె.

పిత—బ్రాహ్మణవనితయందు బ్రాహ్మణబీజంబునకు జనించినవాఁడును, గర్భాధానాదిసంస్కారయుక్తుండును, సంధ్యాత్రయమునందు సావిత్రీజపపరాయణుండును, తపోధనుండును, సత్యవాక్పరిపాలకుండును, ధర్మేచ్ఛగలవాఁడును, సదా సంతుష్టితోఁ గూడినవాఁడునైన సద్గుణగణాగ్రగణ్యుండగు బ్రాహ్మణశ్రేష్ఠుఁ డీలోకమును రక్షింపుచున్నవాఁడు.

పుత్రుఁడు—సదాచారముచే భగవంతునికిఁ బ్రీతిని కలుగఁజేయుచు సమస్తలోకంబులయందలి యాపదలను బరిహరించి మనోవాంఛితంబులు ప్రసాదింపుచుండునట్టి బ్రాహ్మణోత్తముం డేస్థలమునం దున్నవాఁడు?

పిత—ధర్మంబు నడుగంట నశింపఁజేసినవాఁడును, బ్రాహ్మణోచితంబు లగుధర్మంబులకు హానిఁ జేయువాఁడును, బలవంతుఁడు నైన కలిపురుషునిచే తిరస్కరింపఁబడి బ్రాహ్మణోత్తము లనేకవత్సరంబులకు పూర్వంబే గతించిరి. ఇక్కలియుగ మధ్యకాలంబున స్వల్పతపోయుక్తులుగనుండు బ్రాహ్మణులు సయితము దారోదరపరాయణులుగ, అధర్మప్రాధాన్యులుగ, బ్రాహ్మణోచితంబు లగుధర్మంబులను వర్జించినవారుగ, పాపభూయిష్ఠులుగ, తేజోవిహీనులుగ, తమ్మును రక్షించుకొనుట యందుసయితము కొఱవడిన శక్తిగలవారలుగ, శూద్రజనసేవాధురంధరులుగ, దురాచారంబుల ననుష్ఠించువారుగ నుందురు.

కల్కిపురుషుం డిటులు వచించినపితృవాక్యంబుల నాకర్ణించి కలియుగదుష్కృతంబుల నామూలాగ్రంబుగ ఖండింప నిశ్చయించి బ్రాహ్మణసదస్సున తండ్రిచే నుపనీతుండై ఆచార్యకులంబునందు వసించుట కిచ్ఛయించెను.

ఇది ద్వితీయాధ్యాయము.

తృతీయాధ్యాయము.

—కల్కి వేదాభ్యాసము చేయుట—

ఇట్లు కల్కి గురుకులంబున వసించుట కిచ్ఛకలవాఁడై పుణ్యాశ్రమంబునుంగూర్చి పోవుచుండుతఱి మహేంద్రాచల శిఖరంబునఁ దపంబుచేయుటకై వచ్చియుండు పరశురాముం డీబాలునిం జూచి తనయాశ్రమంబునకుఁ జేరం జీరి "నీ కేను వేదశాస్త్రంబుల నుపదేశముచేసెదను. నీవు నన్ను ఆచార్యునిగ గొనుము. నేను భృగువంశకులజుండగు జమదగ్నిపుత్రుండ. వేదవేదాంగ ధనుర్వేదాదులయందు కడు నేర్పరిని. భూమి యందు క్షత్రియకులంబు నిరువదియొక్క మాఱు నిర్మూలంబుఁ జేసి సాగరపరివృతంబుగనుండు సద్ధాత్రిని బ్రాహ్మణోత్తమునకు దానంబుగా నిచ్చి యీమహేంద్రగిరిశిఖరంబున తపస్స్వాధ్యాయనిరతుండనై యున్నవాఁడను. ఓబ్రాహ్మణకుమార! నీకు వలయు వేదశాస్త్రంబులను బఠింపుము." అని చెప్పినపరశురాముని హితోపదేశంబును విని కల్కిమూర్తి తృప్తిఁ జెందిన మనస్సుకలవాఁడై వారికి దండంబు లిడి వారివద్ద వేదవేదాంగములు, చతుష్షష్టికళలు, ధనుర్వేదము మొదలగువానిని నామూలాగ్రంబుగ నభ్యసించి బద్ధాంజలిపుటుండై "ఓస్వామి! గురుదక్షిణార్థంబుగ నే నెద్ది సమర్పించిన తమకు తృప్తికరం బగునో దాని వక్కాణించి నన్ను గురుఋణవిముక్తునిగ చేయుఁ"డని ప్రార్థించినకల్కివచనంబులను విని పరశురాముం"డోతనయా! నీవు సర్వాశ్రయుండుగ, సర్వాంతర్యామిగ, సర్వవ్యాపకుండుగనుండువిష్ణుండవు. బ్రహ్మాది దేవతలచే కలినిగ్రహముకొఱకుప్రార్థింపఁబడి శంబళగ్రామమునందు బ్రాహ్మణకుమారుండుగ నవత

రించి నావద్ద ధనుర్వేదాదిసర్వవిద్యల నభ్యసించితివి. మఱియు నీవు పరమేశ్వరుంగూర్చి తపంబుఁజేసి అతనివద్ద నస్త్రవేసము, వేదమయమైన చిలుకను గ్రహించి సింహళద్వీపమునందు రాచకులంబునంబుట్టి పద్మయను పేరం బరంగు లక్ష్మీదేవిని పరిణయమాడి దిగ్విజయమునందు కలిపురుషుని శిష్యులుగ,దుష్టులుగ, ధర్మహీనులుగ నుండు రాజులు, బౌద్ధులు మొదలగువారిని సంహరించి మరువు, దేవాపి అను భూమీశుల నిరువురిని ప్రజాపాలకులుగ నేర్పఱిచి యిజ్జగంబున సదాచారసద్ధర్మంబుల స్థాపింపంబోయెదవు. ఈమంచికార్యంబులచేత నేను కడు సంతోషమును జెందెదను. ఇదియ నాకు గురుదక్షిణ. మే మింక నిశ్చింతను యజ్ఞ దాన తపఃకర్మస్వాధ్యాయాదులను శాస్త్రప్రకారముగఁ జేయుదుము. ఇంతకన్ననిష్టమగు నొంకగురుదక్షిణ యేల?" అని పరశురాముఁడు మందలించెను.

ఇట్టి పరశురామవాక్యంబులకు కల్కిపురుషుం డెంతయు సంతసించి వారికి దండప్రణామంబు లాచరించి బిల్వోదకేశ్వరునిసమీపంబునకుం బోయి యథావిధిగఁ బూజించి నమస్కరించి ఇట్లు స్తోత్రముచేయుట కుపక్రమించె.

~ కల్కి బిల్వోదకేశ్వరుని స్తుతించుట. ~

పార్వతీపతియును, సకలలోకంబుల శాధ్యుండును, సర్వభూతగణశరణ్యుండును, వాసుకిని కంఠహారంబుగ ధరించినవాఁడును, త్రిలోచనుండును, పంచముఖంబులు కలవాఁడును, ఆది దేవుండును, అమందానందపరిపూర్ణహృదయుండును, యోగాధీశుండును, అనంగుని తనకంటిమంటచే దహింపఁ జేసిన వాఁడును, ఉగ్రరూపధరుండును, గంగాతరంగసంగతోత్తమాంగుండును, జటాపటలదేదీప్యమానుండును, అభినవశీతాంశుకళాశేఖరుండు

నునైన దక్షయజ్ఞధ్వంసికి నమస్కారము చేయుచున్నాఁడను. ఎవ్వఁడు ఖడ్గశూలాది నానావిధాస్త్రంబుల ధరించిన భూతవేతాళసంఘంబులతోడం జేరి శ్మశానవాసియై నిజకోపానలంబుచే సమస్తభువనంబులను సంహరించునో; ఎవఁడు సర్వభూతంబుల కాదిభూతుండును, సర్వభూతతన్మాత్రాస్వరూపుండును, సమస్తభువనభూతంబుల సృజియింప నిచ్ఛగలవాఁడునై కాలకర్మస్వభావములలో నెల్ల జంగమ స్థావరంబులయందు తాను జీవత్వముఁబొంది బ్రహ్మనంశంబును బొందుచున్నవాఁడో; ఎవఁడు విష్ణుస్వరూపుండై సర్వలోకాంతర్యామియై సర్వధర్మపరిపాలకులైన సజ్జనులను దనకరుణాకటాక్షంబుచేఁ బరిపాలింపుచున్నాఁడో; ఎవఁడు బ్రహ్మాద్యంశములను జెంది సకలలోకసృష్టిస్థితిసంహారాదికేళిని జేయుచున్నాఁడో; అట్టిసదాశివునికి నమస్కారముఁ జేసెదను.

మఱియు నెవనియాజ్ఞచే వాయుదేవుండు వీచునో; ఎవనియాదేశంబున అగ్ని జ్వలించునో; ఎవనియానతిచే సూర్యుండొకచోనైన నిలువక తన వేఁడిమిచే లోకంబులను దపింపఁజేసి ఆకాశపథంబున సంచరించునో; ఎవని నియామకంబుచే చంద్రుండు నక్షత్రగ్రహగణపరివృతుండై ఆకసంబున సంచరించుచున్నవాఁడో; ఎవని యనుగ్రహమువలన భూదేవి భువనంబులను ధరించుచు, ఇంద్రుండు వర్షించుచు, మేరుపర్వతముచలింపక స్థావరజంగమంబులను భరింపుచునుండునో; అట్టి విశ్వరూపధరుండైన సాంబమూర్తికి అంజలిఁ జేయుచున్నాఁడను.

ఇటులు కల్కిస్వరూపుండగు భగవంతునిచేఁ జేయఁబడినస్తోత్రమును సర్వాత్ముండుగ, సర్వలోకేశ్వరుండుగ, పార్వతీసహితుండుగనుండు బిల్వోదకేశ్వరుం డాలకించి మందస్మిత

వికసితవదనారవిందుండై కల్కిని సమస్తావయవంబుల నిజహస్తకమలంబులచేఁ దాఁకుచు "ఓకుమారా! నీకోరిక యెద్దియో అద్దానివేఁడుము. నీచే నొనర్పఁబడిన యీస్తోత్రమువలన మహానందంబు నొందితిని. భూలోకంబునం దేరిచే నీస్తోత్రము పఠింపఁబడునో లేక ఆకర్ణింపఁబడునో అట్టివారికి ధర్మార్థకామాదిసకలమనోరథంబులు సిద్ధించుట కిసుమంతయైనను సందియంబు లేదు.

బిల్వోదకేశ్వరుఁడు కల్కిమూర్తికి శుకతురంగాదులనిచ్చుట.

గరుత్మంతునివంటి జవసత్త్వము కలదిగ, యజమానుఁడు తలఁచుస్థలంబున కతిత్వరితగతిం గొంపోవు శక్తికలదిగ నుండు నియ్యశ్వంబును, సకలలోకవృత్తాంతంబుల నాద్యంతము ప్రత్యక్షముగా నెఱుంగ శక్తికలదిగ నుండు నీచిలుకను గ్రహింపుము. నీవు సకలవేదశాస్త్రపారంగతుఁడవుగ, సమస్తలోకంబులయందు జయము గొనువాఁడవుగ నగుదువు. రత్నముచేఁ జేయఁబడినపిడితోఁ గూడినదిగ, సౌదామనీలతవంటి ప్రకాశము కలదిగ, భయంకరముగ, భూభారంబును బోఁగొట్టునదిగనుండు నీఖడ్గంబునుం గొనుము." అను పరమేశ్వరువాక్యంబులకలరి, తురగ, శుక, ఖడ్గంబుల వందనపూర్వకంబుగ నందుకొని, నందివాహనునికి పునఃపునః ప్రణామంబు లాచరించి మనోవేగముగల యావాజి నెక్కి పవనవేగంబున శంబళగ్రామంబుచేరి మాతృపితృ భ్రాత్రాది బంధువులకు యథావిధి మ్రొక్కులిడి తాను పరశురామునివద్ద నెల్లవిద్యల నభ్యసించిన దాదిగాఁగల వృత్తాంతంబుల వారికి శ్రుతపఱిచి, అధిక ప్రీతి నచ్చోవసింపుచుండె. అట్టిసమయంబున శంబళగ్రామంబున వసించు గర్గ భర్గ విశాలాది మహాజనంబులు కల్కివృత్తాంతంబు నొక్కరితో నొక్కరు కథాప్రస్తావంబున

కడు సంతోషంబుతోఁ జెప్పుకొనుచుండ తత్కాలధరణీధవుం
డగు విశాఖయూపుండా మహనీయునిచిత్రచారిత్రంబు లాక
ర్ణించి జగద్రక్షణాధ్యక్షుండగు, పుండరీకాక్షుం డీభూభారంబు
నాఁపుటకై శంబళగ్రామంబున సామాన్యమనుజ రూపంబుతో
నవతారంబుఁ జేసి యుండునట్లును, అదిమొదలు మాహిష్మతి
యను నిజరాజధానియందలి బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రాది
చాతుర్వర్ణ్యము స్వకులాచార యాగ దాన తపో ధ్యానాది
సదాచారంబులయందాసక్తి గలవారలుగ నుండుటనుం గాంచి
తాను ధర్మపథంబున ప్రజాపరిపాలనంబుఁ జేయుచుండె. అట్టి
యెడ నా దేశంబునుండి అసత్య లోభ మద మాత్సర్యాదు ల
గునధర్మాచారంబులు పరువులిడియె. అనంతరము కల్కిమూర్తి
జయప్రదంబగు నశ్వంబు నెక్కి నిర్మల ప్రభాధవళితదిగంతరా
ళంబైన కరాళకరవాలంబును గ్రహించి శరాసనధరుండై శం
బళగ్రామంబునుండి వెలికిం బోయియుండె. అట్టి సమయంబున

విశాఖయూపుఁడు కల్కిసమీపమునకు వచ్చుట

సజ్జనప్రియుండుగనుండు విశాఖయూపుండు శంబళగ్రామంబున
అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుండగు లక్ష్మీమనఃకాంతుండు
నిజాంశంబుచే నవతరించియుండు కల్కిదర్శనార్థంబుగ బైలు
వెడలి కవి,ప్రాజ్ఞ సుమంతువులను ముందిడుకొని గర్గ భర్గ విశా
లాది బాంధవకోటి సహితుండై ఉడుగణమధ్యంబున చంద్రుని
వలె ప్రకాశించుచుండుకల్కిమూర్తిని దర్శించి పులకాంకితగా
త్రుండై కడు సంతోషంబున నా లోకనాయకునిసన్నిధానం
బున వసించుచుండె.

అపుడు కల్కి విశాఖయూపునకు బ్రహ్మక్షత్రియాది

చాతుర్వర్ణ్యము బ్రహ్మచర్యాద్యాశ్రమములు మొదలగు ధర్మంబుల నుపదేశము సేసె.

మఱియు నే నిబ్భువనంబుల కొడయుఁడ. అనాది ధర్మస్వరూపుఁడ. కలాకాష్ఠాది కాలగతులు నాలీలావ్యాపారంబులు రాజసూయాదియాగంబులచే నన్ను నీవు పూజింపుము. చంద్రసూర్యవంశజాతులగు మరువు, దేవాపి అను నిద్దఱు రాజులను ధర్మముచే ప్రజాపాలకులుగ నియమింపఁబోయెదను అని చెప్పిన కల్కివాక్యంబులను విశాఖయూపుండు వీను లలర నాకర్ణించి వారికి నమస్కరించి "ఓస్వామి! సద్ధర్మంబుల నుపదేశింపుము." అని ప్రార్థింప కలికులంబును నిర్మూలంబుఁ జేయ నమకట్టి యవతరించిన యక్కల్కిమూర్తి మహాజనమధ్యంబున మృదుమధుర వాక్యంబులచే సద్ధర్మంబుల వచింప నుపక్రమించె.

ఇది తృతీయాధ్యాయము.

చతుర్థాధ్యాయము.

కల్కిమూర్తి విశాఖయూపునకు సృష్ట్యాదు లుపదేశించుట.

సభామధ్యంబున దినకరునిపగిది ప్రతిభాసమానుండును, ధర్మస్వరూపుండునైన కల్కిపురుషుఁడు తేనిం జూచి "ఓరాజా! ప్రళయకాలంబున నలువ నశించుకాలంబున సమస్తచరాచరభూతవర్గం బెల్ల నాయందు లయంబుఁ జెందినవి. అత్తఱి నే నొక్కరుఁడ నుంటిని. దేవాసురమనుష్యపశ్వాది జంతుజాలంబు లన్నియు శూన్యంబులయ్యె. లోకవ్యాపారంబులనుమాని శుద్ధా

ద్వైతస్వరూపుండనగు నాకు ప్రళయావసానంబున జగన్నిర్మా
ణంబునం దిచ్ఛ జనించుచుండ నాతనువునుండి వేయుశిరంబులు,
వేయుకన్నులు, నంతసంఖ్యగల పాదంబులుగల విరాట్పురుషుం
డు పుట్టెను. అవ్విరాట్టుమేనినుండి నలుముఖంబులచే ఋగ్య
జుస్సామాథర్వ వేదంబుల నుచ్చరించుచుండువాఁడును, సర్వ
జ్ఞుండును, సర్వలోకప్రభుండునైన నలువ యుద్భవించెను అప్ప
రమపురుషుఁడు కాలమాయాంశ యోగంబువలన జీవరాసులను
సృజించెను. ఇంద్రాది దేవతలు, మన్వాదులు, దక్షాదిప్రజాపతులు
రజస్సత్త్వతమోగుణసామ్యముగల మన్మాయచేఁ బుట్టింపఁ
బడిరి. సమస్తలోకంబులు పురందరాదిబృందారకులు, పశ్వాది
జంతువులు నాసంబంధమగు మాయచేఁ గప్పంబడి యంత్య
కాలంబున నాయందు లీనంబగుటంజేసి ఉపాధిసహితులుగ
నుందురు. ఇప్పగిది నాచే సృజియింపఁబడిన వారలును, మచ్ఛ
రీరాంతర్గతులునైన బ్రాహ్మణులు యజ్ఞాదితపఃకర్మాదులచే న
న్నారాధించి స్తుతించి యనవరతంబు సంతసించుచుందురు.
దేవతలుసయితము బ్రాహ్మణులవలె యజ్ఞాదికర్మములచే నన్ను
భజింపఁజాలరు. ఋగాదులగు ప్రామినుకులు మచ్ఛరీరంబు, అట్టి
వేదములను విప్రులెల్లపుడును ఉల్లాసంబున పఠించుచుండుట
వలన నేలవేల్పులచే సర్వజగంబు పరిశుద్ధము చేయఁబడుచున్న
ది. ఇద్ధరిత్రి యంతయు నాశరీరం బగుటచే దానిం బోషించుట
కగ్రజన్ములే ముఖ్యులు జగంబునం దెల్లెడల బల్లిదంబుగ నల్లు
కొని యుండువాఁడును, ఇచ్చటఁగలఁడచ్చట లేఁడను శంక లేక
యంతటను నిండియుండువాఁడను, అఖిలప్రపంచంబున కాధార
భూతుండునునైన నన్ను బ్రాహ్మణు లనవరతంబు భక్తిశ్రద్ధా
యుక్తులై భజించుచున్నవారలు. కావున శుద్ధసత్త్వగుణాశ్ర

యుండుగ నుండు నేను నయిత మట్టి ద్విజశ్రేష్ఠుల కంజలిఁ జేయు
చున్నాఁడను" అనివచించె. ఇట్టికల్కిపల్కులను విశాఖయూపుం
డాలకించి "యోభగవంతుఁడా! బ్రాహ్మణులకుఁగల లక్షణంబు
లెట్టివి? వార లెవ్విధంబున నీకు భక్తి సలిపిన ఆనందింతువు?
ద్విజన్ము లెప్పగిది నీచే వాగ్బలము కలవార లగుదురు?" అని
ప్రశ్నచేయ కల్కి యిట్లు వచించుచున్నాఁడు:—

"వేదము లవ్యక్తస్వరూపుఁడనగు నన్ను నీశ్వరునిగ మొఱ
లిడుచున్నవి. సర్వధర్మప్రకాశంబులగు వేదములు బ్రాహ్మణ
ముఖంబులయందు శోభిల్లుచున్నవి. పయఃపారావారతనయాధ
వుండ నగు నేను బ్రాహ్మణోత్తము లొనర్చు భక్తిచే సంతృప్త
హృదయారవిందుండనై యుగయుగంబును ధర్మపరిపాలనార్థ
ము లీలామానుషవిగ్రహుఁడ నగుచు నవతారముఁ జేయుచు
న్నాఁడను. బ్రాహ్మణులు ప్రథమమున త్రివృతముగ, అనంతరము
త్రిగుణముగ, గ్రంథియుక్తముగ వేదమంత్రములచే నభిమం
త్రింపంబడి బలవీర్యప్రదంబుగనుండు యజ్ఞోపవీతంబును ఎడమ
భుజశిరంబున కంఠము మొదలు నాభిపర్యంతము ధరించుచుం
దురు. ఇది ఋగ్యజుస్సామాదివిధానంబు. మఱియు బ్రాహ్మ
ణుఁడు ముఖంబున మృత్తికా విభూతి చందనాదిశుద్ధద్రవ్యము
లచే సర్వకర్మముల కంగముగ కేశపర్యంతము నలంకరింపఁ బడి
నదిగ నుండు త్రిపుండ్రమును ధరింపవలయును. ఇద్దానియం
దెల్లపుడును బ్రహ్మవిష్ణుమహేశ్వరులు వసించుచుందురు త్రిపుం
డ్రదర్శనంబుచే నిల్లకలుషంబులు దూరీకృతంబు లగును. బ్రా
హ్మణునికి హస్తతలంబున స్వర్గము, వాక్కున వేదంబులు, శరీ
రంబున సర్వపుణ్యతీర్థంబును, నాడులయందు ప్రకృతిత్రివృత్తులు
కంఠకుహారంబున సావిత్రి, హృదయకమలంబున పరబ్రహ్మము,

స్తనమధ్యప్రదేశంబున ధర్మము, పృష్ఠప్రదేశంబున నధర్మము నుండును. ధరిత్రీదేవస్వరూపులుగనుండు బ్రాహ్మణులు నమస్కారార్హులు. వారలు బ్రహ్మచర్యాదిచతురాశ్రమంబులకు నధికారులై ధర్మస్వరూపులుగ వెలయుదురు. జ్ఞానవృద్ధులు తపోవృద్ధులునైన బ్రాహ్మణులు బాలురైనను నాకత్యంత ప్రియులు. వారివాక్పరిపాలనము చేయుటకై నే ననేకరూపంబుల నిద్ధరిత్రి నవతారముచేయుచుందును. బ్రాహ్మణమహిమ కలి పాపంబుల పటాపంచలుచేయును. దాని వినువారికి సర్వాపదలుఁ దొలగును.'' అని నుడువు కల్కిగంభీరవాక్యంబుల నాలించి విష్ణుభక్తాగ్రగణ్యుండగు విశాఖయూపధరాకాంతుఁడు కలిదోషధ్వంసకుఁడుగనుండు కల్కిమూర్తికి చేతులుజోడించి పరిశుద్ధాంతరంగుఁడై నిజపురంబునకుఁ బోయె.

ఇవ్విధంబున విశాఖయూపుఁడు చనినపిదప ముక్కంటిచేఁ గల్కిమూర్తికి వరంబుగ నియ్యఁబడిన చిలుక అనేకదేశంబులు సంచరించి యచ్చటచ్చటఁగల యచ్చెరువుల నాలోకించి కల్కిముందర సందెవేళ కేతెంచి మ్రొక్కిలిడి స్తుతి చేయుచుండుమరుని వారువంబును కల్కి వీక్షించి "యోశుకంబ! సుఖంబున వచ్చితివా?-ఎద్దేశంబునుండి యిట కేతెంచితివి ? ఆహారంబుఁ జేసితివా?'' అని యడిగెను. అందున శాచిలుక "ఓస్వామీ! నేనుసాగరమధ్యంబున నెలకొనియుండు సింహళం బనుపేరఁబరఁగు ద్వీపంబున కరిగితిని-అచ్చట నే నొకగొప్పయాశ్చర్యంబును పొడగంటిని.దానిని సవిస్తారంబుగఁ జెప్పెద నాకర్ణింపుము.

బ్రాహ్మణక్షత్రియాది జాతులచేతను, ప్రాసాదహర్మ్యగోపురసవనాదులచేతను, రత్నస్ఫటికాది స్తంభాద్యలంకృతమండపాదులచేతను, అనవద్యలావణ్య ... వన భూషాలంకార

సముల్లసత్పద్మినీజాతి కాంతామణుల చేతను, హంస సారస చక్ర
వాక మధుకర కలనినదలాలితపద్మ కహ్లార కుముదాది కుసుమ
తల్లజ నిబిడిత సరోవరంబుల చేతను నెల్లపుడు శోభిల్లుచుండు
సింహళద్వీపంబున బృహద్రథుండను భూమీశుండు కలఁడు.
అతనికి నిజభార్యయగు కౌముది యను కాంతాలలామంబునందు
పద్మావతి యను నొక్క ముద్దుఁగూఁతురు గలదు. అబ్బాలికా
రత్నంబున కెన యగు మందగామిని యిమ్మూఁడులోకంబుల
యందును చిక్కుట దుర్లభంబు. చిత్రితప్రతిమపగిది యౌవన
రూపంబులఁ దేజరిల్లుచున్నయది. అత్యుత్తమజాతియం దుద్భ
వించిన నారీరత్నం బనుట కెంతమాత్రమును సందియంబు
లేదు. అక్కన్నియ నిజసఖీజనపరివృతయై జపధ్యానపరాయణ
యై పార్వతివలె నుమాపతిం గూర్చి తపంబుఁ జేయు నెడ నాపర
మేశ్వరుఁడు ప్రత్యక్షమై యాయింతియంగసౌష్ఠవముం దిలకించి
విష్ణుమనోనాయిక యగు లక్ష్మీదేవి యిత్తెఱంగున ఘోరతపంబు
చేయునటుల నెఱింగి పార్వతీసహితుండై నందీశ్వరుని పై
నెక్కి వరంబు నిచ్చుటకై ప్రత్యక్షమాయెను. ఇబ్బాల యా
సదాశివుం గాంచి లజ్జచే తల వంచి మౌనము ధరించియుండెను.
అపు డీశ్వరుఁ డమ్మత్తకాశినిని జేచ్ఛుచు తనదివ్యజ్ఞానంబుచేఁ దె
లిసికొని యప్పుడును నుద్దేశించు "భాగ్యశాలినివగు నో బాలా!
చిదచిద్విలాస స్వరూపుండగు శ్రీమన్నారాయణుండు నిన్ను పరి
ణయమాడును ఇతరు లెవరును నీకు పరిణయార్హులు కారు. నీ
పాణిగ్రహణంబునం దిచ్ఛయించియున్న యిందిరాధవుండు తప్ప
దేవతలుగాని, రాక్షసులు గాని, గంధర్వ చారణాదులు గాని
మోహంబుచే నీతో మదనసంగరంబునం డేల తమ మనంబున
నెంచినతక్షణం బట్టివారు పురుషరూపభ్రష్టులై స్త్రీరూపంబు

లను ధరింతురు. ఓలక్ష్మీ! గొప్పసౌఖ్యంబున కర్హంబగు నీను కుమారశరీరంబును తపస్సుచేఁ గృశింపఁజేయ నేల ? తపంబును జాలించి యింటికిఁ బొమ్ము." అని కామితవరంబుఁ బ్రసాదించి యదృశ్యుఁ డాయెను. ఇట్లు పద్మావతి తపంబు పెంపున భస్మాలంకృతతనుండగు నీశ్వరునియొద్ద కామితవరంబులం గొని నిజసఖీజనముతో సంతుష్టమానసయై నిజనికేతనంబునకుఁ బోయెను.

ఇది చతుర్థాధ్యాయము.

పంచమాధ్యాయము.

—పద్మాస్వయంవరము—

ఇట్లు కొంతకాలము గడచినపిదప బృహద్రథుండు నిజయౌవ్వనగర్వంబున విజృంభించి పరిణయంబాడ యుక్తవయస్సున నుండు నిజపుత్రిం జూచి యింక నిబ్బాలకు వివాహంబుఁ జేయకుండుట నిందనీయం బని తలఁచి తనపట్టపుదేవియగు కౌముదిని చేరంజేరి "ఓకామినీ' పద్మావతికి ధవుండుగ నేధరిత్రీనాయకపుత్రుని విచారింత" మని యడిగెను. అందుల కాచంద్రవదన "తొల్లి యిందుధరుఁడు పద్మావతి కిందిరాధవుఁడు భర్తయని వాక్రుచ్చె. అమ్మహానుభావునివాక్యంబు లేల దబ్బర యగు?" నని ప్రత్యుత్తరంబీయ బృహద్రథుండు గోవిందుం డెపుడు పద్మావతిని వివాహంబగునో? విష్ణువును అల్లుండుగ నేను స్వయముగ గ్రహించుభాగ్యంబు నాకు లేదుగాదె? అనివచింప "తొల్లి దేవాసురులు సముద్రమథనంబుఁ జేయుతఱి నందుద్భవిల్లిన సముద్రతనయను వటపత్రశాయి యగు నారాయణుండు వరిం

చిన మాడ్కిని పద్మావతిని విష్ణువు తానే వరించు నని కౌముది చెప్పెను. బృహద్రథుండు - అయినను రాజులవాడుక చొప్పున పద్మావతీస్వయంవరార్థంబుగ, సర్వమంగళంబులు కాకరంబుగ నుండు సింహళద్వీపంబునకు రాజకుమారుల రప్పింతు నని నిశ్చయించి కుల శీల వయో రూప విద్యా ధనసంపన్నులగు రాజకుమారులకుఁ జెప్పి పంపెను. అట్టిసమయంబున ఋచిరాశ్వుఁడు, సుకర్ణ, మదిరాక్షుఁడు, దృఢాశుగుఁడు, కృష్ణసారుఁడు, పారదుఁడు, జీమూతుఁడు, క్రూరమర్దనుఁడు, కుశుఁడు, కుశాంబుఁడు, వసుమంతుఁడు, పథనుఁడు, సంజయుఁడు, గురుమిత్రుఁడు, ప్రమాథి, విజృంభుఁడు, సృంజయుఁడు, అక్షయుఁడు, మొదలుగా మిక్కుటమైన యుక్కుగల విశ్వంభరాధిపులు రథగజతురగాధిరూఢులై శ్వేతచ్ఛత్రచామరద్వయశోభితులై నిజసైన్యంబులతోడ సువర్ణరత్నమాణిక్య భూషణస్థగితసర్వాంగులై చిత్రమాల్యాంబరధరులై పద్మావతిని స్వయంవరంబునందు స్వీకరించుటకు మిక్కుటమైన మక్కువతోడ స్వయంవరకూటంబున కేతెంచి సమయంబు నిరీక్షించుచుండిరి.

అపుడు సింహళాధీశుండగు బృహద్రథుండు యౌవనగర్వగ్రంథియు, పూర్ణచంద్రబింబంబువంటి ముఖబింబంబుకలదియు, మణిముక్తాప్రవాళహారాద్యనేకభూషితయు, మాయవలె దర్శనమాత్రంబున నెల్లరియుల్లంబులు మోహింపఁజేసి భ్రమింపఁజేయునదియు, అసమానరూపలావణ్యదేదీప్యమానశరీరంబు గలదియు, సఖీదాసీజనపరివృతయు, వేత్రధర దౌవారికగణపరిరక్షితయు, మన్మథపత్నియగు రతిదేవిచాడ్పున నెల్లసుందరంబులకుఁ బుట్టినిల్లుగ నుండు నప్పద్మావతిని స్వయంవరకూటంబునకు రప్పించెను. అపు డబ్బాలామణి నూపురకింకిణీమధుర

నినదశబ్దాయమానపాదారవిందంబులతో నశేషజనమనోమోహనవిలక్షణసౌందర్యాతిశయంబులతోఁ గూడి స్వయంవరార్థంబై విచ్చేసియుండు రాజకుమారనివహంబుల కుల శీల ధన వయో రూపాదులను వేర్వేఱ తనసఖీజనంబుల నడుగుచు రాజహంసంబుమాడ్కి మందగమనంబున రత్నఖచితస్వయంవరమాలను కరంబున ధరించి మనోహరాపాంగవీక్షణంబులచే కించిన్మధురమందస్మితవదనారవిందంబుతో నచ్చటఁ గల రాజకుమారులం జూచుచు స్వయంవర వేదికం బ్రవేశించె.

ఇట్లసమానరూపలావణ్యచేష్టావిశేషాదులచే జగతీత్రయంబును మోహింపఁజేయునట్టిదియు, కోవెలవంటి మధురాలాపంబుగలదియు, ధవళచీనాంబరపరివేష్టితయు నగు నబ్బాలారత్నంబునుఁ జూచి యాగతులైన రాజన్యులెల్లరును మదనబాణవిదళితాంతరంగులై చేష్టలు దక్కి వస్త్రశస్త్రంబుల నిజహస్తతలంబులనుండి జాఱవదలి యుక్కు దక్కి కామాంధకారసముద్రంబునం బడి గట్టెక్కఁజాలక మూర్ఛాక్రాంతులై మహిం బడిరి రాజకుమారులు లక్ష్మీదేవియంశను జనించినయప్పద్మావతిని కామభావంబుచేఁ గాంచుకతంబున నిజపురుషరూపంబులదృశ్యంబులై పృథులనితంబస్తనభారశోభితలై యుత్తమస్త్రీరూపంబుల ధరించి సఖీజనులవలె పద్మావతిసమీపంబున నిలిచిరి. అట్టియెడ నేను పద్మావతికళ్యాణమహోత్సవంబును జూచుటకాస గలదాననై యొకవటవృక్షాగ్రంబునఁ గూర్చుండి యాయంగనామణివచనంబుల నాలకించుచుంటిని. ఇట్లు తనస్వయంవరార్థముగ నేతెంచినబలపరాక్రమవీర్యశౌర్యసంపన్నులయిన రాజన్యులెల్లను తన్ను మోహించుటం జేసి స్త్రీరూపంబుల ధరించి తనచెంత సఖీజనంబులపగిది నిలిచియుండుటను జూచి

మహేశ్వరునివాక్యము సత్యంబని యీశ్వరునికి నమస్కరించి విష్ణువును తనకు భర్తగా నిజమానసంబున స్మరింపుచుండెను.

ఇది పంచమాధ్యాయము.

షష్ఠాధ్యాయము.

అనంతరము పద్మావతి తనస్వయంవరార్థంబుగ నేతెంచిన రాజులకుఁ గలిగిన స్త్రీరూపంబులంగూర్చి చింతించి మిక్కుటమగు నాశ్చర్యంబున విష్ణువును నిజభర్తగా నిశ్చయించి చేరువనుండు విమల యనుతనసఖిం జూచి "ఓవిమలా! జగత్సృష్టికర్తయగు బ్రహ్మ నానుదుట నెందులకిట్టులు వ్రాసె? నాదర్శనమాత్రంబున బలశీలవయోరూప సంపన్నులగు ధరణీశు లందఱును స్త్రీరూపంబుల ధరించిరిగాదె! మందభాగ్యనగు నేను పెక్కువత్సరంబులనుండి యీశ్వరునింగూర్చి చేసినతపం బెల్ల చవుటిభూమియందు చల్లినబీజంబులమాడ్కి ఫలవంతంబు కాకపోయెను. సర్వజగంబున కొడయఁడును, ప్రభుఁడును, సాక్షాల్లక్ష్మీపతియు నైన విష్ణువు నాయం దిచ్ఛయుంచునా? పరమేశ్వరుని వచనము మిథ్యాభూతంబై విష్ణువు నన్ను వరింపకపోయినచో నేను తత్క్షణం బగ్నిం బ్రవేశించి ప్రాణంబును త్యజింతును. సామాన్యమానవస్త్రీనగు నేనెక్కడ? సర్వలోకనాయకుండగు జనార్దనుం డెక్కడ? బ్రహ్మ నానొసట నిట్టియబద్ధంబు లేల వ్రాసె. ఈశ్వరుఁడుసయితము నన్ను వంచించెనే! ఈశ్వరునివచనం బబద్ధంబై విష్ణువు నన్ను పరిణయమాడఁడేని నామేన ప్రాణంబు లెట్లునిలుపఁగలను?" అను పలువిధంబులగు పద్మావతిదీనాలాపంబుల నాలించి నీసమీపంబునకు వచ్చినా నని యీశ్వరు

నిచే వరంబుగ నీఁబడినచిలుక కల్కిమూర్తితోఁ జెప్పెను.

ఇట్లు నుడివినచిలుకనుడువులను కల్కిమూర్తి యాలకించి విస్మయావిష్టుండై మత్ప్రియ యగు పద్మావతియొద్దకు నీవు మరల నేఁగి యాశోభావతికి నాసౌందర్యాది గుణగణంబులు వ్యక్తీకరించి మరల నాయొద్దికి తెమ్ము. ఓబాంధవ! అప్పద్మావతి నాకు ప్రియురాలు. ఆయింతికి నేను మగఁడను. ఇద్దాంపత్యము దైవంబుచే ఘటిల్లె. మాయిరువురికి మధ్యస్థంబుగనుండు నీచే నీసంబంధము ఘటిల్లును. నీవు సర్వజ్ఞుండవు. విధానకాలంబుల నెఱింగినవాఁడవు దుఃఖితయై పరితపించుచుండు పద్మావతిని నాకథామృతంబుచే సంతసింపఁజేసి యమ్మగువ వృత్తాంతంబుచే నన్ను సంతోషింపఁజేయుము. చిలుక యిట్లు వచించిన కలికిపలుకుల నతిహర్షంబున నాకర్ణించి నమస్కారముఁ జేసి పులకితగాత్రమై సాగరంబున కావల నుండు సింహళద్వీపము చేరి అమృతతుల్యంబగు జలంబునఁ గ్రుంకులిడి ఆహారార్థము దాడిమఫలంబుల భుజించి పిపాసార్థము సలిలపానంబుఁ జేసి రాజగృహాంతర్గతకన్యాంతఃపురంబుఁ బ్రవేశించి అచ్చోఁ గల చాంపేయవృక్షంబుపైఁ గూర్చుండి అంతకుం దొల్లి యచటి కేతెంచియుండు పద్మావతినిం గాంచి "రూపయౌవనంబులం బ్రకాశించు భాసురాంగీ! పద్మసదృశంబులగు ముఖగంధనేత్రహస్తంబులు గల్గి కరతలంబున కమలంబును ధరించియుండు నిన్ను ప్రత్యక్షలక్ష్మి యగునట్లు దలఁచుచున్నాఁడను. విరించి జగత్త్రయసౌందర్యము నంతయు ప్రోగుచేసి నిన్ను సృజించి తననేర్పును వెల్లడి చేసికొనెనుగాఁబోలు?" అని మనుజభాషతో చెప్పెను. పద్మావతి ముద్దుగులుకు చిలుకపలుకుల నత్యాశ్చర్యంబున నాకర్ణించి "నీ వెవరవు? ఎచ్చటనుండి యిట కేతెంచితివి?

నీవు చిలుకరూపంబున వచ్చినదేవుఁడవో, లేక దానవుఁడవో తెలుపు" మని పద్మావతి యడిగెను.

—॥ శుకపద్మా సంవాదము. ॥—

శుకము పద్మావతిపలుకుల నాలకించి "నేను దేవుఁడను గాను, దానవుఁడను గాను. మహేశ్వరునివలన కల్కిమూర్తికి వరంబుగానీఁబడిన సామాన్యమైన చిలుకను. సకలశాస్త్రార్థతత్త్వంబులను దెలిసినవాఁడను. స్వేచ్ఛచే నెల్లదేశంబులం దిరుగులాడుటకు నాకు సామర్థ్యంబు కలదు. సకలలోకవృత్తాంతంబులు నాకు హస్తామలకంబు. దేవగంధర్వసదస్సులందు నేను నెక్కుడగుపూజలం గొందు. ఆకసంబున స్వచ్ఛందవృత్తిం జరింపుచు నిన్నుఁ గాంచి యిట కేతెంచితిని. సంతప్తహృదయురాలవై సఖీలలామంబులతో సరససల్లాపంబులు వర్జించి చింతాకుల మానసవగు నీతో కొన్నిపల్కులం బల్క నిట కేతెంచితిని. నీ దంతోష్ఠజిహ్వాగ్రభాగనిర్గతంబై కోవెలమధురాలాపంబులకు సంతాపంబును గలుగఁజేయు నీవచనామృతంబును శ్రోత్రేంద్రియంబులచే నెవ్వారు పానము చేయుదురో అట్టివారితపోమహిమను నుతించుటకు వేయిజిహ్వాలుగల యాదిశేషునికిసయితమలవి కాదు. నీశరీరంబునకుఁగాక శిరీషకుసుమంబునకు సుకుమారత్వ మెట్లునివ్వటిల్లును? నీముఖకాంతియధరామృతంబుల ముందట చంద్రునికి కాంత్యమృతంబు లెక్కడివి? త్వదీయసుందరబాహులతాపరిరంభణ సుఖితులై నీయధరామృతంబును గ్రోలుపురుషవరేణ్యులకు తపోదానయజ్ఞజపాదులు వ్యర్థంబులనుటకు సందియంబు లేదు. అతిమనోహరతిలకము, కమనీయ కుటిలకుంతలభరము, చంచలోల్లసత్కుండలము, లోలలోచనము, ఆహా! యిట్టియనవద్యలావణ్యంబులచే జేగీయమానంబగు

నీయాననబింబంబును సుకృతవిశేషంబునం జూచుపురుషవరేణ్యులకు పునర్జననరహితంబగు మోక్షంబు కరతలామలకంబు. పరబ్రహ్మదర్శనంబున మానవులకు మోక్షంబు గలుగు ననిపండితమండలంబు దబ్బరలాడుచున్నది. కాన నో కాంతాతిలకమా! నీమనంబును చిక్కులం బెట్టువృత్తాంతంబును వక్కాణింపుము. తెవులులేని వేదనంగుంది కృశించి నశించుటకు కతంబేమి? ధూళిధూసరిత కనకప్రతిమచందంబున నీ వేల ప్రకాశింపక యున్నదాన" యని చిలుక యడిగెను. ఇట్టిపలుకులను పద్మావతి విని "ఓశుకంబా! దైవానుకూల్యంబు లేనివారికి రూపకులధన సద్వంశంబు లుండియు నవి నిష్ఫలంబులు. ఇందులకుం దార్కాణగ నొక్క యుపాఖ్యానంబుఁ జెప్పెద నాలకింపుము.

నేను బాల్యంబున గరకంఠునింగూర్చి నిష్ఠురతపంబు సేయు నాతపంబున కాదక్షయజ్ఞధ్వంసి జాయాసహితుండుగ నందివాహనారూఢుండై నాకట్టెదుట నిలిచి కామితవరంబు వేఁడు మని యడుగ నే నామహామహుం జూచి లజ్జచే వంచఁబడిన ముఖంబు కలదాననై మిన్నక యుండ నామనోభావంబు నాతఁడు దివ్యజ్ఞానంబుచేఁ దెలిసికొని నన్నుం జూచి నిష్ఠురతపంబుచే నీశరీరంబును కృశింపఁజేయ నేల? శ్రీమద్రమాకాంతుండగు భగవంతుండు నిన్నుం జేపట్టు. అతఁడే తక్కఁ దక్కిన దేవ రాక్షస గంధర్వాదులగు రాజులైనను నిన్నుఁ గాముకభావంబున వీక్షించిరేని వారు తత్క్షణంబ పురుషరూపంబులఁ బోఁగొట్టుకొని స్త్రీలయంగంబుల ధరించి స్త్రీరూపు లగుదు రని వరంబుఁ బ్రసాదించి నాకు విష్ణ్వర్చనావిధానం బుపదేశించి యదృశ్యుఁ డయ్యెను. ఇట్లు నేను లబ్ధవరనై నిజసదనంబున కేఁగితిని. ఇప్పగిది కొన్నిరోజులు గతించిన నొక్కనాఁడు మదీయ

జనకుండగు బృహద్రథుఁ డీశ్వరుండు నాకుఁ గరుణించిన వరంబుఁ దెలిసియు నాస్వయంవరంబు లోకంబునం జాటులచేఁ జాటం బంచె. ఇదియెట్లేఁగి ధనయౌవనసౌందర్యాది సంపత్తిగల యనేకులు రాకుమారులు నాస్వయంవరార్థంబు వచ్చి స్వయంవరమంటపంబుఁ జొచ్చిరి. అపు డేను సర్వాలంకారభూషితనై సఖీజనంబులు కైవారంబులు సేయ వందిమాగధులు స్తోత్రపాఠంబులు చదువ నిజహస్తంబున రత్నఖచితస్వయంవరదామాభిశోభితనై మందగమనంబున మంటపంబుఁ జొచ్చితి. అట్టియెడ మదీయస్వయంవరార్థంబుగ విచ్చేసిన విశ్వంభరాధిపులు నాసోయగంబును దిలకించిరి. అపుడు తుంటవిలుకాఁడగు మరుండు వారియెడ వాఁడియగు తనచెఱకువింటిం బ్రయోగింప రాజులు చేష్టలు దక్కి మోహాంధకారంబునం బడి నన్ను మోహించుటం జేసి చంద్రమౌళి చెప్పినట్లు నిజపురుషరూపంబు లదృశ్యంబులై స్త్రీరూపంబులు ధరించినవార లైరి. ఇవ్విధంబున స్త్రీరూపంబుల ధరించిన మహీపతులు నిజస్నేహితబాంధవులకుఁ బరిహాసశోకంబులను ఘటింపంజేయు తమస్త్రీరూపంబులం గాంచి దుఃఖాకులితస్వాంతులై నాకు సఖీభావంబును జెంది నాతోడ తపోధ్యానపూజాదులను సలుపుచు నా కూడిగంబులు సేయుచున్నవారలు" అని చెప్పిన పద్మావతిపలుకులను చిలుక విని సముచితభాషణంబులచే నాబాలామణిని సంతసింపఁజేసి విష్ణ్వర్చనావిధానంబు నడుపుట కారంభించెను.

ఇది షష్ఠాధ్యాయము.

సప్తమాధ్యాయము.

పదంపడి యాశుకరాజంబు "ఓపద్మావతీ! నీవు ధన్యవు! మహాపుణ్యశాలినివి. సదాశివుఁకి ముఖ్యశిష్యవు. నీవు పరమేశ్వరునిచే నుపదేశముఁ జెందిన విష్ణ్వర్చవిధానంబు నా కానతిమ్ము. నాభాగ్యవశంబున నీయొద్ద కేతెంచి పరమాశ్చర్యజనకంబుగ శుకాకారనివారకంబుగ, పరమానందప్రదంబుగ శ్రోత్రానందదాయిగ నుండు భగవద్భక్తి యోగ జప ధ్యానవిధుల నానందంబున వినఁబోవుచున్నాఁడను" అని వచించు చిలుకపలుకులను పద్మావతి విని యిట్టులు చెప్పుట కుపక్రమించినది.

"విష్ణ్వర్చనావిధానము నాకు నీశ్వరుఁడుపదేశించె. ఎవ్వారతిశ్రద్ధతో నీవిధానం బనుష్ఠింతురో లేక విందురో లేక యితరులకు బోధింతురో యట్టివారు బ్రహ్మహత్యాదిమహాపాతకంబులం బాసి గతకల్మషు లగుదురు." కావున నీవు సమాహితబుద్ధి నాకర్ణింపుము.

~ విష్ణ్వర్చనావిధి. ~

మానవుఁడు ప్రభాతంబున మేల్కాంచి పుణ్యతీర్థంబుల యందుఁ గ్రుంకులిడి పరిశుద్ధాంతరంగంబున స్వయతోచితసంధ్యావందనాదిదినకర్మములను యథావిధిగ ననుష్ఠించి పిదపఁ గాలుసేతులు ప్రక్షాళనముఁ జేసికొని యాచమనంబుఁ జేసి పరిశుద్ధాసనంబునఁ దూర్పుముఖంబున నాసీనుండై ప్రాణాయామంబు సలిపి, అంగన్యాసము కరన్యాసము భూతశుద్ధి, అర్ఘ్యస్థాపనములను శాస్త్రోక్తవిధిప్రకారముగ నొనర్చి తాను విష్ణుస్వరూపుండుగ నుండునట్లు ధ్యానించి తనహృదయకమలంబున నెలకొని యుండుపరమాత్ముండు రజతసువర్ణాదిశుభాసనంబునఁగూర్చుండి

యుండునట్లు భావించి పాద్యార్ఘ్యాచమనీయస్నానవస్త్రదివ్య భూషణ ధూపదీపనైవేద్యాది షోడశోపచారంబులచే మూల మంత్రపూర్వకంబుగ నర్చించి ప్రసన్నవదనుండును భక్తాభీష్ట ఫలప్రదుండునైన యాభగవంతుని నుద్దేశించి దేవదేవా! సిద్ధ దేవతాబృందవందితంబును, భక్తులనెడుభృంగములతోఁ గూడి నదియును, ఉత్తుంగారుణనఖసముదాయంబుతోఁ జేరిన వ్రేళ్ల నెడి పత్రంబులతోఁ గూడినదియును, గంగ యనెడుమకరంద ము గల నీపాదాంబుజంబులను, మధురశింజన్మణినూపురాలం కృతంబును, పీతాంబరాగ్రభాగవిలసితంబును, కాంతిసముదా యజన్మభూమియు నైన నీజంఘాప్రదేశంబులను, సౌదామినీస మానపీతాంబరాచ్ఛాదితంబును, మహర్షి ముఖనిర్గతసామనివ హంబులచే స్తుతింపఁబడినదిగ నుండు నీజానుమండలంబును, సక లసురనికరవందితంబును, దివ్యశోభావిరాజితంబును, ఖగరాజపృ ష్ఠాధిరూఢంబుగనుండు నీకటిప్రదేశంబును, త్రివళీప్రకాశమా నంబును, గంగావర్తతుల్యనాభివిలసితంబును, చతుర్ముఖజన్మస్థా నంబునైన పద్మంబుచేఁ బ్రకాశించుచుండునదియును, గణనాతీ తాండకోశకోటీనిలయంబుగనుండు నీయుదరప్రదేశంబును, కల శాంబుధితనయాకుచకుంకుమపంక పంకిలంబును, శ్రీవత్సహార కౌస్తుభమణిప్రభాపటలవిభాసితంబును, హరిచందనకుసుమమా లాలంకృతంబును, అతిమనోహరంబునైన నీవక్షఃస్థలంబును, వలయాంగదాదిదివ్యభూషాశోభితంబులును, దుష్టదైత్యవినాశ దక్షంబులును, కరీంద్రకరశోభామదహరంబులును, శంఖచక్రగ

దాపద్మశార్ఙ్గాద్యనేకదివ్యాయుధ విలసితంబులును, రక్తాంగుళి
సముదయశోభితంబులును, ఆజానులంబితంబులునైన నీభుజం
బులను, ముఖారవిందమృణాళంబుచందంబునం బ్రకాశించుచున
ట్టిదియును, వనమాలికాలంకృతంబును, రేఖాత్రయవిరాజితం
బునైన నీకంఠంబును, మందస్మితమనోహరంబును, రక్తాధరో
ష్ఠవిలసితంబును, వచనామృతపరిపూర్ణంబును, సకలలోకాభిరా
మంబునైన నీ వక్త్రారవిందంబును, జగత్సృష్టిస్థితి ప్రళయాది
వ్యాపారంబులందు సమర్థంబును, కమలాహృదయకామాతిరేక
ప్రదంబునైన నీభ్రూయుగంబును, మకరకుండలశోభితంబును, ది
గ్వలయజన్మస్థానంబును, చంచలకుటిలకుంతలాగ్రచుంబితంబు
నైన నీకర్ణప్రదేశంబులను, విచిత్రతిలకాలంకృతంబును, గోరో
చనాగంధరుచిరంబును, మణిమయకిరీటశోభాయమానంబును,
సకలలోకమనోనయనహారియునైన నీఫాలప్రదేశంబును, దివ్య
గంధనానాకుసుమవిసరమాలాలంకృతంబును, రమాహృదయ
మనోహారిణ వాగురాయమాణంబును, కాలాంబుదశ్యామరుచి
రంబునైన నీచికురనివహంబును, నాహృదయపంకజంబున నెల్ల
పుడు స్మరించుచున్నాఁడను. మఱియు మేఘశ్యామలవర్ణుండును,
సోమసూర్యప్రకాశమానుండును, శోభననాసాభ్రూయుగళశో
భితుండును, లోకాతీతుండును, పుండరీకవిశాలలోచనుండును,
విద్యుత్సదృశపీతాంబరాలంకృతుండును నైన వాసుదేవునికి న
మస్కరించెద. వాసుదేవా! లోభమోహాదిదుర్గుణప్రాధాన్యుం
డుగ, దీనుండుగ, పాపపరిపూర్ణుండుగ నుండుచున్న నీకృపాదృ

ష్టిచే రక్షింపుము. అని పాదాదికేశపర్యంతము ధ్యానించి స్తోత్రము చేయవలయును. పరమేశ్వరునిచేఁ జెప్పఁబడి పుణ్యకరంబై, ఆయుర్యశోధనస్వర్గసుఖాది పురుషార్థప్రదంబై యుండునీ స్తోత్ర మనవరతంబు భక్తితో నెవరు పఠింతురో వారు సర్వపాపవిముక్తులై యిహంబున ధర్మార్థకామసుఖంబులం బడసి పరంబున ఆముష్మికసుఖంబులం జెందుదురు."

ఇది సప్తమాధ్యాయము.

ప్రథమాంశము సంపూర్ణము.

——

శ్రీరస్తు.

కల్కిపురాణము.

వచనకావ్యము.

ద్వితీయాంశము - ప్రథమాధ్యాయము.

పద్మాశుకసంవాదము.

శుక:—ఇట్లు పద్మావతిచేఁ జెప్పఁబడిన విష్ణ్వర్చనావిధిని కల్కిదూతయగు శుకం బాకర్ణించి సఖీపరివృతయగు పద్మావతియొక్క దృష్టి నిగుడ్చి చంద్రముఖీ! పరమాద్భుతచరిత్రంబుగల భగవంతునిపూజావిధానంబును సాంగోపాంగంబుగ నాకుఁ జెప్పుము. నేను దానిని యథావిధిగ ననుష్ఠింపఁగోరెదను.

పద్మా:—శ్రీమదిందిరాసుందరీహృదయారవిందమకరందపానానందమత్తుండగు గోవిందుని పూర్వోక్తప్రకారము పాదాదిమస్తకపర్యంతము ధ్యానించి మూలమంత్రముచే జపము చేసి పదంపడి దండప్రణామంబు లాచరించి విష్ణుని వేదితంబు

లగు నోగిరంబులను విష్ణుపరివారదేవతలగు విష్వక్సేనాదులకు నైవేద్యము సేసి యాసనంబున నావహింపంజేసియుండు పరమేశ్వరుని హృదయపంకజంబున స్మరించి భక్త్యతిశయంబుచే నర్తన, గాన, నామపారాయణస్తోత్రాదులం జేసి తులసిమొదలగువానిని నిజమస్తకంబున ధరించి భగవన్నివేదితాన్నాదుల నిష్టజనబంధుకోటితోడ భుజింపవలయు. ఇట్టి పరమేశ్వరోక్తంబగు విష్ణుపూజావిధానంబును నీకు వివరంబుగ నుడివితిని. ఇయ్యది భక్తజనబృందంబున కైహికాముష్మికసుఖంబులను సిద్ధంబుగ సిద్ధింపంజేయును.

శుక:—మంగళగుణగణాలంకార వగు నోపద్మావతీ! భగవద్భక్తిలక్షణము నీచేఁ జక్కఁగ నాకర్ణింపఁబడియె. కలుషంబుచే శుకాకారంబు నొందిననేనుసయితము నీకరుణాతిరేకంబున మోక్షంబును జెంద ననువుపడును. నీ వతిరూపసంపన్నవయ్యు నీకుం దగు ప్రియుండు లేనికతంబున చంద్రికావిహీనంబగు రేయిచందంబున ప్రకాశింపక యున్నదానవు. కాఁబట్టి నేను నిన్ను స్వర్ణమయరత్నఖచితంబై జీవముతో కూడినబొమ్మగా భావించుచున్నాఁడను. నీవంటిసుందరతనువుగల్గి యౌవనమదాంధయై భువనత్రయంబును మోహింపఁజేయుస్త్రీరత్నంబు నెచ్చోఁ జూడనైతి. నీరూపగుణాదుల కొప్పగు పురుషుని నేనెచటను గానలేదు. అయిన నాగరంబున కావల పరమాశ్చర్యరూపంబును ధరించినవాఁడును, రూపవంతుఁడును, సాక్షాదీశ్వరస్వరూపుఁడును, మనుష్యగుణాతిశయంబుల నతిక్రమించినవాఁడునైన యొక్కపురుషనరేణ్యునిం జూచితిని. అట్టియసమానరూపలావణ్యంబులుగలయాతఁడు బ్రహ్మచే నిర్మింపఁబడినట్లు తలఁచుట పొరపాటు. స్వయంభవుఁడుగనే తోఁచుచున్నది.

భగవంతునికిని వానికిని ఈషన్మాత్రంబైన భేదం బుండునటు లగపడదు విష్ణ్వారాధనఁ జేయునపుడు నీ వేరూపును ధ్యానము చేయుచున్నదానవో అట్టిరూప మతనియందు ప్రత్యక్షముగ కనుపడునట్లు నేను రూఢిగఁ జెప్పఁగలను.

పద్మా:—శుకోత్తమా! పరబ్రహ్మ మెచట నవతరించి యున్నది? దానిచరిత్రం బెల్ల బాగుగఁ దెలిసియున్న నీవు నాకు దానిసవిస్తారము నంతయుఁ జక్కఁగ వచింపుము. చాంపేయ వృక్షంబునుండి క్రింది కురుకుము. విధివిధానంబుగ నీకుం బూజఁ జేసెద. దానిమ్మపండును భక్షింపుము. ఈశ్రేష్ఠమైనపాలు ద్రావుము. పద్మరాగమణికన్న నరుణోజ్జ్వలంబుగ నుండు నీముక్కునకు రత్నఖచితంబగు నాసాభరణంబు వేసెద. స్ఫటికమణిఖచితంబైన స్వర్ణాభరణంబుచే నీకంఠంబునకును, మంచిముత్యములసరములచే నీయిరుప్రక్కలనుండు రెక్కలకును అలంకారముఁ జేసెద. మఱియు నీపుచ్ఛమునకు రత్నభూషణమును, పాదంబులకు స్వర్ణమయంబులగునందియలను వేసెద. ఆపురుషుని కథామృతపానంబుచే మదీయమనోవ్యాధిని బోఁగొట్టుము. నే నీసఖీజనంబులతో నీకు నేమియుపకారంబుఁ జేయవలయునో యానతిమ్ము. అని చెప్పిన పద్మావతి పలుకులను బుద్ధిశాలియగు చిలుక విని మ్రాను దిగి పద్మాసమీపంబున కేతెంచి ప్రత్యుత్తరంబు చెప్పుట కారంభించెను.

శుక:—దయాసముద్రుండును వటపత్రశాయియు నగు విష్ణుండు బ్రహ్మాదిసురలచేఁ బ్రార్థింపంబడి ధర్మరక్షణార్థంబుగ నలువు రగ్రజులతో శంబళగ్రామాంతర్గతమయిన విష్ణుయశస్సుమందిరంబున నవతరించి జ్ఞాతిబంధుజననివహాపరివృతుండై తండ్రిచే నుపనీతుండై పరశురామునియొద్ద వేదవేదాంగధను

ర్వేదంబుల నభ్యసించి పరమేశ్వరునియొద్ద నుత్తమాశ్వ ఖడ్గశుకాదులను వరంబుగఁ జేకొని విశాఖయూపరాజునకు సర్వధర్మంబుల నుపదేశించి యన్నగరంబునందలి యధర్మంబులను తృణీకరించి సుఖంబున శంబళగ్రామమున వసించుచున్నవాఁడని పద్మావతి విని సంతసించి తాను ముందుచెప్పినటులు చిలుకకు సర్వాభరణంబులు ధరింపంజేసి కృతాంజలియై "యోశుకరాజమా! కల్కిపురుషునిచెంతకు నిన్నేమని పంపుదును. ప్రభుండగు విష్ణువుసయితము తా నిచ్చటికి వచ్చి నన్ను కాముకభావంబున వీక్షించినచో తానుసయితము స్త్రీ యగునని భీతిఁజెంది రాక మసలునేమొ? అకటకటా! పురుషులు నన్నుఁజూచి మోహపరవశులగుతత్క్షణంబుననే స్త్రీరూపంబుల ధరింతురుగా! ఔ! ఈశ్వరవరంబు నాయెడ శాపంబైనది గాదే?" అని పగచుపద్మావతికి చిలుక ప్రణమిల్లి దానిచే ననుజ్ఞాతుండై తత్క్షణంబున నాకసంబునకెగసియతిత్వరితగతి శంబళగ్రామంబునకుం జేరెను.

కల్కిపురుషుం డిట్లు చిలుక పద్మావతియొద్దనుండి వచ్చిన వృత్తాంతంబు నెఱింగి దానినిజసదనంబునకు రావించి స్వర్ణరత్నముక్తామాణిక్యంబులచే భూషింపంబడినసర్వాంగంబులతో నేత్రానందదాయిగనుండు మరునిగుజ్జంబునుఁజూచి గారవించి నిజహస్తంబుచే దానిమేను తడవి పాలను ద్రావనిచ్చి దానిముఖంబున తనముఖం బిడి "ఓశుకంబా! ఏయేదేశంబులయందు సంచరించి యేమేమియాశ్చర్యంబులం జూచివచ్చితివి? ఇన్నాళ్లెచట వసించితివి? స్వర్ణాభరణాది భూషణంబు లెవ్వరిచే నీబడ్డవి? రేయుంబవలు నీరాక కెదురుచూచుచుంటి. నిన్నుఁజూడని ప్రతిక్షణము నాకొకయుగముగా నున్నది." అని చెప్ప చిలుక విని దండప్రణామంబు లాచరించి తాను పద్మావతియొ

ద్దికిం బోయినవృత్తాంతంబును, తన కచట నాయిందువదనవలన
నీయఁబడ్డ భూషణంబులును మరల నారాకేందుముఖి కల్కి
యొద్దికి పంపిన దాదిగాఁగల యెల్లసమాచారంబుల నామూ
లాగ్రంబుగ విన్నవించె. ఇట్టిచిలుక పలుకుల నతిహర్షంబున
విష్ణుం డాకర్ణించి ఈశ్వరవరదత్తంబగు వాజి నెక్కి చిలుకను
గూడ తనతోడ గుఱ్ఱంబుపై నెక్కించుకొని సింహళద్వీపంబున
కతిత్వరితగతిం బోవ నెంచి బయలువెడలి మణికాంచన మా
ణిక్య నానారత్నమయ విమానగణభాసమానంబును, ప్రాసాద
సదనగోపుర తోరణవిరాజమానంబునైన సింహళద్వీపంబుఁ
జేరి తన్మధ్యంబున పద్మిన్యాద్యుత్తమస్త్రీకులప్రకాశమానంబు
గను, హృష్టపుష్టజనాకీర్ణంబుగను, మహైశ్వర్యసంపన్నంబుగ
నుండు కారుమతియను పురిసమీపంబునందలి హంససారసదా
త్యూహ మరాళజాల విలోళిత కమలకహ్లార కువలయకుముదాది
కుసుమామోదభరిత సరోవరవిభాసురంబుగను, కదంబకుద్దా
ల సాలతాలామ్ర కేసరకపిత్థాశ్వత్థ ఖర్జూర బీజపూర కరంజక
పున్నాగ పనస నాగరంగ శింశుపార్జున క్రముక నారికేళాది
నానావృక్షనివహాశోభితంబుగను, పల్లవ పుష్ప ఫలావృతంబుగ
నుండు నుద్యానవనంబును దర్శించి అత్యంతప్రముదితచిత్తుం
డై అమృతలహరీసదృశదివ్యసలిలసంభృతసరోవరంబున స్నా
నంబుఁ జేయువలయు నని కల్కి చెప్ప శుకము వినయాన్వితమై
యతని మనోభావంబును గ్రహించి "స్వామీ! మీరు స్నానం
బును జేయుఁడు. నేను పద్మావతినెలవునకుం బోయి వచ్చెద
నన్నుజ్ఞ యిండు." అని యడిగెను.

ఇది ద్వితీయాంశమునందు ప్రథమాధ్యాయము.

ద్వితీయాధ్యాయము.

తదనంతరంబున కల్కిమూర్తి సరోవరసమీపంబున స్వచ్ఛస్ఫటికసోపాన పరంపరోల్లసితంబుగ, ప్రవాళకృత వేదికాపఙ్క్తివిరాజితంబుగ, కదంబపల్లవపటలనివారితసూర్యకిరణంబులుగలదిగ నుండు ప్రదేశంబున వాజిపైనుండి డిగ్గి అచ్చోనుండు విచిత్రాసనంబున నాసీనుండై పద్మావతీసమీపంబునకు శుకంబును బంపె శుకంబు పద్మావతీగృహంబునకుం జని ముందు తాను కూర్చున్నచాంపేయవృక్షంబుపై కెగిరికూర్చుండి సౌధోపరిప్రదేశంబున తామరసదళశయనంబునందుఁ బరుండి సఖీలలామంబులచే కామసంతాపనివారణార్థంబు కమలినీదళవ్యజనంబుచే విసరంబడునదిగను, మదనతాపోష్ణనిశ్వాసవాతంబుచే ముఖారవిందంబును వాడఁజేయునదిగను, చందనపంకంబుచే తడుపఁబడిన కమలంబులను వక్షస్థలంబున ధరించినదిగను, సమీపస్థితరేవానదీజలార్ద్రంబుగ కమలకహ్లారాదికుసుమపరాగధూసరితంబుగ, మందమందసంచారంబుతోఁ గూడియుండు మలయమందమారుతంబును నిందసేయునదిగ నుండు పద్మావతీబాలంజూచి, అతిదుఃఖితమానసమై తత్కాలోచిత వచనామృతంబులచే నాయింతికి దుఃఖోపశమనంబు సేసె. పద్మావతి శుకమును జూచి"రమ్ము రమ్ము,సుఖంబున మగిడి యే తెంచితివా? నీకు శుభంబు చేకూరుఁగాత, నీవు చనినపిదప నేను మదనానలంబుచేఁ గాల్పఁబడిన శరీరంబు గలదాననైతి. నీవాక్యరసాయనంబుచే శాంతిగలుగఁజేయుము. తాపనివారకంబగు రసాయనము మందభాగ్యనగు నా కబ్బుటదుర్లభంబుగనున్నది." అని నందులకు చిలుక శ్రేష్ఠంబగునంగంబుల నొక్కిల్లు దంతి

గమునా? నీమదనతాపాతిశయంబును పరిహరింపం జేయునట్టి రసాయనంబును నగరసమీపోద్యాన వనస్థితసరోవరతీరంబున స్థాపించి నీ కిమ్మంచివార్తఁ జెప్పుటకిట కేతెంచితి" నని పద్మావతి కిం జెప్పె. ఇట్లు పద్మావతీశుకంబులు పరస్పరసల్లాపసుఖసంతృప్తాంతరంగులైరి. పద్మావతి నిజముఖనయనంబులను శుకముఖనయనంబుల నిడి కొంతకాల మమందానందంబు నొందెను పదంపడి యక్కన్నియ విమల, మాలిని, లోల, కమల, కామకందళి, విలాసిని, చారుమతి, కుముద అను నామంబులుగల నిజసఖీజనులను జలక్రీడార్థంబుగ నుద్యానసరోవరంబునకు రమ్మని యాజ్ఞాపించి తాను సర్వాభరణాలంకృతయై శ్రేష్ఠంబగు పల్లకి నెక్కి యంతిపురంబును వదలి నిజపరివారసహితంబుగ నుద్యానవనంబునుగూర్చి యేఁగె. అట్టిసమయంబున రాజమార్గచతుష్పథంబులందలి పురుషు లెల్లరు నీకృశాంగిం జూచిన తాము తొల్లింటి ధరణీధవుభాతి స్త్రీరూపధరులగుదు మని భీతచేతస్కులై యచ్చో నుండి నానాదిక్కులకుం బాఱిరి. మఱియు నంగళ్ల నమ్ము పురుషు లందఱు తా ముచ్చట నుండినచో రాచకూఁతుం జూడవలయు ననియు, అటులు త్రిలోకసుందరియగు నాకన్యం దిలకించిన తమకు మోహం బుప్పతిల్లు ననియు, అటు లుప్పతిల్లినచో తాము స్త్రీత్వము నొందుదుమనియు భయముఁ జెంది తమయిల్లాండ్రే నంగళ్ల నమ్మ నియమించి తాము నలుదిక్కులకుం బాఱిరి. పద్మావతియు నాశుకోక్తమువచనానుసారంబుగ సారసహంసనాదరమణీయంబును, వికసితకమలధూళీవాసనావాసితంబును, అమృతలహరీసదృశంబునైన సరోజలంబున నిజసఖీజనంబులతోడఁ జొచ్చి జలక్రీడలు సలుపుట కుపక్రమించెను.

అత్తఱి సరోవర వికసితతామరసపుష్పమధ్యంబులయందు
తిపరిమళ మకరందపానానందమత్తషట్పదవ్రాతంబులు కమలం
బులయొక్క సామ్యముఁ జెంది వానికన్న నెక్కుడువాసనాయుక్తం
బులగు సుందరీముఖంబులందుఁ గూర్చుండి యాకలువకంటులు
పలుమాఱు కరంబులచే తోలినను మిక్కుటంబగు ముఖవాస
నాతిశయాపేక్షచే వారిమోములం జుట్టికొని ఝుంకారముం
జేయుచుండె. ఆస్త్రీతిలకంబు లాజలాశయంబున హాస్య, వాద్య,
నృత్య, క్రీడా, జలప్రక్షేపాదివిహారంబుల యథేష్టంబుగ సలు
పుచుండిరి. పద్మావతి శుకంబుపలుకుల మనంబునం దలపోసి
కామాంధకారమోహితయై సలిలంబునందుండి గట్టెక్కి చం
ద్రికాధవళదుకూలంబు గట్టి మృగమద కర్పూర కుంకుమోన్మి
శ్రితసుగంధం బలఁది వివిధసురభికుసుమవిసరంబులు ముడిచి
మణిమయభూషణాలంకృతయై నిలుకడవడసిన క్రొమ్మెఱుంగుతీఁ
గెయుంబోలె మణిమయమంజీరఝుళఝుళనినాదంబును, గంక
ణఝుణఝుణత్కారంబును, గటీకలాపకింకిణీక్రేంకారంబును మన
నజ్యానాదఘోషంబునుంబోలె మ్రోయుచుండ నుందగమ
నంబున సఖీజనంబులతో శుకోక్తకదంబమంటపంబుం జొచ్చె.
అచట రత్నవేదికామధ్యంబున సుఖనిద్రాసక్తుండును, సూర్య
తేజంబు నతిక్రమించినవాఁడును, అత్యుత్తమమణిప్రవాళభూష
ణభూషితుండును, తమాలపత్రసదృశనీలగాత్రుండును, సాక్షా
దిందిరాధవుండును, పీతాంబరధరుండును, వికసితకమలసదృశ
నేత్రయుగళుండును, ఆజానుబాహుండును, విశాలవక్షస్థలుం
డును, శ్రీవత్సకౌస్తుభాద్యలంకృతహృదయారవిందుండు నైన
కల్కిమూర్తిని దర్శించి యానందస్తబ్ధశరీరయై క్షణకాలంబు
విస్మృతసకలవ్యాపారయై యోగనిద్రాసక్తుండుగ నుండు భగ

వంతుని మేల్కొలుపుటకై యత్నించు చిలుకరాజుం జూచి యిట్లనియె. "శుకోత్తమా. ఆమహామహిముని మేలుకొలుపకుము. లేచినయెడల మహాబలశాలియు, మెండగు సౌందర్యంబునం దేజరిల్లువాఁడు నగు నీమహాపురుషుండునయినేము పాపిని యగు నా దర్శనంబుచే స్త్రీరూపంబును ధరించునేమో? ఈశ్వరునిపరం బీతనియందెప్పగిది పరిణమించునో? నే నేమిచేయుదు" నని చిలుకను నివారించెను.

పద్మా కల్కి సంవాదము.

అపుడు చరాచరస్వరూపుఁడగు కల్కిమూర్తి చిలుకచేఁ బ్రబోధితుండై కన్నెదుట మాయవలె జగన్మోహనాకారంబు గలిగి చెలులతోఁ గూడినదిగను, లజ్జావనతాననయై కడకంటిచూపుచే తన్నుఁజూచుచుండునదిగనుండు పద్మావతిం జూచి మదనశరపీడితుండై "ఓకల్యాణీ! ఇచటికి రమ్ము. సుఖంబున నేతెంచితివా? నాభాగ్యవశంబున నీసమాగమంబు నాకుఁ జేకూరె. చంద్రవదనా! చంద్రబింబసమానంబగు నీముఖబింబంబు మదనానలసంతాపంబునం గుందు నాకు సుఖానందంబులను కలుగంజేయుఁగాత! చంచలాక్షీ! నీలావణ్యరసామృతంబు మన్మథుండను గొప్పసర్పముచే కఱవంబడిన నన్ను జీవింపంజేయుఁగాక! మానినీమణీ! కడు సుందరంబుగ, నిడివిగ నుండు నీయిరుహస్తంబులు నాకంఠంబునం జేరి నన్ను సుఖింపంజేయుఁగాక! పంకజాక్షీ! మదించినయేనుఁగుకుంభస్థలంబునకుం దుల్యంబై వర్తులాకారంబును జెంది యత్యున్నతంబుగ నుండునీ కుచద్వయంబు గాఢాలింగనసమయంబున నాహృదయకమలంబునం జేరి నా కానందజనకంబుగ నుండనిమ్ము. సింహమధ్యా! సుందరవళిత్రయంబుతోఁగూడి ప్రభావిరాజితంబుగ, మన్మథమహా

రాజవాసస్థానంబుగనుండు నీనాభిప్రదేశము నాకు సంతోష దాయి యగుఁగాక! మీనాక్షీ! సైకతసదృశంబై చీనిచీనాంబరంబులచేఁ బ్రకాశించుచుండు నీపిఱుఁదులు కామమత్తుండనగు నాకు సంభోగసుఖప్రదం బగుఁగాక! బింబాధరీ మనోహరాంగుళిశోభితంబై హంసనాదసదృశమధురారావంబు గల్గి నూపురాలంకృతిశోభితమైన నీపాదాంబుజంబు మన్మథవిషమూర్ఛితుండనగు నాకు హృదయతాపంబును బోఁగొట్టుఁగాక!" అని మోహాతిశయజనితతాపంబున వక్కాణించె. ఇటులు కలికులనాశకుండై యవతరించిన కల్కిమూర్తివచనామృతంబును పద్మావతి హెచ్చినతమి నాకర్ణించి, ఈతఁడు మహాపురుషుఁడని సంతసించి కరంబులు జోడించి స్తోత్రంబు చేసి యితఁడు తనకు నిజభర్తగాఁ దలంచి, నిర్భయంబుగ సంభాషించుట కారంభించెను.

ఇది ద్వితీయాంశమునందు ద్వితీయాధ్యాయము.

తృతీయాధ్యాయము.

—పద్మావివాహము.—

ఇటులు పద్మావతి కల్కిస్వరూపుండుగ నుండునాతని భగవంతుండుగ నెఱింగి యిట్లనియె "జగద్రక్షణాధ్యక్షబిరుదాంకితా! రమాపతీ! నాయందు కరుణింపుము. నీశరణంబు నొందిననన్ను మనుపుము-నేను ధన్యనై పుణ్యశాలిని నైతిని. దేవతలకునయితము దర్శించుట కలవిగాని నీదివ్యమంగళస్వరూపంబును తపోదానజపవ్రతాదులచే దర్శించి నీపాదసన్నిధిం జేరితి. అనుజ్ఞ ఇమ్ము-నే గృహంబునకుంజని మీరాకను నాజనకునికిం దెల్పెద."

అని సుందరంబుల కెల్ల పుట్టినిల్లుభావంబును దోఁపం జేయు పద్మావతి కల్కికి నమస్కరించి సెలవుంగొని నిజసదనంబునకరిగి విష్ణ్వంశుండగు కల్కియాగమనంబును సఖీముఖంబుగ జనకునకుం దెలిపె. ఇట్లు బృహద్రథుండు పద్మావతిచెలికత్తెలచే కల్కిమూర్తియగు భగవంతునిరాకను దెలిసికొని మిగుల సంతుష్టుండై కారుమతియను నిజరాజధానిని పతాకాధ్వజతోరణాదులచే నలంకరింపించి కల్కిమూర్తిని నిజనగరంబునకు రప్పించుటకై పూజార్హంబగు మంగళద్రవ్యంబును కరంబున ధరించినవారుగ నుండుపురోహిత బ్రాహ్మణమిత్ర బంధుజనంబులతోడను వివిధవాద్యనర్తన సంగీతంబులతోడను ఆసరోవరసమీపంబునకుఁ బోయి రత్నవేదికామధ్యంబున సుఖాసీనుండును, జగద్రక్షకుండును, సౌదామనీలతేంద్రధనుస్సులచే పర్శాకాలంబునం గల్గు నీలమేఘంబుభాతి స్వర్ణరత్నాద్యాభరణజాలంబులచే దేదీప్యమానశ్యామలశరీరకాంతివిరాజితుండును, మన్మథరూపగర్వమును పోఁగొట్టునట్టిరూపలావణ్యంబులం బ్రకాశించువాఁడును, సకలమంగళగుణగణాలంకారుండును, విష్ణుయశఃపుత్రుండునైన కల్కిమూర్తిని సుకృతపూజావిశేషంబునం జూచి యానందంబుచేఁ గలిగినగగుర్పాటుశరీరంబుతో నిజనయనంబుల నానందాశ్రువులొలుక దేవదేవుని యథావిధిం బూజించి "జగదీశ్వరా! నీరాక యిదివఱకు నాకుఁ దెలియదాయె. పూర్వజన్మార్జితసుకృతపటలపరిపాకాతిరేకంబున నీయాగమనంబు నాకు లభించె." అని పెక్కుభంగుల స్తోత్రము చేసి నిజాలంకృతసౌధంబునకుం దోడితెచ్చి దివ్యాసనంబున నాసీనుం జేసి పుండరీకదళవిశాలనయనయుగళవిలసితుండగు కల్కిమూర్తికి పద్మసదృశనయనచరణహస్తంబులు గల పద్మావతి యను తనముద్దుల

కూఁతును కన్యాదానము సేసి విధివిధానంబుగ వివాహమంగళమును సలిపె.

ఇటులు కల్కి యతిరూపలావణ్యగుణశీలాతిశయంబులచే విలసిల్లుపద్మావతిని భార్యగా నంగీకరించి సమస్తవస్తు సంపూర్ణంబై యొల్లకలుముల కాకరంబుగనుండు సింహళద్వీపంబున కొంతకాలము సుఖంబులం దేలుచుండె. అట్టిసమయంబున నీశ్వరవరప్రభావంబున స్త్రీరూపమును ధరించి పద్మావతికి చెలికత్తెలై యుండు రాజు లందఱు కల్కి సమీపంబునకు వచ్చి జగత్పతియును పద్మావతిసహితుండునైన కల్కిమూర్తికి నమస్కరించి పద్మావతిప్రేరితకల్కి దేశంబునతొల్లింటివలె పురుషరూపంబుల ధరించి అత్యాశ్చర్యకరంబుగనుండు భగవంతుని ప్రభావంబున కచ్చెరువంది వారి నుద్దేశించి "ఓస్వామీ! నిజమాయచే నశేషభువన విశేషంబులను గల్పించునీకు జయంబు కలుగుఁగాక! తొల్లి సముద్రసలిలంబున నిమగ్నంబైనభువనత్రయంబును రక్షించుటకును, వేదధర్మాదులను స్థాపించుటకును మీనాకారంబు ధరించిన మత్స్యవతారుండవును; హిరణ్యాక్షుండు నిజపరాక్రమాతిరేకంబున సమస్తలోకంబులయందు జయంబు గొని యసురనికరపరివృతుండై వాసవునిం జంపు ప్రయత్నంబున తరలునపుడు వానిని సూకరాకారంబుతోడ సంహరించి భూదేవత నుద్ధరించినవరాహావతారుండవును; దేవదానవులమృతంబునకై సముద్రంబు మథించుటకుం గడఁగి మందరాచలంబు నెత్తుటకు శక్తి చాలక వగచుచు నిజమానసంబుల నిన్నుం దలఁప నీవపుడు వారిసాహాయ్యార్థమై కూర్మావతారంబును ధరించి మందరగిరిని వహించి వారిచే నమృతపానంబుఁ జేయించినవాఁడవును; త్రిభువనంబుల జయించినవాఁడును, మ

హాబలపరాక్రమగర్వితుండును, అస్త్రశస్త్రాదులచేతను దేవగంధర్వకిన్నరనాగాదులచేతను, స్వర్గభూపాతాళలోకంబులయందును, రాత్రిసంధ్యాహ్నకాలంబులయందును మరణంబుఁ జెందకుండునటులు బ్రహ్మదేవునిచే వరంబు గొనినకతంబున నవధ్యుండుగ నుండు హిరణ్యకశిపునిచేఁ బీడింపఁబడి భయశోకసాగరనిమగ్నులైనయింద్రాదులకు క్షేమంబు గలుగఁజేయుటకై దైత్యునిం దునిమిననరసింహావతారుండవును; సమస్తభువనంబులను నిజవిక్రమంబుచే జయించి యాగముఁ జేయుచుండుబలిచక్రవర్తియొద్ద కపటవామనరూపమును ధరించినవాఁడవై పదత్రయపరిమాణంబు గలభూమిని దానంబుగఁ గొని తత్క్షణమే విశ్వరూపంబును ధరించి బలిచక్రవర్తిని పాతాళంబున కణఁగఁద్రొక్కినత్రివిక్రమావతారుండవును; అమితబలపరాక్రమశాలులును, మదాతిశయంబుచే మర్యాదాధర్మంబుల నతిక్రమించినవారునైన హైహయక్ష్మాకాంతులను నిజపితృహోమసాధనంబుగనుండు కామధేనువు నపహరించుటవలన జనించినకోపంబుచే వధించుటకై భృగువంశమున జమదగ్నికి పుత్రుండవై యుద్భవించి యిరువదియొక్కమాఱు క్షత్రియకులంబును నిర్మూలంబుఁ జేసి భూమిని క్షత్రియరహితంబుగఁ జేసిన పరశురామావతారుండవును; పులస్త్యవంశసంభూతుండును విశ్రవసునకు పుత్రుండును సకలలోకకంటకుండు నైనరావణాసురుని వధించుటకై సూర్యకులావతంసుండైన దశరథునికి పుత్రుండవై జన్మించి విశ్వామిత్రునియొద్ద నస్త్రాదులను గ్రహించి సీతాపహరణకుపితుండవై వానరయూథంబుతోడం గూడి సముద్రంబున సేతుబంధనంబుఁ జేసి పుత్రమిత్రకళత్రభ్రాతృబంధువర్గంబులతోడ రావణునిఁ జంపిన శ్రీరామావతారుండవును; యాదవకులజలధి

చంద్రుండుగ, సకలదేవతావందితచరణారవిందయుగళుండుగ, వసుదేవసూనుండుగ బలరామసహితుండవై పెక్కురగు నుక్కుగలరక్కసులను ద్రుక్కడంచి లోకత్రయంబునందలి పాపతాపంబులను పరిహరింపఁజేసిన కృష్ణావతారుండవును; నానావిధ మోహశాస్త్రంబులను కల్పించి యసురులను మోహింపఁజేసిన బౌద్ధావతారుండవును; అయిన నీకు మ్రొక్కెదము.

మఱియు నిపుడు కలికులవినాశార్థంబుగ బౌద్ధపాషండ మ్లేచ్ఛాదులను మడియించి వేదధర్మపరిపాలనార్థంబుగ నవతరించియుండు నీవు స్త్రీరూపంబుల నెడు నరకంబులనుండి మమ్ములను వెలిపుచ్చితివి ఇట్టినీదయావిశేషంబులను మే మేమనికొనియాడఁగలము? బ్రహ్మాదులకునయితము నెఱుంగుటకు శక్యముగాని నీలీలావతారవిశేషంబు లెక్కడ? కామక్రోధాదిదోషపరిపూర్ణహృదయుల మగు మే మెక్కడ? నీ యనుగ్రహాతిశయంబుచే నీపాదంబులను దర్శించితిమి. కావున కృపాసాగరుండవగు నీవు నీపాదసేవాభిలాషులమగు మమ్మును రక్షింపుము.'' అని పునఃపునఃప్రణామంబు లాచరించి భక్తిశ్రద్ధాతాత్పర్యయుక్తులై మిక్కుటముగ స్తుతించిరి.

ఇది ద్వితీయాంశమునందు తృతీయాధ్యాయము.

చతుర్థాధ్యాయము.

—కల్కియొద్దకు నంతఋషి వచ్చుట.—

ఇట్లు పురుషోత్తముండగు కల్కి రాజులపలుకుల నాలకించి బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రాదిధర్మంబులను. ప్రవృత్తినివృత్తిధర్మంబులను, వేదవిధానంబున నన్నిటిని భక్తాగ్రేసరులగు

వారికి నుపదేశించె. రాజులు కల్కియొద్ద నెల్లధర్మంబుల
నామూలాగ్రంబుగ నెఱింగి పరిశుద్ధమనంబులతోడ కల్కికి
పునఃపునః ప్రణామంబు లాచరించి వారి నుద్దేశించి యిట్లులనిరి.

స్వామీ! మాకు తొల్లింటిపురుషరూపంబులు పోయి
స్త్రీరూపంబు లెటులుగల్గె? మీదర్శనానంతరము మాకు మరల
తొల్లింటిపురుషరూపంబు లెటులు నివ్వటిల్లె? ఆత్మకు పురు
షత్వ స్త్రీత్వజరాయౌవన బాల్యాదిసుఖదుఃఖాదికంబు లెటు
లంగలుగు? ఇవి యేరిచే నియమింపబడుచున్నవి? దీనికి కతం
బేమి? ఇది యిట్టిస్వభావము కలది యని తెలియుటకు సాధ్యంబు
గాకయున్నది. మాడెందంబులయందలి యీసందియంబులం
దీర్పవలె నని వచించినరాజులమాటలు కల్కి యాకర్ణించి
అనంతుఁడనునామంబుగల ఋషిశ్రేష్ఠుని నిజమానసంబునతలం
ప నతండు కల్కిదర్శనంబున తాను ముక్తిం జెందంగోరి యతి
వేగంబున కల్కిసమీపంబునకు వచ్చి నమస్కరించి దేవా! నే
నేమి చేయుదు? నే నెచ్చటికిం బోదు? నని యడుగ కల్కిపురు
షుండు మందహాసముఁ జేయుచు అనంతఋషిపుంగవుం గాంచి
మీరు చూడందగినవన్నియుఁ జూచితిరా? మీ రన్నిటిని గ్ర
హించితిరా? అని ప్రశ్న సేసెను.

అనంతుం డందులకు ముందు చూడని వన్నియు నేని
పుడు పొడగంటి నని చెప్పి సంతోషస్వాంతుండై స్వస్థానంబు
నకుం బోవ యత్నించెను.

ఇట్లు బోవ యత్నించుచున్న యనంతఋషిని రాజులు
చూచి ఆశ్చర్యంబున కడు డోలాయమానమానసులై కల్కిం
గాంచి భక్తవత్సలా! ఈఋషిచే నేమి చెప్పంబడియె? మీరం
దుల కేమి ప్రత్యుత్తరం బిచ్చితిరి? వారు వచ్చుటకు కారణం

బేమి? వా రేలయింతత్వరితంబున వచ్చినదారిం బట్టెదరు? వీటిని సాంగోపాంగంబుగ నెఱుంగు నభిలాష మాకుఁ గలదు. అగుటచే మీరు మాకు నీవృత్తాంతము సవిస్తారముగఁ జెప్పఁ బ్రార్థించెద మనిరి. అందులకు కల్కిమూర్తి మీ రాయనంతునే యడిగిన నెల్లవృత్తాంతంబులు గోచరంబు లగు నని వాక్రుచ్చెను. పదంపడి యారాజు లనంతునికిఁ బ్రణమిల్లి ఋషిశ్రేష్ఠా! కల్కి భగవంతునితో మీ రేమిమాటలాడితిరి? అది యెరికినిఁ దెలియకయున్నయది. నీజన్మభూమి యెద్ది? నీజనకుం డెవఁడు? దీనియర్థంబును మాకుం జెప్పవలయు నని యడుగ నాఋషి స్వవృత్తాంతంబును శ్రుతపఱుచుట కారంభించెను.

అనంతఋషివృత్తాంతకథనము.

రాజవరులారా! పురిక యనుపట్టణంబున ధర్మజ్ఞుఁడుగ వేదపారంగతుఁడుగ, దయాస్వరూపుండుగనుండు విద్రుముఁడను భూదేవుండు మజ్జనకుడు. పతివ్రతాశిరోమణియగు సోమ యను కాంతామణి నాకుమాత. యౌవనకాలంబున వారిరువురికి నేను నపుంసకుండనై పుట్టి లోకనిందార్హుండనై తల్లిదండ్రుల కత్యంతశోకప్రదుండ నైతి. నపుంసకుండనగు నన్ను మజ్జనకుండు గాంచి శోకాక్రాంతుండై స్వగృహంబును వదలి శివవనం బను పుణ్యస్థలంబుం జేరి యందలిభవానీశుని ధూపదీపనైవేద్యాది విధానంబులం బూజించి క్షేమము నిచ్చువాఁడును, శాంతహృదయుండును, సర్వలోకైకనాథుండును, సర్వభూతంబులయందు నివసించువాఁడును, వాసుకిని కంఠహారంబుగ ధరించినవాఁడును, జటాజూటాసంగతగంగాతరంగ శోభితుండును, అమందానంద స్వరూపుండునైన పరమేశ్వరుని నమస్కరించెదనని పెక్కుభంగుల సుతించెను. మంగళకరుండగు నీలకంఠుండు స్తోత్రప్రవా

ష్టుండై వృషభారూఢుండుగ నాపితృసమీపంబునకు వచ్చి నిద్రుమా! నీకు వలయువరంబు వేఁడుమని యనఁగ నాపిత పుత్త్రుండునగు నాకు పుంస్త్వము ప్రసాదింపఁ బ్రార్థించెను. పార్వతీసహితుండై సాక్షాత్కరించి యుండునాకపాలధరుండు మందహాసంబు ముఖారవిందంబునం దోఁప నాజనకునికి కాంక్షితవరంబునిచ్చి యంతర్హితుండయ్యె.

ఇట్లు మజ్జనకుండు లబ్ధవరుండై నిజమందిరంబున కేతెంచి యీశ్వరకరుణాకటాక్షవీక్షణప్రభావంబున పురుషరూపంబు ధరించియుండునన్నుం గాంచి సంతోషభరితమానసుండై పదిరెండవ వత్సరంబున నాకు పరిణయంబుఁ జేసె. పిదప నేను రూపయౌవనకులశీలాదుల విలసిల్లు యజ్ఞరాతపుత్రికయగు మానిని యను కన్నియను వివాహమాడి భార్యాసహితుండనై కడు సుఖంబులం దేలుచుంటి. ఇటులు కొంతకాలము గతించ మన్మాతాపితురులు కాలధర్మంబు నొందిరి. అపు డేను వారిమరణంబునకు దుఃఖితుండనై వారికిపరలోకసాధనంబులగు శ్రాద్ధాదికర్మంబులను బ్రాహ్మణబంధుజనంబులతోడ శాస్త్రోక్తప్రకారంబుగ నిర్వర్తించి పెక్కురుద్విజన్ములనన్నాదిసంతర్పణంబులచేఁ దృప్తులం జేసితిని. పితృవియోగచింతాతిశయంబున విరక్తుండనై విష్ణ్వారాధనంబు సలుపుచుంటి. జపపూజాధ్యానాది సత్కర్మంబులచేప్రసన్నుం డగుసాక్షాద్విష్ణువు నాస్వప్నంబున సాక్షాత్కరించి లోకంబున మానవులు “ఇతఁడు నాకు తండ్రి, ఈయింతి నాకుఁదల్లి, వీఁడునాకుభ్రాత, వీఁడు నాకుప్రియమైన పుత్త్రుఁడు” అని బహుభంగుల వాదుకొందురు. ఇవియన్నియు స్నేహమోహంబులం గల్గుమాయ. దీనిచేత శరీరధారులకు శోకదుఃఖభయోద్వేగ జరామరణంబులు గలుగుచున్న

యవి. అనిచెప్పి ప్రతివాదముఁ జేయుటకు ప్రయత్నించు నన్నుం జూచి తత్క్షణం బంతర్ధానంబు నొందె. భూమీశులారా! నేను తోడనే నిద్రనుండి మేలుకొనినవాఁడనై యత్యాశ్చర్యంబును జెంది పురికాబట్టణం బనునిజరాజధాని వదలి భార్యాసహితుండనై "పురుషోత్తమము" అనుపేరుగల విష్ణుక్షేత్రంబునకుం బోయి విష్ణ్వాలయ దక్షిణపార్శ్వంబున నాశ్రమంబు నిర్మించుకొని భార్యాభృత్యసహితుండనై విష్ణుమాయాసందర్శనార్థంబుగ జపధ్యానభగవన్నామకీర్తనాదులను సలుపుచుంటి.

ఇట్లు పదిరెండువత్సరంబులు హరిభజనంబుఁ జేయుచు నొక్కనాఁడు ద్వాదశితిథియందు భార్యాదులతోడ సముద్రస్నానంబున కేఁగితి. తుంగతరంగసంఘుభయానకం బగుసముద్రసలిలంబునఁ గ్రుంకు లిడి మరల లేచివచ్చుటకు సాధ్యంబు గాకుండుకాలంబున జలజంతువులచే పీడితుండనై మెండగుగాలిచేత సముద్రదక్షిణ తీరంబునకుం ద్రోయఁబడితి. ఆ తీరంబున సంధ్యోపాసనంబునకై వచ్చిన వృద్ధశర్మ యనుద్విజోత్తముం డశక్తుండనై మైమఱచి పడియుండు నన్నుఁ జూచి దయాళుండై నన్నతనిపురంబునకుం గొంపోయి పుత్రస్నేహంబుగ వివిధోపచారంబులచేఁ గాపాడుచుండె. నాకు కొంచెము తిరుగులాడుటకు శక్తి కలిగిన తరువాత నేను వచ్చియుండుదిక్కు దేశముఫలాని దని తెలియక వృద్ధశర్మ యనువిప్రుని తండ్రిగను, అతని భార్యను తల్లిగను భావించి కొంతకాలము వారియింట వసింపుచుంటి. పిదప నావృద్ధశర్ముం డేను వేదధర్మానుష్ఠానంబులు గలవాఁడ నని తెలిసికొని "చారుమతి" యనుపేరుగల తనకూమార్తెను నాకుఁ బెండ్లిసేసె. నేను స్వర్ణసమానశరీరకాంతి గలదిగను రూపశీలగుణాన్వితగ నుండునిజభార్యచేసంతోషము

నుజెంది నానావిధసుఖంబులం దేలి యాయిందుముఖియందు జయ, విజయ, కమల, విమల, బుధులను నామంబులుగల అయిదుగురుపుత్రులం గని స్వజనబంధుపుత్రులతోడను నానావిధధన కనకంబులతోడను మిగులఁ బ్రసిద్ధిఁ జెంది దేవలోకంబునందలి దేవరాజుమాడ్కి భూలోకంబున నతిసుఖంబుగ నుంటి. ఇటులుండ నొక్కదినంబున బుధుండనునిజతనూజునికి వివాహంబుఁ జేయ యత్నించునవసరంబున ధర్మసారుండను నగ్రజన్ముండు నాపుత్రునికి తనకూఁతు నిచ్చునట్లు నిశ్చయించి వాద్యగీతనృత్యంబులతో నానావిధరత్నభూషిత స్త్రీసహితుండై నాపుత్రుని కభ్యుదయవ్రతంబును జేయించెను. నేను నాపుత్రుని శ్రేయంబునకై పితృదేవ ఋషితర్పణంబుఁ జేయుటకు సముద్రతీరంబున కరిగి కడు నాదరంబున సముద్రంబునఁ బ్రవేశించి స్నానము చేయుచుండ తటి వీచీపరంపరోద్ధూతుండనై సముద్రసలిలంబు వదలి గట్టెక్కి యచట స్నానసంధ్యాతత్పరులుగ, పురుషోత్తమక్షేత్ర నివాసులుగ, ద్వాదశీపారణయం దాతురులుగ, నుండు సుస్నిగ్ధసుస్నేహితులం జూచి యత్యాశ్చర్య భరితమానసుండ నైతి. ఓ రాజులారా! ఆస్నేహితు లైనబ్రాహ్మణులు సముద్రసలిలస్నాతుండను, విస్మయావిష్టమానసుండను అగు ఋషింజూచి యోఋషిశ్రేష్ఠా! నీవు మిగుల విష్ణుభక్తి కలవాఁడవు. సముద్రుండులోన నైనను బైటనైనను నేయాశ్చర్యంబు నైన నీడగాంచితివా? నిన్ను జూడ నేదో యొకయాశ్చర్యంబున కలంకఁజెందిన మనంబుతోడ నుండు నట్లు తోఁచెడిని. త్వరితంబుగ ద్వాదశీపారణంబుఁ జేసి మనస్సంభ్రమరహితుండవై నీవుచూచినయాశ్చర్యాతిశయంబులం దెల్పుము. అని యాస్నేహితు లడిగిరి. నే నపుడు విష్ణుమాయావివశేంద్రియుం

డనై నేనేయాశ్చర్యంబును కన లేదు, విన లేదు. అని వాకొంటి. స్నేహ మోహావశంగతుండుగనుండు నే నెచ్చటను సుఖంబుండు నటులు నిశ్చయింపఁజాలనైతి. భార్యాధన గృహపుత్ర వివాహాదులయందు మిగుల ననురక్తుండనగు నేను అనంతుండనుపేరుగల ఋషిని. దీనమానసుండనై భార్యాపుత్రాదులను స్వప్నసదృశులుగఁ దలఁచితి. దక్షిణసముద్రతీర భార్యాపుత్రవివాహాదులను తలఁచిపరవశుండనై వెఱ్ఱివానివలె నుండునన్ను పురుషోత్తమ క్షేత్రంబునందుండు భార్యచూచి కట్టా! నాపురుషునికి వెఱ్ఱిపట్టినది. నాసమీపంబున నానావిధంబులగు వెఱ్ఱిమాటల నాడుచున్నవాఁడే! అని బిగ్గరగ నేడ్చెను. నేనిట్లు శోకముఁ జెందుచుండునిచటి భార్యను జూచియు దక్షిణతీరంబున చారుమతియను భార్య జయాదులగునయిదుగురు పుత్రులు ధనసంపత్తిగలగృహము వీటిని స్మరించియు మిగుల భయభ్రాంతచిత్తుండనైతి. అట్టిసమయంబున పండితుఁడుగ సర్వధర్మార్థతత్వంబులను నెఱింగినవాఁడుగ మిగుల తేజోవంతుఁడుగ నుండు హంసుఁడు (అనఁగా శ్రేష్ఠసన్న్యాసి) తత్త్వార్థంబుల నాకుపదేశించుటకై నాచెంతకు జేరెను. దినకరునిపగిది ప్రభాజాజ్వల్యమానుండును; సర్వగుణ పరిపూర్ణుండును, శాంతుండును, దాంతుండును, శుద్ధుండును, సర్వశోకక్షయకరుండును, నైన యాహంసుని సుఖాసీనుం జేసి యథావిధిం బూజించి తత్త్వంబుల నడుగుటకుపక్రమించితిని.

ఇది ద్వితీయాంశమునందు చతుర్థాధ్యాయము.

పంచమాధ్యాయము.

—హాంసుం డనంతఋషికి తత్త్వము నుపదేశించుట.—

పదంపడి యాహాంసుడు యథోచితంబుగ భిక్షచేసికొని
కూర్చుండి నాభావంబుగ్రహించి, ఓ అనంతా! చారుమతి యను
నీభార్య బుధాదిపంచపుత్రులు ధనకనకరత్నాదిసంపూర్ణంబగు
నీమందిరంబు వీనిని వదలి దక్షిణతీరంబునుండి యిచటికి నెవు
డేతెంచితివి? దక్షిణతీరంబున నీతనూజుండగు బుధునిపరిణయ
దినంబున నన్ను రమ్మని పిలిచి నీవుపురుషోత్తమాశ్రమంబునకు
వచ్చి యిట్టివెతలం గుందనేల? సముద్రదక్షిణతీరంబున నీవుడె
బ్బదివత్సరంబుల యాయుఃపరిమితిగలవాఁడవుగ నుంటివిగదా?
ఇచట ముప్పదివత్సరంబులు గలవాఁడవుగ నగుపడుచున్నవాఁ
డవు. ఇది యేమియాశ్చర్యము? ఇపుడు నీతోకూడ నుండు భా
ర్యను నే నచటఁ జూడలేదు. దక్షిణతీరంబున నేను జూచినది
నీవు అగునో! కాదో. నిన్నచటఁజూచినది నేనుఅవునో! కాదో!
తెలియదు. ఇచట మనము యిరువురిచేరిక యింద్రజాలంబుచం
దంబునన్నయది. నీవు గృహస్థుండవు. నేను భిక్షుకుండను. మన
మిరువురము ఇచట భాషించుట బాలోన్మత్తసంభాషణంబువలె
సందర్భరహితంబుగ నున్నయది. ఇది యంతయు త్రిలోకంబు
లను మోహింపంజేయు పరమేశ్వరునిమాయ గాని వేఱు గాదు.
ఈమాయ లోకులకు నజ్ఞానంబునం గలుగు. అని చెప్పి సమీ
పంబున నుండుమార్కండేయునిం జూచి మార్కండేయా!
ప్రళయకాలమునందు విష్ణునాయుదరప్రదేశమునం దుండు
సముద్రంబులో నీవుచూచినమాయ నీజగంబును నావరించి
వారవనితవలె మోహంబును గలుగంజేయుచున్నది ఇజ్జగంబు
మాయాక్రాంతముగ నున్నది. ప్రళయకాలంబున జగత్త్ర
యంబు లీనంబై పరబ్రహ్మమాత్రము నిలిచియుండె. తర్వాత

నాపరబ్రహ్మ లోకంబును సృజింప నిశ్చయించి తానే పురుష ప్రకృతిస్వరూపద్వివిధంబై తనమహిమచే కాలయోగంబువలన మహత్తత్త్వమును నిర్మించె. దానినుండి కాలస్వభావకర్మస్వరూపంబుగను, త్రిమూర్త్యాత్మకముగను, సంసారకారణముగను నుండు అహంకారము జనించె అయ్యహంకారంబునుండి పంచతన్మాత్రలును, వాటినుండి రూపరసాదిగుణంబులుగల పృథివ్యాది పంచమహాభూతంబులును పుట్టినవి. బ్రహ్మసంబంధమువలన ప్రకృతియందు జన్మనాశక్రియాస్వరూపంబుగల దేవాసుర మనుజాదిజీవరాసు లన్నియు జననముం జెందె. పరమాత్ముని మాయాప్రభావంబువలన జీవపురుషుండు సంసారంబునం దాసక్తచిత్తుడై తననిజస్థితిని దెలిసికొనుటకు శక్తిచాలక యున్నవాఁడు. కడు బల్లిదంబై యెల్లెడల నల్లిబిల్లిగ నల్లుకొని యుండు నిమ్మాయ యత్యాశ్చర్యకరంబైనది బ్రహ్మాది దేవతలుసయితము రజ్జువుచే కుట్టఁబడిన నాసాగ్రంబు గలవృషభంబుమాడ్కిని సూత్రంబుచేఁ గట్టఁబడినపక్షివిధంబునను మాయకు లోఁబడియున్నవారలు. లోకంబున రజస్సత్త్వతమోగుణమయమైన మాయ యను నీపెద్దనది యేఋషిశ్రేష్ఠులచే దాటంబడునో అట్టి ఋషీశ్వరులే తత్త్వజ్ఞు లని హంసుండు మార్కండేయునికిం జెప్పె అట్టి సమయంబున శౌనకుండు సూతుం జూచి పౌరాణికోత్తమా! హంసునివాక్యంబుల నాలకించి మార్కండేయవసిష్ఠాదు లేమి చెప్పిరి? పురుషరూపంబులం గోలుపోయి మరల పురుషరూపంబులం ధరించినరాజు లనంతునిపలుకుల నాలించి యేమియనిరి? నాకు నీకథల నన్నింటిని విస్తరించి చెప్పవలయు. నీకథామృతంబుచే నాశ్రోత్రేంద్రియం బానందంబును జెందుచున్నయది. అనుశౌనకవాక్యంబుల సూతుం డాకర్ణించి అహం

దానందంబున నావలికథను శౌనకాదిమహర్షులకు నీకుఁ జెప్పం
బోయెదురీతిని వక్కాణించుట కుపక్రమించె.

పిదప రాజులు అనంతునిం జూచి "ఋషిపుంగవా! తపం
బుఁ జేసి యింద్రియంబుల నెట్లునిగ్రహించితివి? వాటిసవిస్తార
ముఖ జెప్పవలయు" నని ప్రార్థింప నపు డనంతుఁ డాదరాతిశ
యంబునఁ జెప్పుచున్నాఁడు. "తర్వాత నేను నింద్రియనిగ్రహం
బుఁ జేయుటకై యత్నించి కాననంబున కేఁగి కడు నిష్ఠురతపంబు
సేసియు నాకు మనశ్శాంతి గలుగలేదు తపోవనంబున బ్రహ్మ
ధ్యానము చేయుచుండుతఱి నేను పూర్వ మనుభవించిన దార
పుత్రాదిసుఖంబులు జ్ఞాపకంబునకు వచ్చి దుఃఖంబును గలుగం
జేసి ధ్యానయోగంబులను నశింపఁజేయుచుండెను. పిదప నేను
నింద్రియంబుల నిగ్రహించిన నిస్సంశయముగ మనోనిగ్ర
హంబు గలుగు నని నిశ్చయించి నాయింద్రియములను నశింపఁ
జేయుటకు యత్నించుచుండ నింద్రియాధిదేవతలగు దిక్కు,
వాయువు, సూర్యుఁడు, వరుణుఁడు, అశ్వినీదేవతలు, అగ్ని. ఇం
ద్రుఁడు, ఉపేంద్రుఁడు, మిత్రుఁడు అను వీరు నిజరూపంబులతో
నాసమీపంబునకుం జేరి "ఓ అనంతా మేము నీశరీరంబున స్థాపిం
పఁబడిన యింద్రియాధిష్ఠానదేవతలము. మమ్ముల నీగోటికోసల
చేఁద్రుంచుటకై యత్నించుట యుక్తంబుగాదు. నీవు మనోనిగ్ర
హంబు నార్జించుటకై మమ్ములను పీడించుటచే నీశరీరమర్మంబు
లు ఛిన్నభిన్నంబులై మరణంబును జెందుదువు గాని నీకు మేలు
కలుగదు. మఱియు గ్రుడ్డిగ, చెవుడుగ, తదితరాంగంబులు శూ
న్యంబులైనవారుగ, నిర్జరారణ్యవాసులుగ నుండువారునై తము
విషయాసక్తమనస్సు కలవారలై యున్నవారలు. జీవునికి దేహ
మో యిల్లు, మనస్సు భృత్యుఁడు, బుద్ధి భార్య, ఇతరేంద్రియ

ములైన మే మనుచరులము. కర్మాధీనుఁడగు జీవునికి మనస్సు బంధమోక్షంబులను గలుగఁజేయుచున్నది. ఈ మనస్సు పరబ్రహ్మమాయచే సంసారచక్రపరివర్తనమును కలుగఁజేయుచున్నది. కావున మనోనిగ్రహముకొఱకు విష్ణుభక్తిని సలుపుము. ఆ విష్ణుభక్తి సర్వకర్మములను దహించి సుఖమోక్షంబుల నిచ్చును. ద్వైతాద్వైతమహానందసందోహమును కలుగఁజేయును. నీవు హరిభక్తిచే జీవకోశవినాశానంతరము మోక్షమును జెందుదువు. కల్కి దర్శనంబుచే నంత్యకాలంబున నీకు ముక్తి కలుగును.'' అని యింద్రియాధిష్ఠానదేవతలు చెప్పిరి. కాఁబట్టి విష్ణువును భక్తిచేఁ బూజించి కలికులాంతకుం డగు కల్కిమూర్తిని దర్శించుటకు నిచ్ఛకలవాఁడనై యిచటికి చనుదెంచితి. ఇచట సూపరహితుండును, పాదశూన్యుండును, వాగ్రహితుండునై నపరమాత్మనిరూపంబును దర్శించి తత్పదపల్లవంబుల స్పృశించి మధురవాక్యంబుల నాకర్ణించితి'' అనిచెప్పి యనంతుఁడు సాక్షాదిందిరానాయకుండును, కమలదళవిశాలలోచనుండును, నిజస్వామియు నైన కల్కిమూర్తికి నమస్కరించి ప్రముదిత చిత్తంబున నత్తలంబును వదలి స్వస్థానంబునకుం బోయె. మఱియు నచటిరాజు లనంతఋషివాక్యశ్రవణంబున నంతుష్టాంతరంగులై పద్మావతీకల్కిమూర్తులకు పునఃపూజాప్రణామాదులను నతిభక్తిశ్రద్ధాళులై చేసి యథేచ్ఛం జనిరి.

అజ్ఞానాంధకారమాయల నశింపఁజేయునట్టి యీయనంతుని చిత్రచరిత్రంబును పఠించిన లేక ఆకర్ణించిన మానవులు సమస్తబంధంబులనుండి విముక్తులై మహానందమును జెందుదురు.

ఇది ద్వితీయాంశమునందు పంచమాధ్యాయము.

షష్ఠాధ్యాయము.

——కల్కిమూర్తి నిజనగరంబునకుం బోవుట.——

ఇటులు భూపతులు నిజేచ్ఛం జనినపిదప కల్కిమూర్తి భార్యాసహితంబుగ నిజసైన్యపరివృతుండై సింహళద్వీపంబు నిర్గమించి శంబళగ్రామంబునకుం బోవయత్నించె.

పిదప కల్కి మనోభావంబును సురపతి గుఱుతెఱింగి విశ్వకర్మ యను దేవశిల్పిని రావించి "ఓవిశ్వకర్మ! నీవతిత్వరితగతి శంబళగ్రామంబునకుం బోయి యచట రత్నస్ఫటికవైడూర్యాది నానావిధమణిఖచితంబును, రజతస్వర్ణపరిష్కృతంబును, ప్రాకారగోపురాట్టాలక ప్రాసాదహర్మ్యనివహ మనోహరంబును, గృహోద్యానవాపీకూపతటాకవిలసితంబునై యుండు నొక గొప్ప రాజధానిని నిర్మింపుము నీకుంగల యెల్ల శిల్పవిద్యానైపుణ్యంబు నచటంజూపి నీబుద్ధిచాతుర్యంబును వెల్లడిం జేయు"మని యాజ్ఞాపించె. ఇంద్రునిమాటలు విశ్వకర్మ విని నిజశక్తిని స్మరింపుచు భగవంతుండగు కల్కిగ్రామంబును స్వస్తికసర్వతోభద్రప్రముఖ మహాగృహపరిష్కృతంబును, సంతాపనివారక స్ఫటికమయవాతాయన మనోహరంబును, ప్రాసాదహర్మ్యసంబాధమును, నానావనలతోద్యాన సరోవరవాపీతటశోభితంబునై దేవేంద్రుని యమరావతిపట్టణంబుహొయలు ననుకరించుసౌందర్యంబుతో నిర్మించె. కల్కిమూర్తి సింహళద్వీపస్థ కారుమతీ నగరంబును వదలి సేనాగణపరివృతుండై శంబళగ్రామంబునకుం బోవ యత్నించి సముద్రతీరంబుం జేరె. మామయగు బృహద్రథుండు లక్ష్మీసహితుండగు విష్ణువుంబోలె భార్యాయుతుండై పద్మావతియను భామామణితోంగూడి ప్రకాశించుచుండు కల్కి

మూర్తి కిరువది వేలగజంబులు, పదివేల యుత్తమాశ్వంబులు, రెండు వేలరథంబులు, మహార్ఘవిచిత్రనానాభరణవస్త్రాదిభూషితతనులగు ద్విశతదాసీజనంబులు, దివ్యరత్నవస్త్రాభరణంబులు నల్లునికి పారితోషికంబుగ నిచ్చి భక్తిస్నేహానందబాష్పపరిపూరితలోచనుండై మౌనంబున చెంతనిలిచియుండె. అపుడు కౌముదీబృహద్రథులకు పద్మాసహితుండగునుండు కల్కిమూర్తి నమస్కారపూజాదుల నతిహర్షంబునం జేసి కారుమతీపట్టణంబునకుం బొమ్మని నియోగించె. బృహద్రథుండు తనయల్లుండగు కల్కిచేఁ బూజలం గొని నిజరాజధానిం జేరె. కల్కిమూర్తి సేనాగణపరివృతుండుగ మహాసముద్రసలిలంబునం బ్రవేశించి యావలిగట్టునకుఁ బోవ యత్నించుసమయంబున సాగరజలంబు స్తబ్ధత్వముఁ జెందుటం జూచి సముద్రజలోపరిప్రదేశంబు నేలయందు నడిచిపోవుటంబోలె నీటియందు నడిచి యతిసుకరంబున నావలిగట్టున కేఁగి చెంతనుండు చిలుకం జూచి "చిలుకా! మన శంబళగ్రామ మింద్రునిచే నాప్రీత్యర్థము సకలైశ్వర్యసంపన్నంబైన మహానగరంబుగ నిర్మింపంబడియె కావున నీ వానగరంబునకు ముందుగాఁ బోయి నాతల్లిదండ్రులకును, జ్ఞాతిబంధువులకును నా యాగమనంబును పద్మావతీవివాహాదిగ నాక్షేమవార్తలను వ్యక్తీకరింపుము. తర్వాత నేను సేనాగణపరివృతుండనై వచ్చెద" నని చెప్పెడు పలుకులను మహాబుద్ధిమంతుండును, సర్వజ్ఞుండును, ఆకసంబున సంచరించుటకు సామర్థ్యము గలవాఁడునై యుండు నాచిలుక విని దేవపూజితమును, సప్తయోజనవిస్తీర్ణము కలదియును, బ్రాహ్మణాదిచాతుర్వర్ణ్యజనాకులంబును, సూర్యతేజంబునఁ బ్రకాశించునదియును, హర్మ్యప్రాసాదశతశోభితంబును, సర్వర్తుసుఖప్రదంబును, అతిరమణీ

యంబునైన శంబళగ్రామంబునం బ్రవేశించి ఆనందాశ్చర్యపరవశుండై ఒక గృహంబునుండి మఱియొకమందిరంబునకును ఒకప్రాసాదమునుండి మఱియొకప్రాసాదంబునకును ఒకయుద్యానవనంబునుండి మఱియొకయుద్యానవనంబునకును ఒకవృక్షంబునుండి మఱియొకవృక్షంబునకు నెగురుచు అతిరమణీయంబగు విష్ణుయశస్సుమందిరముం జేరి మధురాలాపంబుల కల్కిమూర్తిరాక పద్మావివాహము మొదలగునంతోషవృత్తాంతంబులను జ్ఞాతిబంధుసుహృద్గణ పరివృతుండైన కల్కి తండ్రియగు విష్ణుయశస్సునకుం జెప్పె

విష్ణుయశుండు చిలుకచెప్పిన తనపుత్రుని క్షేమసమాచారంబుల నతిసంతోషంబున నాలకించి విశాఖయూపరాజాది మహాజనంబుల రప్పించి వారికీవృత్తాంతంబు వ్యక్తీకరించి పట్టణగ్రామాదులు తోరణాదులచేతను, పల్లవకుసుమఫలతాంబూలాక్షతచందనాద్యలంకృతంబై పుణ్యోదక పరిపూర్ణమగు కుంభంబులచేతను నలంకారము చేయించెను. అమరావతీపట్టణంబువలె ప్రభావిరాజితంబుగనుండు శంబళపురంబును కామినీనయనానందకరలావణ్యశోభాయమాన శరీర కాంతికలవాఁడును, పద్మావతీసహితుండును, కృపాసముద్రుండును నైయుండు కల్కిమూర్తి సేనానివహపరివృతుండై ప్రవేశించి తల్లిదండ్రులపాదారవిందంబులకు పద్మాసహితుండుగ మ్రొక్కులిడెను. తల్లియగు సుమతికాంత నిజపుత్రుండగు కల్కిమూర్తిని దేవేంద్రునిగను, తనకోడలను పద్మావతిని శచీదేవిమాడ్కియును, శంబళగ్రామంబు నింద్రపురంబగు నమరావతిచాడ్పునను తలంచి ఆనంద పారావారంబున మునిఁగెను. అప్పుడా శంబళనగరము సుగుణమనోహరుండైన కల్కిమూర్తిని నిజధవుండుగఁ బడసి

మిగులఁ బ్రకాశించె. అన్నగరంబున విష్ణువగు కల్కిమూర్తి పద్మావతియను లక్ష్మితో పెద్దకాలంబు సుఖంబున విహరించుచుండె. కల్కిమూర్తి కగ్రజుండగు కవి కామకల యనునామంబునం బరంగు కామినిని పరిణయంబాడి యాయింతియందు మహాబలవిక్రమశాలులగు బృహత్కీర్తి, బృహద్బాహు లను నిరువురుపుత్రులం గనెను. మఱియొకయగ్రజుండగు ప్రాజ్ఞుండు సన్నతి యనుబింబాధరయందు సర్వలోకపూజితులును జితేంద్రియులునైన యజ్ఞ విజ్ఞ నామంబులు గల కుమారులను పుట్టించెను. సుమంతుం డను మఱియొకయన్న మాలిని యనుకాంతాలలామంబునందు సాధుజనంబుల కుపకారంబుఁ జేయుస్వభావంబుగల శాసన వేగవంతు లను నిద్దఱుపుత్రులం గనెను కల్కిభగవంతుండు పద్మావతి యనులక్ష్మీదేవియందు లోకప్రసిద్ధులును, మహాబలశాలులును అయిన జయవిజయులను పేళ్ళుగలయిరువురు తనయులం గనెను. ఇట్లు సర్వసంపత్తులు గలిగియుండు విష్ణుయశుండు పుత్రపౌత్రబంధుమంత్రిగణసహితుండై యశ్వమేధయాగంబుఁ జేయఁబూను తండ్రిం జూచి తనయుండగు కల్కి "నాయనా! నేను దిక్పాలుర జయించి విశేషధనంబు నార్జించి నీచే నశ్వమేధయాగంబును జేయించెద. దిగ్విజయంబునకై నే నిపుడే తరలుచున్నాఁడను. నా కాజ్ఞయిమ్ము" అని నమస్కరించి తండ్రిచే ననుజ్ఞాతుండై మిగుల సంతసంబున నిజసైన్యసమూహపరివృతుండై బౌద్ధజనావాసంబుగ, వైశాల్యము గలదిగ, వేదధర్మబహిష్కృతంబుగ, పితృదేవార్చనావిహీనంబుగ, పరలోకజ్ఞానరహితంబుగ, దేహమే యాత్మయని వాదించునాస్తికజనపరివృతంబుగ, జాతికులశూన్యంబుగ, పానభోజనాదులయందుమాత్రమే యాసక్తిగల జనములోన

ష్వర్ణంబుగ నుండు కీకటంబను నామంబుచే వెలయుబౌద్ధపురం బునకు తొలుతం బోయె. అచట జినుం డను బౌద్ధజనాధిపతి కల్కిమూర్తి జయార్థంబై తనపట్టణంబునకు వచ్చుచున్నాఁడను వర్తమానంబును గ్రహించి అనేకాక్షౌహిణీసైన్యపరివారసహితుండై యుద్ధార్థంబు పట్టణబహిఃప్రదేశంబునకుం జేరె. అపుడాయుద్ధభూమి స్వర్ణాది భూషణభూషితంబును, అస్త్రశస్త్రాదులను ధరించినదియును, ధ్వజపటంగాబిషంబునై యుండు నపరిమితరథగజతురగపదాతులచేతను అసంఖ్యేయరథికజననివహంబుచేతను భయంకరాకారంబుగ నుండె.

ఇది ద్వితీయాంశమునందు షష్ఠాధ్యాయము.

సప్తమాధ్యాయము.

కల్కి బౌద్ధుని జయించుట.

తదనంతరము సింహము కరిణీయూథంబును తఱుము చందంబున జయశీలుండగు కల్కిభగవంతుఁడు యుద్ధంబునకు సన్నద్ధంబుగనుండు జినసైన్యంబును పరువిడం జేసెను. అనంగ రంగంబున సురతయుద్ధంబుచే శ్రాంతిఁ జెందినదియును, రక్త బిందుచిహ్నపరిధానంబు గలదియును, ప్రకాశజఘనకటిప్రదేశము కలదియును, వికీర్ణపతితకేశజాలంబు కలదియును, దీనస్వరముతోఁ గూడినదియునై యుండు తరుణీమణిచందంబున యుద్ధంబున కల్కిప్రహారపరిశ్రాంతంబుగ, రుధిరార్ద్రసర్వగాత్రంబు కలదిగ నుండుజినసేనాయునతిని జూచి "ఓబౌద్ధరాజా! పరువిడకుము మరలవచ్చి నాతో యుద్ధము చేయుము నీపరాక్రమమును నాయొద్దఁజూపు" మని పలుకుకల్కిమాటల బౌద్ధుం డాల

కించి యశ్వాగ్రహంబున వృషభంబుపై నెక్కి ఖడ్గచర్మాది నానావిధాయుధముల ధరించి కల్కిపురుషునితో ననిమిషులు సయితము నచ్చెరువుఁజెందు ఘోరయుద్ధంబుఁ జేసి శూలముచేఁ గల్కివారువంబును, బాణంబుచే కల్కిమూర్తిని ప్రహరించి మూర్ఛింపఁజేసి భూమిం బడియుండు కల్కిమూర్తిని మూఁపునం దిడుకొని పోవ గమకించి యెత్తుటకు గొఱనడినశక్తికలవాఁడై యతనిని విశ్వంభరాధిపుం డని యెఱింగి కవచాదిసాధనంబులను నిజబాణంబుచేఁ ద్రుంప యత్నింపుడు విశాఖయూపధరాధిపుఁడు గదాఘాతంబున జినుని మర్దించి యావలికిఁ దొలంగునటులు చేసి మూర్ఛం జెందియుండు కల్కిమూర్తి నతిసుకరంబున మూఁపునం దిడుకొని రథంబుమీఁదికిం గొంపోయె. క్షణకాలంబునకు పిమ్మట కల్కి మూర్ఛం దేరి రథంబునుండి లేచి మరల యుద్ధంబునకు జినునిసమీపంబుఁ జేరెను. బలిష్ఠంబగు కల్కియశ్వము శూలప్రహారజనితోపద్రవంబులను సరకుచేయక బౌద్ధజనసేనామధ్యంబునం బ్రవేశించి ప్లుతముచే కొందఱిని, భ్రమణముచే మఱికొందఱిని, పాదఘట్టనముచే కొందఱిని, దంతఘాతముచే కొందఱిని, కేసరప్రహారముచే కొందఱిని ఇట్లు పెక్కుభంగుల బౌద్ధసేనాజనంబుల నలయిక నొందించెను. దానినిశ్వాసవాతవేగంబుచే ఆకసంబునకెగిరి గజాశ్వరథసేనాగణములు బహుదూరంబున కానల పడెను. గర్గి యనువాఁడు ఆఱువేల బౌద్ధులను, భర్గి పదివేలబౌద్ధులను, విశాలుఁడిరువది యయిదువేలబౌద్ధజనంబులను యుద్ధభూమిం జంపిరి. కల్కిమూర్తియగ్రజుండగు కవి యనువాఁడు నిజపుత్రులం గూడి యిరువదివేలజైనులను యమపట్టణంబునకుఁ బంప ప్రాజ్ఞుండు పదిలక్షలజనంబులను, సుమంతుఁ డయిదులక్షల

జనంబులను హతముసేసిరి. అపుడు కల్కి హీనబలుండగు జినునిం
జూచి నవ్వి "వివేకశూన్యుండ వగు బౌద్ధరాజా! నాకట్టెదుట
సాహసంబున నిలువుము ; సర్వభూతంబులకు శుభాశుభంబుల
నిచ్చు దైవంబుగ నన్ను తెలంపుము. నా బాణవర్షంబుచే చీల్పఁ
బడిన శరీరము కలవాఁడవై శీఘ్రకాలములో మరణంబు నొం
దఁబోవు నీవు, అంతకుముందట నీబంధుజనంబుల ముఖావలో
కంబుఁ జేయు" మని చెప్పెను. ఇట్లు వచించు కల్కిమాటలను
జైనుండు విని నవ్వుచు "కల్కీ! మాశాస్త్రంబున దైవము
అదృశ్యం బని చెప్పఁబడినది. అట్టిదేవుండు నన్ను మారణముఁ
జేయుపక్షంబున నాకిష్టంబే. బుద్ధులగు మేము కంటి కగ
పడునదిమాత్రము ప్రమాణ మని చెప్పుట నంగీకరింతుమే కాని
కంటి కగపడనిదేవుఁ డున్నాఁ డని చెప్పుట మే మొప్పునది
కాదు. నీవు నిక్కముగ దేవుఁడ వైనయెడల నీయెదుటనుండు
నన్నుఁ గొట్టుము చూతము. మఱియు నీవు నన్నుఁ జూచి పరి
హాసముగాఁ జెప్పినపలుకు లన్నియు నీయొద్దనే కట్టిపెట్టి యుద్ధ
సన్నద్ధుండవై నాయెదుట నిలువుము." అనిచెప్పి యత్యాగ్ర
హంబున బాణజాలంబుచే కల్కిమేనిని నొప్పించెను. కల్కిపు
రుషుండు నా బాణజాలంబులను సూర్యుఁడు మంచును నాశముఁ
జేయుచందంబున పోఁగొట్టెను. మరల నాజినుండు కల్కిమూ
ర్తిపైనఁ బ్రయోగించిన బ్రహ్మవాయవ్యాగ్నేయ పర్జన్యాస్త్రజా
లంబులు చవుటిభూమియందు చల్లినవిత్తనములమాడ్కిని, వేద
విహీనబ్రాహ్మణుని కిచ్చినదానముభంగిని, బ్రహ్మద్వేషిచేఁ జేయం
బడు విష్ణుభక్తిచందంబునను నిష్ఫలంబులాయె. పదంపడి
కల్కిమూర్తి వృషభారూఢుఁడగు జినునిపైకి దుమికి కేశం
బులం బట్టి నేలకుం ద్రోసి కుక్కుటంబులవలె మెండగుకోపం

బున నొకరి నొకరు క్రిందికిఁ ద్రోయుచు నతిఘోరంబగు యుద్ధం
బు సేసిరి. సురలు నిరువురు లేచి పరస్పరము హస్తకేశంబుల
నత్యాగ్రహంబునం బట్టుకొని చాణూరకృష్ణులవలె నిరాయు
ధులై బాహువులతో యుద్ధంబు సేసిరి. అపుడు బలిష్ఠుండగు
కల్కి మదపుటేనుఁగు తాటిచెట్టును క్రిందికిఁ ద్రోయుచాడ్పున
పాదఘట్టనంబున జినుని క్రిందికిం ద్రోసి యమసదననివాసునిగఁ
జేసెను. అట్టియెడ బౌద్ధులు జినునిమరణంబుం జూచి అయ్యా
యో అని కూఁతలు వెట్టిరి. కల్కి సేనాసమూహంబు మిగుల
సంతోషంబును జెందె. జినుండు పడుటయు వానితమ్ముండగు
శుద్ధోదనుండు చూచి మిగుల నాగ్రహంబున పాదచారియై గొ
ప్పగదాయుద్ధముచే కల్కినిం జంపు ప్రయత్నంబున గదాపాణి
యై యతివేగంబుగ వచ్చె. కల్కిభ్రాత యగు కవి శుద్ధోదనుని
బాణవర్షంబుచే నొప్పించి సింహము గజంబు నడ్డగించువిధం
బున నడ్డగించి తాను గదాధరుండై వాని యెదుటం బోయి
మదపుటేనుఁగు మఱియొకమత్తగజంబుతో దంతములచే పోరు
మాడ్కి నిరువు రత్యుగ్రమైన గదాయుద్ధంబునుం జేసిరి. కవి
యనువాఁడు పెద్దది యగు తనగదచే శుద్ధోదనగదను వానిచే
యినుండి వదలునట్లు చేసి సింహనాదంబుఁ జేయుచు వాని
యెద నాటంజేసె శుద్ధోదనుండు కవిగదాఘాతంబుచేఁ గొంత
వడి మూర్ఛం జెంది మఱికొంతసేపటికి మూర్ఛఁ దేరి తనగదచే
కవియెదను నొప్పించె. శుద్ధోదనునిచేఁ జక్కఁగ ప్రహారముఁ
జేయఁబడిన కవి భూమియందుఁ బడక యే దారువుభంగి స్తబ్ధత
నొందియుండె శుద్ధోదనుండు పెక్కురథంబులతోడ నుండు కవి
ని మహాబలపరాక్రమశాలి యగునటులును, తన కజేయుం డని
యును దలఁచి దర్శనమాత్రంబున దేవాసురమనుజపశుపక్షి

జాలంబుల చిత్రలిఖితప్రతిమలవలె నిస్సారంబుగఁ జేయు ప్రభావ
ముగల మాయాదేవి యనునిజమాతను రప్పించెను. శుద్ధోద
నాదిబౌద్ధజనంబులు పెక్కు మ్లేచ్ఛసేనాగణపరివృతులై మా
యాదేవిని ముందిడుకొని కల్కిసేన నెదుర్కొనిరి. సింహధ్వజ
ప్రకాశమాన రథగజాదిపరివృతంబును, సర్వాస్త్రశస్త్రజాలంబు
ల కుత్పత్తిస్థానంబును, షడ్వర్గంబుతోఁ గూడినదియును రజ
స్సత్త్వాదిత్రిగుణస్వరూపయు అయిన మాయాదేవిని కల్కిసై
న్యంబు వీక్షించి బలశూన్యులై చిత్రితప్రతిమాభంగి నిర్జీవులై
భూమిం బడిరి. ఇట్లు మాయాదేవిచే నిశ్చేష్టితులుగఁ జేయఁ
బడిన నిజభ్రాతృబంధుసుహృజ్జన సైన్యసమూహంబును కల్కి
భగవంతుండు చూచి మాయాదేవి కెదుట తా నతిధైర్యం
బున నిల్చెను. అపుడు మాయాదేవి తనభర్తయు, విష్ణుస్వరూ
పుఁడు నగు కల్కిమూర్తిని దర్శించి వారితనువున నైక్యంబుఁ
జెందె. బౌద్ధజనంబులు తమమాతయగు మాయాదేవిం గానక
శోకాకులితహృదయులై బలపౌరుషంబులం దూలి మనమాత
యెచటికిఁ బోయె నని యొకరి నొకరడుగుచు నెలుంగెత్తి
యేడ్చిరి. అట్టిసమయంబునఁ గల్కి తనకటాక్షవీక్షణామృతం
బుచే మృతులైన నిజసైన్యంబుల సజీవులం జేసి వారి నెప్పటి
యట్లు బలపరాక్రమశాలులం జేసి వాఁడి యగుతనకరవాలం
బుచే మ్లేచ్ఛసైన్యంబుల హతంబు సేయుట కుద్యమించె. యుద్ధ
సన్నద్ధుండై యుత్తమాశ్వంబుపై నెక్కి శరశరాసనతూణీర
ధరుండై కవచగోధాంగుళిత్రాణవిరాజమానుండై కిరీటకోటి
ఖచితమాణిక్యరాజివిలసితుండై కామినీజననయనానంద సం
దోహసంధాయకలావణ్యభరితశరీరుండై శత్రునివహభీషణనిరీ
క్షణుండై నిజభక్తజన చిత్తాహ్లాదకరస్వరూపుండై ప్రకాశిం

చుకల్కిమూర్తిని జూచి ధర్మగర్వాకబౌద్ధులు భయంబున వణఁకుచుండిరి. దేవతాసమూహంబు చూచి సంతసించిరి.

ఇది ద్వితీయాంశమునందు సప్తమాధ్యాయము.

శ్రీరస్తు.

కల్కిపురాణము.

వచనకావ్యము.

తృతీయాంశమునందు ప్రథమాధ్యాయము.

—కల్కి మ్లేచ్ఛవధ సేయుట.—

కల్కిపురుషుం డనంతరము కరిణీయూథమధ్యంబునం బ్రవేశించుసింగంబుకరణి మ్లేచ్ఛసేనం జొచ్చి అందుఁ గొందఱిని భీషణంబగు కరవాలంబుచేతను, మఱికొందఱిని బాణజాలంబుచేతను యమధర్మరాజున కంతేవాసులుగఁ జేసె. విశాఖయూపాదు లనేక మ్లేచ్ఛులం జంపిరి. కపోతరోమ కాకాక్షాది బౌద్ధులు కల్కిమూర్తిసైన్యంబుతో నతి ఘోరంబును, సర్వప్రాణుల కతి భయంకరంబును, భూతప్రేతాది క్షుద్రదేవతాచిత్తాహ్లాదకరంబు నైనయుద్ధము సేసిరి. అత్తఱి యుద్ధభూమి గదాఖడ్గాద్యాయుధంబులచే ఛేదింపంబడిన తురంగాదిపదాతులగాత్రంబులనుండి వెడలు రుధిరధారాపరిపూర్ణంబై గొప్పరక్తనది యచటం బ్రవహించె. ఆనదియందు మృతకళేబరకేశంబులు శైవాలంబులవలెను, మృతాశ్వంబులు మొసళ్ళవలెను, ధనుర్బాణంబులు తరంగంబులవలెను, గజంబు లిరుపార్శ్వంబుల యుండలి గట్టులవలెను, మృత మనుజశిరంబులు తాఁబేళ్ళచా

ద్పునను, భిన్నంబైన రథంబు లోడలచందంబునను, హస్తం
బులు మీనంబులవలెను తేలుచుండెను. మఱియు గజాశ్వరథ
ఖరోష్ట్రంబు లుభయపార్శ్వబాణంబులచే భిన్నంబులై నేలం
బడి మృతిఁజెందె. మ్లేచ్ఛులు కల్కిసేనానిశితబాణగణంబులచే
ఖండితతనులై కొందఱు పరువులిడిరి. కొందఱు తాపముచే గా
సిఁజెందినశరీరంబులతోడ తాపనివారణార్థంబుగ నీటఁగ్రుంకిరి.

—॥ మ్లేచ్ఛస్త్రీలు యుద్ధము చేయుట. ॥—

ఇట్లు కల్కిసేనాప్రహారంబుల కోర్వంజాలక మ్లేచ్ఛ
సైన్యంబు పలాయనంబయ్యె. అత్తఱిరూపవతులును, యౌవన
గర్వ మదాంధలును, కడు బల్లిదలును, పతివ్రతాశిరోమణు
లును, నానాభరణభూషితసర్వాంగంబులు గలవారునై యుం
డుమ్లేచ్ఛవనితలు తమ పతిపుత్రబంధుమిత్రాదులు కల్కిసైన్య
ధనుర్బాణగదా ఖడ్గాద్యాయుధంబులచేఁ గొట్టంబడి మృతిఁ
జెందినది గాంచి యరుణాయమానయనంబులతో నిజ మాన
సుఖదుఃఖాదుల సరకు సేయక కృపాణపాణులై రథగజతురగ
ఖరోష్ట్రవృషభాది వాహనారూఢలై కల్కిసైన్యంబుతో నతి
ఘోరయుద్ధంబు సేయ సమకట్టిరి. అపుడు కల్కిసైన్యం బమా
నుషరూపంబుతోడ యుద్ధంబున కభిముఖులై యుండు మ్లేచ్ఛ
తరుణులం జూచి కల్కిపురుషుని కావృత్తాంతంబు నతిత్వరిత
గతిం జని వక్కాణించిరి. అట్టివర్తమానంబును మహాతేజశ్శాలి
యగుకల్కి యాకర్ణించి రథారూఢుండై నిజపరివారంబుతో
యుద్ధభూమిం జేరి సకలాభరణంబులం దొడిగి రథగజతురగా
రూఢలై సర్వశస్త్రాస్త్రంబుల ధరించి కాసెబిగించి యుద్ధంబు
నకు సిద్ధంబుగ నుండు మ్లేచ్ఛవనితలం జూచి వారి నుద్దేశించి
“ఓవనితలారా! హితంబును, పథ్యంబునై యుండునొండు వచ

నంబు వచించెద. మీయొదను కినుకగదురనీయక యాలకింపుఁడు. అతి కోమలసుందరతనూవిలాసంబులు గల మీవంటి స్త్రీజాతి తోడ పురుషు లెట్లు యుద్ధంబుఁ జేయఁగడంగుదురు? శారద పూర్ణచంద్రబింబసమానంబై కుటిలాలకపంక్తి విరాజితంబై నయనానందజనకంబై యుండు మీముఖంబులం దెవ్వఁడు ధైర్యంబున బాణజాలంబులం బ్రయోగింప యత్నించును? సద్యోవికసితరక్తారవిందసదృశంబును, దీర్ఘాపాంగోజ్జ్వలంబును, భ్రమరంబుభాతి చంచలతారకాయుక్తంబునై యుండు మీనేత్రంబులయం దెవ్వఁడస్త్రసంధానంబుఁ జేయ నుద్యోగించు? ఆదిశేషునిపగిది మిక్కిలి తెల్లని రంగుగల ప్రశస్తముక్తాహారంబుచే నలంకరింపంబడి కందర్పదర్పాతిరేకంబును బోఁగొట్టునదియై, ఈశ్వరసదృశంబుగనుండు మీ స్తనమధ్యంబులయం దెవఁడు బాణంబులచే కొట్టుటకు సాహసించును? నిష్కళంక పూర్ణచంద్ర సదృశముగనుండు ముఖమండలము, అతిమనోహర కఠిన స్తనయుగభారముచే మిగుల కృశించి యుండుకటిప్రదేశము, అతిసూక్ష్మముగ నుండు రోమరాజి, నేత్రానందదాయిగ నుండునయనయుగళము, పులినమువలె రమ్యముగ నుండు జఘనము, వీనిచే ప్రకాశించుచు శిరీషకుసుమమువలె నతిమృదువుగ నుండు రమణీమణుల శరీరమునం దెవ్వఁడు దయాశూన్యచిత్తుండై బాణంబుఁ బ్రయోగింప నిచ్ఛగించు" నని చెప్పిన కల్కిమూర్తివచనంబుల నాకర్ణించి యతిసుందరశరీరముగల మ్లేచ్ఛయువతులు మందహాస సుందరవదనారవిందలై కల్కింగాంచి "భక్తవత్సలా మీరు మాభర్తలఁ జంపిన కతంబున మే మందఱము వైధవ్యమును జెంది దుఃఖించుచున్నారము. మీసైన్యంబులను వధించుటకు మేము ప్రయోగించినశస్త్రాస్త్ర

జాలంబులు శత్రువులను జంపక మాహస్తతలంబునకు వచ్చి చేర" నని వాకొనిరి.

—॥ అస్త్రదేవతలు మ్లేచ్ఛస్త్రీలకు తత్త్వోపదేశము సేయుట ॥—

పదంపడి ఖడ్గశూలధనుర్బాణాద్యస్త్రంబులు నిజస్వరూపంబుల నొంది స్వర్ణరత్నాద్యాభరణభూషితలైన యామ్లేచ్ఛస్త్రీలం జూచి "భామామణులారా! మేమే కల్కిమూర్తి నాశ్రయించి మీపతిపుత్రాదులను హింసించుచున్నారము. ఆ కల్కిమూర్తి సాక్షాత్పరమాత్మ యని యెఱుంగుఁడు. మఱియు జగతీతలంబునం దెల్లవస్తుచయంబులకు నామరూపాదిభేదంబు లెవనిచే నిర్మింపఁబడినవో రూపరసగంధాది విషయములు, పృథివ్యాదిపంచమహాభూతంబు లెవ్వని నాశ్రయించి తమవ్యాపారంబులను జేయుచున్నవో కాలస్వభావసంస్కారరూపమైన మూలప్రకృతి యెవ్వనిసంకల్పంబుచే మహదహంకారాదులను, అఖిలాంశంబులను సృజియించుచున్నదో యెవనిమాయచే సృష్టిస్థితిలయరూపమైన జగద్వ్యాపారము ప్రవర్తించుచున్నదో యెవఁడు సమస్తభూతసృష్టి కాదిమధ్యాంత కారణుఁడై యుండునో అట్టిపరమాత్ముం డిట్టికల్కిరూపంబును ధరించి యిచ్చటికి వచ్చియున్నవాఁ డని తెలియుఁడు. వారియనుమతంబున మే మిచట సంచరించుచున్నారము. 'వీఁడు నాభర్త, యిది నా పత్ని: వీఁడు నా కాప్తబంధుఁడు' అని జనులు మాయామోహంబును జెందుదురు ఇది యంతయు స్వప్నతుల్యంబై యింద్రజాలంబుచందంబున నుండును మాయామోహబద్ధులైనజను లిట్టి భ్రాంతిం జెందుదురుగాని కల్కిపురుషుని జక్కఁగ సేవించినవారి కిట్టిమోహంబు గలుగనేరదు కాలం బెక్కడిది? మృత్యు వెక్కడిది? యముఁ డనువాఁ డెవఁడు? దేవత లెవరు? కల్కిమూర్తి నిజ

మాయచే లోకుల నిత్తెఱంగున మోహింపఁజేసి భ్రమింపం జేయుచుండు మేము శస్త్రదేవతలము గాము మేము దండింప వలసినవా రెవరును లేరు. ఆయుధము, కొట్టువాఁడు, కొట్టఁబడు వాఁడు, ఇవి యెల్ల విష్ణుమాయచేఁ జేయంబడు నవివేక మని తెలియుఁడు" ఇట్లు చెప్పిన యస్త్రదేవతలహితవాక్యంబులను మ్లేచ్ఛస్త్రీ లెంతయు సంతసంబున నాలించి శరణాగతవత్స లుండగు కల్కిమూర్తిశరణంబుఁ జొచ్చిరి. కల్కి యిట్లు శరణంబు నొందిన మ్లేచ్ఛతరుణులం జూచి హెచ్చగు సంతోషాతిరేకంబున నవ్వమ నాకలువకంటులకు సర్వపాపప్రణాశకమైన కర్మయోగ, జ్ఞానయోగ, భక్తియోగాదితత్త్వంబుల నుపదేశించె. మ్లేచ్ఛయువతులు కల్కిబోధితజ్ఞానమార్గంబుల నత్యాదరంబున గ్రహించి మోహాజ్ఞానంబులను వదలి జితేంద్రియలై యోగులకుసయితము దుర్లభంబగు మోక్షమును జెందిరి. ఇట్లు కల్కిమూర్తి బౌద్ధమ్లేచ్ఛాదులతోడ ఘోరయుద్ధంబు నెరపి వారిని హతముసేసి వారికి మోక్షంబు నిచ్చెను. సమస్త శోకమోహసంసారసంతాపంబులను బోకడచువాఁడును, మంగళగుణాలంకారుఁడును, నాతౌదిందిరాధవుండును అగు భగవంతునియందు భక్తి నాపాదింపఁజేయునది యైన యీకల్కికృత బౌద్ధమ్లేచ్ఛవధచరిత్రం బెవ్వఁ డనవరతంబు పఠించునో లేక వీనులవిందుగ నాకర్ణించునో అట్టివాఁడు పునర్జనన మరణరహితం బగు మోక్షంబును జెందును.

ఇది తృతీయాంశమునందు ప్రథమాధ్యాయము

ద్వితీయాధ్యాయము.

కల్కిమూర్తి కుథోదర్యాదిరాక్షసులం జంపుట.

అనంతర మతి తేజోవంతుఁడును, సకలధర్మరక్షకుండు నైన కల్కిదేవుండు దుష్టబౌద్ధజనంబుల నుక్కడంచి నిజసైన్యంబులతో బౌద్ధజనంబు లునికిపట్టగు కీకటపురంబును జయించి యందుఁ గల ధనకనకవస్తువుల సంగ్రహించుకొని నిజపురంబునకు వచ్చుటకై యుద్యోగించి బయలువెడలి దారిమధ్యంబునం గల చక్రతీర్థంబున లోకపాలతుల్యులైన భ్రాతృబంధుజనులతోడ విధిప్రకారంబు స్నానంబుఁ జేసి యత్తీరంబున దీనహృదయంబులతోడ "ఆపద్బాంధవా! అనాథరక్షకా! మహాప్రభూ! భీతిఁ జెందిన మమ్ముం గాపాడవలయు" నని ప్రార్థించు వల్కలజటాధారులగు వాలఖిల్యాది ఋషిశ్రేష్ఠులం బొడగాంచి వినయముచే వారికి నమస్కరించి 'ఋషిసత్తములారా! మీరెచట నుండి యిట కేతెంచితిరి? మీ రిట్లు భయంబుఁ జెందుటకుఁ గతం బేమి? మీ కిట్టిభీతిని గలుగఁ జేయువాఁడు పురందరుఁడుగ నుండినను వానిశిరంబును నాఖడ్గంబున కెఱ గావించెద' నని ధైర్యంబున నభయంబొసంగె. ఋషు లిట్టి కల్కిపల్కులవిని సంతుష్టాంతరంగులై "విష్ణుయశోగర్భముక్తాఫలా! కుంభకర్ణసుతుండైన నికుంభునికి కుథోదరి యను ప్రసిద్ధనామముగల యొక్కతనూజ కలదు. అబ్బాల యత్యున్నతాకారంబుచే ఆకసంబున కర్ధమునకు తాఁకుశరీరంబును బెంచి కాలకంజుఁడను దనుజుని పరిణయంబొడి వానికి వికంజుఁడను నొక్క తనూజునిం గనెను. అయ్యింతి హిమాచలంబున తలయుంచి నిషధాచలంబున పాదంబుల నిడి పరుండి నిజపుత్రునికి తనచంటిపాలను కుడిపించుచున్నది. మేము దానినిశ్వాసవాతంబుచేఁ గ్రిందికిఁ ద్రో

యంబడి దైవాధీనంబుచే నీసన్నిధిం బడితిమి. అనాథరక్షకా! ఋషులమగు మాకు నీరాక్షసివలనఁ గలిగినభయంబు నుడుగం జేయవలయు" నని ప్రార్థించిరి. ఋషిప్రార్థనలను కల్కి యాకర్ణించి నిజసైన్యంబులతోడ మంచుకొండచేరువకుం బోయి యచట చంద్రశంఖములపగిది నతిధవళతను జెంది నురుగుసహితమై యతివేగంబునఁ బ్రవహించు క్షీరనదినిం జూచి నిజసైన్యంబు లన్నియు స్తబ్ధతం జెందె రథాదిసైన్యపరివారంబులతోఁ గూడిన కల్కిమూర్తి సకలతత్వవిశారదుండుగ నుండినను మునిశ్రేష్ఠులను గాంచి "ఋషిపుంగవులారా! ఈ నదిపేరేమి? ఎచ్చటనుండి ప్రవహించుచున్నది? ఏకారణంబుచే నీనదిలో పాలు నీళ్లవలె పాఱుచున్నవి?" అని యడుగుడు ఋషులు "హిమవత్పర్వతంబున పరుండి తనశిశువునకు స్తన్యపానము చేయించుచుండు కుథోదరి యను రాక్షసస్త్రీ యొక్క మఱియొకకుచంబునుండి ప్రవహించుపాలు నదీరూపమును జెంది పాఱుచున్న"వని చెప్పిరి. కల్కి యిట్టిచిత్రమైన ఋషులవాక్యంబుల నాఁకొని "ఆహా యిది యేటిచిత్రము! వికంజుంపెను నిజశిశువునకొకచంటిపాల నొసఁగుచు మఱియొక్క స్తనంబునందుండి స్రవించుక్షీర మింత గొప్పప్రవాహముగ పాఱుచున్నదిగదా! ఆరాక్షసభామినిగాత్రం బెంతగొప్పదిగ నుండునో? దానిబల మెట్టిదో?" అని యాశ్చర్యంబును జెంది కల్కిమూర్తి సైన్యంబుతోడ నతివేగముగ మునులుచెప్పిన మార్గంబు ననుసరింపుచు కుథోదరి యుండు స్థలంబునకుఁ బోయె. అచట కుథోదరి హిమాలయశిఖరంబునందు గొప్పమేఘమువలె పరుండి శిశువునకు స్తన్యపానంబును జేయించుచుండెను. మఱియు నాకుథోదరినిశ్వాసవాతముచే మదమత్తవసద్వి

వంబులు తృణంబులపగిది బహుదూరంబున కావలఁ ద్రోయం బడె ఆయింతికర్ణరంధ్రంబుల నెడి గొప్పగుహాలయం దనేకదివసంబులనుండి మృగరాజంబులు పుత్రమిత్రులతో వసించుచున్నవి. అవ్వనంబునందలి లేళ్లు వేఁటకాండ్ర భయమున కులికి దాని కేశంబులం దాఁగి పేలవలె సుఖంబున నుండె. ఇట్లు హిమవచ్ఛిఖరంబున భీకరంబగు శరీరాకారంబునం బరుండి చూచువారి కందు మఱియొకపర్వతం బుండునట్లు తోఁపం జేయు భీకరాకారంబునం బరుండియున్న రాక్షసవనితను గల్కి చూచి అత్యంతాశ్చర్యంబు నొంది భీతులుగను, బుద్ధిసామర్థ్యపరాక్రమశౌర్యహీనులుగను నుండు తన సేనాజనంబులం జూచి "మీ రిచట నగ్నిదుర్గంబును గల్పించుకొని యందులో సుఖంబున నుండుఁడు. గజాశ్వరథంబుల నెక్కి యుద్ధంబుఁ జేయు సమర్థులుగను, నిర్భయులుగను, పరాక్రమవంతులుగను నుండు కొంతసైన్యము మాత్ర మాయుధంబుల ధరించి నా వెంట రండు. నేను స్వల్పసైన్యంబుతో రాక్షసి కెదురై ఖడ్గ, శక్తి, పరశ్వథాద్యాయుధంబులచే దాని నుసుమాడెద" నని చెప్పి హీనబలులగు సైన్యంబుల నచట వదలి మహాబలపరాక్రమశాలులగు కొంత సేనను వెంటఁబెట్టుకొని ఆయుధపాణియై రాక్షసికెదుట నిలిచి అతినిశితతీవ్రబాణంబులచే నా కుథోదరిని నొప్పించె. అపు డది బాణప్రహారంబుచే నతికుపితయై లేచి మహాభయంకరముగ గర్జించె. అట్టిగర్జనశబ్దంబు విని యచటనుండు సమస్తజంతువులు, కల్కిసైన్యము భయంబుచే మూర్ఛ నొంది భూమిం బడిరి. భయంకరంబగు నారాక్షసినిశ్వాసవేగంబుచే రథగజాదులను కల్కిసహితంబుగ నిజవదనగహ్వరంబులోనికిం బీల్చె. వెలుగుబంటినిశ్వాసవాతవేగంబునం బీల్పంబడు పిపీలికాదులచాడ్పున

సేనాగణంబు కల్కిసహితంబుగ కుథోదరీనిశ్వాసవేగంబున నుదరంబులోని కీడ్వంబడిరి. దీనిం జూచి దేవగంధర్వు లాహాకారంబు సేసిరి. కల్కి కొదవినయాపదకై కొందఱు ఋషులు కుథోదరిని శపించిరి. మఱికొందఱు కల్కిక్షేమార్థము మంత్రోచ్చారణము సేసిరి. ఇంకఁ గొందఱు దుఃఖపీడితులై మోహిం బడిరి. శేషసైన్యంబు చింతాకులమానసు లైరి. రాక్షసు లతికుతూహలంబును జెందిరి అపు డిందీవరలోచనుండగు దానవాంతకుండు ఋషులదీనాలాపంబు లాలించి భయంకరకరవాలంబును కరంబున ధరించి సహస్రాక్షుండు వజ్రాయుధంబున వృత్రాసురునియుదరంబును జీల్చినచందంబున కుథోదరి యుదరంబును ఛేదించికొని శస్త్రాస్త్రపాణులై కుథోదరియుదరంబుననుండు తనసైన్యంబుతోడ వెలికి నేతెంచె. గజాశ్వరథంబు లారాక్షసి యోనిద్వారంబున బయలువెడలె. మఱికొంతసైన్యంబు నాసారంధ్రంబులవలన రక్తముచేఁ దడుపఁబడినశరీరములతో వెలికి వచ్చి ఖడ్గశూలాదులచే నారాక్షసికరచరణంబుల వెవ్వేఱుగ ఛేదించిరి. అపు డారాక్షసి మొండెగు రణంబున భూమిం బడి విగతజీవిత యయ్యె. దానిరావంబుచే పర్వతాదులు చూర్ణంబు లయ్యె. వికంజుం డను శిశువు మృతిఁజెందిన తనతల్లిం జూచి భయము నొందె. ఈరాక్షసకామినీధవుం డగు కాలకంజుండు గజతురగంబులను కంఠంబునకు మాలగా ధరించి సింహంబుల నంగరములవలె వ్రేళ్లయం దిడి యతిక్రూరంబై విషముతోఁ గూడి యుండు సర్పంబును పాగాగాఁ జుట్టికొని కల్కిసేనామధ్యంబునం బ్రవేశించి హతము సేయం బూనె. అపుడు కల్కి తొల్లి తా నస్త్రగురువగు పరశురామునిచేఁ బడసిన బ్రహ్మాస్త్రముచే వానితల దుల్ల సేసె. ఇట్లు రాక్షసిని భర్తృపుత్రుల

తోడ వధించి ఋషులవచనంబులచొప్పున హరిద్వారంబునందలి గంగాతీరంబున దేవతల విరులసోనలచేతను, ఋషులస్తోత్రంబులచేతను మిక్కుటముగఁ బూజ లొంది భ్రాతృబంధుమిత్రసైన్యపరివృతుండై యారాత్రి యచటఁ గడపి మఱునాఁడు వేకువ గంగాస్నానవ్యాజంబున నిజదర్శనాగత ఋషిగణంబులం గాంచి వారిచే సత్కృతు లొంది స్నానాదివిధుల యథాప్రకారంబుగఁ జేసి గంగాతీరస్థపిండారకవనంబున సుఖంబున నుండె.

ఇది ద్వితీయాధ్యాయమునందు తృతీయాంశము.

తృతీయాధ్యాయము.

కల్కిసమీపంబునకు నారదాది ఋషులు వచ్చుట

అనంతరము సర్వధర్మంబులఁ జక్కఁగ నెఱింగినవాఁడగు కల్కిమూర్తి యాఋషిశ్రేష్ఠులను బూజించి సుఖాసీనులం జేసి వారిం జూచి "తాపసోత్తములారా! దినకరసదృశప్రకాశులగు మీర లెచ్చోటనుండి యిచ్చటికి విచ్చేసితిరి? మీరు తీర్థయాత్రావ్యాజంబున భువనత్రయంబులకు మహోపకారంబుఁ జేయు నట్టి నాభాగ్యవశంబున నిచటికి వచ్చితిరి కాఁబోలు! మీకృపాకటాక్ష వీక్షణంబులచేఁ జూడఁబడిన యస్మదాదు లీ లోకంబున నతిపుణ్యశీలురుగను, యశోవంతులుగను నుండుట కేమి యబ్బుర" మనెను. ఇట్టి కల్కివచనంబులను వామదేవ, అత్రి, వసిష్ఠ, గాలవ, భృగు, పరాశర, నారద, అశ్వత్థామ, పరశురామ, కృప, త్రిత, దుర్వాసో, దేవల, కణ్వ, వేదప్రమితి, అంగిరస ఇత్యాదిమహావ్రతనియమంబులుగల మహర్షులు మహా

పరాక్రమశాలులుగ, తపోనిష్ఠాగరిష్ఠులుగ, చంద్రసూర్యకులోత్పన్నులుగ నుండు మరు దేవాపిరాజులను ముందిడుకొని సర్వపాపవినాశకరుండగు కల్కిమూర్తిని జూచి "సకలలోకనాథుండవును, సకలభూతంబుల మనోభావంబుల నెఱింగినవాఁడవునైన ఓస్వామీ! నీవు జయశీలుఁడుగ నుండువుగాత. సృష్టిస్థితిలయాధ్యక్షుండును, పరమాత్మస్వరూపియును, కాలకర్మగుణావానుండును, బ్రహ్మాదిదేవతాగణవందితపాదారవిందుఁడునైన ఓరమాకాంతా! మమ్మును రక్షింపు"మని మహోదధిమధ్యవిరాజమానుండగు విష్ణుమూర్తిని జూచి దేవతాగణంబులు స్తుతించినట్లు స్తుతించిరి. జగత్పతియగు కల్కిమూర్తి మహర్షిస్తోత్రంబు లాకర్ణించి "ఋషిశ్రేష్ఠులారా! మహాబలతపోవంతులుగ మీముంగట నిలిచి యుండువా రెవరు? ఏకారణంబున నిచటి కేతెంచిరి? మీరు గంగాదేవి నేహేతువుచే విశేషంబుగ స్తుతించెద" రని యడిగెను. అపుడు వారిరువురిలో నొకఁడగు మరువను భూకాంతుండు సంతుష్టస్వాంతంబున బద్ధాంజలిపుటుండై కల్కిమూర్తికి తనవంశ పారంపర్యమును జెప్పుట కుపక్రమించెను.

"కల్కిమూర్తీ! సర్వాంతర్యామివై సకలభూతహృదయకమలంబులయందు నెలకొనియుండువాఁడవును, పరమాత్ముండవును అగు నీకుఁ దెలియని దెద్దియు లేదు. అయినను నీయాజ్ఞానుసారంబుగ వచించెద నాలకింపుము పరమాత్మస్వరూపుండవగు నీనాభికమలంబునందుండి తమ్మిచూలి జనించె ఆబ్రహ్మకు మరీచియు, మరీచికి మనువు, మనువున కిక్ష్వాకు, ఇక్ష్వాకునకు యువనాశ్వుఁడను పేరుగల మాంధాత, మాంధాతకు పురుకుత్సుఁడు, పురుకుత్సునికి అనరణ్యుఁడు, అనరణ్యునికి త్రస

దస్యు, త్రసదస్యునికి హర్యశ్వుఁడు, హర్యశ్వునికి త్ర్యరుణుఁడు, త్ర్యరుణునికి త్రిశంకువు, త్రిశంకునికి హరిశ్చంద్రుఁడు, హరిశ్చంద్రునికి హరితుఁడు, హరితునికి భరుకుఁడు, భరుకునికి వృకుఁడు, వృకునికి సగరుఁడు, సగరునికి అసమంజసుఁడు, అసమంజసునికి అంశుమంతుఁడు, అంశుమంతునికి దిలీపుఁడు, దిలీపునికి భగీరథుండను పుత్రుండు జనించె నీపాదారవింద మకరందాయమానంబైన యీగంగాదేవి భగీరథధరాధిపునిచే నీమహీతలంబునకుం దేఁబడియె. ఇక్కారణంబుచే సకలజనకలుషరాశినివారణనిపుణ యగు నీగంగాదేవి భాగీరథి యనునామంబుచే వెలయుచున్నది మా పెద్దలచే గంగాదేవి భూతలంబునకుం దేఁబడిన కారణంబుచే నే నంతగ నా దేవిని స్తోత్రముఁ జేసితిని. భగీరథునికి నాభుఁడు, నాభునికి సింధుద్వీపుఁడు, సింధుద్వీపునికి అయుతాయువు, అయుతాయువునకు ఋతుపర్ణుఁడు, ఋతుపర్ణునికి సుదాసుఁడు, సుదాసునికి సౌదాసుఁడు, సౌదాసుని కశ్మకుఁడు, అశ్మకుని కేశవిడుఁడు, వానికి విశ్వసహుఁడు, విశ్వసహునికి ఖట్వాంగుఁడు, ఖట్వాంగునికి రఘువు, రఘువున కజుఁడు, అజునికి దశరథుఁడు, దశరథునికి నాకుఁ జగత్ప్రభువుగ నుండు విష్ణుమూర్తి రాముండను నామంబుతో పుత్రుండై జనించె." కల్కిమూర్తి యిప్పగిది సూర్యవంశరాజుల వంశపరంపరను జెప్పుచువచ్చిన మరుభూపాలునియొద్ద విష్ణువు దశరథగృహంబునందు రామావతారము చేసిన కథను విని "మరుభూమీశా! నాకు రామచరిత్రంబును వివరంబుగఁ జెప్పు" మని యడిగెను. అట్టి కల్కిమనోభావంబును గ్రహించి మరువు కల్కినిజూచి "కల్కిమూర్తీ! శ్రీరామచరిత్రంబు నామూలాగ్రంబుగఁ జెప్పుటకు వేయివక్త్రంబులుగల యాదిశేషునికి నలవి గాదన నే నెంతటి

వాఁడను! అయినను నీయాజ్ఞను శిరంబున ధరించి పుణ్యాకరంబై పాపసంతాపవిమోచనంబై యుండు శ్రీరామచరిత్రంబును నా శక్త్యనుసారంబుగ వచించెద నాకర్ణింపుము.

మరుభూపాలుండు కల్కిమూర్తికి శ్రీరామచరిత్రమును జెప్పుట. కథ

శ్రీమహావిష్ణువు సకలలోకకంటకులగు రావణాదిదుష్టరాక్షసకులనిగ్రహార్థము బ్రహ్మాదిసురనికరప్రార్థితుండై సూర్యకులజాతుండగు దశరథమహారాజునకు పుత్రుండుగ జనించి స్వాంశసంభూతులై దశరథునికి తనయులై జనించి తనకు తమ్ములై వెలయు లక్ష్మణ భరత శత్రుఘ్నులతోడం గూడి సకలవిద్యాభ్యాసములం జేయుచుండె. అట్టియెడ మహర్షి యగు విశ్వామిత్రుండు నిజయాగరక్షణార్థంబై లక్ష్మణసహితుండుగ రాముని సిద్ధాశ్రమంబునకుం బంపవలయు నని దశరథుని బ్రార్థించెను. అంతట వసిష్ఠానుమతంబున రామలక్ష్మణులను నాఋషివెంటం బంప నరంపడి రామచంద్రుండు లక్ష్మణసహితుండై విశ్వామిత్రునివెన్నంటి నడుచుచు మార్గమధ్యంబున నాఋషిశ్రేష్ఠునిచే "బలాతిబల" లను మహావిద్యల నుపదేశముం బొంది యాఋషియాజ్ఞచే తాటకాదిదుష్టరాక్షసులను దునిమి సిద్ధాశ్రమంబున కరిగి విశ్వామిత్రునియజ్ఞము నిర్విఘ్నముగఁ బరిసమాప్తి నొందించి యచటనుండి విశ్వామిత్రాదిమహర్షులతోడ మిథిలానగరంబునకుం బోయి నిఖిలజనమోహనలావణ్యాతిశయసంపన్నులైన రామలక్ష్మణులు జనకమహారాజగృహంబునందుండు హరునివిల్లును జూచుట కిచ్ఛయించిరి. విశ్వామిత్రుండు రామలక్ష్మణులమనోవాంఛితంబును దెలిసికొని యావింటిని రామలక్ష్మణులకుం జూపుమని జనకుని కాజ్ఞాపించె. జనకుం డనన్యశపరాక్రమవిక్రముండై యుండు దశరథసూ

నునిం గాంచి ప్రహృష్టమానసుండై యియ్యర్భకుండు భూసుత యగు సీత కుచితభర్తగాఁ జూపట్టెడిని. కన్యాశుల్క మగు నీశ్వరధనుర్భంగముఁ జేయుట కితనికి సమర్థత కలదో లేదో యని చింతించి ధనుస్సును దెప్పించి రామునకుం జూపె. సకలావనీశ్వరులచే పూజితుండై, జనకపుత్రిక యగు భూమిజాతమనోహరాపాంగావలోకనంబుచేఁ బూజింపఁబడిన పాదకమలంబులుగల రామచంద్రుం డతికఠినాకారంబై యత్యున్నతంబుగ నుండు పరమేశ్వరునిచాపంబును వికసితకమలకుసుమసుకుమార నిజహస్తతలంబున ధరించి గుణమునారోపించెను. అట్టిసమయంబున "జయ రఘూద్వహా!" అని మెండగు ఘోషంబున చాపంబు మధ్యంబున ఫెళఫెళ యను ధ్వనితోడ విఱుగుటను గాంచి జనకచక్రవర్తి నిజమనోరథం బీడేరెనని తలఁచి సంతసించి తోడనే దశరథుని కుటుంబామాత్యపురోహిత బంధుజాలసహితంబుగ రావించి రామునికి సీతను, లక్ష్మణున కూర్మిళను, భరతశత్రుఘ్నులకు తనకనిష్ఠుండగు కుశధ్వజుసుతలైన మాండవీశ్రుతకీర్తులను దివ్యాలంకారసహితలుగ కన్యాదానము చేసి యథావిధి విశ్వామిత్రవసిష్ఠాదిసమక్షంబున పరిణయమంగళము పూర్తిచేసి సంతోషభరితస్వాంతుండై కృతార్థత నొందెను.

అనంతరము దశరథుండు కృతవివాహు లయిన నిజతనూజుల, స్నుషామాత్యపురోహితబంధుజనంబుల వెంటఁబెట్టుకొని అయోధ్యాపట్టణంబునకుం బోవ నిశ్చయించి దారిని వచ్చుచుండ మహేశ్వరధనుర్భంజనసంజాతకోపభీషణుండై పరశురాముండు దశరథరాము నెదుర్కొని "ఓరామచంద్ర! హరునిచాపంబును నీ వతిసుకరంబున భంగంబు గావించిన దండిమగండ వని జనంబులచే వినవయ్యె. ఇదిగో చూడుము. నాచేత

నుండు నీవైష్ణవధనుస్సును నారోపణఁ జేయుము. నీసామర్థ్యాతి
శయంబులం జూతము.'' అని నయనంబుల విస్ఫులింగంబులు
వెడల మెండగు కోపభరంబున వక్కాణించుపరశురామునిభీష
ణవాక్యంబుల నాకర్ణించి దశరథాత్మజుండు కినుక నెసగదుర
చేతినుండి వానిశక్తిసహితంబుగ నావింటిని కరంబున గ్రహించి
గుణారోపణంబు సేయునెడ పరశురాముండు శ్రీరాముని సాక్షా
ద్విష్ణుమూర్తిగా నెఱింగి స్తవముఁ జేసెను. అపుడు రామచం
ద్రుండు పరశురాముని సాదరదృష్టిం జూచి "ఓపరశురామ!
అమోఘంబగు నాబాణమున కేమిగతి చెప్పుచున్నాఁడ" వని
వచింపుడు పరశురాముండు గడగడవడఁకి రాము నుద్దేశించి
కరంబులు జోడించి "దశరథనందనా! చిరకాలతపోబలసంపా
దితమైన నాస్వర్గగతియందు నీబాణంబును బ్రయోగింపు'' మ
నెను. రాముండు పరశురామానుమతంబున వానిస్వర్గగతిని తన
బాణముచేఁ గొట్టి పరశురామదర్శనభీతులైన దశరథాదిపృథ్వీ
కాంతులభయంబును బోఁగొట్టి సకలకలుముల కాకరంబై
వెలయు నయోధ్యాపురవరంబునకుం బోయెను.

ఇట్లు లయోధ్యానగరంబున దశరథుండు నిజభార్యాపు
త్రామాత్యసహితుండై కొంతకాలము సుఖంబున నుండెను.
పదంపడి దశరథుండు దివ్యగుణాభిరాముండైన రామచంద్రునకు
రాజ్యపట్టాభిషేకంబుఁ జేయవలయు నని నిశ్చయించి పట్టాభి
షేకోచితపదార్థంబుల నాయత్తపఱుపవలయు నని మంత్రివరుల
కుం జెప్ప నప్పుడు కేకయరాజపుత్రి యగు కైకేయి మంథ
రాకలహవచనమథితచిత్తయై తనభర్త యగు దశరథునిసమీ
పంబున కేతెంచి యతనితో నిట్లనియె. "మహారాజా! తొల్లి
దేవాసురసంగరంబున సంతోషచిత్తుండ వైన నీవు నాకు స్వ

యముగ వరద్వయంబుం బ్రసాదించి యున్నవాఁడవుగదా! ఆవ
రద్వయంబు నాకిపు డిచ్చి సత్యవాక్యపరిపాలకుండ వగుము.
ఆ రెండువరంబులలో నొకదానియందు రాముని పదునాలుగు
వత్సరంబు లడవికిఁ బంపుము. మఱియొకవరంబునందు రాము
నికి నిశ్చయించిన ముహూర్తంబున నా సుతుండగు భరతుని
రాజ్యంబున కభిషిక్తునిం జేయుము" అని పెక్కుభంగుల ని
ర్బంధముఁ జేసెను.

అట్టిసమయంబున దశరథుండు మిన్ను విఱిగి తలం బడిన
ట్లులికిపడి కొంతవడికి తెలివినొంది సత్యవాక్యపాశబద్ధుండై
చేయునది లేక శోకాంబుధి నిమగ్నుండై రాముని రావించి
కైకేయివాక్యంబున కాననంబునకుం బోవలయు నని చెప్పెను.
అపుడు రాముండు పితృవాక్యంబును శిరసావహించి తాను
రావలదని నిర్బంధముఁ జేసినను "మేమవశ్యము వత్తుము. మిమ్ము
ను వదలి క్షణకాలంబునైతము జీవింపము. దయచేసి మమ్ములఁ
గూడ వనంబునకుఁ గొనిపోవలయు"నని ప్రార్థించు సీతాలక్ష్మ
ణులతో నారచీరలం గట్టి బంధుమిత్రాదులను త్యజించి య
యోధ్యాపురంబును వదలి పోవుట కుద్యోగించునవసరంబున
పురజనులు రాముం జేరి "హా! సత్యసత్యవ్రతా! మాతప్పుల
సైరించి కనికరించి మమ్ముఁ బాలించువా రెవ్వ"రనువారును,
"ఓదీనమందారా! నిన్నుఁ గన్నదినంబు సుదినంబు. నీవున్నచో
టే స్వర్గంబు కాన నో మానవనాయకా! నీవెంట నేతెంచి
నీతోడ కష్టసుఖంబు లనుభవించెద"రనువారును, ఇట్లు తన
తోడ వచ్చుట కిచ్ఛయించునగరజనంబులకు మంచిమాటలం
జెప్పి వారి నచట వదలి శృంగిబేరిపట్టణంబున కధిపుండగు
గుహుని సమీపంబునకుం బోయి జటల ధరించి పదంపడి

గంగానదిని దాఁటి యచటిఋషిగణంబులచేఁ బూజితుండై చిత్రకూటంబున కరిగి లక్ష్మణరచితపర్ణశాలయందు సుఖంబున నుండెను.

అపుడు భరతుండు తనమాతామహుండైన కేకయమహారాజుపట్టణంబునుండి అయోధ్యానగరంబున కేతెంచి పురజనంబులచే రాముండు కైకేయినిర్బంధంబున సీతాలక్ష్మణ సహితుండై కాననంబున కరుగుటయు, రామవియోగతాపంబును సహింపఁజాలక దశరథుండు స్వర్గలోకగతుం డగుటయు విని దుఃఖాకులితస్వాంతుండై రామవియోగకారక యగు నిజమాతం దూఱుచు పురోహితామాత్యసహితుండై దశరథునికి తర్పణాదిక్రియలను శాస్త్రోక్తంబుగ నెఱవేర్చి రాజ్యాభిషిక్తుండ వగుమని చెప్పుపురోహితాదుల వచనంబుల నంగీకరింపక రథగజతురగపదాతిసహితంబుగ రాముని వెదకుచుం బోయి యాతనిం దోడితెచ్చి పట్టాభిషిక్తునిం జేయుట తనకుకర్తవ్యం బని యూహించి సీతాపతిని వెదకుచుం బోయె.

ఇటులు భరతుండు కొంతదూరంబు పోవ వేఁటరుల కెల్లరి కొడయండగు గుహనామకుండు భరతునింజూచి "భరతా! నీ వేల యలజడి నొందెదవు? రాముండు చిత్రకూటంబున సుఖంబున నున్నవాఁడు. నీ వచటికిం బోయి లక్ష్మణరచితపర్ణశాలామధ్యప్రదేశంబున పార్వతీనందికేశ్వర సమేతుండై వెలయు సదాశివునివలె సీతాలక్ష్మణసమేతుండై ప్రకాశించు నిజాగ్రజుండగు రామచంద్రుని పాదారవిందంబులకు నమస్కరింపుము. నిన్నతఁడు సాదరదృష్టిం జూచి క్షమించును." అని యిట్లు మందలించిన గుహునివాక్యంబుల కెంతయు సంతసించి భరతుండు చిత్రకూటపుచక్కిం బట్టి యరుగునవసరంబున

లక్ష్మణుండు భరతునిం జూచి యిట్లనియె. "అన్నా చూచితివా!
కైకేయి దుర్మార్గంబున మనము రాజ్యభ్రష్టులమై సర్వసుఖం
బుల త్యజించి నారచీరలం గట్టి కాననంబున కేతెంచి యిడు
మలం బడుచుండినను భరతుఁ డంతటితోఁ దనివి నొందక మ
నమీఁద దండెత్తి వచ్చుచున్నాఁడు, అనుజ్ఞ యిమ్ము. వానిని
సైన్యసహితంబుగ నొక్క కోలచేఁ బరిమార్చెద" నని చెప్ప
జానకీకాంతుండు "తమ్ముఁడా! అవసరం బుడుగుము. వాని యాగ
మన కారణంబుఁ జక్కగా నెఱింగి పిదంపడి కర్తవ్యం బాలో
చింతము." అని తమ్ముని శాంతపఱిచె. పిమ్మట భరతుండు రా
ముని సమీపించి ప్రణామముఁ జేసి పితృమరణంబునుం జెప్ప
రాముండు పితృమరణంబునకు దుఃఖడోలాయమాన మాన
సుండై తర్పణాదిపితృకర్మంబులం జేసి చింతించుచుండు భ్రా
తం జూచి భరతుం డిట్లనియె. "అన్నా! నే నతిబాలుండను.
రాజ్యభారంబును వహించుటకు నాకు స్వతః శక్తి చాలదు.
నామాత యవివేకంబున వాకొన్నమాటల పాటింపక నీ వవ
శ్యంబుగ నయోధ్యాపురంబున కేతెంచి రాజ్యాభిషిక్తుండవై
మమ్ముల నుద్ధరింపు" మని ప్రార్థించెను. రాముం డపుడు భర
తునిం జూచి "తమ్ముఁడా! పితృవాక్యపరిపాలనంబు మనయిరు
వురకు ముఖ్యంబుగాఁ జూపట్టెడిని. అట్లగుటం జేసి నీవు రాజ్యం
బును వహింపుము. నేను కాననంబున కరిగి పదునాల్గువత్సరం
బు లుండి మగిడి వత్తు"నని చెప్పి భరతునివాక్యంబునకు సమ్మ
తింపకయుండ భరతుండు రామునకు మరల నుతు లొనర్చి
"మీపాదుక లిచ్చిన నేను వానిని సింహాసనంబున నుంచి పదు
నాల్గువత్సరంబులు ధర్మపథంబున రాజ్యపరిపాలనంబుఁ జేయు
దును. పదునాల్గువత్సరంబులుకడచిన పిదప మీరు రాకేని చితిని

పేర్చి అందుఁ బ్రవేశించి ప్రాణంబు త్యజింతు"నని చెప్పి వసిష్ఠాదిమహర్షులతోడ రామపాదుకలం గొని శత్రుంజయమను పట్టాభిషేక గజంబుపై నిడుకొని ఛత్రచామరరాజ చిహ్నంబులతోడ నయోధ్యం జేరి రామపాదుకలకు పట్టాభిషేక మహోత్సవంబుఁ జేసి నందిగ్రామంబున వల్కలజటాధరుండై కందమూలంబుల నాహారంబుగఁ గొని యనవరతంబు రాజ్యకృత్యంబులు పాదుకాసమీపంబున విజ్ఞాపించుచు రాజ్యపరిపాలనముఁ జేయుచుండె. చిత్రకూటాశ్రమమునందు రామచంద్రుఁడు సీతాలక్ష్మణసమేతుండై పితృవియోగజనిత చింతాక్రాంతుండై కొంత కాలం బచట జరిపి యటనుండి క్రమంబుగ దక్షిణాపథంబును బట్టి గోదావరియొడ్డున నున్న పంచవటికిఁ జేరి సుఖంబుండెను. అత్తఱి రావణుని చెలియలును రాక్షసియు నగు శూర్పణఖ సీతాపతిపై మోహించి యాతని నిజధవునిగా వరించెను. లక్ష్మణుం డది యుపలక్షించి రామాజ్ఞచే కృపాణపాణియై దానినాసాకర్ణంబుల ఖండించెను. అపు డారాక్షసభామ రక్తారుణితలోచనయై జనస్థానంబునందుండు ఖరదూషణత్రిశిరఃప్రభృతిరాక్షసులను రామునిపై యుద్ధంబునకుం బంపె. అట్టియెడ రామచంద్రుండు లెక్కకెక్కుడగు సైన్యంబుల వెంటఁ బెట్టుకొని యుద్ధంబునకు వచ్చు ఖరదూషణాదులం జూచి నిజపత్నియగు సీతాదేవిరక్షణార్థంబుగ లక్ష్మణుని నియమించి అత్యుగ్రభీషణ శరాసనంబుఁ ధరించి తాను రాక్షసులతోడ యుద్ధంబునకుం గడఁగి ప్రళయకాలానలజ్వాలాసదృశంబులైన బాణజాలంబులచే ఖరదూషణాది రాక్షసులను, తదనుచరులైన పదునాలుగు వేలరక్కసులను ముహూర్తార్థంబున దునిమి సంతుష్టయగు సీతాదేవిచే గాఢాలింగనముఁ జేయంబడి అనుజరచితపర్ణశా

లయందు సుఖమునసుండెను అప్పుడు శూర్పణఖ విఫలమనోర
థయై యతిదుఃఖంబున నిజానుజపురంబగు లంకాపురిం బ్రవేశిం
చి రావణుం జూచి రామలక్ష్మణులు తన్ను విరూపం జేసినది
యును, యుద్ధంబున రాముండు ఖరదూషణాదులగు పదునాల్గు
వేలసంఖ్యగల దండిరాక్షసుల నతి సుకరంబున రూపుమాపి
నదియు, జనస్థానంబును విజనస్థానంబుగఁ జేసినదియు మొదల
గువానిని మొఱలిడుచు అతిసౌందర్యశాలినియు, రామునిపత్ని
యు నగుసీతాభామారూపలావణ్యాతిశయంబుల వర్ణించుచు నా
లోకమాతను వంచించి యపహరింపబుద్ధి నాతనికుఁ
గల్పించెను దశాననుండు శూర్పణఖాకలహవాక్యంబుల నాక
ర్ణించి కాలపాశబద్ధుండై మారీచుని సాహాయ్యంబుగఁ గొని
రామాశ్రమంబునకు వచ్చి స్వర్ణహరిణరూపంబును ధరించి
సీతాదేవిని వంచించునట్లు మారీచుని కాజ్ఞాపించె. మారీ
చుఁ డప్పు డతి విచిత్రస్వర్ణరజితబిందు పరిష్కృతహరిణంబై జా
నకి కట్టెదుట నిలిచి విచిత్రలీలం జూపుచుండె. అత్తఱి రామ
పత్ని అచటసంచారంబుచుండు చిత్రపులేడిని రామునికిం జూపి దా
నిని జీవంబుతోడఁ దనకుం దెచ్చియిచ్చునట్లు ప్రార్థింప రాముం డు
వల్లెయని శరశరాసనంబుల ధరించి దాని వెన్నంటి బహుదూరం
బరిగియు నది తనచేతి కబ్బకుండుటవలన బాణంబుచే దానిఁగూల
డుల్లనేసె. అప్పు డాజంక తనస్వరూపంబును వదలి భీకరాకార
రాక్షస శరీరంబుగల్గి హాలక్ష్మణా! హాసీతా! అని విశృత ఘోషం
బుతో నేలం బడి ప్రాణంబు విడిచె. జనకతనయ యప్పు డావి
కారఘోషమును విని భయాక్రాంతచిత్తయై లక్ష్మణుని రామ
సాహాయ్యార్థముగ నతినిర్బంధంబునఁ బంపె అట్టిసమయంబున
రావణుండు సన్న్యాసిరూపంబున రామలక్ష్మణవిహీనంబుగ

నుండు నాపర్ణశాలం బ్రవేశించి బలాత్కారంబున సీత నెత్తి యంకతలంబునం దిడుకొని యాకాశమార్గంబునం బోవుతఱి దశరథమిత్త్రుండగు జటాయువు సీతారక్షణంబునకై రావణుని తోడం బోరి వాని రథతురగధనుర్బాణంబులు నిజనాసాగ్రన ఖాగ్రంబులచే తునియలం జేసి రావణునిచే మర్మస్థానంబుల యందు ప్రహారింపంబడి భూమిం బడియుండ రావణుండు సీత నెత్తుకొని లంకాపురిం బ్రవేశించె. సీతాదేవి రావణుండు తన్ను లంకకుం దీసికొనిపోవునెడ మార్గమధ్యంబున ఋష్యమూకం బునం దుండు వానరులం జూచి తన యాభరణంబులదుల్పి వస్త్రఖండంబున బంధించి వానరమధ్యంబునం బడవైచి "హా రామ! హా రామ!" యని కేకలువెట్టుచు లంకం బ్రవేశించె.

రాముం డచట మారీచునిం జంపి లక్ష్మణసహితుండై పర్ణశాల కేతెంచి సీతం గానక చింతాక్రాంతుండై యాయం గనామణిని వన, గిరి, నదీ, జలాశయ, పల్వలంబులలో వెదకు చుం బోయి యొక్కయెడ రావణునితో సీతకై పోరి వానిచే ప్రహారింపఁబడి ప్రాణావశిష్టుండై నేలంబడియుండు జటాయువుం జూచి వానిని తనపత్ని నపహరించిన దుష్టరాక్షసుం డగునట్లు భావించి సమయింప సమకట్టుడు జటాయువు స్వామి నుద్దేశించి "స్వామీ! ఏను జటాయు వనువాఁడ. నీతండ్రికి ప్రియసఖుండ. లోకకంటకుండగు దశాస్యుండు నీమనోనాయికను వంచించి లంకకుం గొని చనె. నేను వానితోడ సీతకై పోరి వానిచే ప్రహారింపంబడి మీ దర్శనంబు చేసిన పిదప ప్రాణంబుల వదలుట కై యత్నించి యున్నవాఁడ" నని చెప్పి ప్రాణంబును వదలె. అపుడు రామచంద్రుం డా పక్షికై నెక్కుడుగఁ జింతించి దశ రథునికిం జేసినటులె జటాయువున కపరక్రియలం జేసి జానకీ

దేవిని వెదకుచు దక్కినపుచక్కిం బట్టి పోయి అతిభయంకర కాంతారమధ్యంబున నివసించుచు నతిదీర్ఘబాహువులుగల దనుకబంధుని వధించి దివ్యరూపంబును ధరించినవానిచే ఋష్యమూకపర్వతంబున సుగ్రీవుండు నలువురుమంత్రులతో నున్నవాఁడనియు నీవాతనితోడ సఖ్యంబుఁ జేసి వానివలన సీతం బొందుదు వనియుఁ జెప్పఁబడి ఋష్యమూకంబున కరిగి సుగ్రీవునితో సఖ్యంబు సేసి వాలిని నిగ్రహించి సుగ్రీవుని కిష్కింధకు పట్టాభిషేకంబు సేసెను. పదంపడి సుగ్రీవుండు రామవచనంబువగిది సీతను వెదకుటకై వానరసహస్రంబులను నలుదిక్కులకుం బంపె. దక్షిణపథంబున కరిగినహనుమంతుండు మహేంద్రపర్వతసమీపంబున సంపాతిచే సీతామహాదేవి లంకయం దుండువర్తమానంబును నెఱిఁగి పారావారంబును గడచి రావణరాజధానిం బ్రవేశించి యశోకతరుచ్ఛాయ నతిఖేదంబున వివర్ణకేశయై ధూళిధూసరితకాంచన ప్రతిమభంగి వెలుంగు లోకమాతం గాంచి యాయింతిచే నెల్లవృత్తాంతంబుల గ్రహించి రామకుశలంబు నాదేవికిం జెప్పి శ్రీరామముద్రిక భూసుత కిచ్చి మరల నామెముద్రికం గైకొని అశోకవనంబును నాశనముఁ జేసి లెక్కకెక్కుడగు రక్కసుల నుక్కుఁదక్కించి యింద్రజిత్తువలన బ్రహ్మాస్త్రంబుచే బంధింపంబడి రావణునికొలువుకూటంబుఁ బ్రవేశించి యాదుష్టరాక్షసునిం దూలనాడి లంకాపురి దహించి మరల సముద్రంబును దాఁటి రామచరణారవిందంబులం జేరి సీతాముద్రికనిచ్చి లంకాపురస్థరాక్షసవృత్తాంతంబులను జెప్పెను. రామచంద్రుండు హనుమంతునిచే సీతావృత్తాంతంబుల నామూలాగ్రంబుగ నెఱింగి వానరయూథంబుల వెంటఁబెట్టుకొని దక్షిణమహోదధితీరంబున కేఁగి కోపా

నలజ్వాలాజాలంబుచే సముద్రంబును శుష్కింపంజేసి శరణాగతసముద్రరాజానుమతుండై వానరశ్రేష్ఠులచేఁ గొనిరాఁబడిన మహాశైలంబులచే సేతుబంధనంబుఁ జేసి దానిమార్గంబున వివిధవిచిత్రప్రాకార గోపురాట్టాలకహర్మ్యప్రాసాదవిమానమాలాసంకులంబై రథగజతురగపదాతిచతురంగబలపరిరక్షితంబుగ దుర్నిరీక్ష్య వివిధదుర్గజాల సంకీర్ణంబుగ నుండు రావణపురి యగులంకాపురిం జొచ్చి నిజానుజునితోడ భీషణకోదండంబును ధరించి సంవర్తసమయసముదితమార్తండకరనికరఖరతరశరజాలంబుచేతను కృతాంతజిహ్వాభీషణక్రూరతరకరవాలంబులచేతను, రాక్షససేనాంతర్గతరథగజతురగపదాతులను ఖండఖండంబులుగఁ జేసి యమసదనంబున కతిథులుగఁ బంపెను. మఱియు సుగ్రీవాంగదహనుమజ్జాంబవత్ప్రముఖులైన వానరసేనానాయకు లత్యున్నతతరునివహంబులచేతను, మహామహీధరనికరంబులచేతను అతిక్రూరతరకరప్రహారంబులచేతను రావణానుచరులైన రాక్షసాధిపతుల నురుమాడిరి. పదంపడి అతిబలశాలి యగు లక్ష్మణుండు పురందరజేత యగు రావణాత్మజుండైన యింద్రజిత్తును తదనుచరులైన ప్రహస్త వికట కుంభ నికుంభ విరూపాక్ష మకరాక్ష ప్రభృతులైన రాక్షసశ్రేష్ఠులను, కల్పాంతానలజ్వాలాజాలభయానకసాయకసంఘాతంబుచే సంహరించెను. అనంతరం బఖిలనిశాచరాధ్యక్షుండగు దశాననుండు నిజసైన్యంబు లొందిన చెట్టల నాలకించి కోపావేశపరవశస్వాంతుండై సంఖ్యాతీతరథగజతురగపదాతికోటిపరివృతుండై యుద్ధరంగంబున కేతెంచి సకలవానరసేనాపతియగు సుగ్రీవునితో కొంతతడవు మల్లయుద్ధము సేసి తత్సమీపంబున శారదదివాకరునిపగిది జాజ్వల్యమానుండై సకలసురాసురగంధర్వయక్షా

దుల కడేయుండగు రామచంద్రుని సమీపించి లోకభయంకరంబుగ యుద్ధంబుఁ జేసె. అత్తఱి సత్యపరాక్రముండగు రాముండు బ్రహ్మవరంబున విజృంభించుచు కన్నులఁ గానక మదోన్మత్తచిత్తంబున మహాబలపరాక్రమశాలియై యుద్ధరంగంబున మహాకులపర్వతంబువలె నిశ్చలుండై అతిభయంకరుండగు రావణుని, తదనుజుండును భీషణాకారుండును నగు కుంభకర్ణుని, బ్రహ్మాస్త్రప్రయోగంబున సంహరించెను.

ఇప్పగిది భూసుతపాతివ్రత్యమనెడి యగ్నిచేతను రామబాణాగ్నిచేతను దహింపంబడిన శరీరంబుతోడ సకలలోకకంటకుండగు రావణాసురుండు దహింపఁబడి మహిం బడి మరణంబు నొందె. అపుడు రామరావణయుద్ధంబుఁ జూడ నేతెంచిన పురందరాదిబృందారకులు, వానరసేనాసమూహంబు, రావణునిచావున కత్యంతసంతుష్టాంతరంగులైరి. అపుడు రామచంద్రుని మనోభావంబును గ్రహించి యగ్నిప్రవేశము సేసిన సీతాదేవిని అగ్నిదేవుండు శిరంబున నిడుకొని రామునిసముఖంబునకుం బోయి "స్వామీ! సకలలోకమాత యగు జానకీదేవి స్పర్శచే సర్వభక్షకుండనగు నేనుసయితము పరిశుద్ధుఁడనై ధన్యుఁడనైతి. ఈదేవిని నీవవశ్యంబుగ నంగీకరింపవలయు" నని ప్రార్థింప రాముండు సీతను బరిగ్రహించి యుద్ధరంగంబున నీల్గినవానరులు పునర్జీవితు లగునటు లింద్రాదిదేవతలచే నియ్యఁబడ్డవరంబును గైకొని రావణానుజుం డగు విభీషణుని లంకారాజ్యంబున కభిషిక్తునిం జేసి ఈశ్వరసఖుండగు కుబేరునిచే నొసంగంబడినపుష్పక విమానంబున సీతాలక్ష్మణసహితుండై సౌక్కి యఖిలసేనానివహాపరివృతుండై మార్గమధ్యంబున ననేకమునిశ్రేష్ఠులచేఁ బూజింపఁబడి నందిగ్రామంబున కేఁగి యచ

ట జటావల్కలధారియై కృశించియుండు తనయనుజుండగు భరతుని గాంచి గారవించి పురోహితామాత్యమాతృభ్రాతృబంధుమిత్రానుచరగణపరివృతుండై మనుమాంధాతృప్రభృతిమహారాజపాలితంబుగ సకలాలంకారశోభితంబుగ నుండు నయోధ్యానగరంబునం బ్రవేశించి వసిష్ఠాదిఋషిగణంబుచేతను సిద్ధార్థాదిమంత్రినివహంబులచేతను పట్టాభిషేకముం జేయంబడినవాఁడై దేవరాజువలె ధర్మపథంబున రాజ్యపరిపాలనముఁ జేయుచుండె. రామచంద్రుఁడు ప్రజాపరిపాలనముఁ జేయుచుండుతఱి బ్రాహ్మణాదిచాతుర్వర్ణ్యంబు నాయురారోగ్యైశ్వర్య పుత్రమిత్రకళత్రాదిసర్వసంపత్సమృద్ధులై యత్యానందంబున నుండిరి. మేఘంబులు యుక్తకాలంబున వర్షించి భూమి మిగుల ఫలవంతంబుగ నుండె.

ఇట్లు శ్రీరామచంద్రుండు దయాదాక్షిణ్యాదిగుణంబులచే ప్రజాపాలనంబుఁ జేయుచు నిజమనోనాయిక యగు సీతాదేవిమనంబును లీలావిలాసంబులం దృప్తిపఱచుచు సంపూర్ణదక్షిణలతోఁ గూడిన యశ్వమేధాదియజ్ఞానుష్ఠానంబులచే నింద్రాది దేవతల మనఃప్రహర్షాతిశయంబులనుగలుగఁ జేయుచు పెక్కుమహర్షులచే స్తోత్రముఁ జేయఁబడి పదివేలవత్సరంబులు రాజ్యంబు నేలుచుండె. పిదప రాముం డొక్క కాలంబున నేదో యొక్క కారణంబునం జింతించుచు దయావిహీనుండై సీతాదేవిని కాననంబునకుం బంపె. అట్టియెడ బ్రహ్మిష్ఠుండగు వాల్మీకి మహర్షి రామునియభిప్రాయంబును దెలిసికొని దుఃఖవారాశిని మగ్న యగు జానకీదేవిని తనయాశ్రమంబునకు రావించెను. పదంపడి రామపత్ని యగు సీతాదేవి మహాబలపరాక్రములై రామచంద్రునియశంబు ననవరతంబును కీర్తించు స్వభావముగల

కుశలవు లనుపేరం బరంగుపుత్త్రులం గనెను. అనంతరము వాల్మీకిమహర్షి గంభీరగుణగణ సంపన్నులగు పుత్త్రులతోడ దోషరహితయు సకలసురనికరవంద్ధితయు నగు భూపుత్త్రిని రామపాదారవిందంబులకు నొప్పగించె. ఆసమయంబున కాకుత్స్థతిలకుండగు రామభద్రుండు నిజపుత్త్రులతోడ దుఃఖంబున నెలుంగెత్తి శోకించుసీతం జూచి మరల నగ్నిం బ్రవేశించునటులు చెప్ప సీతాదేవి రామపాదారవిందంబులకు ప్రణామముఁజేసి నిజమాత యగు భూదేవతచేఁ గొనిరాఁబడినరత్నఖచితపర్యంకంబు నారోహించి తనమాతృగర్భస్థలంబగు భూమిం బ్రవేశించె. అపుడు రాముండు గోపభరంబున ప్రళయకాలానలజ్వాలాసమానసాయకంబుల వింట నారోపించి భూమి నడుగంట దహించుటకై యత్నించె. ఆసమయంబున బ్రహ్మిష్ఠప్రవరుండగు వసిష్ఠుండు రామునిం జూచి "భక్తజనమనోవాంఛితకల్పవృక్షసదృశా! నీకుం గల భృగుశాపాది పూర్వవృత్తాంతంబుల నివేదించెద విను" మనిన రాముం డేతద్వృత్తాంతంబుల నాలకించి కోపంబును వదలి నిజానుజులతోడ గొంతకాలము ధర్మపథంబున రాజ్యభారంబును వహించి తర్వాత అయోధ్యానగరంబునందలి నరపశుపక్ష్యాది సర్వజంతుజాలంబులతోడను తమ్ములతోడను సరయూనదీసలిలంబును జొచ్చి తననెల వగు వైకుంఠంబునకుం జేరె. ఇట్లు సర్వాభీష్టఫలప్రదంబుగను, సంసారార్ణవతారకంబుగను, శ్రవణానందకరంబుగ నుండు శ్రీరామునిచరిత్రంబు నాలకించు జనంబుల కాయురారోగ్య ధనకళత్రపుత్రమిత్రస్వర్గాదిసంపత్తు లన్నియు శ్రీరామానుగ్రహంబునం జేకూఱుట కిసుమంత యైనను సందియంబు లేదు.

ఇది తృతీయాంశమునందు తృతీయాధ్యాయము.

చతుర్థాధ్యాయము.

శ్రీరామపుత్రుండగు కుశునికి, అతిథి యనుపుత్రుండు పుట్టె. అతిథికి నిషధుఁడు, నిషధునికి నభుండు, నభునికి పుండరీకుఁడు, పుండరీకునికి క్షేమధన్వుఁడు, క్షేమధన్వునికి దేవానీకుఁడు, దేవానీకునకు హీనుఁడు, హీనునికి పారిపాత్రుఁడు, పారిపాత్రునికి బలాహకుఁడు, బలాహకుని కర్కుఁడు, అర్కునికి రజనాభుఁడు, రజనాభునికి విధృతుఁడు విధృతునికి హిరణ్యనాభుఁడు, హిరణ్యనాభునికి పుష్పాధ్రువుఁడు. పుష్పాధ్రువునికి స్యందనుఁడు, స్యందనుని కగ్నివర్ణకుఁడు, అగ్నివర్ణకునికి శీఘ్రుఁడుఁబుట్టె. అతులపరాక్రమవిక్రముం డగు నీశీఘ్రుండు మజ్జనకుండు. శీఘ్రునితనయుండ నగునన్ను కొందఱు 'మరు' వనియు, మఱి కొందఱు "బుధుఁ" డనియు, ఇంకకొందఱు "సుమిత్రుఁ" డనియు పిలుతురు. నేను కలాపగ్రామంబున నిన్నుఁగూర్చి పెక్కేండ్లు తపంబుఁ జేయుచుంటి. సత్యవతీపుత్రుండగు వేదవ్యాసునిచే నీవు కలియుగ మారంభమైన లక్షసంవత్సరములకు నవతారము సేతు వని యెఱిఁగి నీరాకకై నిరీక్షించుచున్నాఁడను. ఇవు డనేకకోటి జన్మసంచితపాపరాసులను వినాశముఁ జేయునదిగ, ధర్మాభివృద్ధికరంబుగ, యశస్సు, కీర్తి, సర్వాభీష్టంబులు వీనిని బూర్తిచేయునదిగ నుండు నీసమీపమును జేరితి." అను మరువాక్యంబులను కల్కి యాలకించి "నీవు సూర్యవంశసముద్భూతుండ వని తెలిసితి. నీసమీపంబున ఉత్తమపురుషలక్షణంబులతోఁ గూడినవాఁడుగ నుండు పురుషుఁ డెవండు?" అని కల్కిమూర్తి మరుభూపాలుని నడుగుసమయంబున దేవాపి వినయంబున కల్కితో నిట్లనియె.

~ఇ చంద్రవంశానువర్ణనము. ఇ~

"స్వామీ! ప్రళయావసానంబున పరమాత్మస్వరూపుండగు నీ నాభికమలంబున చతుర్ముఖబ్రహ్మ జనించె. వాని కత్రిమహర్షి, అత్రికి చంద్రుఁడు, చంద్రునికి బుధుఁడు, బుధునికి పురూరవస్సు, పురూరవసునకు యయాతి జనించె. అయ్యయాతి దేవయానియందు "యదువు తుర్వసువు" అను నిరువురుపుత్రులనును, శర్మిష్ఠ యను మఱియొకభార్యయందు ద్రుహ్యుండు, పురువు, అనునిద్దఱుకుమారులనును జనింపఁజేసె. పురువునకు జయుఁడు, జయునికి ప్రచిన్వంతుఁడు, ప్రచిన్వంతునికి ప్రవీరుఁడు, ప్రవీరునికి మనస్యుండు, మనస్యున కభయదుఁడు, అభయదునికి త్రైయరుణి, వీనికి పుష్కరారుణి, పుష్కరారుణికి బృహత్‌క్షేత్రుండు, వీనికిని హస్తి అను పుత్రుండుఁబుట్టె వీనికి వాసస్థానమైన నగరము వీనిపేరిట హస్తినాపురి యని సార్థకనామముఁ జెందె. ఈహస్తియనువానికి "అజమీఢ" "అహిమీఢ" "పురుమీఢు" లను మువ్వురుపుత్రులు జనించిరి. అజమీఢునికి ఋక్షుఁడు, ఋక్షునికి సంవరణుఁడు, సంవరణునికి కురువు, కురువునకు పరీక్షిత్తు, పరీక్షిత్తునకు సుధనువు, జహ్నువు, నిషధుఁడు, సుహోత్రుఁడు అనుపుత్రులు పుట్టిరి. సుధనునకు చ్యవనుఁడు, చ్యవనునికి కృతి, కృతి యనువానికి బృహద్రథుండు, బృహద్రథునికి ఋషభుండు పుట్టె. ఆఋషభునికి ప్రథమభార్యయందు సత్యజితుఁడు, పుష్పవంతుఁడు, నహుషుఁడు అను మువ్వురుపుత్రులును మఱియొకభార్యయందు పరాక్రమశాలి యైనజరాసంధుండు అనుపుత్రుండును జనించిరి. ఆజరాసంధునికి సహదేవుఁడు, సహదేవునికి సోమాపి, సోమాపికి సురథుండు, సురథునికి విదూరథుఁడు, విదూరథునికి సార్వభౌముండు అనుపుత్రుఁడుజనించె. వీ

నికి జయసేనుఁ డని నామాంతరము కలదు. జయసేనునికి రథానీకుండు, రథానీకునికి యుతాయువు, యుతాయువునకు దేవాతిథి, దేవాతిథికి ఋక్షుండు, ఋక్షునికి దిలీపకుండు, దిలీపకునికి ప్రతీపకుండు అనుపుత్రుండు జనించె. ఓస్వామీ! అట్టిప్రతీపకునకు నేను పుత్రుండనై జనించితి. నారాజ్యమును భీష్మాచార్యునివద్ద నొప్పగించి తపంబునం దిచ్ఛగలవాఁడనై కలాపగ్రామంబున తపంబు నెఱపుచు మరు వను నామంబుగల యీభూపాలునితోడను, ఈమహాత్ములతోడను నీ సమీపంబున కేతెంచి నీపాదారవిందంబులకు నమస్కారముఁ జేసి ధన్యుండ నైతి" నని చెప్పె. ఇట్టిమరు-దేవాపి అనుభూమీశులపలుకుల నాలకించిన కల్కిమూర్తి మందస్మిత వికసితవదనారవిందుండై వారిరువురినిజూచి "మీరు మిగుల ధర్మిష్ఠు లని యెఱుంగుదు. మీరిరువురును నాయాజ్ఞచే రాజ్యపరిపాలనము చేయవలయు" నని చెప్పి తరువాత మరువు నుద్దేశించి "మరుభూపా! అధర్మిష్ఠులును, ప్రజాహింసకులునునగు మ్లేచ్ఛులను వధించి సూర్యవంశన్ృపరాజధాని యగు అయోధ్యాపట్టణమునకు నిన్ను నభిషిక్తునిం జేతు-ఓదేవాపి! యుద్ధంబున పుల్కసు లనుపేరుగల దుష్టులను నురుమాడి హస్తినాపట్టణమునందు నీకు పట్టాభిషేకముఁ జేతును. నేను మథురాపురంబున వసించుచు మిమ్మును శత్రువులచే భయంబునొందనీయక కాపాడుచుండెద. మఱియు నేను అధర్మపరులుగను, దుర్మార్గులుగను నుండు శయ్యాకర్ణుండు, ఉష్ట్రముఖుఁడు, ఏకజంఘుఁడు ఇత్యాదుల వధయించి కృతయుగంబును కలుగఁజేసి ప్రజలను రక్షించెద. మీరపుడు ఋషివేషంబు వ్రతంబులు వీనిని వదలి ఉత్తమరథారూఢులై శస్త్రాస్త్రములను ధరించి సేనాగణపరివృతులై నాతోడ సంచరింపుఁడు.

మరుభూమీశా! విశాఖయూపభూపతి వినయాన్వితగ, మనోహరమైన కడకంటిచూపులు కలదిగ మిగుల సౌందర్యవతిగ నుండు తనకూఁతును నీకు వివాహార్థమై యిచ్చుం గాన నీవు దానిం బెండ్లాడుము. దేవాపి! నీవుం మిగుల శాంతికలదిగ, అత్యుత్తమ సౌందర్యముతోఁ గూడినదిగ నుండు ఋచిరాశ్వని కొమార్తెను పరిణయమాడు" మని చెప్పు కల్కిమూర్తి మధురమైన పల్కు లాలించిన మరుదేవాపులు మిగుల సంతసించి కల్కిమూర్తిని సాక్షాద్విష్ణుమూర్తి యని యాలోచించి మిగుల నాశ్చర్యభరితమానసు లైరి.

దేవాపిమరువులకు దివ్యరథప్రాప్తి.

అట్టిసమయంబున మధ్యందినమార్తండునిపగిది జ్వలించుచుండునదిగ, నానావిధరత్నపటలఖచితంబుగ, యజమానుఁడుద్దేశించినమాత్రంబున తలఁచిన స్థలంబునకుఁ దీసికొనిపోవునదిగ, దివ్యశస్త్రాస్త్రంబులతోఁ గూడినదిగ, విశ్వకర్మనిర్మితంబుగ నుండు రథద్వయంబు లచటి కాకాశమార్గంబుననుండి వచ్చి నిలచె. అట్టియెడ అచట నుండురాజులు, ఋషిగణంబులు అమందానంద సాగరనిమగ్నులై ఇది యేమి ఇది యేమి యని చెప్పిరి. అపుడు కల్కి మరుదేవాపులనుజూచి మీరు సూర్య, చంద్ర, ఇంద్ర, యమ, కుబేరాంశంబులచే లోకరక్షణార్థంబుగ నిబ్బవి రాజులై యవతారము సేసినారని ఋషులు చెప్పుచున్నారు. ఇక్కలికాలమాహాత్మ్యంబున నిదివఱకుమీరు ప్రచ్ఛన్నాకారంబులు కలవారలై యుంటిరి. మీ రిపుడు నాసాన్నిధ్యంబుచే ప్రకాశముఁ జెందితిరి. నాయాజ్ఞచే నింద్రదత్తంబగు నీరథద్వయంబునారోహింపుఁడు" ఇటులు విశ్వేశ్వరుండుగను, అనాదిపురుషుండుగను నుండు విష్ణువుపలుకుల నాలకించి అను

రులు పుష్పవృష్టిని కురిపించిరి. మహర్షులు కల్కిపురుషుని అనేకభంగుల గొనియాడిరి. గంగానదీజలకణశీతంబుగ, దివ్యకుసుమగంధపరిమళితంబుగ నుండు మందమారుత మచట సంచరించె నపుడు కరగించిన పసియాఱువన్నెబంగారుకాంతికి సమానమైన శరీరకాంతి కలవాఁడుగ, సకలధర్మంబుల కునికిపట్టుగ, మనోహరజటావల్కలదండధరుండుగ, లోకాతీతుండుగ, తన గాలి సోఁకినమాత్రముచే నెల్ల నధర్మరాసులను నశింపఁజేయువాఁడుగ, బ్రహ్మపుత్రుం డగు సనకఋషిసమానుండుగ, తామరసపుష్పమున కీడగు నేత్రయుగ్మముకలవాఁడుగ నుండు నొక యతీశ్వరుం డచటి కేతెంచె.

ఇది తృతీయాంశమునందు చతుర్థాధ్యాయము.

పంచమాధ్యాయము.

కృతయుగము వచ్చుట.

పదంపడి కల్కిమూర్తి దివ్యరూపంబున నేతెంచిన ఋషిశ్రేష్ఠునిం గాంచి యాశ్చర్యపరవశుండై అచ్చో నుండు రాజఋషిగణంబులతోడ లేచి వారిని పాద్యార్ఘ్యాచమనీయాదులచేఁ బూజించి నమస్కారముఁ జేసి అతివృద్ధుఁడుగ, బ్రహ్మచర్యాద్యాశ్రమచతుష్టయంబులచే నమస్కారముఁ జేయఁబడినవాఁడుగ నుండు జటాధారి నుద్దేశించి "దేశికేంద్రా' మీర లెవరు? నాయదృష్టవశంబున మీ రిచటి కేతెంచితిరి కాఁబోలు? లోకంబున సర్వభూతంబులయందు సౌహార్దము గలవారుగ, ఆనందపరిపూర్ణమానసులుగ, సకలపాపసంచయవినిర్ముక్తులుగ నుండు

మీవంటిమహాత్ములు లోకరక్షణంబునం దిచ్ఛ గలవారలై తి అచుగ సంచరించుచుందు" రని వక్కాణింప వచ్చిన యతీశ్వరుండు కల్కివినయంపుమాటలను విని యానందించి కల్కినిం జూచి "ఓ లక్ష్మీశా! నేను నీయాజ్ఞను శిరసావహించునట్టి కృతయుగపురుషుండను - నీయవతారవిధనంబును కన్నులపండువుగ వీక్షించునభిలాషంబున నిచటి కేతెంచితి. నీవు నిరుపాధిగ నుండు కాలస్వరూపివి. క్షణము, దండము, లవము, పక్షము, అహోరాత్రములు, మాసములు, ఋతువులు, సంవత్సరములు, కృతాదియుగంబులు మొదలగునవి నీసంకల్పముచే నడుచుచున్నవి. మొట్టమొదటివాఁడగు స్వాయంభువమనువు, రెండవవాఁడగు స్వారోచిషమనువు, మూఁడవవాఁడగు ఉత్తమమనువు, నాలవవాఁడగు తామసమనువు, అయిదవవాఁడగు రైవతమనువు, ఆఱవవాఁడగు చాక్షుషమనువు, ఏడవవాఁడగు వైవస్వతమనువు, ౮వ వాఁడగు సావర్ణికమనువు, ౯వవాఁడగు దక్షసావర్ణికమనువు, ౧౦వ వాఁడగు బ్రహ్మసావర్ణికమనువు, ౧౧వ వాఁడగు ధర్మసావర్ణికమనువు, ౧౨వ వాఁడగు రుద్రసావర్ణికమనువు, ౧౩వ వాఁడగు వేదసావర్ణికమనువు, ౧౪వ వాఁడగు ఇంద్రసావర్ణికమనువు, ఈ ౧౪గురు మనువులు నీయైశ్వర్యములో చేరినవారలై నామరూపాదిభేదంబులతో నీసంకల్పముచే ప్రకాశమును జెంది మరల నీలోనే లయమును జెందుచున్నారు. దేవమానంబుచే ౧౨ వేలసంవత్సరంబులు మనుజులకొక చతుర్యుగము. దేవమానంబుచే ౭౧ యుగములు(౧)మన్వంతరము. పైనచెప్పిన (౧౪) మనువులకును ఇటులు కాలపరిమాణము కలిగియుండును. (౧) మన్వంతరము నలువకొక యహోరాత్రము. అహోరాత్రములు, పక్షములు, మాసములు, సంవత్స

రములు,ఋతువులు మొదలగు కాలములునదుపాధిచే కలుగును. ఇవి జననమరణాదులను కలుగఁజేయును. నలువ (౧౦౦) సంవత్సరములు గడచినపిదప నీయందు లయమును జెందుచున్నాఁడు. ప్రళయాంతమునందు నీనాభికమలమునందుండి జనించిన బ్రహ్మ మరల భువనాదులను సృజియించుచున్నాఁడు. ఆబ్రహ్మ సృష్టిలో నేను సద్ధర్మంబులం బరిపాలించునట్టి కృతయుగుండనువాఁడ. నాకాలములో ప్రజలు కృతార్థులై యుండుట వలన నన్ను కృతుండని పెద్దలు చెప్పుదురు''

ఇట్టి కృతయుగ పురుషునివచనంబుల నాలకించి కల్కి పురుషుండు బంధుజనపరివృతుండై యమందానందంబున కృతయుగపురుషునియభిప్రాయంబును గ్రహించి తనసమీపంబునందలి జనంబులం గాంచి''కృతయుగపురుషుండు కలిపురుషునితో యుద్ధముఁ జేసి వానిని నాశనముఁ జేయుట కిచ్ఛ గలవాఁడై యున్నాఁడు. అగుటచే నేను వానికి సహాయుండనైతి. కలిపురుషునితోఁడ సంగర మొనర్చి కలిపురుషుని సంహరించెద. సర్వాభరణభూషితంబులుగను నానావిధశస్త్రాస్త్రంబుల ధరించినవిగను, యుద్ధంబున పరాక్రమంబుతోఁ గూడినవిగను నుండురథగజతురగపదాతిబలంబుల నాయత్తపఱుచుఁ''డనియాజ్ఞాపించె.

ఇది తృతీయాంశమునందు పంచమాధ్యాయము.

షష్ఠాధ్యాయము.

—: కల్కి దిగ్విజయమునకుఁ బోవుట. :—

పిదప మరుదేవాపులు కృతవివాహులై నానావిధాయుధపాణులుగ నుండు నిజసైన్యంబుల వెంటఁబెట్టుకొని కవచ, కిరీట, బాణంబుల ధరించి దేవేంద్రదత్తంబగురథంబుల నారోహించి అక్షోహిణీసైన్యంబులతోడ కల్కిసమీపంబునకు వచ్చిరి. విశాఖయూపభూకాంతుఁడు లక్షయేనుఁగులు, ఇరువదివేలయుత్తమాశ్వంబులు, ౭ వేలయుత్తమరథంబులు, యుద్ధంబునేర్పరులును, ధనుర్ధరులును, కవచోష్ణీషాదుల ధరించినవారునైన రెండులక్షలపదాతులతోడం గూడి కల్కిసమీపంబుఁ జేరె. రుధిరాశ్వుం డేఁబదివేలమహారథంబులు, ౯ లక్షలసంఖ్యగల మత్తగజంబులు పేనిసహితంబుగ వచ్చె. శత్రుపట్టణమును జయించుశక్తిగలవాఁడును, జగదీశ్వరుండు నగు కల్కిమూర్తి దశాక్షోహిణీసైన్యపరివృతుండై నిజసైన్యసమన్వితులైన మరువు-దేవాపి మొదలగువారితోడను, తదితరబంధుజనులతోడను స్వర్గలోకాధిపతి యగు నింద్రుండు సకలసురనికరపరివృతుండై యసురవిజయంబునకుఁ దర్లుటంబోలె దిగ్విజయంబునకుం బోయెను. ఆసమయంబున తొల్లి కలిపురుషునిచే పరాభవము నొందిన ధర్మదేవత బ్రాహ్మణస్వరూపంబును ధరించి సత్యము, ప్రసన్నత్వము, అభయము, సుఖము. సంతోషము, యోగము, క్షేమము, సాక్షాద్విష్ణ్వంశభూతులగు నరనారాయణులు తపోవ్రతములు, అనుపుత్రులతోడను; ధర్మపరిపాలకులైన శ్రద్ధ, మైత్రి, దయ, శాంతి, తుష్టి, పుష్టి, క్రియ, బుద్ధి, మేధ, తితిక్ష, లజ్జ అను భార్యలతోడను; తదితరులైన బంధుమిత్రగణంబులతోడను; కల్కిని జూచి తనకార్యమును విజ్ఞాపనముఁ జేసికొనుటకై యచటికేతెంచె. కల్కిమూర్తి యాబ్రాహ్మణునిం జూచి

వినయాన్వితుండై యథావిధిగఁ బూజించి "నీ వెవ్వఁడవు? పత్నీ పుత్రసహితుండవై యెచ్చోనుండి యిచ్చోటికి విచ్చేసితివి? జీవాత్ముఁడు సుకృత విశేషంబున నార్జించినపుణ్యంబుచే దేవలోకంబున వసించి యాపుణ్యము క్షీణించినతోడనే మరల భూస్థలంబునకుఁ ద్రోయంబడుచందంబున నీవిచ్చటికి వచ్చినట్లు చూపట్టెడిని. నీ వేధరణీశుని దేశంబునుండి యిట కేతెంచితివి. నీయొక్క యీపుత్రులు, భార్యలు కడు దీనులై బలపౌరుష వర్జితులై యున్నవారలేమి?" అని ప్రశ్నఁ జేసెను.

ధర్మపురుషుండు కల్కిమాటల నాలకించి కృతాంజలి పుటులై నిలిచి యుండు నిజభార్యాపుత్రులతోడ శ్రీమదిందిరాకాంతుండును, విష్ణుస్వరూపుండును, దయాపరుండును, అగు కల్కిమూర్తికి నమస్కరించి యథావిధిగఁ బూజించి విశేషముగ స్తోత్రముఁ జేసి "ఓస్వామీ! నిజవృత్తాంతంబులఁ జెప్పెద నాకర్ణింపుము. నేను ధర్మపురుషుండ-పరబ్రహ్మస్వరూపుండుగ నుండు నీవక్షఃస్థలంబునుండిజనించినవాఁడ-సర్వప్రాణులకు కామితవరంబుల నిచ్చువాఁడ-సకలదేవతల కగ్రగణ్యుండ - హవ్యకవ్యంబుల నొసఁగువాఁడ-న న్ననవరతంబునుపాసించుప్రాణికోటులకు కీర్తినికలుగఁజేయుచు నీలోకంబున నీయాజ్ఞ చే సంచరించుచున్నవాఁడ. ఇట్టినేను బలిష్ఠుఁడుగ నుండుకలిచేతను,అధర్మపరులైన శక కాంభోజ శబరాదులచేతను తిరస్కరింపఁబడి సంసారదావాగ్ని సంతప్తులై సర్వేశ్వరుండవగు నీపాదారవిందములను సదా భజించు సత్పురుషులమాడ్కి నఖిలజగదండప్రభుండవగు నీచరణకంజంబులమఱుఁగుఁజొచ్చితి నని"మందలించె. ఇట్టి యపూర్వంబగు ధర్మపురుషవచనంబులచే కల్కిపురుషుం డత్యంతసంతోషసమన్వితుండై ధర్మపురుషుని నూరార్చుచు

"ధర్మపురుషా! ఇదిగో చూడుము. కృతయుగపురుషుండు వచ్చి యున్నవాఁడు ధర్మేచ్ఛాపరుండును, సూర్యకులసముద్భూతుండునగు మరుభూపాలుం డేతెంచి యున్నవాఁడు. మఱియు విష్ణువగు నేను బ్రహ్మాదిబృందారకాగ్రగణ్యులచేఁ బ్రార్థింపఁబడి కల్కిస్వరూపంబున భూతలంబున కేఁగుదెంచినాఁడ నని యెఱిఁగితివా? విష్ణుభక్తిరహితులై నీకు కీడుఁ జేయువారిని సంహారించుటకై సైన్యపరివృతుండనై యిదిగోఁ బోయెదను జూడుము. నీయెడ నిసుమంతయైన వంత లేక స్వచ్ఛందవృత్తిని సంచరింపుము. సత్యస్వరూపి యగు నేను నీచెంత నుండఁగా నీ వెందుకు భయంబు నొందెదవు? నీవు యజ్ఞదానతపోవ్రతంబులతోడ భూమియందు సంచరింపుము. నేను సేనాగణంబులను వెంటఁ బెట్టుకొని దిగ్విజయార్థంబుగఁ బోవుచున్నాఁడను. నీవు నిజబంధు మిత్ర జనంబులతోడ శత్రువుల నిగ్రహించుకొఱకుఁ బొమ్ము. నేను నీకు సహాయుఁడ నగుదును" అని చెప్పె. ఇట్టి కల్కిమూర్తి నుడువుల వీనులపండువుగ నాకర్ణించిన ధర్మపురుషుండు మిగుల సంతసించి శత్రుజయార్థం బరుగుటకు సన్నద్ధుఁడై పుణ్యాకరంబగు సిద్ధాశ్రమంబున నిజభార్యాదులను డించి చతుర్వేదము లనురథంబు నారోహించి నానావిధశాస్త్రంబులను బాణంబులుగను,సుసంకల్పమును కార్ముకముగను, సప్తస్వరంబు లశ్వంబులుగను, బ్రాహ్మణులను, సారథులుగను, త్రేతాగ్నులను సింహాసనముగను ధరించి యజ్ఞదానతపోనియమాదులను కాల్బలపరివృతుండై ధర్మగర్హకు లైన శక, కాంభోజ, శబర, బర్బరాదులను జయించుటకై బయలువెడలెను.

కల్కిపురుషుఁడు కలిపురుషునితో యుద్ధముఁ జేయుట.

ఇట్లు కల్కిపురుషుండు బయలువెడలి భూతగణంబుల

తోఁ గూడినదియును, సారమేయావృతంబును, గోమాంసదు ర్గంధపరిపూర్ణంబును, కాకోలూకజంబుక సంకీర్ణంబును, అతిభీ కరాకారంబును, స్త్రీకృతదుష్టద్యూతకలహావాస స్థానంబును, స్త్రీనాయకంబు నైన కలిపురుషస్థానంబు చేరెను. అపుడు కలి పురుషుండు కల్కిపురుషునియుద్ధసన్నాహంబు నాకర్ణించి పుత్ర పౌత్రాదులంగూడి పేచకాంకరథమ్మునై నెక్కి కడుకోపముతో విశసన మను తనపట్టణమునుండి బయలుదేరెను. అట్టితరుణం బున ధర్మపురుషుండు ఋషిగణంబుల వెంటఁబెట్టుకొని కల్కి వచనప్రేరితుండై కలిపురుషునితో యుద్ధంబుఁ జేసెను. అట్టియెడ ధర్మపురుషానుచరులైన ప్రసాదము, అభయము, సుఖము, సంతోషము, యోగము, క్షేమము, స్మృతి, మొదలగువారు, క్రోధము, భయము, నరకము, ఆధి, వ్యాధి, గ్లాని, జర మొద లగు కలిపురుషానుచరులతోడ వివిధాయుధపాణులై యథాక్ర మంబున యుద్ధము సలిపిరి. అట్టిఘోరయుద్ధంబును వీక్షించు నాకాంక్షతోడ నాకసంబున బ్రహ్మాది దేవతలు నిజపరివారం బులతోడ వచ్చి నిలిచిరి.

అట్టి సమయంబున కల్కిపురుషసైన్యాంతర్గతుండైన మరుభూపాలుం డతిభయంకరపరాక్రములైన కలిపురుషాను చరులగు శకకాంభోజాదులతోడను, దేవాపి యనువాఁడు పరి వారసహితుండైన బర్బరునితోడను, విశాఖయూపభూకాం తుండు పుళిందశ్వపచులతోడను, కల్కిపురుషుండు కోకవికోకుల తోడను, నానావిధశస్త్రాస్త్రంబులను ప్రయోగించి యుద్ధముఁ జేసెను.

బ్రహ్మవరంబున గర్వితులును, అసురశ్రేష్ఠులును, మదిం చినవారును, యుద్ధంబునందు పరాక్రమవంతులును, పరస్పరా

కారసదృశులును, దేవతలకుసయితము భయంబును గలుగంజే యువారును, వాహనరహితులై పాదంబులతో నడచుచు హస్తంబుల గదను ధరించి సంగరం బొనర్చుటయందు సమర్థులును, వజ్రాయుధమువలె వతికఠినమైన యవయవములు కలవారును, ఎల్లదిక్కులయందు జయశీలురును, సమవర్తినిసయితము నరకుచేయక సామర్థ్యముతోడ సమరంబు సల్పువారును, లెక్కకెక్కుడగు సేనాగణపరివృతులును, అన్నదమ్ములునైన శోక, విశోకు లను ననురవరులతోడ కల్కిమూర్తి భయంకరసంగ్రామంబుఁ జేసెను. తురగహేషితఘోషంబుచేతను,గజగర్జితంబుచేతను,భటనివహదంతసంఘర్షజనిత కటకటాత్కారంబుచేతను, ధనుష్టంకారంబుచేతను, శూరజననివహసింహనాదంబుచేతను, బాహువేగజనితశబ్దంబుచేతను, తలప్రహారఘోషంబుచేతను, ఎల్లదిక్కులు బల్లిదంబుగ నల్లుకొనెను. అపుడు సమస్తభువనంబులు సుఖరహితంబు లయ్యె. దేవత లెల్ల భీతిఁజెంది మార్గంబులు గోచరింపక ఆకసంబున నానాదిక్కులకుం బాఱిరి. అపుడుభయసేనాంతర్గతు లైన యుద్ధశూరులు, పాశ, దండ, ఖడ్గ, శక్తి, యష్టి, శూల, గదా, బాణాది వివిధాయుధఘోరప్రహారంబులచే హస్తపాదాద్యవయవంబులు ఛిన్నభిన్నంబులై గుంపులుగుంపులుగ యుద్ధభూమింబడిరి.

ఇది తృతీయాంశమునందు షష్ఠాధ్యాయము.

సప్తమాధ్యాయము.

ఇట్లు కడుభయంకరంబైన సంగరంబు ప్రవర్తించుచుండ ధర్మపురుషుం డతికోపముతో కృతయుగపురుషసహితుండై కలిపురుషునితోడ సంగ్రామం బొనర్చె.

చుంచుగంధముతో తుల్యమయిన శరీరగంధము, వికారమైన ముఖము గలకలిపురుషుండు ధర్మ, కృతయుగపురుషుల తీవ్రబాణజాల ప్రహారంబులచే పరాభూతుండై తానెక్కియుండు గర్దభవాహనంబును వదలి రక్తధారాసహిత నిజాంగంబులు కలవాఁడై, స్త్రీనాయకమైన అనఁగా స్త్రీలేయజమానులుగాఁగల తనమందిరంబులోనికిం బోయి దాఁగె. దంభుఁడను కలిపురుషానుచరుఁడు ధర్మపురుషానుచర బాణపీడితుండై అతిఖేదముతో చేవదక్కి నిజమందిరంబున దాఁగె. లోభుండు ప్రసాదుం డను కల్కిపురుషానుచరునిగదచే చీల్పఁబడిన తలగల్గి కుక్కలచే నీడ్వఁబడిన తనరథమునువదలి నోట రక్తమును గ్రక్కుచు తన గృహంబున దాఁగె. క్రోధుండు అభయునిచేఁ గొట్టఁబడి తన చుంచువాహనంబును వదలిమరణంబు నొందెను. భయము సుఖముచే ప్రహారింపంబడి విగతప్రాణుఁడై మహిం బడె నిరయమనువాఁడు సంతోషమను కల్క్యనుచరునిముష్టిఘాతంబుచే పీడింపంబడి యమసదనంబునకుం బోయె. ఆధివ్యాధ్యాదు లెల్లరు కల్కిమూర్త్యనుచరవివిధాయుధనివహంబులచేఁ బ్రహృతులై భయమును జెందినానాదేశంబులకుం బరువులిడిరి. ధర్మకృతయుగపురుషు లిరువు రతివేగముతో విశసనము నామముగల కలిపత్తనంబుఁ జొచ్చి బాణాగ్నిచే అన్నగరంబును కలిపురుషసహితంబుగ దహింపఁజేసిరి. ఇట్లుకలిపురుషుండు సర్వాంగ

ములు దహింపఁబడినవాఁడై పరాభవము నొంది మృతులైన నిజపత్నీపుత్రులకై వెక్కుడుగ నేడ్చుచు నేకాకియై నెవ్వరికంటికగపడక యెందేనియుంజనెను. మరుభూపుండు శకకాంభోజులను నిజాయుధంబులచే హతముచేసెను. దేవాపి శబర, చోల, బర్బరులను వారివారి సైన్యసహితంబుగ నానావిధశస్త్ర ప్రహారంబులచేఁ బీడించెను విశాఖయూపభూపాలుండు పుళిందపుల్కసాదులను తీక్ష్ణఖడ్గ ప్రహారంబులచే నశింపఁజేసెను. ఇట్లు కలిపురుషానుచరులెల్లను కల్కిపురుషానుచరులయొక్క నానావిధబాణపరంపరలచే హింసింపంబడి నశించిరి.

——కోకవికోకవధము——

పిదప యుద్ధంబొనర్చుటయందు నేర్పరులైన వారికన్న మిక్కిలి సామర్థ్యముగల కల్కిమూర్తి గదను హస్తతలంబున ధరించి కోకవికోకుల కెదురై సర్వలోకంబులకు భయోత్పాతంబగు యుద్ధంబుఁ జేయుట కుపక్రమించె. తొల్లి మధుకైటభాసురలతో యుద్ధముఁ జేసినటులు శకుని యను అసురునికి మనుమలుగ, వృకాసురునికి పుత్రులుగ నుండు కోకవికోకులతో సమరంబుఁ జేసెను. అపుడు కోకవికోకగదాప్రహారంబుచే అలయికనొందినశరీరముగల కల్కిమూర్తిహస్తతలంబునందుండి గదాయుధము భూమిజారె. దానిందిలకించిఅచ్చోనుండు దేవమనుష్యాదులు అయ్యయ్యో యని కుయ్యలిడిరి. సర్వలోకజైత్రుండుగ, మహాబాహుబలగర్వితుండుగ నుండు కల్కిమూర్తి అతికోపావిష్టహృదయుండై భల్లాయుధంబుచే వికోకునిశిరంబును తెగనఱికి మరణంబు నొందించెను. అట్లు నీల్గినవికోకుండు నిజానుజుండగు కోకునిదర్శనంబుచేఁ బునర్జీవితుండై లేచి నిలిచెను. దానిం గని కల్కిపురుషాద్యమర

గణంబులు ఇదియేమి! ఇదియేమి ! అని మహాశ్చర్యమును జెందిరి. కల్కిమూర్తి కోకునిశిరమును ఖడ్గముచే ఖండించెను. చచ్చిన కోకుండు వికోకునిదర్శనంబుచే మరలజీవించినిలుచుచుండెను.

ఇటులు మహాబలపరాక్రమసంపన్నులుగ, కామరూపధరులుగ, సాక్షాత్కాలమృత్యువ్యతుల్యులుగ, ఖడ్గాద్యాయుధధరులుగ నుండుకోకవికోకులు నొక్కటిగఁ జేరి కల్కిమూర్తిని మిక్కుటముగఁ గొట్టిరి. అట్టియెడ కల్కిమూర్తి కోపారుణితలోచనుండై బాణంబుచే కోకవికోకులను స్తకంబును ఛేదించి భూమింబడవైచె. మరల వారిశిరంబులు తోడనే యెప్పటివలె కంఠంబునం జేరె. దానిం జూచి కల్కి మూర్తి యిది యేమి యని చింతాకులమానసుం డయ్యెను. అట్టిసమయంబున కల్కివాహనం బగు తురగశ్రేష్ఠంబు అంతకసదృశులుగ, ఇంద్రాదుల చేనయితము జయించుట కశక్యులుగ నుండు కోకవికోకులను పాదప్రహారాదులచే మెండుగ మథించెను.అట్లు కల్కివారువంబుచేఁ గొట్టంబడిన కోకవికోకులు కడుకోపముచే నెఱ్ఱగఁ జేయంబడిన నయనంబులతోడ నాయశ్వంబును బాణవర్షంబుచే నెక్కుడుగ నొప్పించిరి. అపు డాయశ్వము కినుకచే కోకవికోకులవక్షంబును నిజదంతంబులచేఁ గొఱికెను. గుఱ్ఱంబుచే సంధిబంధంబులు చూర్ణంబుఁ జేయంబడిన కోకవికోకులు పసిబాలురు ఆవుతోఁకను బట్టుకొనునట్లు ఆగుఱ్ఱపుతోఁకను బట్టుకొనిరి అట్టియెడ వారువంబు నిజపాదఘట్టనచే వారివక్షఃస్థలంబున మెండుగ తన్నెను పదఘాతంబుచే నొప్పింపఁబడినకోకవికోకులు మూర్ఛఁజెంది నేలంబడి మరల లేచి కల్కిమూర్తి కట్టెదుట దిట్టంబుగ నిలచి కఠినోక్తుల నొక్కి వక్కాణించుట కుపక్రమించిరి.

అట్టితరుణంబున బ్రహ్మదేవుండు కల్కిసమీపంబున
కేతెంచి నమస్కారముఁ జేసి "స్వామీ! ఇకోకవికోకులు శస్త్రా
స్త్రప్రయోగంబుచే మరణంబుఁ జెందనేరరు. కరప్రహారంబుచే
వీరిరువురిని నొక్కపెట్టున • నేకకాలంబునం గొట్టవలయు నని
నిర్ణయింపఁబడియున్నది. ఇట్లు చేయనిచో వీరిరువురిపరస్పరదర్శం
బుచే బొత్తిగ చావక బ్రతుకుచుందురు. నీవీసంగతిఁ జక్కఁగ
నెఱింగి వారిమారణక్రమంబు చింతించి చంపు" మని చెప్పె.
ఇట్లు నలుముఖంబులు గలనలువవచనంబుల నాకర్ణించి కల్కి
మూర్తి దిగ్గున నిజవాహనాయుధాస్త్రంబులను వర్జించి తన్ను
గాఢంబుగ మర్దించుచుండు కోకవికోకసమక్షంబున నిలచి వజ్రా
యుధంబువలె కఠినంబుగ నుండు తనపిడికిటిగ్రుద్దులచే నిరువు
రిని నేకకాలంబున మస్తకంబునం బొడిచెను. అపుడు దేవతలకెల్ల
రకు భయంబు నాపాదింపంజేయు కోకవికోకులు కల్కిమూర్తి
ముష్టిప్రహారంబులచేఁ జక్కఁగఁ బ్రహరింపంబడి చూర్ణము
చేయఁబడిన శిరములుగలవారలై శిఖరము భగ్నంబై నేలం
బడు పర్వతములచందంబున నేలకొరగిరి. అట్టితఱిని దేవతల
కజేయులగు కోకవికోకులను అశ్రమంబున సాధారణమనుష్యా
కారముగల కల్కిమూర్తి వధించిన క్రమంబునుం గాంచి
గంధర్వులు మిక్కుటముగ సంతోషంబున నర్తంబుఁ జేసిరి.
అప్సరోగణంబులు గానంబుఁ జేసిరి. సిద్ధచారణాదులు కల్కి
మూర్తిప్రభావంబున కచ్చెరువొంది విశేషంబుగ స్తుతించిరి.
దేవతలు సంతోషభరితచిత్తంబున కల్కిమూర్తిపై విరుల
సోనం గురిపించిరి. ఆకసంబున దేవదుందుభివాద్యంబులు చె
లఁగె. దిక్కులు ప్రసన్నంబు లయ్యె. కోకవికోకవధంబునకై
సంతసించిన కల్కి అనుజుండగు కవి యనునాతఁడు పదివేల

మహారథులను, ప్రాజ్ఞుండు లక్షయోధులను, సుమంత్రుఁడిరువదియయిదువేల రథికులను జంపిరి. గర్గభర్గవిశాలాదులు మహారథికులుగను, యుద్ధంబున మదించిన నిషాదమ్లేచ్ఛబర్బరాదులగు పెక్కుదండిమగలను నుక్కడంచిరి. ఇప్పగిది కల్కిమూర్తి గర్గభర్గాదులతోఁగూడి శత్రుభంజనంబుఁజేసి భల్లాటనగరంబుపైకి దండెత్తుట కారంభించి నానావిధవాద్యంబులతోడను, దివ్యాస్త్రధరులుగ, నానావిధవస్త్రభూషణాలంకృతులుగనుండు సైన్యంబుతోడను, వివిధాభరణభూషితంబులుగనుండు గజాదివాహనంబులతోడను ఛత్రచామరంబులతోడను యుద్ధంబునకు బయలువెడలె.

ఇది తృతీయాంశమునందు సప్తమాధ్యాయము.

అష్టమాధ్యాయము.

భల్లాటనగరంబున శశిధ్వజకల్కిసేనలకు యుద్ధము.

సకలలోకనాయకుండుగ, సాక్షాన్నారాయణస్వరూపుండుగ నుండు కల్కిమూర్తి సేనాగణపరివృతుండై ఖడ్గంబును ధరించి యుత్తమాశ్వంబు నెక్కి భల్లాటనగరంబునకుఁబోయె. పదివేలగజంబులబలంబునకుఁ దుల్యంబైన బలంబుగలవాఁడును, మంచిబుద్ధికలవాఁడును, ఎల్లప్పుడు కృష్ణభజనఁ జేయుటయందాసక్తుఁడును, గొప్పపరాక్రమము గలవాఁడును, యోగమార్గాసక్తచిత్తుండును నగు భల్లాటనగరాధిపుండగు శశిధ్వజుండు కల్కిపురుషుని శ్రీమదఖిలాండప్రభుండగు విష్ణుమూర్తి యని డెందంబునం దలంచి ఆనందాతిశయ జనితరోమాంచకవచిత

సకలావయవుండై సేనానివహంబుల వెంటఁ బెట్టుకొని కల్కిమూర్తితోడ యుద్ధముఁ జేయుటకై బయలువెడలె.

అపుడు విష్ణువ్రతపరాయణురాలుగ సుశాంత యనుపేరం బరంగునదిగ నుండు శశిధ్వజమహారాజుపట్టపుదేవి కల్కిమూర్తితోడయుద్ధంబుఁ జేయుట కుపక్రమించుచుండు నిజభర్తం గాంచి "ఓనాథ! మన్మథకోటిసుందరగాత్రుండుగ, సకలజగన్నాథుండుగ, సకలజగదంతర్యామిగ, సకలలోకప్రభుండుగ, సాక్షాన్నారాయణస్వరూపిగ నుండు కల్కిమూర్తిని నీ వెట్లు యుద్ధంబునం గొట్టుటకై యత్నించెదవు?" అని ప్రశ్నఁ జేసె. ఇటులడిగిన నిజభార్యంజూచి శశిధ్వజుండు "కాంతాతిలకమా! చెప్పెద దత్తావధానచిత్తంబున నాలకింపుము. యుద్ధరంగంబునం దోఁచువారు గురువులుగ, శిష్యులుగ, స్వామిగ నుండినను నెల్లవారిని ప్రహరించుట యనునది క్షత్రియులకు ముఖ్యమైనధర్మ మని బ్రహ్మచే నిర్మింపంబడినది. క్షత్రియుండు శత్రువుల ప్రహరించిన నిహంబున రాజభోగం బతిసులభంబుగఁ జెందును-అటుగాక శత్రువులచే రాజు సంహరింపంబడిన పరంబున వీరసుఖంబును జెందుట కిసుమంతయైన సందియంబు లేదు అగుటచే యుద్ధంబునఁ గలుగుజయము గాని మరణముగాని క్షత్రియులకు సుఖప్రదంబుగఁ జూపబ్టెడిని"

ఇట్లు వక్కాణించుభర్తం జూచి సుశాంత "ప్రాణనాయకా! దేవత్వరాజత్వంబులు విషయాసక్తచిత్తులుగ ఉన్మత్తులుగ నుండువారికిఁ గలుగుట సహజమే కాని విష్ణుపాదసేవకులకుఁ గలుగనేరవు. నీవు ఈశ్వరుని సేవించువాఁడవు, కల్కిమూర్తి సకలలోకంబుల కీశ్వరుండు, నీవు కామనారహితుండవు, అతఁడు సకలాభీష్టప్రదుండు, ఇట్టి మీ రిరువురికి యుద్ధం బెటులు కలు

గును”ఇవ్విధంబున వచించిన పత్నింజూచి శశిధ్వజుండిట్లనియె.

“సుశాంతా! ద్వంద్వాతీతుం డైన యీశ్వరునికిఁగాని, లేక యీశ్వరభక్తులకుఁగాని, దేహాభిమానమువలన ద్వంద్వగుణములు గలిగినను, అవి భగవంతునిలీలలుగాఁ బరిణమించును. దేహావేశమువలన నీశ్వరునికి కామాదిదేహసంబంధగుణములు కలిగినను, అవి భగవంతునిమాయచే కలుగుచున్నవని యెన్నుము. అవి విషయంబులు కానేరవు. సకలలోకేశ్వరుండై యుండుట, తత్సేవకుం డగుట, మొదలగునవి సాక్షాద్భగవంతునిమాయావిలాసం బని యార్యులచేఁ జెప్పఁబడును. అట్టిమాయ ప్రాణికోటులకు ధర్మార్థకామము లను త్రివర్గమును కలుగఁజేయును. కావున నేను సేనాగణపరివారసహితుండనై కల్కిమూర్తితో యుద్ధంబుఁ జేయుట కరుగుచున్నాఁడను. నీవు కమలానాయకుండగు భగవంతునిబూజింపుము” అని యిట్లువక్కాణించినపతిపలుకుల నతిశ్రద్ధతో నాలకించి “నాయకా! విష్ణుభక్తాగ్రేసరుండ వైననిన్ను భర్తగాఁ బొంది కృతార్థత నొందితి. మానవులకు విష్ణుభక్తి యిహపరలోకసాధకంబులకు ముఖ్యంబుగఁ జూపట్టుచున్నది.” శశిధ్వజుం డిట్లు పతివ్రతాశిరోమణియైన సుశాంతమంజుభాషణంబుల సంతసంబున నాలకించి యాయింతిని నాలింగనముఁ జేసి యానందాశ్రుపరిపూర్ణ నేత్రయుగళుండై భగవన్నామంబులను వాక్కున నొక్కి వక్కాణించుచు భగవంతునిరూపంబును మనంబునం దలపోయుచు శూరజనపుంజపరివృతుండై యుద్ధంబునకు బయలుదేరి కల్కిసేనామధ్యంబునం బ్రవేశించి యాసేనను బాఱఁదోలెను. మహాబలవంతుండును, విలుకాండ్రకెల్లరికి శ్రేష్ఠుండునైన శశిధ్వజసూనుండగు సూర్యకేతుండు మరుభూపునితో యుద్ధంబుఁ

చేసెను. గదాయుద్ధంబున కడు నేర్పరిగ నుండు సూర్యకేతుని యనుజుండైన బృహత్కేతువు దేవాపితోడ యుద్ధంబునకుఁ బ్రారంభించెను. విశాఖయూపుండు గజయూథపరివృతుండై వివిధశస్త్రంబుల ధరించి శశిధ్వజునితో సమరంబునకుఁ గడఁగె. మిక్కిలి ప్రతాపవంతుఁడును, ధనుర్ధరుండు నైన రుధిరాశ్వుండు రజస్యైన అనువానితోడను, భర్గుఁడు శాంతునితోడను భీషణ యుద్ధంబుఁ జేసిరి కల్కి శశిధ్వజసేనలకు పరస్పరము శూల ప్రాసగదాబాణశక్తియష్టితోమరభల్లఖడ్గభుసుండీకుంతాదినా నావిధాయుధప్రహారంబులచే భీకరసంగ్రామంబు ప్రవర్తించె. మఱియు,పతాకాధ్వజచ్ఛత్రచామరతోమరంబులచేతను,యుద్ధసమ్మర్దసముదితధూళీపటలంబుచేతను, గాఢాంధకారము ప్రవర్తించెను. అట్టి యద్భుతయుద్ధంబును జూచు నాకాంక్షచే దేవదానవగంధర్వవిద్యాధరసిద్ధచారణాదు లెల్లరు వచ్చి యాకసంబునందు నివసించుచుండిరి శంఖదుందుభివాద్యధ్వనులచేతను, భుజాస్ఫోటనరవంబులచేతను, గజగర్జితనాదంబులచేతను,హయహేషితఘోషంబులచేతను, శూరజనకృత సింహనాదంబులచేతను, లోకంబులెల్ల మూఁకతం జెందె. రథికులు రథికులతోడను,పదాతులు పదాతులతోడను, తురగంబులు తురగంబులతోడను, గజంబులు గజంబులతోడను తొల్లి దేవదానవులు యుద్ధంబుఁ జేసినచందంబున కల్కిసేనాధిపతులు శశిధ్వజసేనాధిపతులతోడ యమునగరంబును వృద్ధిసేయునట్టిఘోరయుద్ధమును జేసిరి. కల్కిశశిధ్వజసైన్యాంతర్గతసైనికు లొండురులందాఁకి యాయుధప్రహారంబులచే హస్తపాదకంధరాదులు ఛేదింపంబడినవారలై రుధిరప్రవాహంబుచేఁ దడుపఁబడినగాత్రంబులతోడ వికృతఘోషంబుతో గుంపులుగుంపులుగ నేలంబడిరి.

మఱికొందఱు గజాశ్వరథాదులసమ్మర్దంబున భూమింబడి ప్రాణంబులం గోలుపోయిరి. అపుడు సమరభూమియందు భూతనివహంబుల కత్యంతసంతోషజనకంబును రక్తప్రవాహాభరితంబు నైన రక్తనది యుచటం బ్రవహించె. ఆనదియందు వీరభటపరివేష్టనంబులు హంసలమాడ్కిగను, గజశ్రేష్ఠంబులు గట్టులచందంబునను, రథంబులు నావలవలెను, వీరభటహస్తపాదాద్యవయవంబులు మత్స్యంబులభంగియును, స్వర్ణాభరణంబులు సైకతంబులచాడ్పునను పరిణమించె. అంతకసముండును, అజేయుండును నగు సూర్యకేతువు మరువుతోడ సమరం బొనర్చి వానిని బాణంబులచేఁ బీడించెను. అపుడు మరువు సూర్యకేతుబాణంబులచే నెక్కుడుగ బాధింపంబడి వాఁడిగల పదినారాచంబులచే సూర్యకేతుమేని నొప్పించె. మరుబాణహతుం డైనసూర్యకేతువు మిగుల కోపావేశపగీతుండై వానిరథంబునకుఁ గట్టియుండు గుఱ్ఱంబులను పాదతాడనంబుచే నేలకుం ద్రోసి రథంబును చూర్ణంబుచేసి మరురాజునురంబును గదచేఁ గొట్టెను. గదాప్రహారంబుచే మరుభూపుండు మూర్ఛఁజెంద వానిసారథి యాభూపాలుని మఱియొక రథంబునం దిడుకొని యొకానొకస్థలంబునకుఁ గొంపోయె.

పదంపడి యతిబలిష్ఠుఁ డైనబృహత్కేతు వాకర్ణాంతము ధనుస్సు నాకర్షించి హిమజాలము సూర్యునిం గప్పుటంబోలె బాణజాలంబులచే దేవాపినిం గప్పెను. అట్టియెడ దేవాపి బృహత్కేతుబాణవర్షంబును లెక్కింపక నిజదివ్యాయుధంబులచే ఖండించి వానిశూలాయుధంబు నతిక్రూరసాయకంబులచే తునియ లగునట్లుచేసి వానిం గొట్టెను. అపుడు బృహత్కేతువు మఱియొక దివ్యబాణంబును గ్రహించి స్వర్ణపుంఖంబు

లతోఁ గూడినదియును, మిగుల వాఁడికలదియు నైన బాణంబులచే దేవాపిని సైన్యసహితంబుగఁ బ్రహరించెను. దేవాపియు అతితీక్ష్ణసాయకంబులచే బృహత్కేతుధనుస్సును ఖండించెను. ధనుస్సు ఖండింపఁబడిన బృహత్కేతువు ఖడ్గపాణియై దేవాపిని రథగజతురగసారథి సహితంబుగ ఛేదింప దేవాపి ఎక్కుడుకోపంబున కరతలప్రహారంబుచే శత్రువునుగొట్టి వానిని గాఢంబుగ నాలింగనముఁజేసికొని నిజవక్షంబునం బట్టి గట్టిగ నదిమి మథించెను. ఇట్లు శత్రువుచే నీల్గినవాఁడును, పదియాఱువత్సరంబు లాయుఃపరిమితి గలవాఁడును, అగు తనతమ్ముని జూచి సూర్యధ్వజుండు దేవాపి నొదలను వజ్రాయుధప్రహారతుల్యంబగు ముష్టిప్రహారంబుచేఁ గొట్టి మూర్ఛఁజెందునట్లు చేసి వానిసేనాగణంబులను చీకాకునొందించెను. అట్టిసమయంబున శశిధ్వజుండు సర్వజగన్నివాసభూతుండును, సూర్యతేజంబు నతిక్రమించిన తేజోఘనుండును, అభినవజలధరశ్యామవర్ణుండును, పీతాంబరధరుండును, తామరససదృశనయనయుగళుండును, ఆజానుబాహుండును, మనోహరకిరీటభూషణాలంకృతుండును, నానావిధరత్నజాలఖచిత దివ్యాభరణాలంకృత నిజశరీరశోభాతిశయంబుచే సమస్తజన నయనహృదయాంతర్గతాంధకారంబును బోఁగొట్టువాఁడును, ధర్మపురుషకృతయుగపురుషులచేఁ బూజితుండును, విశాఖయూపాదిరాజకుమారపరివృతుండును,సకలలోకప్రభుండును నైన కల్కిమూర్తిని సముఖంబున వీక్షించెను.

ఇది తృతీయాంశమునందు అష్టమాధ్యాయము.

నవమాధ్యాయము.

—॥ కల్కి శశిధ్వజుల యుద్ధము. ॥—

తదనంతరము శశిధ్వజుండు నిజహృదయధ్యానగోచరమయిన కల్కిస్వరూపమును సాక్షాత్తుగ వీక్షించి ఖడ్గబాణధనుర్ధరుండును, ఉత్తమతురగారూఢుండును, దివ్యాభరణభూషితతనుండును, సకలభువనపాపసంహారణార్థం బవతారము సేసినవాఁడును, పరమాత్మస్వరూపుండునైన కల్కిమూర్తినిం జూచి పులకాంకితగాత్రుండై "పుండరీకనయనా! నాహృదయంబును నీబాణంబులచేఁ గొట్టుము. అట్లుగాదేని బాణభయజనితతమోవ్యాకులంబైన నాహృదయంబునం బ్రవేశింపుము. ఇపు డేను నీతోఁ జేయుయుద్ధంబునందు నిర్గుణుండవును, అద్వైతుండవును, నిష్కాముండవును, అసహాయుండవును, పరమాత్మస్వరూపుండవునైన నీనుగుణశాస్త్రప్రహార, జయోత్సాహ, సేనాసన్నాహాదులను లోకజనంబులు చూతురుగాక" యని చెప్పె. అట్టి శశిధ్వజమహారాజవాక్యంబుల నాకర్ణించి కల్కిమూర్తి క్రోధరహితుండై యుండినను క్రోధంబుగలవానివలె నభినయించి యుద్ధంబున బాణంబుచే వానిం గొట్టెను. శశిధ్వజుండు కల్కిప్రయుక్తనారాచంబుల సరకుసేయక పయోధరమండలంబు నిజధారావర్షంబుచే పర్వతంబుల మోదుచందంబున విశిఖవర్షంబుచే కల్కిమూర్తి మేనిని గొట్టెను. శశిధ్వజబాణవర్షంబుచేఁ బ్రహరింపంబడినసర్వావయవములు గల కల్కిమూర్తి శశిధ్వజుని దివ్యశస్త్రాస్త్రసమవాయంబులచేఁ గొట్ట వారిరువుర కపుడు పరస్పరము బ్రాహ్మ, వాయవ్య, పార్వతాగ్నేయ, పార్జన్య, పాన్నగ, గారుడప్రభృతి నానావిధాస్త్రపటలంబులచే ఘోరసమరంబు

జరిగెను. అట్టిసమయంబున నింద్రాదిసకలలోకపాలుగు దేవతా గణంబులు వీరలెల్లరు బాణాగ్నిసంతప్తులై మహాప్రళయం బౌనన్నం బైనట్లుదలంచి యాకాశమార్గంబు ననుసరించి పలు త్రోవలం బరువిడిరి. కల్కిశశిధ్వజులు గొంతకాలము దివ్యాస్త్ర గణంబులచే యుద్ధము సేసి పిదప నస్త్రంబులను పరిహరించి బాహుయుద్ధంబునకు మొదలువెట్టి పాదప్రహార ముష్టిప్రహా రాదులచే నొకరి నొకరు దృఢముగఁ గొట్టుకొనుచు పరస్పర పరాక్రమాతిశయములను ప్రశంసచేసికొనుచు మిగుల సంతో షమును జెందుచుండిరి. పదంపడి కల్కిమూర్తి కరతలప్రహా రంబుచే శశిధ్వజుని గట్టిగఁ గొట్టిన వాఁడు మూర్ఛఁజెంది భూ మిం బడి మరల తత్క్షణంబున లేచి అతికోపముతో వజ్రాయు ధమునకు సమానమైన తనపిడికిటిగ్రుద్దుచే తనశక్తికొలఁది కల్కిమూర్తిని మోద నతండు మూర్ఛఁజెంది నేలం బడెను. అపుడు మూర్ఛచే మహిం బడి యుండుజగదీశ్వరు నెత్తుకొని పోవుటకై ధర్మపురుషకృతయుగపురుషు లేతెంచిరి. అత్తటి శశిధ్వజుండు కల్కిమూర్తిని నిజవక్షఃస్థలంబున నదుముకొని ధర్మపురుష కృతయుగపురుషులను రెండుచంకలయం దిరికించు కొని సకలలోకనాయకుండైన కల్కిమూర్తిని జయించుటచే కలిగినసంతోషవిశేషంబున గగుర్పాటుఁ జెందినదేహముకల వాఁడై నిజగృహంబునకుం బోయి విష్ణుపూజామందిరంబున విష్ణుభక్తిపరాయణ లైన నిజనఖిలలామంబులతో సంగీతనర్త నాదులను సల్పుచుండునాత్మపత్ని యైన సుశాంతాకాంతామ ణిం జూచి "పద్మగంధీ! దేవతాసముదయప్రార్థనా వాక్యంబు లచే మ్లేచ్ఛపాషండాది పాపజనంబుల మడియించి లోకంబున కృతయుగధర్మంబులను స్థాపించుటకై యవతరించియుండు

సాక్షాత్పరమాత్మస్వరూపుండైన కల్కిమూర్తి నాతో భీకర సంగ్రామంబుఁ జేసి మద్బాణప్రహార జనితమూర్ఛావ్యాజంబున భక్తాగ్రేసరురాలవైన నీకు దర్శన మిచ్చి మనల నుద్ధరించుటకై యిచటికేతెంచి యున్నవాఁడు. ఇదిగోఁ జూడుము కల్కిమూర్తి నావక్షఃస్థలంబునందున్నవాఁడు. కృతయుగపురుష ధర్మపురుషులు నాకక్షంబులం జేరి యున్నవారలు. సాక్షాత్పరమాత్మస్వరూపిగ నుండు నీ కల్కిమూర్తిని నీవు పూజింపు" మని చెప్పె. ఇట్లు వక్కాణించిన పతివాక్యంబులనువిని సుశాంత సంతోషస్వాంత సమన్వితయై కృతయుగధర్మపురుష సహితుండును, లోకనాథుండునైన కల్కిమూర్తికి పునఃపునఃప్రణామంబు లాచరించి యథావిధిం బూజించి హరిభజనంబుఁ జేయుచుండెను.

ఇది తృతీయాంశమునందు నవమాధ్యాయము.

దశమాధ్యాయము.

— సుశాంతాగీతము —

పదంపడి సుశాంతాకాంత భక్త్యతిశయముచే కల్కిమూర్తివిషయమై యాక్రింద ప్రతిపాదించియుండు నర్థముగల గీతమును గానముఁ జేయుట కారంభించెను.

"కల్కిమూర్తీ! అతులపరాక్రమవిక్రముండవైన నీవు సర్వోత్కృష్టుఁడవుగ నుందువుగాక. ఇంద్రాది దేవబృందముచే వందితంబును, నానావిధభూషణభూషితంబును, సత్పురుషులచే నెల్లపుడు పూజితంబు నైన నీపాదారవిందములను నామె

దుటికిం దెచ్చి నిలుపుము. నామనంబు నాశ్రయించియున్న యజ్ఞానపటలంబును పాఱఁదోలుము. నీశరీరము, లోకంబునం గల యెల్లసౌందర్యంబులచే నొక్కటిగాఁ జేయఁబడినదియును సజ్జనులమానసంబులయం దెల్లపుడును ధ్యానింపఁబడినదియును, మన్మథునికినయితము మోహంబును కలుగఁజేయునదియును, జూచువారి కందఱికి కామమును పుట్టించునదియునై యున్న యది. ఇట్టి నీదివ్యరూపంబును నాకంటి కగపఱుపుము. నీకీర్తి సకలలోకశోకంబులను బోఁగొట్టి యెల్లరికి ప్రీతిని కలుగఁజేయుచున్నది. నీముఖమండల మమృతతుల్యమైన మందహాసము తోఁగూడి పూర్ణచంద్రునివలెఁ బ్రకాశించుచున్నది. నీకరంబులు తామరసపుష్పంబులకు సమానంబై యెల్లలోకంబులకు మంగళంబుల కాకరంబై యున్నవి. భువనంబుల కెల్ల నజేయుండగు నాప్రాణనాయకుండు నీకు నిక్కంబుగ నపకారం బొనర్చియుండినయెడల నాతని నీవు శత్రువుగా భావించి సంహరింపుము. అట్లు లేకుండిన సర్వలోకేశ్వరుండవైన నీ వతనియందు కరుణింపుము. ఇమ్మానవశరీరంబు నీయొక్క ప్రకృతి. మఱియు నది మహదహంకారపంచతన్మాత్రలచే నిర్మాణము చేయఁబడి యున్నది. అట్టి యీశరీరము నీదర్శనంబుచే బ్రహ్మానదృశ మయి నది. భూమ్యాకాశవాయుజలతేజస్సముదాయముచేతను, శరీరేంద్రియములచేతను, రజస్సత్త్వతమోగుణస్వరూపం బైన నీమాయచేతను, మనుజులు సంసారమునందు బద్ధులై యున్న వారు. నీపాదారవిందసేవాసక్తులయం దీవు కరుణింపవలయును. సకల కళ్యాణగుణంబులకు స్థానంబును, సమస్తపాపములం బోఁగొట్టునదియును, సంసారబంధవిముక్తంబును, మిగుల పరిశుద్ధంబునైన నీనామం బనవరతంబు భజించువారు జన్మజరా

మరణరూపమైన సంసారమును జెందనేరరు. సత్పురుషులకు సంతోషసమృద్ధిఁ జేయునదియును, అసురకులక్షయకరంబును, దేవగణపరిపాలితంబును, కృతయుగము, ధర్మము మొదలగు వానిని వృద్ధిచేయునదియు నైన నీయవతారము మాకు క్షేమకరముగ నుండుఁగాక. పతిపుత్రబంధుమిత్రపరివృతంబును, రథగజతురగచ్ఛత్రచామరాది పరివారపరిపూర్ణంబును, ముక్తామాణిక్యాదిరత్నగణాలంకృతంబు నైన నామందిరము నీపాదపంకజరజస్సంబంధమువలన విశేషకాంతిఁ జెందినది. సుందరమందహాసముతోఁ గూడినదియును, మనోహర మధురగంభీరధ్వని గలదియును, అతిసుందరంబు నైన నీయాననం బపాంగదృష్టిచే నన్ననుగ్రహింపక యుండిన నాకిపుడే మరణంబును గలుగఁ జేయుము. ఉత్తమాశ్వంబుపై నెక్కి సంచరించువాఁడవును, భక్తజనభయాపహారుండవును, సకలసురనికరశరణ్యుండవును, అతితీవ్రతరసాయకగణమథితశత్రుసైన్యనివహుండవును భక్తజనసంసారతాపనివర్తకుండవును, రాకాచంద్రబింబకోటిసమానసుందరవదనారవిందుండవు నైన ఓకల్కిమూర్తీ! నీవు జయంబును చూఱగొందువుగాక.''

ఇట్లు గానముఁ జేసిన సుశాంతాగీతము నాలకించి కల్కిమూర్తి సంతుష్టచిత్తుండై యుద్ధరంగంబునందుండి వెలువడు శూరునిచందంబున లేచి తనకెదుట సుశాంత, యెడమపార్శ్వంబున కృతయుగపురుషుండు, కుడినైపున ధర్మపురుషుండు, వెనుకటిభాగమున శశిధ్వజుండు నిలచి యుండుటనుం గాంచి కడు లజ్జావనతవదనుండై సుశాంతనుద్దేశించి "పద్మపత్రములకు సమానమైన నేత్రములుగల భామామణీ! నీవెవ్వతెవు? నన్నేమికతంబున నమస్కరించి స్తుతించెదవు? మిగుల బలపరాక్రమశాలి

ద్యైన శశిధ్వజుండు నావెనుకటిభాగంబున నేల నిలిచి యున్న వాఁడు?" అనియడిగి ధర్మదేవతాకృతయుగపురుషులనుం జూచి "ఓధర్మదేవతా! ఓకృతయుగపురుషుఁడా! మనము రణరంగంబున శశిధ్వజునితో యుద్ధమును జేయుచు నుంటిమిగదా! అచట నుండి శత్రునియంతఃపురంబున కెవ్విధంబున వచ్చితిమి? శత్రుండైన శశిధ్వజునిభార్య శత్రుండైన నన్ను మిగుల భక్తితో నేల పూజించుచున్నది? శూరమానియైన శశిధ్వజుండు మూర్ఛం జెందిన నన్నేమికతంబునఁ జంపక యున్నవాఁ?" డని యడిగెను. ఇట్టికల్కిమూర్తిపలుకుల నాలకించి సుశాంత కల్కి నుద్దేశించి "సకలభువనరక్షకా! స్వర్గమర్త్యపాతాళంబులంగల సురాసురనరపశుపక్ష్యాదిసకలజంతుజాలంబులయందు సాక్షాన్నారాయణమూర్తివైన నిన్నుభజింపనిప్రాణిగలదా! సకలజగంబులకు మిత్రులై నీపాదపద్మములను భజనసేయువారి దర్శనమాత్రంబున మానవులకు సహజశత్రుభావము నశించుచుండె నీకు సాక్షాత్తుగ శత్రువు గలఁడా? నాప్రాణనాయకుండు యుద్ధరంగంబున నీతోడ శత్రుభావంబున యుద్ధంబుఁ జేసినది నిక్కంబైనయెడల సర్వప్రపంచమున కాదియైన నిన్ను తనయంతఃపురంబులోనికిఁ దెచ్చుట కెట్లు సమర్థుం డగును? కావున నో స్వామీ! నాపెనిమిటియగు శశిధ్వజుని నీభక్తుండుగ నెన్నుము నే నన్నవో నీకు సేవకురాలను సుమ్ము! ననుగ్రహించుటకై భక్తజనమనోభీష్టదుండవగు నీవు దయాతిశయంబుచే మాయంతఃపురమలంకరించితి" వని వక్కాణించె. అపుడు ధర్మపురుషుండు కల్కిని జూచి "స్వామీ! వీరికి నీయందుఁగల భక్త్యతిశయంబును జూచియు వీరు నీవిషయమై చేయుస్తోత్రంబులను వీనుల నాలకించియు నేను కడు ధన్యుండ నైతి" నని వచించెను. పిమ్మట కృతయు

గపురుషుండు కల్కిని జూచి "స్వామీ! సర్వజగంబులయందుం బూజింపఁబడినవాఁడవును,జగదీశ్వరుండవునై ననీయందు శశిధ్వజుండు విశేషభక్తి గలవాఁడై దాసభూతుండుగ నున్నవాఁడు. అట్టిశశిధ్వజుని దర్శనముచే నే నిపుడు కృతార్థత నొందితి"నని చెప్పె. పిమ్మట శశిధ్వజుండు కల్కిమూర్తిని జూచి "కల్కిమూర్తీ! సర్వాంతర్యామివైన నీయందు కామాదిదోషంబులచేత శత్రుభావంబును దలంచి యాయుధపాణినై యుద్ధంబునకుం గడంగితిని. అగుటం జేసి నేను దండార్హుండ నని నీదండనంబునకుం దోఁచిన నన్ను దండింపు"మని చెప్పెను ఇట్లు సుశాంతాధర్మపురుష కృతయుగపురుష శశిధ్వజుల వాక్యంబుల నాకర్ణించి కల్కిమూర్తి చిఱునగవు నెమ్మొగంబునం దోఁప శశిధ్వజునిం జూచి "మహారాజా! నేను నీచే జయింపఁబడి నీయంతఃపురంబునకుం దేఁబడితి" నని వచించెను. పదంపడి శశిధ్వజుండు యుద్ధరంగంబునందుండి తనతనూజుల రప్పించి సుశాంతయభిప్రాయంబును గ్రహించి "రమ" అనుపేరం బరంగు నిజపుత్రికారత్నంబును కల్కిమూర్తి కిచ్చి వివాహముఁ జేసెను. అప్పుడు మరు దేవాపి శశిధ్వజ విశాఖయూప రుధిరాశ్వప్రభృతులయిన రాజులు శయ్యాకర్ణునితోడ రథగజతురగపదాతిచ్ఛత్రచామరాది పరికరసహితులై కల్కిమూర్తికి రమకు జరుగుపరిణయమంగళమును జూచు నాకాంక్షతోడ శశిధ్వజరాజధాని యగు భల్లాటనగరంబునకు వచ్చిచేరిరి. అపుడా కల్యాణమహోత్సవంబుఁ జూడ గుమికూడినజనులచే భల్లాటనగరంబు నిబిడీకృతం బాయెను. శంఖభేరీమృదంగాదినానావిధములైన వాద్యకోలాహలంబులతోడను, మనోహరనృత్యగీతంబులతోడను, పురపురంధ్రీజనమంగళగీతంబులతోడను, రమాదేవీ కల్కిమూర్తులకు

వివాహమును శశిధ్వజుండు చేయించెను. ఆపరిణయము నెపం
బుచే బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రాది సకలజాతులు నానావి
ధాన్నపానాదులచేఁ దృప్తిఁ జెంది విచిత్రవస్త్రమాల్యాభర
ణాదులచే నలంకరింపంబడినవారలై కల్యాణమంటపముఁ బ్రవే
శించి రమా కల్కులను జూచి యానందభరితమానసులైరి.
అమ్మహారాజసభయందు తామరసదళసదృశనేత్రయుగళుండు
ను, సకలరాజనికరవందితచరణారవిందుండును, నిజసౌందర్యా
తిశయముచే సర్వజగంబులను మోహింపఁజేయువాఁడునైన
కల్కిమూర్తి నక్షత్రనివహామధ్యంబునం బ్రకాశించు పూర్ణ
చంద్రునివలె ప్రకాశించెను. అపుడు శశిధ్వజుండును సాత్వాగ్రమా
కాంతుఁడును, పుండరీకదళాయతనేత్రద్వయుండును, నారాయ
ణుండునైన కల్కిమూర్తిని అల్లునిగాఁ జెంది యతని విశేష
భక్తితోఁ బూజించి సంతోషాతిశయముతో సభామధ్యంబున
నాసీనుం డాయెను.

ఇది తృతీయాంశమునందు దశమాధ్యాయము.

ఏకాదశాధ్యాయము.

—శశిధ్వజుండు తనపూర్వజన్మవృత్తాంతమును జెప్పుట.—

పదంపడి యచట నుండు రాజు లిట్లు సభామధ్యంబున
విష్ణుభక్తాగ్రేసరులును, ఋషులచే స్తోత్రము చేయఁబడిన భ
క్త్యతిశయము కలవారునైన శశిధ్వజసుశాంతలను, కృతయుగ
ధర్మపురుషులచే సేవింపఁబడిన కల్కిమూర్తిని కన్నులపండు
వుగఁజూచి కడు సంతసించినవారైరి. పదంపడి యారాజులు శశి
ధ్వజునిం జూచి "శశిధ్వజమహారాజా! నీభార్యయును నీవును

నారాయణస్వరూపుండుగ నుండు నీ కల్కి మూర్తికి అత్తమూమలైతిరి. ఆభగవంతునియందు మీయిరువురికిఁ గల భక్తిని జూచి యీసభయందుండు ఋషులును, బ్రాహ్మణులును, తదితర జనంబులును మిక్కిలి యాశ్చర్యమును జెందుచున్నారు. మీకు పరమాత్మునియం దిట్టి భక్తి యెట్లుగలిగె? మీ కేరిచే భగవద్భక్తి బోధింపఁబడినది? త్రిలోకపావనంబును, సంసారతాపనివారకంబునైన భగవత్కథను నీయొద్ద వినుట కిచ్ఛయించుచున్నా" మని చెప్పిరి అపుడు శశిధ్వజుండు రాజులమాటలను విని "యమోఘవిక్రమవిలసితులగు ఓభూపాలురారా! నిజపత్నీ సహితుండనగు నాజన్మకర్మచరిత్ర భగవద్భక్త్యాదులను జెప్పెద నాలింపుఁడు.

నేను వేయియుగంబులకు ముందు దుర్గంధయుక్తమైన పలలంబును భక్షించుస్వభావముగల గ్రద్ధనై యుంటిని. అక్కాలంబున మీయెదుట నిలచి యుండు నాభార్య సుశాంత స్త్రీజాతి గృధ్రమై నాకు భార్యగ నుండె. మేము పొకగొప్పకాంతారంబునం దొక యున్నతవృక్షాగ్రంబున నెలవు నేర్పఱచుకొని యుపవనంబునందు యథేచ్ఛముగ సంచరించుచు నచట స్వయముగ మరణముఁ జెందినప్రాణులమాంసమును భక్షించుచుఁ గాలము గడపుచుంటిమి. ఇట్లు గొంతకాలంబు గతింప నొకానొకదివసంబునం దొక వేఁటకాఁడు మమ్ముం జూచి మా యిరువురిమాంసంబును దిన నిచ్ఛగించి మమ్ములను వంచించి చంపుటకై యతండు పెంచుచున్న యొండుగృధ్రంబును మా కడకుం బంపె. అట్టిసమయంబున మిగులనాఁకలిచేఁబీడింపఁబడుచుండు మే మాగ్రద్ధను నమ్మి దానివెన్నంటి పోయి వ్యాధునివలయందుఁ జిక్కికొంటిమి. వ్యాధుం డపుడు కడు సంతోషం

బునుం బొంది గండకీతలంబునందలియొక గొప్పశిలాతలంబున
మాకంఠంబుల నురుమాడి పిశితభక్షణంబుఁ జేసి చక్రాంకిత
ముగ నుండు శిలలం గలిగిన గంగయందు మరణంబుఁ జెందిన
కతంబున మేము తేజోమయంబైన విమానంబుపై నెక్కి చతు
ర్భుజములతోఁ గూడినవారమై సర్వలోకంబులచే స్తోత్రముఁ
జేయఁబడిన వైకుంఠంబునకుం బోయి యచట నూరుయుగం
బులు మహానందంబు ననుభవించి పిదప బ్రహ్మలోకంబున కే
తెంచి యచట నేఁబదియుగంబులానందంబు ననుభవించి యచ
టినుండి దేవలోకంబునకుఁ బోయి నాలుగువందలయుగంబులు
సుఖంబు లనుభవించి మరల భూలోకంబున నేను రాజపుత్రుం
డుగను నాభార్య రాజపుత్రికగను జనించితిమి. సాలగ్రామ శిల
లతోడం గూడినదీతీరంబున మరణంబు నొందుటవలనఁ గలి
గిన భగవంతునియనుగ్రహంబు నిపుడును స్మరించుచున్నారము.
గండకీనదీతీరంబున మరణంబుఁ జెందినకతంబున పూర్వజన్మ
వృత్తాంతస్మరణనుగుఱించి నేనేమి చెప్పఁబోయెదను? మాకు
గండకీనదీజలస్పర్శనమాత్రముచేతనే యాశ్చర్యమగు నిట్టిమ
హత్త్వము కలిగియుండఁగా దేవదేవుండగు వాసుదేవుని
ప్రత్యక్షంబుగ దర్శించిన నెట్టిఫలంబుగలుగునో దానిని జెప్పుట
కలవి గాదు గదా మేమిరువురము హరిపూజాధురంధరులమై
నర్తనగానస్తోత్రాదుల నొనర్చుచు నిచట వసించి యున్నవార
ము. తొల్లి మేము బ్రహ్మదేవునివలన శ్రీమన్నారాయణుండు
కల్కిమూర్తియై యవతరించి కలికులంబును నిర్మూలంబుఁ
జేయఁబోవు నని యాకర్ణించి యుంటిమి. అట్టికల్కిమూర్తి ని
పుడు ప్రత్యక్షంబుగ వీక్షించి సంతోషభరితమానసుల మైతి"
మని తమపూర్వజన్మవృత్తాంతంబుల నచ్చో మూఁగిన రాజ

లకు వినిపించి పదివేలగజంబులు, లక్షసంఖ్యగల యుత్తమాశ్వంబులు, ఆఱువేలరథంబులు, రూపయౌవనగుణదాక్షిణ్యాదులతోఁ బ్రకాశించుచుండునట్టి యాఱువందలదాసీజనంబులు, మహార్ఘరత్నములు మొదలగువానిని మిగుల భక్త్యతిశయంబుతో రమాకాంతుండయిన కల్కిమూర్తికి సమర్పించి సుహృద్బంధుజనపరివృతుండునై కృతార్థుండనైతినని చెప్పెను.

ఇట్టిశశిధ్వజునియపూర్వవృత్తాంతంబులను సభాజనంబులాకర్ణించి యితం డతిధన్యుం డని తలఁచి యాధరాకాంతుని పూర్వజన్మజ్ఞానంబున కెంతయు నచ్చెరువుఁ జెంది యాతని పెక్కుభంగుల స్తుతించిరి.

తదనంతరము సభాసదులు కల్కిమూర్తిని స్తుతింపుచు, ధ్యానముఁ జేయుచు ప్రశంసఁ జేయుచు, శశిధ్వజునిం జూచి "భూమీశా. భగవద్భక్తి యెట్టిది? భగవంతునియందు భక్తిగలవాఁ డెవఁడు? భక్తుండు చేయుకార్యం బెయ్యది? వాఁడేమిటిని భక్షించును? ఎచ్చట వసించును? వాఁడేమిమాటలాడును? ఇత్యాదిభగవద్భక్తభక్తిలక్షణంబులను మాకు నత్యాదరంబునం జెప్పఁ బ్రార్థించెదము. మీరు పూర్వజన్మవృత్తాంతంబుల నెఱుంగుశక్తిగలవారలై యుండుటం జేసియు, భగవద్భక్తాగ్రగణ్యులై యుండుకతంబునను మీకు యావద్వృత్తాంతంబులు కరతలామలకంబులు." శశిధ్వజుం డిట్లుచెప్పిన రాజశ్రేష్ఠులవచనంబుల నాలకించి భక్త్యతిశయవికసితవదనారవిందుండై సభ్యులంజూచి వారికి తొల్లి బ్రహ్మచేఁ జెప్పఁబడిన భగవద్భక్తభక్తిలక్షణంబులను జెప్పెద నాకర్ణింపుఁ డని యిట్లనియె. "తొల్లి బ్రహ్మర్షిసంకులంబైన బ్రహ్మసభామధ్యంబున భగవద్భక్తభక్తిలక్షణంబుల సనకుండు నారదుని నడుగ నాతండు చెప్ప

నేను మహర్షి కరుణాతిరేకంబుచే బ్రహ్మసభయందుండి వానిని ఆలకించితిని. పాపహారంబులైన యాకథల నన్నిటిని మీకు సవిస్తారముగా వచించెద నాలకింపుఁడు.

లోకంబున సంసారతాపంబును బోఁగొట్టునదియును, సర్వలోకవంద్యంబునైన భగవద్భక్తి యెట్టిది? యని సనకుండు నారదమహర్షి నడుగ నాఋషిపుంగవుండు చెప్పుచున్నాఁడు.

జ్ఞానేంద్రియ కర్మేంద్రియాదులను నిగ్రహించి సూక్ష్మబుద్ధిచేత మనుజుఁడు శరీరమును గురువునొద్దనుంచవలయును. గురువు దృష్టిఁజెందినయెడల సాక్షాద్భగవంతుఁడు ప్రసన్నుండై ఫలంబునిచ్చును. గురువు సావధానచిత్తంబున ఓంకారస్వాహాకారమధ్యంబున శిష్యవాచకమైన మకారమును నిర్దేశించి యేకాగ్రబుద్ధిచే భగవంతుని స్మరింపవలయును. బుద్ధిమంతుఁడగు మనుజుఁడు మిగుల జాగరూకతతో వాసుదేవుని పాదారవిందంబులను పాద్యార్ఘ్యాచమనీయస్నాన వస్త్రభూషణ గంధమాల్యనైవేద్యాదులచేఁ బూజించి సర్వాంగ సుందరుండును, రమ్యుండునైన యావిష్ణుమూర్తిని హృదయకమలమధ్యంబునందుండునట్లు ధ్యానించి మనోవాగ్బుద్ధీంద్రియగణంబులతోఁ దనయాత్మను విష్ణువునందు సమర్పింపవలయును. వేదవేదాంగములు సాక్షాద్విష్ణువైనకల్కిమూర్తినామంబులే గాని వేఱుగాదు. ఎల్లపుడు భగవంతుఁడు సేవ్యుండు. నేను సేవకుండను. తదితరజనంబులందఱు పరమాత్ముని శరీరభూతులుగ నుందు రని ధ్యానింపవలయును. అవిద్యోపాధి గలవారజ్ఞానమువలన భక్తులకును భగవంతునికిని సేవ్యసేవకులవలె భేదము కల దని వచింపుదురు. భగవద్భక్తాగ్రేసరుండు భగవంతునియందు తప్ప తదితరస్థలములయం దెచట నెద్దియు లేదని భావించి విష్ణుమూర్తిని

స్మరింపుచు, విష్ణునామంబులను గీర్తింపుచు, విష్ణుపూజాదులలో నవ్వుచు బ్రహ్మానందసుఖంబుచే తన్ను మఱచి పను స్తభూతంబులకును విష్ణువునకును గలభేదంబు దెలియక న ర్తనముం జేయును. ఉన్మత్తునివలె కేకలు వేయును. - భగవంతునియందు లయముని జెందును. భగవంతునియం దెపుడును కొఱవడని భక్తి యీవిధంబున నుండును. ఇట్టిభక్తి దేవాసురమనుజాదులతోఁ గూడి యుండులోకంబులను పరిశుద్ధముగఁ జేయును. భక్తియనునది బ్రహ్మను నెడి గొప్పనిధికి మార్గమును జూపించును. మఱియు నది శివ విష్ణు బ్రహ్మస్వరూపంబు గలదియై యుండును. వేదవేదాంగంబులకన్న కడుశ్రేష్ఠంబు సత్త్వగుణాధిక్యమువలన మనుజులు పరబ్రహ్మభక్తులగుదురు రజోగుణాధిక్యమువలన నింద్రియార్థాదులయం దాసక్తిగలవార లగుదురు. తమోగుణాధిక్యమువలన దారుణసంకల్పముతోఁగూడి యుందురు. మఱియు మనుజులకు సత్త్వమువలన నిర్గుణత్వము, రజోగుణమువలన విషయేచ్ఛ, తమోగుణమువలన నరకప్రాప్తి కలుగును. పథ్యంబును, విష్ణునివేదితంబు నైనయది సాత్త్వికాహార మనంబడును. ఇంద్రియములకుఁ బ్రీతినికలుగఁజేయునదియు, శుక్లశోణితంబులను వృద్ధిఁజేయునదియు, పరిశుద్ధంబు గలదియు, ఆయురారోగ్యాదివర్ధకంబై యుండునదియు నైనయాహారంబు రాజసాహార మనఁబడును. మిగుల కారముగ, పులుసుగ, వేఁడిగ, విదాహిగ, దుర్గంధయుక్తముగ, ప్రాఁతదిగ నుండు నాహారము తామసాహార మనఁబడును. సాత్త్వికులకు వనము వాసస్థానంబు. రాజసులకు గ్రామము మనికిపట్టు. తామసులకు ద్యూతమద్యాదిగృహంబు లునికిపట్టు. భగవంతుఁడు నిజభక్తులకు నెద్దియు నిచ్చుటలేదు. భక్తులు భగవంతుని నేమియు నడుగుటయు

లేదు. అట్టు లుండియు భగవంతునికిని భక్తులకును పరస్పరము అనాదృశమైన ప్రీతిమాత్రము కలదు."

ఇట్లు కలహాభోజనుండు సనకునికి సకలలోకాంతర్యామి యైన సర్వేశ్వరునిభక్తిని వినిపించి స్వర్గలోకంబునకుం బోయెను.

ఇది తృతీయాంశమునందు ఏకాదశాధ్యాయము.

ద్వాదశాధ్యాయము.

—శశిధ్వజునికి యుద్ధప్రవృత్తికారణము.—

తదనంతరము శశిధ్వజుం డచట రాజులం గాంచి "ఇలాధిపులారా! విచిత్రచరిత్రంబులతోఁ గూడిన భగవంతునిభక్తి భక్తలక్షణంబులను మీ కానతిచ్చితి. ఇఁక మీ కేమి చెప్పవలయు"నని యడిగిన శశిధ్వజునింజూచి యచ్చోఁగల ధరావరులు "శశిధ్వజా! ఈలోకంబున సాధుజనంబులు సర్వభూతంబులకుఁ దఱచుగ నిజప్రాణబుద్ధివాగ్ధనంబులచే హితంబును జేయుచుండ విష్ణుభక్తాగ్రేసరుండవును, సర్వభూతహితాచరణరతుండవు నైననీకు జీవహింసాదిక్రూరకృత్యప్రధానంబైన యుద్ధరంగంబునందాగ్రహమెట్లుగలిగెను?" ఇటులడిగిన భూమీశులవాక్యంబుల నాలకించి శశిధ్వజుండు చెప్పుచున్నాఁడు. "కామరూపధారిణియైన ప్రకృతి (అనఁగా మాయ) మానవులకు ద్వైతమనుబుద్ధిని గలుగఁజేయుచున్నది. త్రిగుణాత్మకంబగు నమ్మాయ సమస్తలోకంబులను, వేదంబులను సృజించినది. ఆవేదంబులు త్రిభువనంబులయందలి ధర్మంబులను వృద్ధిపఱిచి యధర్మంబులను నశింపఁజేసి భగవంతునియందు భక్తిని కలుగఁజేయుచున్నవి.

విషయాసక్తులైన కామాసక్తులకు హితమైన శాస్త్రములను
వాత్స్యాయనాదులు వేదంబుల ననుసరించి చేసియున్నవారు.
వేదవేదాంగపారంగతులయిన మన్వాదులునయితము వేదవా
క్యానుసారముగ ధర్మశాస్త్రములను రచియించిరి. మే మాధ
ర్మశాస్త్రచోదితంబులైన వేదవాక్యముల నమ్మి ధర్మకర్మనిష్ఠు
లమై యుద్ధమునం దాసక్తిచేత మమ్ముఁ జంపవలయు నని యు
ద్దేశించిన వారిని జంపుటకు మేము నిశ్చయింతుము. అవధ్యుం
డుగ నుండువానిని జంపినమనుజుల కెంతటిపాపము సంఘటిల్లు
నో యంతటిపాపము వధ్యుఁడైనవానిని జంపకపోయినయెడల
సంభవించునని సకలవేదార్థవిజ్ఞానుండైన వ్యాసభగవంతుఁడు
వచించియున్నవాఁడు. శత్రువులను యుద్ధరంగంబునఁ జంపుటచే
పాపము కలుగ నేరదు. కావున యుద్ధరంగంబున దుర్జయులగు
మీ సేనలను వధించి ధర్మపుంగవ, కృతయుగపురుష, కల్కిమూ
ర్తులను నే నెత్తుకొని యిల్లుచేరితిని. ఇట్లు నేనొనర్చుటయు విష్ణు
భక్తి యనియే నాయభిప్రాయము ఈవిషయంబున మీకుంగల
యభిప్రాయము వెల్లడిసేయుఁడు. పిదప నేను వేదవాక్యసమ్మతం
బులగు కొన్నియంశంబులను మీకుం జెప్పెద. సర్వదేశంబుల
యందును, సర్వకాలంబులయందును, పరిపూర్ణుండై యుండు
విష్ణుమూర్తి సకలచరాచరబాహ్యాభ్యంతరంబులయందు నిం
డియున్నవాఁడు. అట్లుండఁ జంపువాఁ డెవఁడు? చంపఁబడినవాఁ
డెవఁడు? కావునఁ జంపువాఁడును, జంపఁబడినవాఁడును విష్ణువే
గాని వేఱు కాదు. యాగాదులయందు పశువధంబువలె సమరం
బున సమయించుట జీవహింస కానేర దని వేదంబు లుద్ఘోషిం
చుచున్నవి. యుద్ధంబునఁ జంపుటచే మానవులకు పాపము సం
భవింప దని మహర్షులును, పదునలుగురు మనువులును వచించి

యున్నారు. అగుటంజేసి మేము యుద్ధయజ్ఞంబులచేత సర్వశక్తిసమన్వితుండైన విష్ణుమూర్తిని భజింపుచున్నారము. ఇంతియకాక యమోఘశక్తిసంపన్నంబైన భగవంతుని మాయ ననుసరించి సేవ్యసేవకభావంబుతో విధిప్రకారము భగవంతుని బూజించువాఁడు సుఖమును జెందును గాని, దుఃఖమును జెందనేరఁడు" అని వక్కాణించిన శశిధ్వజునివాక్యంబులను రాజులాలకించి "గురుశాపంబుచే మరణంబు నొందిన నిమిచక్రవర్తికి శరీరంబునం దెటులు వైరాగ్యము కలిగినది ? శిష్యశాపంబువలన మరణంబుఁ జెందిన వసిష్ఠునికి మరల శరీరమెట్లు కలిగినది? భగవద్భక్తులుగ ముక్తులుగ నుండువారికి జన్మజరామరణాదులు లేవని వేదంబు మొఱలిడుచున్నది. అగుటంజేసి భగవంతుని మాయ జితేంద్రియులైన మహాత్ములకు సయితము దెలియుటకు సాధ్యంబు గాకయున్నది. మఱియు నామాయ యింద్రజాలమువలె నానావిధంబై మనుజులకు సంసారమునందు మోహమును కలుగఁజేయుచున్నది" అని చెప్పిన రాజులవాక్యములను శశిధ్వజుం డాకర్ణించి భక్తిసంపన్నంబైన బుద్ధితో మరల నారాజులనుజూచి తత్త్వములను జెప్పుట కారంభించెను. "అనేకజన్మములలో పుణ్యతీర్థములయందు స్నానముఁ జేయుటవలనను, పుణ్యక్షేత్రంబులకుం బోయి భగవంతుని దర్శించుటవలనను, తొలిజన్మంబునం జేసిన పూజావిశేషమువల్లనను మనుజులకు సజ్జనసమాగమంబు కలుగును. సజ్జనసమాగమంబువలన నీశ్వరుని ప్రత్యక్షముగఁ జూడనగును. ఈశ్వరదర్శనమువలన మనుజులీలోకంబునం దత్యుత్తమభోగంబు లనుభవించి భగవంతునిసాలోక్యమును బొంది యానందము ననుభవింతురు. రజోగుణయుక్తులును, యాగానుష్ఠానహరిపూజాతత్పరులునైన జను

కెల్లపుడు భగవన్నామసంకీర్తనముఁ జేయుచు భగవద్దివ్యరూప విశేషాదులను ధ్యానింపుచు, భగవదవతారలీలలను పఠింపుచుందురు. కొందఱు పరమానందసంపూర్ణస్వాంతులై భగవన్నామకీర్తనపూజాధ్యానాదులే మోక్షం బని తలఁచి తదితరములైన మోక్షఫలంబు నపేక్షింపకయుందురు. అట్టిమనుజులీభూలోకంబునందు జనించి హరిభక్తి ప్రకాశముఁ జేసి హరిస్వరూపధరులై ధర్మతత్పరులై సేవ్యసేవకభేదంబులను వదలి యానందము ననుభవింపుచుందురు. కావున నిమిచక్రవర్తి హరిభక్తుల నయనంబులయందు నిమేషరూపంబున నున్నవాఁడు. ముక్తుండైన వసిష్ఠుఁడునయితము దేహమునం దాసక్తచిత్తుండై యున్నవాఁడు. ధరణీశులారా! తత్క్షణమే పాపంబులను హరింపఁ జేయునదియును, విష్ణుభక్తివర్ధనంబును, సర్వేంద్రియంబులయందలి దేవతల కానందమును కలుగఁ జేయునదియు నైన భగవద్భక్తిభక్తమాహాత్మ్యములను మీకుం జెప్పితి. లోకంబుల కుపకృతిఁ జేయుటకై యవతరించి పరిశుద్ధమనంబులతోఁ గూడి యుండువ్యాసాదులు నానావేదోపనిషచ్ఛాస్త్రంబు లనెడు సముద్రంబును మథించి కృష్ణభక్తియనెడు నవనీతంబును గైకొనిరి. సంసారమోహతాపంబులను పరిహరింపం జేయుటయందు దక్షంబైన యీ నవనీతంబును భక్షించువారు పరబ్రహ్మాత్ములు లగుదురు."

ఇది తృతీయాంశమునందు ద్వాదశాధ్యాయము.

త్రయోదశాధ్యాయము

~ద్వివిదోపాఖ్యానము.~

ఇట్లు శశిధ్వజుండు సభయందుండు రాజులకు హరిభక్త్యాదులను జెప్పి ప్రీతమానసుండై కల్కికి నమస్కారముఁ జేసి "ఓస్వామీ! నీవు త్రిలోకనాథుండవు. ఈభూపతులు నిన్నాశ్రయించి నీభక్తబృందంబులోఁ జేరినవారలై యున్నవారు. నేను సయితము నీభక్తుండగను నీయాదేశమును జేయువాడగనునై యుండునటులు దలంపుము. నేను తపస్సుఁ జేయుటకై సుహర్షిజనప్రియవాసస్థానంబైన హరిద్వారక్షేత్రంబునకుం బోయెద. నీయెదుట నిలచి నిన్నాశ్రయించియుండు నాపుత్రపౌత్రాదులను రక్షింపుము. పొల్లి జాంబవంతునికివలె నాకిపుడు కలిగియున్న మనోరథమును, ద్వివిదుండనువానగునిమరణంబును నీకుఁ దెలిసియున్నదికదా!" అని చెప్పి భార్యాసహితుండై పోవుట కిచ్ఛయించియుండుశశిధ్వజునిం జూచి కల్కిమూర్తి లజ్జచే తలవంచుకొనియెను అట్టిసమయంబున నచట నుండురాజులు కల్కిమూర్తిని జూచి" ఓనాథా! ఈశశిధ్వజుం డేమి చెప్పెను? అది విని నీ వేల తలవంచుకొంటివి? ఈవిషయములో మాకు గొప్పసంశయము కలిగియున్నది. మా కొసం దేహమునుదీర్చి కాపాడవలయు" నని చెప్పిరి. ఇట్లువచించిన రాజులనుజూచి కల్కిమూర్తి "మహీపతులారా! బుద్ధిమంతుండును, నాభక్తుఁడునయిన శశిధ్వజు నడిగిన మీ కాతనివలన సంశయంబులు నివర్తియగు" ననియెను.

ఇట్లు కల్కి చెప్పఁగా నచటి రాజులు శశిధ్వజునిం జూచి "శశిధ్వజా! నీ వేమి మంచలించితివి? నీవు చెప్పినమాటలను విని కల్కి యేలతలవంచుకొనియెను? దీనికారణంబును మాకుం జెప్పి

మాకుఁగల సందేహమును దీర్చవలయు"నని ప్రార్థింప శశిధ్వజుఁడిట్లు చెప్పుట కారంభించెను.

"తొల్లి రామావతారంబున లక్ష్మణుండు రావణపుత్త్రుండైనయింద్రజిత్తును వధించెను. అగ్నిగృహంబున బ్రాహ్మణవీరుండైన యింద్రజిత్తును జంపుటచే సౌమిత్రి శరీరంబున నేకాహికజ్వరము ప్రవేశించి తాపమోహంబులను గలుగంజేసె. అపుడశ్వినీదేవతాంశముచే జనించినవాఁడును, కడు వైద్యశ్రేష్ఠుండునైన ద్వివిదుఁడనుపేరుగల వానరుఁడు లక్ష్మణుని చికిత్సచే నిద్రింపఁజేసి రామభద్రసంజ్ఞాపత్త్రికనువ్రాసి దానిని లక్ష్మణునికిఁ జూపెను. అపుడు లక్ష్మణుండు రామభద్రసంజ్ఞాపత్త్రమును జూచి యేకాహికజ్వరవిముక్తుండై శరీరబలమును జెంది "ఓద్వివిదా! నీ కిష్టమైన వర మడుగు" మని చెప్పెను. ద్వివిదుండామాటలను విని మిగుల సంతోషించి యింద్రజిత్తు లక్ష్మణునిచే మరణము నొందుటచేత రాక్షసరూపమును వదలి మోక్షమును జెందిన వర్తమానమును తెలిసికొని "నీచేత నాకు మరణము కలుగవలయు"నని యడిగెను.

ఇట్లు వచించిన ద్వివిదుని వాక్యంబులను లక్ష్మణుండాకర్ణించి "ద్వివిదా! నే నింకొకజన్మంబున బలరాముండనై పుట్టి నిన్నుఁ జంపి నీవానరత్వమును నివర్తింపఁజేసి నీకు మోక్షము నిత్తును. మఱియు "సముద్రస్యోత్తరే తీరే ద్వివిదోనామ వానరః, ఏకాహికం జ్వరం హన్తి లిఖనం యస్తు పశ్యతి" అను మంత్రాక్షరములను తాళపత్త్రమునందు లిఖియించి గృహద్వారంబున కూర్ధ్వభాగంబునందుఁ గట్టవలయు. దానిని చూచినవారికి తత్క్షణం బేకాహికజ్వరము నివర్తించును." అని లక్ష్మణునిచే వరంబు నొంది చిరాయువుగల యాద్వివిదుండు కృష్ణావ

తారంబునందు బలరామునిబాణంబుచేఁ గొట్టంబడి మోక్షమును జెందెను. అటులే నైమిశారణ్యమునందు సూతసూనుండైన రోమహర్షణుండు బలరామాస్త్రముచే గొట్టఁబడినవాఁడై మోక్షమును జెందెను. ఓ రాజులారా! పూర్వకాలంబున త్రివిక్రమావతారంబునందు జాంబవంతుఁ డూర్ధ్వలోకంబునందుండు త్రివిక్రమపాదంబునకు ప్రదక్షిణముఁ జేసెను. అపుడు కపటవామనావతారుండైన భగవంతుఁ డతివేగముగ ప్రదక్షిణముఁ జేయుచుండు జాంబవంతుని జూచి "మహాబలసంపన్నుండవైన జాంబవంతుఁడా! నీమనోరథం బవుగు" మని చెప్పెను.

ఇట్లు చెప్పిన త్రివిక్రముని పలుకులను బ్రహ్మాంశసంభూతుఁడైన జాంబవంతుం డాలకించి చిఱునగవు ముఖంబున నంకురింప "స్వామీ! నీచక్రాయుధాగ్నిచే నాకు మరణంబు కలుగు నటులు ప్రసాదింపు"మని యడుగ వామనుఁడు జాంబవంతునిం జూచి "భల్లూకశ్రేష్ఠా! కృష్ణావతారంబున నాచక్రాయుధముచే నీశిరము వ్రక్కలు చేయఁబడి నీకు ముక్తికలుగు"నని చెప్పెను.

తొల్లి కృష్ణావతారంబున సూర్యభక్తుఁడనై సత్రాజిత్తని పేరువడసిన నాకు స్యమంతకమణినిమిత్తంబున కలహము కలిగెను. సత్రాజిత్తుతమ్ముఁడైన ప్రసేనునికి మణికారణంబున సింహముచే మరణము కలిగెను. అపుడు జాంబవంతుఁ డాకేసరినిం జంపి మణి నెత్తుకొని గుహామధ్యంబునుం జొచ్చె. ఆసమయంబున జనాపవాదభీతుండైన కృష్ణుండు స్యమంతకమణిని వెదకుచుం బోయి ఋక్షాధీశుండైన జాంబవంతునిగుహఁ జొచ్చి వానితో యుద్ధముఁ జేసెను. అపు డాజాంబవంతుఁడు పరాభవము నొంది నూతనదూర్వాదళశ్యామవర్ణశరీరముగల కృష్ణుని జూచి సర్వేశ్వరుండుగ నుండునట్లుదలఁచి తనముద్దులకూఁతు

రైన జాంబవతిని స్యమంతకమణిసహితముగ కృష్ణమూర్తికి సమ
ర్పించెను. పిమ్మట కృష్ణమూర్తి జాంబవతిని పరిణయమాడి మణి
ని గ్రహించి ద్వారకాపట్టణంబునకు వచ్చి మహాజనసభామ
ధ్యంబునకు నన్ను రప్పించి నాకామణిని మరల నిప్పించెను.
అపుడు నేను లజ్జాభయభరాక్రాంతుండనై నిజకన్యక యగు
సత్యభామను కృష్ణమూర్తి కిచ్చి వివాహము చేయించి మణిస
హితంబుగ నొసంగితిని. అపుడాకృష్ణమూర్తి సత్యభామను
మాత్రము గ్రహించి రత్నమును మరల నాకిప్పించి ద్వారక
కరిగి యచట కొంతకాల ముండి తర్వాత హస్తినాపురికిం బో
యెను. కృష్ణుఁడరిగినపిమ్మట శతధన్వయనువాఁడు నన్నుఁజంపి
ఆమణి నపహరించుకొని పోయెను ఆమణిప్రభావమువలన నా
కిపుడు పూర్వజన్మవృత్తాంతము చక్కఁగ జ్ఞాపకమున్నది. పూ
ర్వజన్మంబున కృష్ణునిపైన మిథ్యాపవాదము మోపినకతంబు
నం గలిగిన పాపమునకు నాకిదివఱకును విమోచనము కలుగ
లేదు. కావున నే నిపుడు పరమాత్ముండును కృష్ణస్వరూపుండును
అగుకల్కిమూర్తికి సత్యభామాస్వరూపయైన యీరమాకాం
తను సమర్పించి సద్గతిని జెందుచున్నాఁడను. స్వామియొక్క
సుదర్శనాస్త్రప్రహారంబుచే నాకు మరణము కలుఁగవలయు నని
యిచ్ఛయించుచున్నాఁడను. అగుటం జేసియే కల్కిమూర్తితో
డ యుద్ధంబుఁ జేసితిని. సర్వజగంబుల కీశుండైన యీకల్కి
మూర్తి శ్వశురుండనైన నన్ను సుదర్శనాయుధముచేఁ జంపుట
వలన నధర్మము తారసిల్లు నని తలఁచి లజ్జచే శిరమును వంచు
కొని యున్నవాఁ''డని శశిధ్వజుండు చెప్పెను అత్యాశ్చర్యభరి
తంబును, అపూర్వంబును, అత్యుత్తమంబునైన యీవృత్తాం
తమును సభామధ్యంబునం దాసీనులైనరాజులు, మునీశ్వరులు

మొదలైన వారాలకించి కల్కిమూర్తి గుణాతిశయంబులకు మిక్కుటముగ సంతసించిరి. ధనము, కీర్తి, సుఖంబుల నిచ్చునదియును, శశిధ్వజునిచేఁ జెప్పఁబడినదియు నైనయీయుపాఖ్యానంబు నతిశ్రద్ధతో నాకర్ణించుమానవులు ధర్మార్థకామాదుల నతిసులభంబునఁ జెందుదురు.

ఇది తృతీయాంశమునందు త్రయోదశాధ్యాయము.

చతుర్దశాధ్యాయము.

కల్కిమూర్తి కాంచనపురికిఁ బోవుట.

పదంపడి కడు బలపరాక్రమవంతుండైన కల్కిమూర్తి శ్వశురునియొద్ద సెలవు గొని రాజులతోడంగూడి వెడలెను. శశిధ్వజుండు కల్కియొద్ద కామితవరంబులం గొని మహేశ్వరియైన మాయను స్తుతించి మాయారహితుండై తనభార్యతోడ తపోవనమునకుఁ బోయెను. కల్కిమూర్తి సేనాసమన్వితుండై మహీధరదుర్గజాలసంకులంబై గరళంబును వర్షించుసర్పంబులచే రక్షితంబైన కాంచనపురి యనుసార్థకనామంబుగల సర్పనగరము సమీపంబునకుం బోయి బాణజాలంబులచే దుర్గజాలంబులను విదళించి విషంబుల నాయుధంబులుగ ధరించిన పన్నగంబుల సాయకసంఘాతంబులచే ఛేదించి లోనికిం బ్రవేశించి మణికాంచనచిత్రవ్యాప్తంబును, నాగకన్యానికరపరివృతంబును, హరిచందనతరునివహసంబాధంబును, మనుష్యరహితంబును నైన యానగరంబు నాలోకించి మందస్మితభూషితాననుండై సమీపంబునందలి రాజులం గాంచి "భూపతులారా! ఇది యేమి యాశ్చర్యము? ఇది సర్పంబుల కునికిపట్టై యుండుపట్టణంబుగఁ

జూపట్టెడిని. మనుజుల కతిభయకరంబై నాగకన్యాసంకులంబై యున్నయది. నుశ విశాపట్టణంబులోనికిం బ్రవేశింపవచ్చునా? మీరు చెప్పుఁ"డని యడిగెను. అట్టిసమయంబున నాకాశవాణి రమాపతి యైన కల్కిమూర్తిని జూచి, "కల్కిమూర్తీ! నీవు సేనాసహితుండవై యీపట్టణంబులోనికిం బోఁజనదు. పోయినచో నీవు తప్పనితరసేనలు విషకన్యాదర్శనంబున మడియుదు" రని పుందలించె. కల్కిమూర్తి యశరీరిపలుకుల నాలకించి యీశ్వరునిచేఁ బొందినచిలుకరాజును సహాయముగఁ బెట్టుకొని యుత్తమాశ్వారూఢుండై ఖడ్గంబును కేలఁ బూని యేకాకియై పట్టణమధ్యంబునం బ్రవేశించి ధీరులకు సయితము ధైర్యమును నశింపఁజేయునట్టి భయంకరమయిన విషకన్యను గాంచెను. అపు డావిషకన్య యత్యుత్తమరూపంబుతో వచ్చినకల్కిమూర్తిని సాక్షాల్లక్ష్మీపతి యని తనమనంబునం దలపోసి నవ్వుచు స్వామినిం జూచి "కల్కిమూర్తీ! అత్యుత్తమవీర్యపరాక్రమవంతులైన యనేకరాజవీరు లస్మన్నయననిరీక్షణంబులచే దహింపఁబడి మరణంబు నొందిరి అట్టివిషనేత్రంబులుగల నేను సురాసురనరాదివిలోకన భాగ్యవిహీననై దీనమానసముతోడ దుఃఖించుచున్నదానను. వికసితారుణసరసిజ సదృశనయనాలోకనామృతప్రవాహమునం దభిషిక్తురాలనై యిపుడు నీకు నమస్కారముఁ జేయుచున్నదానను. విషనయనయుగళంబుగల నేనెక్కడ? అమృతధారాసమాననిరీక్షణములుగల నీవెక్కడ? మందభాగ్యురాలనైన నాకీజన్మమునందు మహామహిమగల నీసమాగమము నాకెట్టితపోబలంబుచేఁ గలిగినదో తెలియదు."అని చెప్పెను. ఇట్టి విషకన్యావచనంబులను గల్కిమూర్తి యాకర్ణించి "సుందరశరీరముగల ఓచిన్నదానా! నీ వెవ్వతెవు? ఈగ

తి నీ కేకారణమువలనఁ గలిగినది? ఏదుష్టకృత్యమువలన నీకు విషనేత్రములు సంభవించినవి? నీవృత్తాంతం బంతయు సవిస్తారముగ చెప్పు" మని యడిగెను. ఇటులన్నకల్కిమూర్తివచనంబులను విషకన్య యాలకించి "ఓస్వామీ! నేను చిత్రగ్రీవుఁడని పేరువడసిన గంధర్వునిభార్యను. నన్ను సులోచన యని యందురు. నేను నాభర్తకు మిక్కిలి కామతాపనివారణమును గలుగఁజేయుచు నొకానొకనాఁడు నిజభర్తతోడ విమానమునం దేకాసనాసీననై గంధమాదనగిరివరరమణీయకుంజమధ్యంబున విహరించుచుంటిని. అట్టిసమయంబున నచటికి సమీపప్రదేశమునందు వికారమైన శరీరముతోఁగూడినవాఁడును, రోగపీడితుండు నైనయొకానొక యక్షజాతిఋషిపుంగవుని గాంచి నాదగురూపయావనగర్వముచే విజృంభిఁగి కొన్నిమాట లాడుచు నవ్వి హేళనముఁ జేసితి. అపు డా యక్షఋషి నాపరిహాసవాక్యంబులను విని కోపావేశపరవశచిత్తుండై నన్ను విషనిరీక్షణములు గలదాన నగునటులు శపించెను. ఆశాపముచే విషముతోఁగూడిన కన్నులు గలదాననైతి. నాదర్శనముచేత సమస్తభూతంబులు విషానలజ్వాలాదగ్ధాంగులై మరణముఁ జెందుదురు. కావున నేను నాగకన్యాసంకులంబైన కాంచని యనుపేరుగల సర్పపట్టణంబునందు పతిహీనురాలనై నిజనేత్రములనుండి విషధారలను వర్షింపుచు సంచరించుచున్నదానను. పూర్వజన్మార్జితతపఃపరిపాకమువలన మీకటాక్షగోచరమును జెంది ఋషిశాపవిముక్తురాలనై యమృతలోచనంబులు గలదాననైతిని. మీయనుగ్రహమువలన నాభర్తృలోకమును జెందెదను. మహాత్ములయొక్క శాపము మనుజుల కనుగ్రహముగా పరిణమించుచున్నది గాదె! మహామహిమతోఁ గూడియుండుయక్షఋషి

శాపమువలన మీపాదారవిందములను దర్శించి విమదర్శననగు నేను అమృతదర్శననై నాపతిలోకమును జెంది మోక్షమును కూడఁ జెందఁబోవుచున్నదానను.'' అనిచెప్పి యావిమకన్యఉద్య న్మార్తండభాస్వరపమానంబుపై నెక్కి స్వర్గమునకుఁబోయెను.

కల్కిమూర్తి విమకన్యావృత్తాంతంబునకు సంతోషా శ్చర్యపరవశమానసుండై యానగరాధీశునికి రాజ్యమునందు పట్టాభిషేకముఁ జేసెను. ఆరాజునకు అమర్షుఁ డనుపుత్రుఁడు జనించె. వానికి సహస్రుఁడు, సహస్రునికి అసి అనుపుత్రుఁడు జ నించె. ఇతనివంశమునందు బృహన్నల యనుపేరం బరంగు భూ మీశులు జనించిరి. ఆవంశములో జనించినమనువను పేరుగల రాజశ్రేష్ఠుని అయోధ్యానగరమునందు పట్టాభిషేకముఁ జే యించి కల్కిమూర్తి ఋషిగణంబులతో మథురానగరమునకు వెడలెను. మథురానగరమునకు మహాప్రభావశాలియగు సూర్య కేతు వను ధరాకాంతుని పట్టాభిషేకముఁ జేయించి వారణావత పురమునకుంబోయి అచట దేవాపిని వారణావతము,అరిస్థలము, వృకస్థలము, మాకందము, గజాహ్వయము,అను ఈ ౫ దేశము లకు అధిపతిగనియమించి కల్కిమూర్తి శంబళగ్రామమునకు వ చ్చిచేరెను. పిదప భాతృవత్సలుఁడుగ నుండుకల్కిమూర్తి నిజ సహోదరులగు కవి ప్రాజ్ఞసుమంతులకు శౌంభము, పౌండ్రము, పుళిందము, సురాష్ట్రము, మగధము అను దేశముల నిచ్చివారిని పరిపాలనము చేయునటులు నియమించెను. మఱియు జగదీశ్వ రుఁడుగ నుండు కల్కిమూర్తి తనజ్ఞాతులకు కీకటము, మధ్యక ర్ణాటకము, ఆంధ్రము, ఓఢ్రము, కళింగము, అంగము, వంగ ము అను దేశముల నిచ్చె. మహాప్రతాపశాలి యగు కల్కి మూర్తి తాను శంబళనగరమునందు వసించుచు కంకము, కే

నము, కలాపకము అను దేశములను విశాఖయూపధరణీశున కిచ్చెను. ద్వారకామధ్యదేశముగ నుండుచోళము, బర్బరము మొదలగు దేశములను తనపుత్రుల కిచ్చెను. సకలలోకనాయకుం డగు కల్కిమూర్తి శంబళనగరమునందు వసించుచుండు ప్రజలను ధర్మానురాగములతో పరిపాలింపుచు భక్త్యతిశయసమన్వితుండై నిజపితకు ధనరత్నకనకాదులను మిక్కుటముగ సమర్పించెను. కల్కిమూర్తి పద్మ రమ యనునిరువురుభార్యలతోడ గృహస్థధర్మంబు లనుష్ఠింపుచు సముందానందమగ్నమానసుఁడై శంబళపురంబున సుఖముగ వసించుచుండెను. అట్టిసమయంబున ధర్మము నాల్గుపాదములతోఁగూడి యుండెను. సమస్తభువనంబులును కృతయుగపరిపూర్ణం బాయె. ఇంద్రాదిదేవతలు భూమియందలి సమస్తభూతంబులకు సర్వాభీష్టఫలప్రదులుగ నుండిరి. భూమి యెల్లపుడు సర్వసస్యసంపూర్ణంబై హృష్టపుష్టజనపరిపూర్ణం బాయెను. లోకమునందు వంచన, చోరత్వము, అసత్యభాషణము, రోగములు, మనోవ్యాధులు అనునవి లేకుండెను. బ్రాహ్మణులు వేదాధ్యయనతత్పరులుగ యాగాదిధర్మానుష్ఠాననిరతులుగ నుండిరి. స్త్రీలు పతివ్రతలుగ, దేవద్విజగురుభర్తృజపహోమపరాయణలుగ నుండిరి. క్షత్రియులు అశ్వమేధాదియాగానుష్ఠానతత్పరులుగ, ధర్మమార్గప్రవర్తకులుగ న్యాయముచే రాజ్యములను పరిపాలించువారుగ నుండిరి. వైశ్యులు స్వధర్మానుష్ఠానములను దప్పక వ్యాపారములను చేయుచు విష్ణుపూజాదులను సలుపుచుండిరి. శూద్రులు బ్రాహ్మణశుశ్రూషాతత్పరులై విష్ణుకథాసక్తచిత్తులుగ నుండిరి.

ఇది తృతీయాంశమునందు చతుర్దశాధ్యాయము.

పంచదశాధ్యాయము.

~ మాయాస్తోత్రము. ~

ఓసూతా! శశిధ్వజమహారాజు మాయాదేవిని స్తుతించి యెచ్చటి కేఁగెను? మాయ యన నెద్ది? మాయాస్తుతి ఎటువంటిది? వీనినన్నిటిని మాకు తత్త్వముగ నుపదేశింపవలయును. నీచేఁ జెప్పంబడు విష్ణుకథ మనశ్శుద్ధికరమును సంతోషకరమునై యున్నయది. అని శౌనకాది మహర్షులు పౌరాణికోత్తముండగు సూతు నడిగిరి. "ఓఋషిసత్తములారా! మార్కండేయ మహర్షి శుకమహర్షి యొద్దికేతెంచి మాయాస్తవమును జెప్పు మని యడుగ నాశుకమహర్షి మార్కండేయునికి దానిని జెప్పెను. ఆసమయంబున శుకమహర్షి యనుమతిచే నేనును ఆకర్ణించితిని. సర్వకామఫలప్రదమును సర్వపాపవినాశకమునైన మాయాస్తోత్రమును మీకు నేను జెప్పెద వినుండు.

విష్ణుభక్తాగ్రేసరుండైన శశిధ్వజుండు భల్లాటనగరమును వదలి యాత్మసంసారమోక్షముకొఱకు మాయాస్తవమును జేసెను. హ్రీంకారస్వరూపిణియు,సత్త్వగుణపరిపూర్ణయు,బ్రహ్మాదిసకలదేవమాతయు, సకలవేదప్రతిపాదిత మహామహిమశాలినియు, దేవగంధర్వసిద్ధాదివందితయు, సకలభూతతన్మాత్రస్వరూపిణియు నైన మహేశ్వరికి నమస్కరించెద. మఱియు లోకాతీతయు, ద్వైతభూతయు, విద్వద్గణంబులచే స్తుతింపఁబడినదియు,లీలాకటాక్షవీక్షణంబుచే సకలసంసారతాపంబును పోఁగొట్టునదియు, పూర్ణానందస్వరూపిణియు, సకలలోకరక్షకయు, భూతభవిష్యద్వర్తమానకాలములయందుఁ బ్రకాశించుచుండునదియు, దేవతిర్యఙ్మనుష్యాది నానావిధరూపముల కాధారభూ

తయు, సాక్షాత్పరబ్రహ్మస్వరూపిణియు నైన పరాశక్తిని నమస్కరించెద. ఏమహేశ్వరి తేజస్సుచే త్రిజగంబులు ప్రకాశించుచున్నవో; ఏమహేశ్వరిప్రకాశము లేకుండిన సకలలోకంబులు ప్రకాశమును జెందకుండునో, కాలదైవ కర్మోపాధు లెవతెనం కల్పముచేఁ బ్రవర్తించుచున్నవో అట్టిపరమేశ్వరికి నమస్కరించెద. భూమియందు గంధము, ఉదకమున రసము, తేజంబున రూపము, వాయువునందు స్పర్శము, ఆకాశమున శబ్దము ఇవి ఏపరమేశ్వరియొక్కయాజ్ఞచే స్థిరమై నానారూపములు చెంది యున్నవో అట్టివిశ్వరూపధారిణియైన మాయాదేవికి నంజలిఁజేసెద. ఓజగన్మాత! నీవు నలువయందుసావిత్రీస్వరూపిణివయ్యును, సకలభూతపతియైన పరమేశ్వరునియందు పార్వతీస్వరూపిణివయ్యును, విష్ణువునందు లక్ష్మీస్వరూపిణివయ్యును, స్వర్గాధిపతియైన ఇంద్రునియందు శచీస్వరూపిణివయ్యును, సర్వజగంబులయందు మిక్కిలి శ్రేష్ఠురాలవై ప్రకాశించుచున్నదానవు. బాల్యమునందు బాలాస్వరూపిణిగను, యౌవనమునందు యువతిస్వరూపిణిగను, వార్ధకమునందు వృద్ధాస్వరూపిణిగను, అమోఘప్రభావంబుచే నానావిధాకారంబులతోఁగూడి బ్రహ్మాది సకలదేవతాబృంద వందితవై యవాఙ్మానసగోచరప్రభావముతోఁగూడి వెలయుచున్నదానవు

ఓజగదంబ! సర్వాభీష్టముల నిచ్చుదానవును, సకలలోక వందితవు నై యుండునీవు చండి దుర్గ కాళి కాళిక అనునామంబులతో నానారూపంబులను ధరించి నానాదేశములయందుఁ బ్రకాశించుచున్నదానవు. ఓదేవీ! సకలబృందారక బృందవంద్యంబై యుండునీపాదారవిందములను హృదయకమలమునందు భక్తిచే ననవరతము ధ్యానము చేయువారికి సకలైశ్వర్యవురు

పార్థసిద్ధులు సులభంబులై యుండును. శుకబ్రహ్మముచే మార్కండేయమహర్షి కుపదేశింపఁబడినదియు, సకలపాపములను పోఁగొట్టునదియు, మహాపుణ్యకరంబైనదియు నైన యీమాయాస్తవమును శశిధ్వజమహారాజు మార్కండేయునియొద్ద నుపదేశముఁ జెంది మహాసిద్ధిని బొందెను. పిదప నాశశిధ్వజుండు కోకాముఖం బనుపుణ్యక్షేత్రంబున తపంబుఁజేసి విష్ణుమూర్తిని ధ్యానించుచు విష్ణ్వాయుధోత్తమంబైన సుదర్శనముచే గొట్టంబడినవాఁడై వైకుంఠలోకమునకుం బోయి మహానందమును జెందెను."

ఇది తృతీయాంశమునందు పంచదశాధ్యాయము.

షోడశాధ్యాయము.

—విష్ణుయశస్సు మోక్షమును జెందుట—

ఓమహర్షులారా! మీకు శశిధ్వజునివృత్తాంతంబు నంతయును జెప్పితిని. అసమానంబును అతిపావనంబునైన కల్కిమూర్తికథల నింకను వచించెదను. వినుం డనిచెప్పి సూతుండు చెప్పుట కారంభించెను.

కల్కిమూర్తి దిగ్విజయ మొనర్చి రాజ్యంబు నేలుచుండుసమయంబున వేదోక్తధర్మంబు లన్నియు గొఱవడక యుండెను. ఎల్లస్థలంబులయందును కృతయుగంబు బల్లిదంబుగ నల్లుకొని సురాసురనరపశు పక్ష్యాదిసకలజంతుజాలంబు లన్నియు సంతోషకలితంబులై వృద్ధిఁ జెందుచుండె. మాయామోహాభరితమానసులును సాధుజనవంచకులు నైన పాషండజనంబు

తెచ్చుటను నుండైరి. పద్మావతి, రమ, యనుభార్యాద్వయంబుతోడ కల్కిమూర్తి సుఖంబున వసించుచుండుతఱిని విష్ణుయశస్సు నిజపుత్త్రుండైన కల్కిమూర్తిని గాంచి రాజసూయాది మహాయాగంబులచే నింద్రోపేంద్రాదులఁ బూజింపవలయు నని యడిగెను. ఇట్లు వచించినతండ్రిపలుకుల నాలకించి కల్కిపురుషుండు పరమహర్ష పరిపూర్ణస్వాంతుండై వినయముతోడ ధర్మార్థకామాది సకలపురుషార్థసిద్ధికొఱకు నశ్వమేధాదియాగంబుల ననుష్ఠింపవలయు నని బహుదక్షిణలతోఁగూడిన రాజసూయ వాజపేయాశ్వమేధాదినానావిధమహాయజ్ఞంబులచే సర్వయజ్ఞభోక్తయైన విష్ణుమూర్తిని కృప రామ వసిష్ఠ వ్యాస ధౌమ్యాశ్వత్థామ మధుచ్ఛంద మందపాల ప్రభృతులయిన మహర్షులతోడఁ బూజించి గంగాయమునామధ్యంబున నవభృథస్నానంబుఁ జేసి వేదవేదాంగపారంగతులయిన బ్రాహ్మణశ్రేష్ఠులను చోష్యలేహ్యపేయ మధుమాంస మూలఫలాదినానావిధాన్నపానాదులచేతను, విశేషదక్షిణలచేతను దృప్తిపఱచి విధిప్రకారము యాగకార్యంబులను బూర్తిచేసెను.

ఇట్లు కల్కిమూర్తిజనకునిచేఁ జేయఁబడిన యాగంబునందు అగ్నిదేవుండు పాచకుండుగను, వరుణదేవుండు దివ్యోదకంబులఁ దెచ్చువాఁడుగను, వాయుదేవుండు బ్రాహ్మణాదుల కన్నంబు వడ్డించువాఁడుగను ఉండిరి. ఇప్పుగిదిని కల్కిమూర్తి వాద్యనృత్యగీతంబులచేతను పితృయజ్ఞమహోత్సవంబులచేతను సర్వభూతంబులను దృప్తిపఱచి యతిసంతోషంబున స్త్రీబాలవృద్ధదీనాదులకు యథోచితముగ ధనకనకవస్త్రాదులను దానంబుగ నిచ్చి వేదవేదాంగపారంగతులుగను, శ్రోత్రియులుగను నుండుబ్రాహ్మణశ్రేష్ఠులకు భూదానగోదానాదుల నొసంగి గం

గాతీరంబున పితృవాక్యంబుల నామోదింపుచు సుఖంబుగ వసించుచుండెను. అట్టిసమయంబునందు కల్కిమూర్తిసదస్సునందు విశ్వదగ్రగణ్యులయిన బ్రాహ్మణోత్తములు పూర్వరాజసచ్చరిత్రంబులను, అశ్వమేధాదుల ప్రభావంబును కల్కిమూర్తి-విష్ణుయశస్సులకు బోధింపుచు మహానందంబును జెందియుండిరి. అట్టితరుణంబున దివ్యయే బువ్వగాఁ గొను నారదుండు తుంబురునితో కల్కియొద్దకువచ్చెను. ఇట్లువచ్చిన నారదతుంబురులను కల్కిమూర్తి తనపితతోడ యథావిధిగ నర్చించెను. విష్ణుయశస్సు వినయాన్వితుండై వచ్చినఋషులకు నమస్కారముఁ జేసి విష్ణుభక్తాగ్రేసరుండును, వీణాహస్తుండునైన నారదునిం జూచి "ఋషిశ్రేష్ఠా నాభాగ్యంబు నేమని కొనియాడుదు? పూర్వకాలంబున నేను విశేషంబైన తపంబుఁ జేసియుండునట్లు దలంచెదను అట్లు లేనియెడల పరిపూర్ణకాములును, బ్రహ్మవిదగ్రేసరులునైన మీబోఁటిమహాత్ముల దర్శనము నాకెట్లులభించును? ఇపుడు మిమ్ముల దర్శించి పూజించినందుచేత గార్హపత్యాద్యగ్నులు, పితృదేవతలు, ఇంద్రాది బృందారకులు మొదలగువారు నాయందు విశేషముగఁ దృప్తిఁజెందిరి. సాధుజనంబులను బూజించుటవలన విష్ణువు పూజింపఁబడిననాఁ డగును. సజ్జనులను దర్శించుటచే విష్ణుమూర్తిని దర్శించినఫలము కలుగును. సాధుజనస్పర్శనముచే కలుషంబు లన్నియు దూరంబు లగును. సత్పురుషులహృదయము ధర్మము వాక్యంబు లాదిదేవతలు, కృత్యంబులు పాపవిమోచకంబులు అగుటంజేసి సాధుజనంబులు విష్ణుతుల్యు లని వేఱుగఁ జెప్ప నేల? భూలోకమందు కంసాదిదుష్టజనవినాశార్థమై యవతరించిన కృష్ణమూర్తిశరీర మెట్లు పాంచ

భౌతికము కాదో అటులే విష్ణుభక్తాగ్రేసరుండవైన నీశరీరము సయితము పంచభూతజన్యంబు కానేరదని తలంచెదను.

నీవు సంసారంబను సాగరంబును దాటుటకుఁ సాధకమైన విష్ణుభక్తి యనెడు నోడకు నావికునివలె నున్నవాఁడ వగుటం జేసి నిన్నొకటి యడిగెదఁ జెప్పుము.

లోకంబుల కెల్ల బాంధవుండవైన యోనారదా! ఏమంచి కార్యముచే నేను యాతనాగృహంబైన యీశరీరంబునందుండి మోక్షంబును జెందుదు'' నని వచించుచున్న విష్ణుయశస్సు పల్కుల నాలకించి నారదమహర్షి యిట్లుచింతించుచున్నాఁడు. ''విష్ణుమాయ సర్వైశ్వర్యకరంబుగను కడు బల్లిదంబుగను గాన్పించుచున్నయది. విష్ణువు తనమాతాపితరులను సయితము నిజమాయచేఁ దపింపఁజేయుచున్నాఁడు. ఎల్లెడల బల్లిదంబుగ నల్లియుండువాఁడును, సర్వలోకంబుల కెల్ల యజమానుఁడు నైన సాక్షాన్నారాయణమూర్తి యే విష్ణుయశస్సునకుఁ బుత్రుండై యున్నవాఁడో యట్టివిష్ణుయశస్సు నాచే మోక్షోపాయంబునకు తెరు వరయుటకు గమకించుచున్నవాఁ''డని నిజమానసంబునం దలపోసి విష్ణుయశస్సును గాంచి ''బ్రాహ్మణశ్రేష్ఠా! నీ సుతుండైన యీకల్కిమూర్తి మోక్షంబు నిచ్చువాఁ''డని రహస్యంబున వక్కాణించి మాయావిషయకమైన యొండితిహాసంబును జెప్పుట కారంభించె.

''లోకంబున సాధారణంబుగ శరీరము నాశ్రయించి యుండు జీవుఁడవసానకాలంబున దేహమును వదలి పోవుటకుఁ బ్రయత్నించు నవసరంబున వింధ్యాచలనివాసిని యగుమాయ స్త్రీరూపమును ధరించి ఆజీవాత్ముని జూచి 'నేను విష్ణుమా

యును, నాచేత విడువంబడి నీ వెట్లు జీవింపఁగల' వని యడుగ జీవుఁడు వచించుచున్నాఁడు.

జీవ:—లోకమునందు శరీరము లేకపోయిన నేను అను బుద్ధి యెట్లు గలుగును? జీవనాధారమై యుండు నీ శరీరములో నేను జీవించుట లేదు.

మాయ:—శరీరమునందు నీకు విశేషాసక్తి కలిగి యుండుటవలన దేహమే యాత్మ యనుబుద్ధి నీకు కలిగియున్న ది. నీకు మాయాధీనంబులైన వ్యాపారంబు లన్నియు నెట్లు కలిగినవో చెప్పుము.

జీవు:—నేను లేక జగంబునం దేవ్యాపారముజరుగును?

మాయ:—ఓజీవుఁడా! మనుజుఁడు మాయచే మోహింపఁబడినవాఁడై జీవించుచున్నాఁడు. మఱియు మాయాప్రభావమువలన నిస్సారమైన వస్తువుసయితము సారముగలదానివలెఁ బ్రకాశించుచున్నది.

జీవు:—ఓమూఢురాలైనమాయా! నీవు నాసంసర్గమువలన జనించి నానామనస్స్వరూపంబులను ధరించినదానవై వ్యభిచారస్త్రీ తనభర్తను నిందించుచందంబున నన్ను నిందించుచున్నదానవు. సూర్యుఁ డుదయించునపు డంధకార మెట్లు లేకుండునో యటులే నేను లేకపోయిన నీవు నుండనేరవు. సూర్యుని మేఘము కప్పుకొనియుండునట్లు నీవు నన్నావరించుకొని యున్న దానవు. మఱియు నీవు నాలీలలనెడు బీజములకు గాదెవలెనున్న దానవు. ఆద్యంతకాలములలో లేకుండి మధ్యకాలములో మాత్ర మింద్రజాలమువలె నానావిధములై కనుపడుచున్నదానవు.

ఇటులు జీవుఁడు చెప్పఁగా మనోవ్యాపార రహితమైనది యును, పంచభూతసంబంధము లేనిదియును, జీవసంబంధవర్జితం

బునై యనిత్యముగ నుండుశరీరమును వదలి మాయ జీవునిం జూచి "ఓజీవుఁడా! నీ కొక్కఁడను నిక్కమైన యునికిపట్టు లేకుం డఁబోవుంగాక" యని శపించి నిజస్థానంబునకుం బోయె. ఆమా య యనునది సర్వాంతర్యామియును సర్వలోకప్రభుండు నైన నీతనూజుండగు కల్కిమూర్తి సంబంధమైన మాయ గాని వే ఱుగాదు. అట్టిమాయాస్వరూపంబును జక్కఁగఁ గుర్తెఱిఁగి విష్ణు మూర్తియందు చరాచరం బంతయు నంతర్గతంబుగ నున్న ద నియు, విష్ణుమూర్తి యెల్లయెడలను బల్లిదంబుగ నల్లియున్న వాఁడనియు నిశ్చయించి శాంతచిత్తంబున సర్వభోగంబుల యందలియాశాపాశంబును ఖండించి నిజచిత్తంబునఁ బరమా త్ముని ధ్యానించుచుండవలయు" నని చెప్పి నారదతుంబురులు విష్ణుయశస్సుచే సెలవుగొని కల్కిమూర్తికిఁ బ్రదక్షిణనమస్కా రాదు లర్పించి కపిలాశ్రమంబునకరిగిరి పదంపడి విష్ణుయశస్సు నారదునిపలుకుల నాకర్ణించి నిజతనూజుండైన కల్కిమూర్తి శ్రీమన్నారాయణుం డని నిజమానసంబునం దలంచి సంసార మునందు విరక్తిం జెంది బదరికావనంబునకుం బోయి యచట నిష్ఠురంబైన తపంబు సల్పి తపఃప్రభావంబుచే నిజాత్మను పర మాత్మునియందు లయంబు చేసి బ్రహ్మానందపరిపూర్ణుండై పాం చభౌతిక మయినశరీరమును ద్యజించెను విష్ణుయశస్సహధ ర్మిణి యైన సుమతి లోకాంతరమును జెందిననిజభర్తృమృతకళే బరముతోఁ జితి నెక్కి సహగమనముఁ జేసి దేవతలచే స్తుతింపఁ బడినదై భర్తృలోకమును జేరెను.

పదంపడి కల్కిమూర్తి బదరికావనంబున తపంబుఁ జే యుచుండు తనతల్లిదండ్రులు లోకాంతరంబుఁ జేరిన వర్తమా నంబును ఋషిగణంబులచే నెఱిఁగి శోకాతిరేకజనితబాష్పధా

రాపరిపూర్ణలోచనుండై తర్పణాదిపితృయజ్ఞంబుల యథావిధి ననుష్ఠించి సకలసంపత్సమన్వితంబైన శంబళనగరంబునం దుండు ప్రియభార్యలైన పద్మావతీరమాభామలతోడ నానావిధ భోగంబులం బడయుచు ధర్మపథంబున రాజ్యభారంబు సేయుచుండె. అట్టిసమయంబున తీర్థయాత్రాకుతూహలస్వాంతుండైన పరశురాముండు కల్కిదర్శనంబునకై శంబళగ్రామంబున కేతెంచె. ఇటు లేతెంచినపరశురామునింగాంచి కల్కిమూర్తి భార్యాసహితుండై యతికౌతుకంబున నాతనికి నానావిధాన్న పానాద్యుపచారంబులచే నాతిథ్యం బొసంగి గారవించి యత్యుత్తమవస్త్రాచ్ఛాదితంబైన పర్యంకప్రవరమునందుఁ బరుండనిచ్చి విద్యాగురుండైన యతనిపాదంబు లొత్తుచు నతనిం జూచి "స్వామీ! మీకటాక్షవీక్షణంబువలన నాకు త్రైవర్గికఫలము సిద్ధించినది శశిధ్వజునిసుతయగు రమ నీయొద్ద తనమనోభీష్టంబును జెప్పుకొనుట కిచ్ఛయించుచున్నది యగుటంజేసి దాని శ్రద్ధతో నాలకింపఁ బ్రార్థించెద"నని చెప్పు ప్రియునివాక్యంబు లాలకించి రమాదేవి పరశురామునిం జూచి "స్వామీ! నాకు సుపుత్రోదయం బగునటు లనుగ్రహింపు" మని యడిగెను.

ఇది తృతీయాంశమునందు షోడశాధ్యాయము.

సప్తదశాధ్యాయము.

—రుక్మిణీవ్రతకథనము.—

ఇట్లు పరశురాముండు రమాదేవికి పుత్రసంతానమునం
దుం గలిగియుండు నభిలాషను దెలిసికొని విష్ణ్వంశసంభూతుం
డగు కల్కిపురుషునికిసయితము పుత్రోదయమునం దాకాంక్ష
గలిగియుండునదియు నెఱింగి రమాదేవికి సుపుత్రోదయ మగు
నట్టి రుక్మిణీవ్రతమను నొక వ్రతము నాకాంతామణిచేఁ జేయిం
చెను. ఈవ్రతాచరణంబుచే రమాదేవి సుగుణసంపన్నుఁడైన
పుత్రునిం గని సౌభాగ్యయౌవనసమన్వితయై సర్వసంపద లను
భవింపుచు సుఖంబున నుండె నని చెప్పినసూతపౌరాణికునివచ
నంబులను శౌనకుం డాలకించి "పౌరాణికోత్తమా! రుక్మిణీవ్ర
తవిధానం బెట్టిది? దానిం జేయువారు పడయుఫలం బెయ్యది?
తొల్లి యెవరిచే నీవ్రతం బాచరింపంబడియె? దీనినంతయు నాకుఁ
దెల్లంబుగ దెల్పు" మని యడిగెను.

ఇవ్విధంబున నడిగిన శౌనకునివాక్యంబుల నాలకించి
సూతుండు చెప్పుచున్నాఁడు "ఓ ఋషిసత్తమా! రుక్మిణీవ్రత
ప్రభావంబును వివరించెద. దత్తావధానచిత్తంబున నాకర్ణింపుము.

తొల్లి వృషపర్వుండను నొకానొక రాక్షసరాజు కలఁడు.
వానిపుత్త్రియైన శర్మిష్ఠ యను కాంతాతిలక మొకదినంబున
సఖీజనంబులతోడను శుక్రపుత్రియైన దేవయానితోడను గూడి
నదై యొండుకాంతారమధ్యంబునంపలి సరోవరంబునకుఁ బో
యి నిజవస్త్రంబులం దూల్చి తత్తీరప్రదేశంబునం దుంచి స్నా
నంబుఁ జేయుచుండెను. అత్తఱి పార్వతీసమేతుండై పరమేశ్వ
రుండు మార్గవశంబున నచటి కేతెంచెను. అపు డాసుందరాం

గుఁలు సదాశివుని గాంచి లజ్జా భయభ్రాంతచిత్తలై తమచేతి కబ్బినవస్త్రంబులం జుట్టుకొనిరి. శుక్రసుతయైన దేవయాని ప్రమాదవశంబున శర్మిష్ఠపుట్టంబును గట్టుకొనియె. దానిం దెలిసి శర్మిష్ఠ యతికుపితయై దేవయానిం జూచి బిట్టలిగి "ఓ బిచ్చపుదానా! రాచస్త్రీలచేఁ గట్టంబడు నాపుట్టంబును నీవెట్టులు గట్టుకొంటివి? వస్త్రంబును విప్పి యిటులు పెట్టుమని కొన్నినిష్ఠురోక్తులను బలికి దాసీజనసహితయై దేవయానిని క్రిందికిఁద్రోసి దాని వస్త్రంబుతో నాపడఁతిం గట్టి తత్సమీపంబునం దుండు నొక కూపంబునం బడవైచి నిజేచ్ఛం జనియె.

తదనంతరము నహుషాత్మజుండైన యయాతి యను క్ష్మాకాంతుండు మృగయాసంజాతపిపాసాకులితుండై జలంబును గ్రోలుటకై కూపసమీపంబునకుం బోయి యందుఁబడి దిక్కులేక పొక్కుచుండు నక్కన్నియను జూచి నిజకరయుగళంబుచే నాపడఁతిని కూపంబునందుండి పైకెత్తి "ఓసుందరాంగీ! నీవెవ తెవు? చెప్పు"మని యడిగెను. అపుడు దేవయాని వస్త్రంబును జుట్టుకొనిలజ్జావనతవదనయై నిజాపాంగావలోకనంబుచే యయాతిరాజునాననంబును జూచుచు, తాను శుక్రసుతయైన దేవయాని యనియు, వృషపర్వునికూఁతురైన శర్మిష్ఠచే తన కిట్టిచెట్టలు పుట్టినవి యనియుఁ జెప్పితన్నుఁ బరిణయమాడు మనియు వచింప యయాతియు దేవయానిని మోహించి నీవు గృహంబునకుం బొమ్ము. కాఁగలకార్యంబును వెనుకఁ జింతింత మని వచించి యాబాలామణి ననిపి తాను నిజగృహంబున కరిగి దేవయానిని పాణిగ్రహణంబుఁ జేసికొనుటయం దతికుతూహలుండై యుండెను. పిదప దేవయాని నిజగృహంబున కరిగి తండ్రియైన శుక్రాచార్యునికి శర్మిష్ఠ తన కొనర్చిన యపకారంబులం జెప్ప

నాయసురగురుండు క్రోధారుణితలోచనుం డాయెను. ఇది తెలిసి
వృషపర్వుండు శుక్రునిసమీపంబున కేతెంచి "స్వామీ! శర్మి
ష్ఠ నీసుత కజ్ఞానవశంబున నపకృతి యొనర్చె. నీకోపానలంబుచే
నన్నైనను లేక శర్మిష్ఠనైనను దగ్ధముచేయు"మని శుక్రాచార్యు
నిపాదంబులను గట్టిగఁ బట్టుకొనెను.

అపుడు దేవయాని వృషపర్వునిం జూచి శర్మిష్ఠ నా కెల్ల
పుడు దాసియై యుండునటు లాజ్ఞాపింపు మనుడు నసురరాజు
మిక్కిలిఁ జింతించుచు శర్మిష్ఠను దెచ్చి దేవయానికి పరిచారకు
రాలై యుండునట్లుచెప్పి యప్పగించె. అంత శుక్రుండు దేవ
యానిమనోభీష్టంబును దివ్యజ్ఞానంబుచేఁ దెలిసికొని యయాతి
మహారాజునురప్పించి యతనికి శర్మిష్ఠాసహితముగ దేవయానిని
కన్యాదానముఁ జేసి యయాతిని జూచి "భూమీశా! నీవు వృ
షపర్వరాజసుత యైనశర్మిష్ఠతోడ శయనసుఖం బనుభవింపఁ
గోరకుము కోరినచో తత్క్షణంబే నీకు స్త్రీసంపర్కమునం దశ
క్తిని గలుగంజేయు ముదిమి సంభవించు" నని చెప్పె. ఇట్లు
యయాతి శుక్రునివచనంబుల నాలకించి దేవయానీశర్మిష్ఠలతో
డ నింటికిం బోయి జరాభయంబున శర్మిష్ఠను తనకంటి కగ
పడకుండునటు లాజ్ఞాపించెను. రాజసుతయైన శర్మిష్ఠ శోకాక్రాం
తచిత్తయై యనేకదాసీజనులతోడ దేవయాని కూడిగంబులు
చేయుచు యయాతినయనగోచరంబు గాకయుండె. ఇవ్విధం
బున కొన్నిదివసంబులు గతింప నొకానొకదినంబున శర్మిష్ఠ
కాంతారమధ్యస్థిత జాహ్నవీతీరంబునకుం బోవుచు తనకుఁగల
భర్తృదర్శన సుఖప్రతిబంధకంబైన పాపవిశేషంబును దలఁచి
యెలుంగెత్తి యేడ్చుచు గంగాతీరంబునకుఁ జేరి యచట నానా
విధదివ్యాభరణవస్త్రమాల్యగంధాదులచే నలంకరింపంబడిన

వారును, అత్యుత్తమరూపవతులునైన స్త్రీలలామంబులకు మాల్యదీపధూపనైవేద్యాద్యుపచారంబులచే రుక్మిణీవ్రతమును జేయించుచుండు విశ్వామిత్రునిం జూచెను. ఆసమయంబున శరిష్ఠచతురశ్రశోభితంబును, చతుర్దిక్కులయందు రంభాస్తంభంబులచేఁ బ్రకాశించుచుండునదియును, అగ్రభాగంబున స్వర్ణపట్టాలంకృతవసనవితానవిచిత్రితంబునై యుండు వేదికామధ్యప్రదేశంబున అష్టదళపద్మంబు నిర్మించి తన్మధ్యంబున నానారత్నఘటితంబును స్వర్ణనిర్మితంబునై యుండు వాసుదేవవిగ్రహంబును ప్రతిష్ఠించి పురుషసూక్తమంత్రములు పఠించుచు నుత్కృష్టగంధపరిమళితపుణ్యోదకంబులచేతను పంచామృతపంచగవ్యంబులచేతను,అభిషేకముఁ జేయించి షోడశోపచారంబులచేఁ బూజించి "పాద్యమధ్వశ్రమహారం శీతలం సుమనోహరమ్, పరమానందజనకం గృహాణ పరమేశ్వర!'' అనుమంత్రముచే పాద్యంబును "దూర్వాచందనగంధాఢ్య మర్ఘ్యం యుక్తం ప్రయత్నతః, గృహాణ రుక్మిణీనాథ! ప్రపన్నస్య మమ ప్రభో.''అనుమంత్రంబుచే నర్ఘ్యంబును "నానాతీర్థోద్భవం వారి సుగంధ సుమనోహరమ్, గృహాణాచమనీయం త్వం శ్రీనివాస! శ్రియా సహ'' అను మంత్రంబుచే నాచమనీయంబును "నానాకుసుమగంధాఢ్యం సూత్రగ్రథిత ముత్తమమ్, వక్షశ్శోభాకరం చారు మాల్యం నయ సురేశ్వర!'' అనుమంత్రముచే పుష్పదామంబును, "తంతుసంతానసంధానరచితం బంధనం హరే!,గృహాణావరణం శుద్ధం నిరావరణసప్రియ!'' అనుమంత్రముచే వస్త్రంబును, "యజ్ఞసూత్రమిదం దేవ! ప్రజాపతివినిర్మితమ్, గృహాణ వాసుదేవ! త్వం రుక్మిణ్యా రమయా సహ'' అను మంత్రముచే యజ్ఞోపవీతంబును "నానారత్నసమాయుక్తం స్వర్ణముక్తావిభు

ట్టితమ్, ప్రియయా సహ దేవేశ! గృహాణాభరణం మమ" అను మంత్రముచే నాభరణంబును "దధిక్షీరగుడాన్నాదిపూపలడ్డుకఖండకాన్, గృహాణ రుక్మిణీనాథ! సనాథం కురుమాం ప్రభో!" అనుమంత్రముచే నైవేద్యంబును "కర్పూరాగరుగంధాఢ్యం పరమానందదాయకమ్, ధూపం గృహాణ వరద! వైదర్భ్యాశ్రీప్రియయా సహ" అనుమంత్రముచే ధూపంబును "భక్తానాం గేహసక్తానాం సంసారధ్వాంతనాశనమ్, దీపమాలోకయ విభో జగదాలోకనాదర!" అనుమంత్రముచే దీపంబును సమర్పించి "శ్యామసుందర పద్మాక్ష! పీతాంబర! చతుర్భుజ! ప్రపన్నం పాహి దేవేశ! రుక్మిణ్యా సహితాచ్యుత." అనుమంత్రంబుచేఁ బ్రార్థించుచు రుక్మిణీవ్రతమును జేయుచుండు స్త్రీలను జూచెను. శర్మిష్ఠ యిట్టివ్రతనియమంబులుగల స్త్రీలను జూచి శోకభరాక్రాంతచిత్తయై వారి కంజలిఁ జేయుచు "వనితోత్తములారా! నిర్భాగ్యురాలును, భర్తృపరిత్యక్తయు, గత్యంతరవిహీనయు, రాజపుత్రియునైన నాచే నీరుక్మిణీవ్రతమును జేయించి నన్నురక్షింపుఁ" డని ప్రార్థింపఁగ రుక్మిణీవ్రతపరాయణలైన యావనితలు దయాతిరేకంబున పూజోపకరణసామగ్రులను శర్మిష్ఠ కొసఁగి యాదరంబున నావృషపర్వపుత్రిచే రుక్మిణీవ్రతమును జేయించిరి. శర్మిష్ఠ రుక్మిణీవ్రతప్రభావంబుచే నిజభర్తతోడం గూడి సుగుణంబైన సంతానంబునుబడసి యౌవనసుఖంబులను పెద్దకాలం బనుభవించుచుండెను. మఱియు రావణాసురునిచే నపహరింపంబడిన సీతాదేవి యశోకవనమధ్యప్రదేశంబున సరమ యను నక్తంచరభామతోడ నీరుక్మిణీవ్రతమును సలిపి తత్ప్రభావంబుచే రాక్షసకుల వినాశకుండైన రాముని పాదారవిందములను జేరెను. ద్రౌపది బృహదశ్వునియనుగ్రహంబున నీవ్రతం బొన

ర్పి శోకవిముక్తయై నిజభర్తలం గలసి సుఖంబు లనుభవించె.

కల్కిమూర్తిభార్యయైన రమాదేవి వైశాఖశుద్ధద్వాదశీదివసంబున పరశురామానుగ్రహంబువలన వ్రతనిమిత్తంబు కంకణంబును నిజకరంబున ధరించి రుక్మిణీవ్రతమును యథావిధిగ నాలుగువత్సరంబు లనుష్ఠించి బ్రాహ్మణోత్తముల నన్నదానాదులచేఁ దృప్తిపఱిచి నిజభర్తతోడ క్షీరసహితమైన హవిస్సును భక్షించెను. ఇంతియకాక యాసాధ్వి వ్రతప్రభావంబుచే బంధుగులతోడం గూడి భూచక్రంబు నేకచక్రాధిపత్యంబుగ ననుభవించెను. పతివ్రతాశిరోమణియైన రమాదేవికి యజ్ఞదానతపోవ్రతంబులచే దేవతలకు సంతసంబును గలుగంజేయుస్వభావముగలవారును, మహోత్సాహశాలులును, బలపరాక్రమవంతులును, అతిరూపరేఖావిభ్రమసంపన్నులును, కల్కిమూర్తికి సదృశులునైన "మేఘమాలుఁడు" "వలాహకుఁడు" అనుపుత్రరత్నంబు లుత్పన్నులైరి. ఇవ్విధంబున రమాదేవి భర్తృపుత్రబంధువులతోడ కలుము లనుభవించుచుండె. లోకంబునం దీరుక్మిణీవ్రతం బేయువతిశిరోమణి యాచరించునో యట్టి స్త్రీలలామంబు సకలసౌభాగ్యసంపన్నయై సకలభోగంబు లనుభవించి యంత్యకాలంబున బ్రహ్మజ్ఞానులకుసయితము దుర్లభంబుగనుండు నుత్తమపదము ననుభవించును.

ఇది తృతీయాంశమునందు సప్తదశాధ్యాయము.

అష్టాదశాధ్యాయము.

~ కల్కిమూర్తిలీలావర్ణనము. ~

తదనంతరము సూతపౌరాణికుండు శౌనకాదిమహర్షులను జూచి బ్రాహ్మణోత్తములారా! త్రిలోకప్రసిద్ధంబుగ పుణ్యకరంబైన రుక్మిణీవ్రతవిధానంబును జెప్పితి. ఇఁక కల్కిమూర్తి లీలలం జెప్పెద నవధరింపుఁడు.

కల్కిమూర్తి పతాకాధ్వజచిత్రితంబైన హర్మ్యప్రాసాద సభామండపచత్వరంబులతో నింద్రునియమరావతింబోలెఁ బ్రకాశించుచుండుశంబళనగరంబునందు నిజబంధువర్గంబులతోడ వేయువత్సరంబులు సుఖంబుగ వసించుచుండెను. కల్కిప్రభావంబుచే అఱువదియెనిమిదిపుణ్యతీర్థంబు లెల్లపుడు నచటఁ బాఱుచుండెను. దేవదేవుండైన కల్కిమూర్తిపాదారవిందప్రభావంబువలన శంబళనగరంబునందలిజనంబులకు మోక్షంబు కరతలామలకంబై యుండె. నానావిధకుసుమవితానశోభితవనోపవనవిలసితంబైన యాశంబళనగరంబు భూలోకంబునందలి మోక్షలోకంబువలెఁ జూపట్టె. ఆనగరంబున స్త్రీనయనంబుల కానందంబును గలుగఁజేయు రూపరేఖావిలాసంబులుగల యాకల్కిమూర్తి పద్మారమలతోడ వెలయుచుండె. కల్కిమూర్తి యింద్రదత్తంబై తలఁచినస్థలంబులకుఁ గొంపోవుశక్తిగలిగిన రథంబు నెక్కి భార్యాద్వయవిరాజమానుండై నదీపర్వతకుంజద్వీపాదిరమణీయ ప్రదేశంబులయం దతికౌతుకంబున మదనావేశపరవశుండై రేయుంబవళ్లనుభేదంబు లేక మదనకదనంబునం దేలుచుండె. పదంపడి పద్మాముఖారవిందగళితశీధుపానమత్తుండైన కల్కిమూర్తి యింద్రనీలమణిగణమరీచిజాలజటి

లంబైన యొకానొకగుహామధ్యంబునం బ్రవేశించె. అపుడు భార్యాద్వయంబు కల్కివిష్ణుండు గుహాయందుఁ జొచ్చినదిగాంచి తాముసయితమనేకయువతిజనపరివృతలై కల్కిమూర్తితోడ రమించునాకాంక్షతోడ నాగుహం బ్రవేశించిరి. అపుడు పద్మావతీ రమ లింద్రనీలమణిప్రభాభాసురంబైన యాగుహామధ్యంబున నవనీలనీరదనిభశరీరవర్ణముగల కల్కిమూర్తి తమకు సదృశలైన స్త్రీసహస్రంబులతోడ సరససల్లాపంబు లాడుచుండుటనుగాంచి నలుప్రక్కలు కలయం జూచుచు నిజనయనంబులనుండి శోకాశ్రు లొలుక నుత్తలపాటుఁ జెందిరి.అపుడు పద్మావతి భూమియందు కల్కిమూర్తిరూపంబును కంటికాటుకచేతను, ఈశ్వరదత్తశుకంబును కుచకుంకుమపంకంబుచేతను లిఖంచి వానికి మోహాతిశయంబుచే నమస్కరించి యాలింగనముఁ జేసికొనెను. రమాదేవి భావజుకోలలం జిక్కి తనహృదయప్రదేశంబున కల్కిమూర్తి నిలిచియుండునట్లు ధ్యానించి తనయాభరణంబులచేఁ బూజించి కల్కిమూర్తిని తాను గాఢాలింగనముఁజేసి రమించునట్లుభ్రమించి మరల స్మృతిఁ జెంది "ఓస్వామీ! నన్ను కరుణింపు"మని కోవెలకు సమానమైన కంఠస్వరముతో కేకవేసెను. పద్మావతియు కల్కిమూర్తివియోగంబువలనఁ గలిగినవిరహతాపంబును సహింపనేరక తనయాభరణంబులన్నిటినిద్ధూల్చి ధూళిధూసరితాంగియై కంఠంబున కస్తూరికాపంకంబు నలఁది తాను శివునివలె భావించుకొని మన్మథుని దహించుటకై యత్నించెను. అపుడార్తజనరక్షకుండైన కల్కిమూర్తి నిజభార్యలొందు మన్మథవేదనను గాంచి దయార్ద్రచిత్తుండై యాకలువకంటుల సమీపంబున కేతెంచి లీలావిభ్రమవిలాసంబుల నాయింతులను దనివినొందించె. పద్మావతీ రమ

త్యాది స్త్రీరత్నంబులు కరిణీగణంబులు గజేంద్రంబులతో రమించుచందంబున అత్యాదరావేశముచే కల్కిమూర్తితోడ గాఢమైనరతులం దేలిరి. మఱియు కల్కిమూర్తి యిచ్ఛానుసారంబుగ సంచరించుస్వభావముగల రథముపై నెక్కి వైభ్రాజకము, చైత్రరథము, నందనవనము, మందరశిఖరము, మొదలగు నతిరమణీయప్రదేశంబులకుం బోయి యచటచట పద్మావత్యాదులతోడ మదనసుఖంబు లనుభవించెను. లక్ష్మీసమానురాండ్రైన యాస్త్రీరత్నంబులు కల్కిమూర్తిని స్తనమధ్యప్రదేశంబులందుఁ జేర్చి పరస్పరగాఢాలింగనముచే కల్కిమూర్తికి నెక్కుడైన సంతోషమును గలుగంజేసిరి. పిదప కల్కిమూర్తి నిజభామామణులతోడ సురతవిమర్దజనితసంతాపాతిశయనివారణార్థంబుగ సమీపస్థితసరోవరంబును బ్రవేశించి యథేచ్ఛముగ జలక్రీడలు సలిపి సుఖంబులం దేలుచుండె. సకలలోకనాథుండైన కల్కిమూర్తి నిజనాయికామణులైన పద్మావతీరమలతోడం గూడి యనేకసుఖంబులం బడయుచు శంబళగ్రామంబున సుఖంబున వసించుచుండెను. సాక్షాన్నారాయణమూర్తిగ నుండు కల్కిమూర్తి కర్ణానందకరంబైన లీలావిశేషంబులను సాదరంబుగ నాకర్ణించుచు ధ్యానించుచునుండువారిహలోకంబున సకలసౌభాగ్యంబు లనుభవించి యంత్యంబున పరమానందంబును జెందుట కిసుమంతయైన సందియంబు లేదు.

ఇది తృతీయాంశమునందు అష్టాదశాధ్యాయము.

ఏకోనవింశాధ్యాయము.

—కల్కి వైకుంఠంబునకుం బోవుట.—

తదనంతరము బ్రహ్మేంద్రాదిదేవతానికరమహర్షిప్రకరకిన్నరగరుడోరగప్రభృతు లెల్లరు నిజరథంబులయం దారూఢులై తమతమపరివారంబులతోడం గూడి కల్కిమూర్తిని దర్శించునాకాంక్షతోడ శంబళగ్రామంబున కేతెంచిరి.

మఱియు, వా రన్నగరాంతర్గతసభామధ్యంబున నాశ్రితజనాభయప్రదానుండును, నీలమేఘనిభశరీర కాంతియుతుండును, ఆజానుబాహుండును, చాంచల్యరహిత సౌదామనీలతాసమానకిరీటశోభాయమానుండును, ఉదితదినకరసదృశమణిమయకుండలద్వయదేదీప్యమానుండును, మందస్మితవికసితవదనారవిందుండును, కృపాకటాక్షవిక్షేపనిగ్రహీతనిఖిలభక్తబృందతాపత్రయుండును, తారానికరభాసురముక్తాహారవిరాజితవక్షఃస్థలుండును, శంఖచక్రగదాశార్ఙ్గపీతాంబరాద్యలంకృతవిగ్రహుండును, సంపూర్ణానందసందోహస్వరూపుండును, అత్యాశ్చర్యరూపలీలావిలాసయుక్తుండును, తేజోనిధిస్వరూపుండును, పుండరీకదళవిశాలలోచనుండు నైన కల్కిమూర్తిని బ్రహ్మేంద్రాదులు దర్శించి భక్తిశ్రద్ధాయుక్తులై మిక్కుటముగ స్తుతించి వారిని జూచి "సర్వజగదండమండలంబున కొడయుండవై యుండునో స్వామీ! మీకు మాయం దనుగ్రహం బుండునది నిక్కంబేని సత్యధర్మంబులకు హానిలేకుండ మీరు పరిపాలించుచు వచ్చిన యీభూభాగంబునందుండి వైకుంఠంబునకుం జేరవలయు" నని చెప్పు జేజేలవాక్యంబుల నాలకించి కల్కిమూర్తి ప్రముదితచిత్తంబున నిజనికేతనంబయిన వైకుంఠంబునకుం బోవ నిశ్చ

యించి మహాబలపరాక్రమాతిరేకులును, ధర్మమార్గనిరతులును, ప్రజానురంజనచతురులునైన తననలువు రాత్మజులం బిలిచి వారికి రాజ్యంబునం దభిషేక మొనర్చి ధర్మపథంబున రాజ్యకార్యంబుల జరుపునట్లు వారికాదేశించి ప్రజాగణంబును రప్పించి వారి కిట్లు లనియె "పౌరజనులారా! నే నిదివఱకు ధర్మమార్గంబున మిమ్ములను బరిపాలించుచుంటి. అయిన నిపుడు లోకపాలురైన బ్రహ్మేంద్రాదులు నన్ను వైకుంఠంబున కేతెంచునటులు నిర్బంధముఁ జేయుటంబట్టి నేనుబోయెదను. మీరు సుఖంబున నుండుం"డని వచింప పురజనంబులు శోకవిస్మయపరవశమానసులై "సర్వధర్మంబుల నెఱింగినయోనాథా! మిమ్ముల నాశ్రయించినవారును, మీకు భక్తులునైన యస్మదాదులను విడిచిపోవుట మీకు ధర్మమా ? మీరు పోయెడిస్థలంబునకు మేమునయితము వత్తుము. మాకు పత్నీపుత్రమిత్రధనకనకగృహప్రాణాదు లన్నియు నీవ. నిను వదలి క్షణకాలంబైనను నెట్లు జీవింపఁగలము? మేముగూడ నీతోడ వచ్చెద"మని ప్రేమగల తండ్రి చెంతఁ దనయులు విజ్ఞాపనఁ జేసికొనుచందంబున విజ్ఞాపనముఁ జేసికొన కల్కిమూర్తి దయార్ద్రచిత్తంబుతోడ పౌరజనులకు సాంత్వవచనంబులం జెప్పి వారియాగమనంబు నుడిగించి భార్యాద్వయసహితుండై మహర్షిగణసంకీర్ణంబును, జాహ్నవీతరంగశీకరమనోహరంబును, దేవతానికరసేవితంబు నైన హిమాలయంబున కరిగి గంగాతీరంబున దేవతాసముదయపరివృతుండై కొన్నాళ్లు వసించుచు పూర్ణజ్యోతిస్స్వరూప మయిన నిజస్వరూపంబును నిజమానసంబున స్మరించి యుదితాదిత్యసహస్రతేజోవిరాజితుండై శంఖచక్రగదాపద్మశార్ఙ్గాద్యాయుధంబుల ధరించి దివ్యాభరణంబులం దొడిఁగి నిజనివాసంబైన వైకుంఠంబున కరిగె. ఆసమయంబున. దేవగణంబు ప్రసూనవ

ర్షంబును గురిపించిరి. దుందుభిధ్వానంబులు చెలంగె. జంగమ స్థావరరూపంబులైన సకలలోకంబులుఁ గల్కిమూర్తిప్రభావ విశేషంబున కానందించి పెక్కుభంగుల స్తోత్రంబులు చేసిరి. రమాపద్మావతు లత్యాశ్చర్యకరంబైన తమభర్తనైకుంఠగమనంబుంజూచి తత్క్షణం బగ్నింజొచ్చి దివ్యరూపంబులం ధరించి భర్తృసమీపంబుఁ జేరిరి. ధర్మపురుషకృతయుగపురుషులు కల్కిమూర్తియాజ్ఞచే భూభాగంబునం దెచటను శత్రుభయంబులేక స్వేచ్ఛందవృత్తి సంచరించుచుండిరి. దేవాపి మరుభూమీశులు కల్కిపురుషునియాజ్ఞచే ధర్మమార్గంబున ప్రజాపరిపాలనంబుఁ జేయుచు భూమినిరక్షించుచుండిరి. విశాఖయూపధరాకాంతుండు కల్కినిర్యాణంబు నాలకించి యుత్తలమైన చిత్తంబున నిజపుత్రునికి రాజ్యభారంబొసంగి తపంబుఁ జేయుటకై కాననంబున కరిగె కల్కిమూర్తికి భక్తులైన తక్కొకాంతులందఱు కల్కినిర్యాణంబును విని దుఃఖడోలాయమానమానసులై రాజ్యాదిపదవులం దృజించి కాననంబులకరిగి పరమాత్ముని ధ్యానించుచుండిరి.

శుకుం డిప్పగిది సర్వలోకపావనంబయిన కల్కిమూర్తి విచిత్రచరిత్రంబును మార్కండేయాదులకుం జెప్పి నరనారాయణాశ్రమంబునకుంజనియె. మిగుల శాంతచిత్తులైన మార్కండేయాదులు శుకునిచే కల్కిమూర్తికథలను విని సంతుష్టమానసులై కల్కిమూర్తిని ధ్యానముఁ జేయుచు స్తుతించుచునుండిరి. కల్కిమూర్తియాజ్ఞచే ప్రజలందఱు నధర్మిష్ఠులు గాకుండిరి. మఱియు వారు దీర్ఘాయుష్మంతులును, బలవంతులును, హేతువాదరహితులునై యుండిరి. ప్రజలు మనోవ్యాధి, రోగము, ఆధ్యాత్మికాధిదైవికాధిభౌతికములనెడు తాపత్రయముతో రహితులై యుండిరి. మఱియు ప్రజలు ద్వేషమాత్సర్యరహితులై, ఎల్లపు డుల్లాసవంతులుగ నుండిరి. ఇట్లు మహాభా

గ్యమును కలుగఁజేయుచు ఆయుర్యశోధనస్వర్గసుఖప్రదంబును, శోకసంతాపపాపకలిదోషాదులను బోఁగొట్టునదియును, సుఖమోక్షసాధనంబయినదియును, ఇహలోకవాంఛితంబుల నిచ్చునదియు నైన యీకల్కిపురుషునియవతారకథ మీకుఁ జెప్పఁబడియె. సూతుం డిట్లు చెప్పిన కల్కిమూర్తిచరిత్రంబును శౌనకుం డాలకించి సంతుష్టాంతరంగుండై సూతుని గంగాస్తవముం జెప్పు మని ప్రార్థించుట కారంభించెను.

ఇది తృతీయాంశమునం దేకోనవింశాధ్యాయము.

వింశాధ్యాయము.

ఇట్లు చెప్పినసూతునిం జూచి శౌనకుం డడుగుచున్నాఁడు. సర్వపురాణంబులను నెఱింగిన పౌరాణికోత్తమా! ఋషులు గంగాదేవిని స్తోత్రముచేసి కల్కిమూర్తిసమక్షంబున కేతెంచిరని చెప్పితివికదా! ఋషిప్రోక్తంబును, సర్వపాపవినాశదక్షంబును, భక్తిచేఁ బఠనము చేయువారికి సుఖమోక్షంబుల నిచ్చునదియు నైన యీగంగాస్తోత్రంబును నాకుం జెప్పుమని వేఁడెను. ఇట్లు ప్రార్థింప సూతుండు శౌనకాదిఋషులం జూచి ఋషిశ్రేష్ఠులారా. ఈలోకంబునందలి మనుజుల శోకమోహంబులను బోఁగొట్టునదియై యుండు గంగాస్తోత్రమును మీకు వచించెద వినుఁ డని చెప్పందొడంగె.

సంసారసాగరసంతారకంబును, హరిచరణారవిందనిర్గళితంబును, సకలసంపత్కరంబును, సుమేరుశిఖరాగ్రనివసన్నిలింపగణప్రమోదకంబును, సకలపాపనివారకంబును, భగీరథమార్గానుగామినియును, సురగజనికరదర్పాపహప్రవాహభాసురంబును, మహేశ్వరమకుటమణిభూషణంబును, ధరాధరపరిబృఢశిరఃపతాకాయమానంబును, కమలభవగిరిజాధీశ కమలాపతిప్రముఖ

సురాసురసంస్తూయమానప్రభావవిభాసమానంబును, ముక్తిఫలప్రదంబునైన యీగంగాదేవి మిగులఁ బ్రకాశించుచున్నయది. మఱియు నీభాగీరథి యొకచో మునిగణంబులచే స్తుతింపఁబడియు, మఱియొకచోట దేవతలచే నమస్కారముఁ జేయఁబడియు, వేఱొకస్థలంబున పతంగకులకలకిలారావముఖరితం బయ్యెను, ఇంకొకప్రదేశంబున భీషణజలచరజంతుజాలసంవృతం బయ్యెను, ఇంకొకయెడ దినకరకరనికరసంపర్కసముజ్జ్వలం బయ్యెను, ఇంకొకతలంబున మహావర్తజాలజటిలం బయ్యెను, మఱియుండుస్థలంబున స్నానాగతసాధుజనబృందనిబిడితంబునై ప్రకాశించుచున్నయది. ఈభువనంబున నేమానవుండు గంగాదేవికి నమస్కరించుచు తన్నామంబులను జపించుచు, తద్రూపంబును ధ్యానించుచు,తజ్జలంబున స్నానంబుఁ జేయుచుండునో యట్టివాఁడు సర్వశ్రేయోభాజనంబును, తపోనిధియును, పురుషవరేణ్యుండును, సకలజయసమన్వితుండును నగుట కిసుమంతయైనను సందియంబు లేదని ప్రార్థించి గంగానదినిం జూచి మఱియు నిట్లనియె. ఓగంగాదేవి. నిర్మలోదకభరితంబును హంససారసాదివిహంగనివహాభాసురంబును చలత్కల్లోలవీచీనిచయరుచిరంబును, నానాతరునివహాభాసుర రోధఃప్రదేశరమణీయంబునైననీప్రవాహంబున స్నానం బొనర్చి నిర్ధూతసకలకలుషనిచయుండనై దివ్యరూపంబునుధరించి సురాసురాదులచే స్తోత్రముఁ జేయఁబడినవాఁడనై నే నెపు డానందంబును జెందుదునో? మఱియు దేవీ! నీతీరంబున వాసముఁ జేయుచు నీనిర్మలోదకంబున స్నానంబుఁ జేయుచు నిన్ను దర్శించుచు నీయనంతనామంబులను స్మరించుచు నీయుత్పత్తికథలను జెప్పుకొనుచు, నే నెపుడు సుఖంబున సంచరింతునో యని సకలకలుషదోషవిధ్వంసినియైన గంగాదేవిని స్తోత్రముఁ జేసిరి. పతనశ్రమాదు

లచే స్వర్గాయుర్యశోధన మోక్షంబులనొసఁగి సర్వపాపంబులను నశింపఁజేయుస్వభావముగల గంగాస్తవమును త్రికాలంబుల యందుఁ బఠించువారికి గంగాసాన్నిధ్యము సిద్ధముగ సిద్ధించు నని సూతుండు చెప్పి మఱియు వచించుచున్నాఁడు. ఓమహర్షులారా! కల్కిమూర్తియవతారకథలను దెలియఁబఱుచునట్టి యీ కల్కిచరిత్రమును నేను శుకబ్రహ్మముచే నెఱిఁగితిని. యశస్కరంబును, ధన్యంబునైన నీయుపాఖ్యానంబును నేను పఠించియనేకుల కుపదేశించితిని. కావున నీకథను వినువారి కిహంబునసర్వారిష్టంబులు నశించి సుఖించి లోకాంతరంబున సద్గతి చేకూరును.

ఇది తృతీయాంశమునందు వింశాధ్యాయము.

ఏకవింశాధ్యాయము.

~ పురాణకథాసంగ్రహము ~

ఈ పురాణంబునందు మార్కండేయ శుకసంవాదంబును, అధర్మవంశవృత్తాంతంబును, కలివివరణంబును, దేవతలు బ్రహ్మపురంబున కరుగుటయును, గోరూపధారిణియైన భూదేవితోడ దేవతలు బ్రహ్మపురంబున కేఁగుటయును, బ్రహ్మప్రార్థనచే విష్ణుయశునిభార్యయైన సుమతియందు విష్ణుమూర్తి నిజాంశము లగునలుపురుభ్రాతలతోడ కల్కిమూర్తియైయవతరించుటయును, కల్కి విష్ణుయశస్సంవాదంబును, కల్కిమూర్తియుపనయనంబును, కల్కిమూర్తిధనుర్వేదాదుల నభ్యసించుటయును, కల్కిమూర్తి పరమేశ్వరుని స్తుతించి నమస్కరించుటయును, కల్కిమూర్తి శివునివలన నశ్వాదులను వరంబుగఁ గొనుటయును, పిదప కల్కిమూర్తి శంబళగ్రామంబున కేతెంచుటయును, కల్కిమూర్తి విశాఖయూపభూకాంతునితో నిజవృత్తాంతంబును జెప్పుటయును, కల్కిమూర్తిచెంత కీశ్వరవరదత్తశుకంబు వచ్చు


టయును, కల్కిశుకసంవాదంబును, శుకకృతసింహళద్వీపవర్ణనంబును, పద్మావతి శివునిచే వరమును పొందుటయును, పద్మావతీస్వయంవరమునకు వచ్చినరాజులు తద్దర్శనంబుచే స్త్రీరూపంబుఁ బొందుటయును, పద్మావతి దుఃఖించుటయును, కల్కిమూర్తి వివాహార్థము ప్రయత్నించుటయును, పద్మావతియొద్దకు శుకం బేఁగుటయును, శుకపద్మాసంవాదంబును, విష్ణుపూజావిధానంబును, కల్కిమూర్తిపాదాదికేశాంతవర్ణనంబును, పద్మావతి శుకంబునకు స్వర్ణభూషణంబుల నిచ్చుటయును, మరల శుకము కల్కిమూర్తిచెంతకు వచ్చుటయును, వివాహముకొఱకు పద్మావతీసమీపమునకు కల్కిమూర్తి పోవుటయును, జలక్రీడావ్యాజముచే పద్మాకల్కులకు పరస్పరదర్శనంబును,పద్మావతీవివాహంబును, తొల్లిస్త్రీరూపమును జెందినరాకొమరులు కల్కిదర్శనమాత్రముచే మరల నిజరూపములను ధరించుటయును, అనంతఋషి కల్కిమూర్తియొద్దకు వచ్చుటయును, రాజు లనంతునితో సంవాదము చేయుటయును,విష్ణుక్షేత్రమునందు అనంతునికి మాయాదర్శనంబును,అనంతోపాఖ్యానంబును, రాజులు తమతమస్థానంబులకుఁ బోవుటయును, కల్కిమూర్తి పద్మాసహితంబుగ శంబళగ్రామమునకుఁ బోవుటయును, శంబళగ్రామమునందు విశ్వకర్మ నగరమును నిర్మించుటయును, శంబళనగరమునందు కల్కిమూర్తి పద్మాసహితుఁడుగ సుఖముగ వసియించుటయును, కల్కిమూర్తి సేనాసహితుండై బౌద్ధులను జయించుటయును, మ్లేచ్ఛస్త్రీలయుద్ధంబును, కుథోదరీవధంబును, హరిద్వారగతుండైన కల్కిమూర్తియొద్దకు ఋషులు వచ్చుటయును, సూర్యచంద్రవంశానువర్ణనంబును, శ్రీరామచరిత్రంబును, మరుదేవాపులు యుద్ధమునకుఁ బోవుటయును, కోకవికోకవధంబును, కల్కిమూర్తి భల్లాటనగరగమనంబును, శశిధ్వజయుద్ధం

బును, శశిధ్వజుండు కల్కిమూర్తిని తనగృహమున కెత్తుకొని పోవుటయును, సుశాంతాగీతంబును, రమావివాహంబును, శశిధ్వజకృతనిజవృత్తాంతకథనంబును, విషకన్యామోచనంబును, కల్కికృతరాజ్యాభిషేకంబును, మాయాస్తవంబును,శంబళనగరమున కల్కిమూర్తి కృతయుగవర్ణనంబును, నారదోపదేశంబున విష్ణుయశస్సు మోక్షమును జెందుటయును, రుక్మిణీవ్రతంబును, కల్కివిహారంబును, బ్రహ్మాదిదేవతలు కల్కిసమీపంబునకు వచ్చుటయును, విష్ణుస్వరూపుండైన కల్కిమూర్తివైకుంఠమునకుఁ బోవుటయును,శుకఋషి మార్కండేయఋషులకు పై చెప్పినకథల నన్నిటిని జెప్పి బదరికాశ్రమంబునకుఁ బోవుటయు, గంగాస్తోత్రంబును, అను మొదలగువానిని సూతపౌరాణికోత్తముండు శౌనకాదిఋషులకుఁ జెప్పెను. జగదానందకరంబును, సర్వపాపహరంబును 1600 శ్లోకములు గలదియును, సకలశాస్త్రార్థతత్త్వసారంబులతోఁ గూడినదియును, ధర్మార్థకామమోక్షంబులనిచ్చునదియు నైన యీకల్కిపురాణము ప్రళయాంతకాలమునందు విష్ణువుచే వక్కాణింపఁబడియె. అత్యాశ్చర్యకరంబై సాక్షాన్నారాయణస్వరూపియైన కల్కిమూర్తిప్రభావంబును తెలియఁబఱుచునట్టి యీకల్కిపురాణము భూతలంబున వ్యాసమహర్షి చేఁ జెప్పంబడినది. విష్ణుచరిత్రంబును ప్రతిపాదించునదియై యుండు నీపురాణసారంబును భక్తితో పుణ్యతీర్థాశ్రమాదులయందు బ్రాహ్మణోత్తములకు గోదానాదులనొసఁగి యెవరు వినుచున్నారో, లేక పఠించుచున్నారో, అట్టివారు బ్రహ్మానందమును జెందుదురు. మఱియు నీయుత్తమపురాణమును బ్రాహ్మణుండు వినిన వేదవేదాంగపారంగతుఁడును, క్షత్రియుండు వినిన సకలభూమీశ్వరుండును,వైశ్యుండువినిన విశేషధనవంతుఁడును,శూద్రుండువినిన మహత్త్వముగలవాఁడుగనగు

దురు. ఈపురాణపఠనశ్రవణమువలన సంతానమును గోరువారికి సత్పుత్త్రులును, సంపదలఁ గోరువారికి విశేషసంపదలును, విద్యలను గోరువారికి సకలశాస్త్రపాండిత్యమును సిద్ధించును. లోమహర్షణసుతుండైన సూతపౌరాణికోత్తముండు పుణ్యాకరంబైన ఈపురాణమును భక్త్యతిశయముతో శౌనకాదిమహర్షులకుం జెప్పి తీర్థయాత్రకుంజనిరె. శౌనకుం డనేకమునులతో నేతత్పురాణశ్రవణానంతరము సూతపౌరాణికోత్తముని చేననుమతిఁబడసి పుణ్యారణ్యమునందు విష్ణువునుధ్యానించుచు యోగప్రభావము వలన బ్రహ్మానందమునుపొందెను. లోమహర్షణపుత్త్రుండును, సర్వపురాణసారసర్వస్వవేదియును, వ్రతనియమతత్పరుండును, వ్యాసశిష్యుండును, ఋషిశ్రేష్ఠుండునైన సూతపౌరాణికునకు నేను నమస్కరించెద. నూతనజలదసమానశరీరకాంతి గలవాఁడును,వాయువేగముగల యుత్తమాశ్వమును వాహనముగఁగల వాఁడును, హస్తంబున కరాళకరవాలంబును ధరించినవాఁడును, సర్వలోకరక్షకుండును,కలికులబలధ్వంసియును, సత్యధర్మప్రవర్తకుండును నైనకల్కిమూర్తి మనకు క్షేమమునుగలుగఁజేయుఁగాక.

ఇది తృతీయాంశమునం దేకవింశాధ్యాయము.

అనుభాగవతంబైన కల్కిపురాణము సమాప్తము.



శ్రీమత్కల్కిపురాణ మిద్ది దురితచ్ఛేదంబునై సత్కథా,
స్తోమాలంకృతమై రసోదితమునై దోషజ్ఞవంద్యంబునై,
కామక్రోధనివారితంబునయి శ్రీకైవల్యసౌఖ్యప్రదం,
బై మేలొందెడుఁ గాన నెల్లరు ముదంబారంగఁ గైకోఁ దగున్.